


రాజ్యసభకు రాజైన
రైతుబిడ్డ

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

అసాధారణ వ్యక్తిత్వం
కష్టపడి పనిచేసే కర్తృత్వం
ఎంత ఎదిగినా ఒదిగి ఉండే
మనస్తత్వం



కరీంనగర్ 11-8-2017 శుక్రవారం సిటీ సంపుటి 44 సంచిక 2

రూ. 5-00. పేజీలు 20+16

www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఈనాడు

కరీంనగర్ 11-8-2017 శుక్రవారం సిటీ సంపుటి 44 సంచిక 2

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 20+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

గోదారి.. మన జలసిరి

నాలుగు జీవధారలతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు

- తెలంగాణ ఉద్యమం చేయాలని శ్రీరాంసాగర్ కట్టపైనే నిర్ణయం తీసుకున్నా
- ముఖ్యమంత్రి హోదాలో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన చేయడం నా అదృష్టం
- పోచంపాడు బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

-వివరాలు 2లో

"గోదావరి జలాల ఆధారంగా నాలుగు జీవధారలను సృష్టిస్తాం. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల వరకూ ఒక జీవధార.. ఇక్కడ నుంచి కరీంనగర్ వరకు రెండోది.. ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ వరకూ మూడోది... మధ్య మానేరు నుంచి మల్లన్నసాగర్, సింగూరు, నిజాంసాగర్ వరకూ నాలుగో జీవధార వెల్లివిరిసేలా చేస్తాం."

- ముఖ్యమంత్రి కేసీఆర్

"ఆంధ్ర ప్రాంతానికి ప్రయోజనం చేకూర్చే నాగార్జున సాగర్ జలాశయం వైష్ణోదేవి ఆలయంలా కళకళలాడుతూ ఉంది. తెలంగాణకు ప్రయోజనం చేకూర్చే శ్రీరాంసాగర్ మాత్రం శివాలయంలా పాడుబడింది"



శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథక శంకుస్థాపన అనంతరం నిజామాబాద్ జిల్లా పోచంపాడు వద్ద గురువారం నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనసందోహానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

హవాలా అడ్డా.. హైదరాబాద్

- భాగ్యనగరం కేంద్రంగా ఏటా రూ.1000 కోట్ల నిధులు విదేశాలకు మళ్లింపు
- నకిలీ పత్రాలు, సంస్థలతో మోసాలు
- విదేశాల్లోని ఖాతాల్లోకి నిధులు బదిలీ చేసిన మహేంద్ర ఖత్రి
- రంగంలోకి ఈడీ

ఈనాడు - హైదరాబాద్

తప్పుడు పత్రాలు సృష్టించడం... నకిలీ సంస్థల ద్వారా నల్లధనాన్ని అక్రమంగా విదేశాలకు తరలించే ముఠాలకు హైదరాబాద్ స్వర్గధామంగా మారింది. దేశంలోని అనేక ప్రధాన నగరాల వ్యాపారులు ఇక్కడ్నుంచే తమ అక్రమ సంపాదనను చాకచక్యంగా విదేశాలకు బదిలీ చేస్తున్నారు. ఈ పనిచేసిపెట్టే సంస్థలు భాగ్యనగరంలో పెద్ద సంఖ్యలో బయటపడుతున్నాయి. అధికారిక అంచనాల ప్రకారమే హైదరాబాద్ నుంచి ఏటా రూ. వెయ్యి కోట్లకుపైగా నల్లధనాన్ని విదేశాలకు తరలిస్తున్నారు. గతంలో కూడా ఈ వ్యవహారం నడిచినా నోట్ల రద్దు తర్వాత ఇది ఊపందుకుంది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.



ఎందుకు తరలిస్తున్నారు?

అధికారికంగా బ్యాంకుల ద్వారా నగదు బదిలీ జరిగినప్పుడు వ్యక్తులు, సంస్థల ఆదాయ వివరాలు బయటపడతాయి. అన్ని పన్నులు చెల్లించి చట్టబద్ధంగా ఆర్జించిన మొత్తాన్ని మాత్రమే అధికారికంగా బదిలీ చేయగలుగుతారు. కానీ వ్యవస్థలో ఉన్న లోపాల్ని ఆసరగా చేసుకొని అనేక మంది వ్యాపారులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. బిల్లుల్లేకుండా చేసే వ్యాపారం, దాని ద్వారా ఆర్జించే లాభం వంటిది ఏదయినా అక్రమమే. ఉదాహరణకు ఒక సిమెంట్ కంపెనీలో వంద టన్నులు ఉత్పత్తిచేస్తే అందులో 50 టన్నులు అధికారికంగా, మిగతా 50 టన్నులు ఎలాంటి బిల్లుల్లేకుండా అమ్ముతారనుకుంటే ఇదంతా అక్రమార్జన కిందికే వస్తుంది. ఈ మొత్తానికి (మిగతా 2లో)



హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స విభాగాన్ని ప్రారంభించిన అనంతరం అధునాతన పరికరాల వివరాలను తెలుసుకుంటున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో వైద్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి -15లో

ఉపముఖ్యమంత్రిగా పన్నీర్ సెల్వం!

- పార్టీ ప్రధాన కార్యదర్శి కూడా ఆయనే!
- అన్నాడీఎంకే వర్గాల విలీనానికి సన్నాహాలు
- తమిళనాడులో శరవేగంగా పరిణామాలు -5లో

జిల్లా న్యాయమూర్తుల నియామకాలకు ఉమ్మడి పరీక్ష!

- ఏకీకృత ఎంపిక వ్యవస్థ -16లో
- త్వరలో సుప్రీంకోర్టు నిర్ణయం

ఇదీ సంగతి!



యాదాద్రికి మూడేళ్లలో ఎంఎంటీఎస్!

- అంచనా వ్యయం రూ.412 కోట్లు
- ఆమోదం తెలిపిన ఆర్‌వీఎన్‌ఎల్
- రెండు వారాల్లో టెండర్లు
- సికింద్రాబాద్ నుంచి రాయగిరి వరకు మూడో లైను మార్గం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి ఎంఎంటీఎస్ రైలు మార్గంతో అనుసంధానం కానుంది. ఘట్‌కేసర్-రాయిగిరి(యాదాద్రి) ఎంఎంటీఎస్ మూడోదశ ప్రాజెక్టును పట్టాలు ఎక్కించేందుకు రంగం సిద్ధమైంది. రూ.412 కోట్ల వ్యయం అవుతుందని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్) తాజాగా అంచనా వేసింది. పది, పదిహేను రోజుల్లోగా ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మొదలుపెట్టాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు వ్యయంలో మూడింట రెండొంతుల వ్యయాన్ని తెలంగాణ ప్రభుత్వం (మిగతా 2లో)





శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి శ్రీకారం చుడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్, చిత్రంలో మంత్రి హరీశ్‌రావు

గోదారి.. మన జలసిరి

ఈనాడు - నిజామాబాద్

తెలంగాణలో సాగునీటి కష్టాలను శాశ్వతంగా తొలగించాలనే చిత్తశుద్ధితో తెరాస ప్రభుత్వం ముందుకు పోతోందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో 200 కి.మీ. మేర ప్రవహించే గోదావరిలో బ్యారేజీలు నిర్మిస్తే సుమారు 80 టీఎంసీల నీరు నిల్వచేసుకునే వెసులుబాటుతో పాటు నది ఎల్లప్పుడూ జీవధారలా ఉంటుందని సీఎం అన్నారు. మేడిగడ్డ నుంచి తరలించే జలాలతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి తీరుతామని చెప్పారు. జలసాధన ఉద్యమానికి శ్రీకారం చుట్టినప్పుడు ఇచ్చంపల్లిలో ఇచ్చుకాయలు, నిజాంసాగర్‌లో నాచు, డిండిలో బండలు, కోయిల్‌సాగర్‌ను కొంగలు ఎత్తుకుపోయాయంటూ తెలంగాణలో నెలకొన్న జలగోసను ఆయన గుర్తుచేశారు. గురువారం ఎస్సారెస్పీ పునరుజ్జీవం పథకానికి సంబంధించి వరదకాలువ వద్ద పైలాన్ ఆవిష్కరించి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పోచంపాడు వద్ద గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.

'1996లో వేణుగోపాలాచారి రాజీనామాతో నిర్మల్ ఉపఎన్నిక వచ్చింది. అప్పుడు నేను.. ప్రస్తుతం ఎంపీ గుత్తాసుఖేందర్‌రెడ్డి కలిసి ఇక్కడికి వచ్చాం. నా మిత్రుడితో కలిసి శ్రీరాంసాగర్ ఆనకట్టపైకి వెళ్లా. తుప్పుపట్టి, గ్రీజుకూడా వేయని స్థితిలో జలాశయం గేట్లు ఉన్నాయి. ఆనకట్టపై ఉన్న రహదారిపై గజం లోతు గుంతలు పడ్డాయి. ఆంధ్రపాలకులు తెలంగాణకు ఎన్నడూ నీళ్లివ్వాలని ప్రాజెక్టులు కట్టలేదని అర్థమైంది. అప్పుడే అనుకున్నా.. తెలంగాణ సాధిస్తే ఇలాంటి దయనీయస్థితి నుంచి బయటపడతామని.. తెలంగాణ ఉద్యమం చేపట్టాలని జలాశయం ఆనకట్టపైనే నిర్ణయం తీసుకున్నాం. అనంతరం ఉవ్వెత్తున ఉద్యమం చేపట్టి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాం. ఏ జలాశయంపై నిలబడి ఉద్యమం చేయాలని నిర్ణయం తీసుకున్నానో, అదే జలాశయానికి మేడిగడ్డ నుంచి నీటిని తరలించి పునరుజ్జీవం తీసుకువచ్చేందుకు వీలుగా చేపట్టిన పునరుజ్జీవన కార్యక్రమానికి ముఖ్యమంత్రి హోదాలో శంకుస్థాపన చేసే భాగ్యం దక్కడం నా అదృష్టం. ఇలాంటి అరుదైన అవకాశం కొంత మంది అదృష్టవంతులకు మాత్రమే వస్తుంది. మేడిగడ్డ వద్ద గోదావరిలో ఏడాది పొడవునా నీరు సమృద్ధిగా ఉంటుంది. సద్వినియోగం చేసుకునేందుకు బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరానికి శ్రీకారం చుట్టాం. ప్రజల ఆశీర్వాదం, అండ ఉన్నంత వరకూ ఈ క్రతువును ఎవరూ అడ్డుకోలేరు. హైదరాబాద్‌లో నిలబడి ఉత్తరం వైపునకు చూస్తే కశ్మీరు లాంటి ఆదిలాబాద్ జల జీవధారతో ఉట్టిపడేలా చేస్తాం.

వచ్చే వర్షాకాలం నాటికి మేడిగడ్డ నీరు తరలిస్తాం

ఆంధ్ర పాలకుల పుణ్యమాని ఎస్సారెస్పీ జలాశయం ఆదరణకు నోచుకోక తెలంగాణ రైతాంగానికి అంతులేని నష్టం కలిగింది. అప్పటి ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఈ జలాశయానికి 54 ఏళ్లు పూర్తయ్యాయి. మొదటి, రెండో దశ, మూడో దశ, వరద కాలువ నిర్మాణం ఇలా పనులు చేసుకుంటూ పోతున్నారు. ఆయకట్టుకు ఆశించిన స్థాయిలో మేలు జరగడం లేదు. 14 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఇప్పటికీ 5.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు మించి నీరు అందించలేని దయనీయ స్థితి నెలకొంది. మేడిగడ్డ నుంచి రివర్స్ పంపింగు ద్వారా నీటిని తరలించే పనులు ఏడాదికల్లా పూర్తి చేసి రెండు పంటలకు నీరు అందిస్తాం. జూన్ నుంచి ఇప్పటి వరకు మేడిగడ్డ ద్వారా 250 టీఎంసీల నీరు వృథాగా కిందకు వెళ్లి పోయి సముద్రం పాలైంది. ఈ నీటిని సద్వినియోగం చేసుకుంటే ఉత్తర తెలంగాణకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగిపోతాయి. పునరుజ్జీవ పథకంలో కీలకమైన వరదకాలువలో ఏడాది పొడవునా నీరు తొలకులు కొడతాయి. 110 కి.మీ మేర ఉన్న ఈ కాలువ పరిధిలో భూగర్భ జలాలు వృద్ధి చెంది భూములకు పుష్కలంగా బోర్ల ద్వారా సాగునీరు అందుతుంది. అన్నారం, సుందిళ్ల ఆనకట్ట పనులు పూర్తి చేస్తే ఎస్సారెస్పీకి నీటి తరలింపు దాదాపు కొలిక్కి వచ్చినట్టే. పునరుజ్జీవ పథకం అందుబాటులోకి వస్తే ప్రతి ఏటా ఫిబ్రవరి నాటికే ఎస్సారెస్పీలోకి 90 టీఎంసీల నీరు అందుబాటులో ఉండేలా చేసుకోవచ్చు.



పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

96 కేసులు వేసింది

తెలంగాణను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టును శతవిధాలా అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతోంది. ఇందులో భాగంగా 96 కేసులు వేసింది. నా సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో నిర్మించ తలపెట్టిన కొండపోచమ్మ రిజర్వాయరుకు 4,600 ఎకరాల భూమి అవసరం కాగా రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 4,510 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. కేవలం 90 ఎకరాలు మాత్రమే భూసేకరణ కాకుండా నిలిచిపోయింది. ఇది కాంగ్రెస్ నాయకులకు చెందిన భూమి కావడంతో ఆ పార్టీ రాష్ట్ర నేతలు వీరితో హైకోర్టులో కేసులు వేయించి రిజర్వాయరు నిర్మాణాన్ని అడ్డుకునే దుర్మార్గపు చర్యకు ఒడిగట్టారు. తెలంగాణ ప్రజలు వీరికి తగిన రీతిలో బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ పాలకులు 35 ఏళ్ల పాటు కరెంటు సరిగ్గా ఇవ్వకుండా ప్రజలను ఏడ్పించారు. ఇప్పుడు తెరాస పాలనలో కరెంటు కష్టాలకు చరమగీతం పాడాం. ప్రస్తుతం మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 24 గంటలపాటు నిరంతర త్రీఫేజు కరెంటు ఇస్తున్నాం. యాసంగి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల కరెంటు ఇస్తాం' అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

ప్రమాణం చేస్తున్నా.. పన్నెండు నెలల్లో పూర్తిచేస్తాం

- మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, నిజామాబాద్: ముఖ్యమంత్రి ఎదుట ప్రమాణం చేసి చెబుతున్నా.. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకాన్ని పన్నెండు నెలల్లో పూర్తి చేస్తాం. వచ్చే సంవత్సరం నుంచి రెండు పంటలకు సాగునీరందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం పోచంపాడు బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి రైతుగా, ఇంజినీరుగా ఆలోచించి ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. దేశంలోనే అతి తక్కువ సమయంలో, భూసేకరణ లేకుండా, తక్కువ వ్యయంతో శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. తెలంగాణ వస్తే ఏం వచ్చింది అని కొందరు ప్రశ్నిస్తున్నారని.. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తేనే శ్రీరాంసాగర్ పునరుజ్జీవ ప్రాజెక్టు వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం రాష్ట్రంలోని అధికారులు, పాలకులు మూడు షిఫ్టులు పనిచేస్తున్నామన్నారు. ప్రాజెక్టులకు అడ్డుపడుతున్న కాంగ్రెస్ నాయకులు వారి పాలనలో ఎందుకు ప్రాజెక్టులు నిర్మించలేదని విమర్శించారు. శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకంతో ఉత్తరతెలంగాణ పునరుజ్జీవం పోసుకుంటుందని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించడంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు

మహత్తర ప్రాజెక్టు: పోచారం

ఇది మహత్తర ప్రాజెక్టు అని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాలతో పాటు నిజాంసాగర్ నాన్ ఆయకట్టుకు ఈ ప్రాజెక్టుతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రులు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు, మహేందర్‌రెడ్డి, జోగు రామన్న, ఎంపీలు కవిత, బీబీపాటిల్, వినోద్‌కుమార్, బాల్క సుమన్, డి.శ్రీనివాస్, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్లు దఫేదర్‌రాజు, తుల ఉమ, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గంప గోవర్దన్, పుట్ట మధు, రసమయి బాలకిషన్, విద్యాసాగర్‌రావు, సీహెచ్ రమేష్, హన్మంత్‌షిండే, ఏనుగు రవీందర్‌రెడ్డి, షకీల్, గణేష్ గుప్త, కమలాకర్, రేఖానాయక్, బొడిగే శోభ, బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు.

పోటెత్తిన పోచంపాడు

పోచంపాడు నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి: పోచంపాడు పోటెత్తింది. ఎస్సారెస్పీ తీరం జనసంద్రమైంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ సభకు మండుటెండలను సైతం లెక్క చేయకుండా అశేష జనవాహిని తరలివచ్చింది. 20 కి.మీ. మేర రహదారులు కిక్కిరిసిపోయాయి. మంత్రి కేటీఆర్ ఇతర నేతలు రెండున్నర గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. సభ మధ్యాహ్నం ఒంటిగంటకు కాగా గురువారం ఉదయం నుంచి జనసందోహం మొదలైంది. ప్రాజెక్టు ఆయకట్టు జిల్లాలతోపాటు హైదరాబాద్ నుంచి ప్రజలు వచ్చారు. దాదాపు ఆరువేల బస్సులతో పాటు ఇతర ప్రైవేటు వాహనాల్లో వేదిక వద్దకు చేరుకున్నారు. సీఎం కేసీఆర్ ఉదయం 11.30కి మొప్కాల్ వద్ద పునరుజ్జీవ పైలాన్‌ను ఆవిష్కరించారు. మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్ ఆయన వెంట ఉన్నారు. తర్వాత సీఎం ప్రాజెక్టును సందర్శించారు.

2.15కి వేదిక వద్దకు సీఎం: ముఖ్యమంత్రి 2.15కి సభాప్రాంగణానికి వచ్చారు. మంథని ఎమ్మెల్యే పుట్ట మధు ఇతర నేతలు కాళేశ్వరం నుంచి తెచ్చిన గోదావరి జలాల కలశాలను సీఎంకు అందించారు. ఆయన ఈ నీళ్లను అక్కడ చల్లించారు. సీఎం సభావేదికపైకి చేరగానే అంతా లేచి హర్షధ్వానాలతో, స్వాగతం పలికారు. ఆయన వేదికపైన చుట్టూ తిరుగుతూ రెండువేళ్లతో విజయధ్వానాలు..అభివాదాలు చేస్తూ, జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు.



రహదారిపై ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

పునరుజ్జీవ పథకం పూర్వాపరాలను వివరిస్తూ మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. సీఎం కేసీఆర్ ప్రసంగంలో ఎస్సారెస్పీతో అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. దాదాపు 25 నిమిషాల పాటు సీఎం ప్రసంగం ఉద్వేగంగా సాగింది.

భారీగా ఏర్పాట్లు

సభకు తెరాస నేతలు భారీఎత్తున ఏర్పాట్లు చేశారు. సభావేదిక వద్ద 50 అడుగుల కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వెనుతిరిగి వెళ్లిపోయిన కేటీఆర్

ఆర్మూర్, న్యూస్‌టుడే : మంత్రి కేటీఆర్ ప్రయాణిస్తున్న కారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. 63వ జాతీయ రహదారిపై పోచంపాడు చౌరస్తా నుంచి పెర్కిట్ దాకా నిలిచిపోయిన వాహనాల్లో మంత్రి వాహనం కూడా ఉంది. కారులో ఉన్న కేటీఆర్‌ను చూసి ప్రజలు, తెరాస నాయకులు పరిగెత్తుకుంటూ రాగా, ఆయన వారికి అభివాదం చేశారు. పలువురు ఆయనతో ఫొటోలు దిగడానికి పోటీపడ్డారు. కొంతమంది సెల్ఫీలు దిగారు. ఈలోపు వేదికపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగిస్తున్నారని తెలుసుకుని, అక్కడకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మంత్రి వెను తిరిగి వెళ్లిపోయారు.

తెరాస శ్రేణుల్లో ఆనందం

సభ విజయవంతంపై తెరాస వర్గాలు ఆనందం వ్యక్తంచేశాయి. మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో ప్రాజెక్టు సాంకేతిక అంశాల రూపకల్పన పైలాన్, సభాప్రాంగణం ఎంపిక, వేదిక ఏర్పాట్లు జరిగాయి. మంత్రి ఈటలకు సమన్వయ బాధ్యతలను అప్పగించారు. సభపై కేసీఆర్ సంతృప్తి వ్యక్తంచేశారు. ఒకరోజు ముందే పోచంపాడు చేరుకొని పరిస్థితులను సీఎం సమీక్షించారు. ఎదురెండలు కొడుతున్నాయని, సభను త్వరితగతిన ముగించారు.

సమస్యలు పరిష్కరించాలని కటౌట్ పైకెక్కి నిరసన

- కేసీఆర్ సభ వద్ద ఇద్దరి హల్‌చల్

ఆర్మూర్, న్యూస్‌టుడే: పోచంపాడులో గురువారం జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో సభావేదిక పక్కనే ఉన్న ఎత్తైన కటౌట్ పైకెక్కి ఇద్దరు వ్యక్తులు హల్‌చల్ చేశారు. వారు పైనుంచి ఎక్కడ దూకేస్తారేమోనని అందరూ ఆందోళన చెందారు. పోలీసులు కటౌట్ పైకెక్కి వారికి సర్దిజెప్పడంతో కథ సుఖాంతమైంది. కేసీఆర్ ప్రసంగం కొద్ది నిమిషాల్లో ముగుస్తుందనే సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కడెం మండలం గంగాపురం గ్రామ సర్పంచి శాంత భర్త, తెరాస నాయకుడు చంద్రవాస్ సభా వేదిక పక్కనే కేసీఆర్, కేటీఆర్, కవిత, ప్రశాంత్‌రెడ్డిల ఫొటోలతో ఉన్న ఎత్తైన కటౌట్ పైకెక్కి కలకలం రేపారు. దాదాపు 40 అడుగులకు పైగా ఎత్తున్న ఆ కటౌట్ పైకి ఆయన ఎందుకు ఎక్కుతున్నారో, ఏం చేస్తారోనని అందరూ విస్మయంగా అటు చూశారు. పూర్తిగా కటౌట్ పైకి వెళ్లిన తర్వాత మెడలో గులాబీ కండువా వేసుకొని వినతి పత్రాన్ని చూపించాడు. ముఖ్యమంత్రి అదేదీ పట్టించుకోకుండా ప్రసంగం ముగించి వేదిక దిగి వెళ్లిపోయారు. పోలీసులు కటౌట్ ఎక్కి అతనికి సర్దిజెప్పేందుకు ప్రయత్నించారు. ఈలోపు పోచంపాడుకు చెందిన విజయలక్ష్మి అనే యువతి కూడా ఆ కటౌట్ పై దాకా ఎక్కారు. ఒకవైపు పోలీసులు వారిస్తున్నా ఆమె వినలేదు. పోలీసులు నానా తంటాలు పడి వారిద్దరికీ నచ్చజెప్పి కిందకు దిగేలా చేశారు. తమ గ్రామంలో వంతెన నిర్మించాలని, రోడ్డు బాగు చేయాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి వచ్చానని, అవకాశం లేకపోవడంతో ముఖ్యమంత్రికి తెలియజేయడం కోసం ఇలా చేశానని చంద్రవాస్ తెలిపారు. తనకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు కోసం ఇలా చేశానని విజయలక్ష్మి వివరించారు.

యాదాద్రికి మూడేళ్లలో ఎంఎంటీఎస్!

(మొదటి పేజీ తరువాయి)

భరించనుంది. టెండర్లు పూర్తయి.. పనులు ప్రారంభం అయిన తర్వాత మూడేళ్లలో ఎంఎంటీఎస్ మూడో దశను అందుబాటులోకి తీసుకురావాలని ఆర్‌వీఎన్ఎల్ లక్ష్యంగా పెట్టుకుంది.

ఘట్‌కేసర్ నుంచి రాయిగిరి వరకు 33 కిలోమీటర్ల దూరం. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా ఘట్‌కేసర్ వరకు పనులు జరుగుతున్నాయి. యాదాద్రి పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఎంఎంటీఎస్‌ను విస్తరించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయి సమగ్ర సర్వే తర్వాత భూ సేకరణతో కలిపి రూ.412 కోట్లు అంచనా వ్యయంగా తేలింది. దీనికి ఆర్‌వీఎన్ఎల్ యాజమాన్యం కొద్దిరోజుల క్రితం ఆమోదముద్ర వేసింది.

ఐదు స్టేషన్లు.. మూడు రైళ్లు: ఎంఎంటీఎస్ మూడో దశలో స్టేషన్లు ఎక్కడెడక్కడ అన్నది ఆర్‌వీఎన్ఎల్ ఖరారుచేసింది. ఘట్‌కేసర్, బీబీనగర్, పగిడిపల్లి, భువనగిరి, రాయిగిరి.. ఐదుచోట్ల ఎంఎంటీఎస్ రైళ్లు ఆగే విధంగా రూపకల్పన చేశారు. రాయిగిరి నుంచి యాదాద్రి వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడికి రహదారి మార్గమే ఉండటంతో ఎంఎంటీఎస్‌ను రాయిగిరి వరకు పరిమితం చేశారు. యాదాద్రి మూడో దశకోసం మూడు రేక్(రైళ్లు)లను కొనుగోలుచేయాలని ఆర్‌వీఎన్ఎల్ ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఒక్కో రేక్‌లో తొమ్మిది బోగీలు ఉంటాయి. వీటి కొనుగోలుకు మొత్తం రూ.30 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ మార్గం నిర్మాణం పూర్తయితే సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, లింగంపల్లి వంటి ప్రాంతాల నుంచి రాయిగిరి వరకు ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణం చేసే వెసులుబాటు వస్తుంది.

పాతిక ఎకరాల భూసేకరణ: ఘట్‌కేసర్ నుంచి రాయిగిరి వరకు మూడోదశ ఎంటీఎస్‌కు 90 శాతం వరకు భూమి అందుబాటులో ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. సికింద్రాబాద్-వరంగల్ మార్గంలో రెండు లైన్లకు ఇరువైపులా రైల్వే భూమి ఉంది. కొన్నిచోట్ల అక్కడక్కడా ప్రైవేటు భూమిని సేకరించాల్సి ఉంటుందని ఆర్‌వీఎన్ఎల్ గుర్తించింది. సుమారు 25-27 ఎకరాల(10, 11 హెక్టార్లు) భూమి అవసరమని.. సేకరించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలుస్తోంది.

కొత్త లైను ఎంఎంటీఎస్‌కు ప్రత్యేకం: సికింద్రాబాద్-భువనగిరి మార్గంలో రెండు లైన్లున్నాయి. ఈ మార్గం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సరుకు రవాణా రైళ్లతో రద్దీగా ఉంటుంది. ఎంఎంటీఎస్ విస్తరణ నేపథ్యంలో ఘట్‌కేసర్ నుంచి రాయిగిరి వరకు కొత్తగా మూడోలైను మార్గాన్ని చేపట్టనున్నారు.

హవాలా అడ్డా.. హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడా లెక్కలుండవు. దీనిద్వారా పొందిన లాభం ఆదాయపుపన్ను పరిధిలోకి రాదు. ఇలా ఆర్జించిన మొత్తాన్ని బ్యాంకుల్లో కూడా దాచిపెట్టుకోలేరు. రాజకీయనేతలు, అధికారులు కూడా లంచాల డబ్బు దాచిపెట్టుకోవడం కష్టం. ముఖ్యంగా నోట్ల రద్దు తర్వాత లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారానే జరుగుతుండటంతో అక్రమ సంపాదనను దాచుకోలేక విదేశాలకు తరలిస్తున్నారు. ఇందుకోస తప్పుడు పత్రాలతో నకిలీ సంస్థలు తెరుస్తున్నారు. ఆ సంస్థల్లో ఎలాంటి ఉత్పత్తి జరగదు. కానీ తమకు అవసరమైన ముడి సరుకు దిగుమతి చేసుకుంటున్నట్లు బోగస్ ఇన్‌వాయిస్ తయారు చేస్తున్నారు. ఆ మొత్తాన్ని విదేశాల్లోన్ని ఆయా సంస్థల ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు.

ఎలా బయటపడింది?

హైదరాబాద్‌లోని చందానగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ ఫిర్యాదుతో ఈ బండారం బయటపడింది. తమ బ్రాంచిలో నకిలీ పత్రాల ద్వారా మూడు తప్పుడు ఖాతాలు తెరిచి దాన్నుంచి రూ.31.60 కోట్లు విదేశాలకు తరలించారని మేనేజర్ చందానగర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసి, దర్యాప్తుచేసిన పోలీసులు హైదరాబాద్ కేంద్రంగా ఈ తరహా దందా పెద్దఎత్తున జరుగుతున్నట్లు గుర్తించారు. ఈడీ అధికారులు రంగంలోకి దిగేసరికి మొత్తం బండారం బయటపడింది.

అంతా బోగస్

అక్రమంగా ఆర్జించిన మొత్తాన్ని విదేశాలకు తరలించగలిగితే కమిషన్ రూపంలో భారీగా చెల్లిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌కు చెందిన మహేంద్ర ఖత్రి భారీ వ్యూహాన్ని పన్నాడు. ఇందుకోసం చందానగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వేర్వేరు సంస్థల పేర్లతో మూడు ఖాతాలు తెరిచాడు. సంస్థలు రిజిస్ట్రేషన్ చేయించడం, వాటి ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించడానికి అవసరమైన పత్రాలన్నీ నకిలీవే సృష్టించాడు. ఇందుకోసం పరిచయస్తుడయిన దుర్గాప్రసాద్‌ను వాడుకున్నాడు. తనతోపాటు తన మిత్రులైన వినోద్‌ఓఝా, ఆనంద్‌కుమార్ బిద్రకర్‌లకు సంబంధించిన పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, విద్యుత్తు బిల్లులు దుర్గాప్రసాద్‌కు ఇచ్చిన ఖత్రి వాటి ఆధారంగా మూడు కరెంటు ఖాతాలు తెరవాలని కోరాడు. ఇందుకోసం రూ.2 లక్షలు చెల్లించాడు. సంస్థ రిజిస్ట్రేషన్ బాధ్యతను దుర్గాప్రసాద్.. వ్యాట్, టీవోటీ పత్రాలు ఇప్పించే ఏజెంటు సాయికిరణ్‌కు అప్పగించాడు. అవసరమైన నకిలీ పత్రాలు సృష్టించిన సాయికిరణ్ వ్యాట్ రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలను దుర్గాప్రసాద్‌కు ఇచ్చాడు. వీటన్నింటి ద్వారా దుర్గాప్రసాద్ చందానగర్ హెచ్‌డీఎఫ్‌సీ, సిద్దిఅంబర్‌బజార్‌లోని యాక్సిస్ బ్యాంకుతో పాటు మరికొన్ని బ్యాంకుల్లో శ్రీనివాస్ ట్రేడింగ్ కంపెనీ, జీఎస్ ట్రేడ్, వినాయక ఎంటర్‌ప్రైజెస్‌ల పేర్లతో కరెంటు ఖాతాలు తెరిచాడు. ఈ ముగ్గురికీ వేర్వేరు వ్యాపారాలున్నాయి. ఖత్రికి ఉస్మాన్ గంజ్‌లో సౌందర్య బ్యూటీ ప్లేస్ అనే సంస్థ ఉంది. వినోద్‌ఓఝా స్టీల్ వ్యాపారం నిర్వహించేవాడు. ఆనంద్‌కుమార్‌కు చెక్కులు తీసుకొని డబ్బు చెల్లించే సంస్థ ఉంది. చెక్కును నగదుగా మార్చుకోవాల్సిన వారు బ్యాంకు వరకూ వెళ్లకుండా ఆనంద్‌కుమార్‌కు ఇస్తే కొంత కమీషన్ తీసుకొని డబ్బు చెల్లించేవాడు. వీరిద్దర్నీ ఖత్రి తనకు అనుకూలంగా వాడుకున్నాడు. ఎవరైనా నల్లధనాన్ని విదేశాలకు తరలించాలనుకుంటే వారి ద్వారా తమ ముగ్గురికీ ఉన్న వివిధ సంస్థల్లో డబ్బు జమ చేయాల్సి ఉంటుంది. తమ సంస్థలతో నిర్వహించిన వ్యాపార లావాదేవీల్లో భాగంగానే ఈ డబ్బు జమచేసినట్లు ఖత్రి నకిలీ పత్రాలు సృష్టించేవాడు. ఉదాహరణకు ఇనుము కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించి ఆ మొత్తాన్ని తమ ముగ్గురి పేర్లతో ఉన్న వేర్వేరు సంస్థల్లో జమచేసేవాడు. మళ్లీ ఈ సంస్థల నుంచి విదేశాలకు నిధులు పంపేందుకు ప్రత్యేకంగా తెరిచిన మూడు కరెంటు ఖాతాల్లోకి మళ్లించేవాడు. ఇదంతా వ్యాపార లావాదేవీల్లో భాగంగానే జరిగినట్లు నకిలీ ఇన్‌వాయిస్‌లు పుట్టించేవాడు. అంతిమంగా ఈ మూడు సంస్థల నుంచి విదేశాల్లోని ఖాతాలకు నిధులు బదిలీ చేసేవాడు. ఇందుకోసం తాము విదేశాల నుంచి ఎల్.ఇ.డి. లైట్లు, కుక్కర్ల వంటి వివిధ రకాల సరుకులు దిగుమతి చేసుకున్నట్లు మళ్లీ తప్పుడు పత్రాలు పుట్టించేవాడు. దిగుమతి చేసుకున్న సరుకుకు డబ్బు చెల్లించాలి కాబట్టి.. ఆ నెపంతో అప్పటికే తమ ఖాతాల్లో పడ్డ డబ్బును విదేశాల్లోని ఖాతాలకు బదిలీ చేసేవాడు. మనం ఇంపెక్స్, మిత్రాట్రేడ్ సర్వీస్, విక్టరీ ఇంపోర్ట్స్, గ్లోబల్ ఇంపెక్స్ వంటి వాటి నుంచి చెక్కులు, ఆర్టీజీఎస్‌ల ద్వారా డబ్బును తాము తెరిచిన మూడు కరెంటు ఖాతాల్లోకి, అక్కడ్నుంచి విదేశాలకు మళ్లించేవాడినని విచారణలో ఖత్రి అంగీకరించాడు.

కదిలిన డొంక: చందానగర్ పోలీసు విచారణలో ఖత్రి అక్రమాలు బయటపడటంతో ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఖత్రి తెరిచిన ఖాతాలు, సంస్థలతో పాటు ఆ ఖాతాల్లోకి డబ్బు మళ్లించిన సంస్థలు కూడా నకిలీవేనని తేల్చారు. 40 రోజుల వ్యవధిలోనే రూ.42 కోట్లు విదేశాలకు మళ్లించారని, ఇప్పటివరకూ దర్యాప్తులో వెల్లడయిన వివరాల ప్రకారం ఈ ముగ్గురు వ్యక్తులే దాదాపు రూ.150 కోట్ల వరకూ అక్రమంగా విదేశాలకు మళ్లించారని అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌తో పాటు దిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబయిల నుంచి కూడా పెద్దమొత్తంలో తాము నిధుల్ని విదేశాలకు మళ్లించినట్లు నిందితులు విచారణలో వెల్లడించారు. ఇలాంటి దళారులు ఒక్క హైదరాబాద్‌లోనే పదుల సంఖ్యలో ఉన్నారని, ముఖ్యంగా సికింద్రాబాద్ ప్రాంతంలో ఇనుము వ్యాపారం నిర్వహిస్తున్న అనేక సంస్థలు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నాయని, ఒక్క హైదరాబాద్ నుంచే ఏటా దాదాపు రూ.వెయ్యికోట్ల నల్లధనాన్ని విదేశాలకు తరలిస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. దర్యాప్తు అధికారులు ఇప్పుడు ఇలాంటి బోగస్ సంస్థలన్నింటినీ గుర్తించే పని మొదలుపెట్టారు.

సంస్థ పేరు	బ్యాంకు ఖాతా	యజమాని	విదేశాలకు తరలించిన మొత్తం
శ్రీనివాస ట్రేడింగ్ కంపెనీ	50200005764688	భన్వర్‌లాల్‌రాజ్ పురోహిత్	రూ.9.18 కోట్లు
జీఎస్ ట్రేడ్	0045763000031	జౌరా రామ్ పురోహిత్	రూ.11.444 కోట్లు
వినాయక ఎంటర్‌ప్రైజెస్	0045760000264	బాబూలాల్ హరిసింగ్	రూ.31.60 కోట్లు

సీఎం దిల్లీ పర్యటన రద్దు

ఈనాడు, హైదరాబాద్: సీఎం కేసీఆర్ దిల్లీ పర్యటన రద్దయింది. శుక్రవారం దిల్లీలో ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొనాల్సి ఉంది. చివరి నిమిషంలో పర్యటన రద్దయింది. ముఖ్యమంత్రి ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడంతో బాటు కేంద్రమంత్రులతో సమావేశమవుతారని మొదట్లో ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. తాజాగా పర్యటన రద్దయింది.

ప్రమాణ స్వీకారానికి గవర్నర్: ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఈ.ఎస్.ఎల్.నరసింహన్ హాజరు కానున్నారు.

గ్రహం అనుగ్రహం

11-8-2017 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
చవితి: రా. 10-45 తదుపరి పంచమి
పూర్వాభాద్ర నక్షత్రం: ఉ. 6-22 తదుపరి ఉత్తరాభాద్ర
అమృతఘడియలు: రా. 1-24 నుంచి 3-00 వరకు
వర్జ్యం: మ. 3-53 నుంచి 5-28 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-17 నుంచి 9-07 వరకు
తిరిగి మ. 12-31 నుంచి 1-22 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-45; సూర్యాస్తమయం: సా.6-26

హద్దుల్లోనే...హుందాగా..

- నిబంధనలు, సంప్రదాయాలే దిక్సూచిగా సభా నిర్వహణ
- సభ్యుల సహకారం తప్పనిసరి
- రాజ్యసభ ఛైర్మన్ బాధ్యతల నిర్వహణపై వెంకయ్యనాయుడు



ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీతో ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు

దిల్లీ: ప్రజలకిచ్చిన వాగ్దానాలను ప్రభుత్వాలు విజయవంతంగా అమలుచేయాలంటే పార్లమెంటు ప్రభుత్వ బిల్లులను సకాలంలో ఆమోదించాల్సిన ఉందని, దీనికి గాను ఉభయ సభలు సభ్యులు హుందాగా నడవాల్సి ఉంటుందని శుక్రవారం ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేయనున్న ఎం.వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. ప్రజల తీర్పును చట్టసభల్లోని సభ్యులందరూ గౌరవించాలని, దానికి అనుగుణంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి హోదాలో రాజ్యసభ ఛైర్మన్‌గా ఎగువసభకు ఆయన అధ్యక్షత వహిస్తారు. నియమనిబంధనలు, సంప్రదాయాలకనుగుణంగా సభను సాఫీగా నిర్వహించేందుకు ప్రాధాన్యమిస్తానని పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ వెంకయ్యనాయుడు అన్నారు. "ఉభయ సభల ప్రధాన విధి శాసనాలను రూపొందించటం. ఆయా బిల్లులపై కూలంకషంగా చర్చించాల్సిన బాధ్యత సభ్యులదే. సభను సక్రమంగా కొనసాగనివ్వకుంటే చట్టాలను రూపొందించటం ఎలా సాధ్యమవుతుంది?" అని వెంకయ్యనాయుడు ప్రశ్నించారు. 'సభా కార్యకలాపాలు సాఫీగా, అర్థవంతంగా సాగటానికి ప్రతి సభ్యుడూ పరిణితితో వ్యవహరించాలి. ఛైర్మన్ అంటే కేవలం సభకు అధ్యక్షత వహించటమే కాదు ...సభా సంరక్షకుడు కూడా' అని అన్నారు. సభ సక్రమ నిర్వహణలో సభ్యుల సహకారం కూడా అవసరమేనని తెలిపారు. తరచూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలగటం వల్ల పార్లమెంటు పనితీరుపై ఇటీవల దురభిప్రాయం కలుగుతుందని, దీనిని సరిచేసుకోవాల్సి ఉందన్నారు. సభ్యులు ఆయా అంశాలపై మాట్లాడాలి, చర్చించాలి, నిర్ణయించాలే కాని పార్లమెంటును భంగపరచరాదన్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ హితవును వెంకయ్యనాయుడు గుర్తు చేశారు. "నా కొత్త బాధ్యతల నిబంధనలు ఇది వరకటిలా స్వేచ్ఛగా ప్రజల్లోకి వెళ్లేందుకు అనుమతించకపోవచ్చు. క్రియాశీల రాజకీయవేత్తగా ఇప్పటి వరకూ గడిపిన జీవితం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. కనీసం మరో అయిదేళ్ల వరకూ ఆ తరహా జీవితానికి విరామమే" అని వెంకయ్యనాయుడు అన్నారు.

రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా: ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు గురువారం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను రాజ్యసభ ఛైర్మన్ హమీద్ అన్సారీ ఆమోదించారని సభలో డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ ప్రకటించారు. ప్రస్తుతం వెంకయ్యనాయుడు రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, 13వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఆయన శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారని కురియన్ సభలో ప్రకటించారు.

ముగ్గురు సభ్యులకు వీడ్కోలు

ప్రస్తుత వర్షాకాల సమావేశాల్లో పదవీ కాలం ముగియనున్న ముగ్గురు సభ్యులకు రాజ్యసభ గురువారం వీడ్కోలు పలికింది. మరో ఆరుగురు సభ్యుల పదవీకాలం ముగిసినప్పటికీ వారు తిరిగి సభకు ఎన్నికయ్యారు. పదవీకాలం ముగిసిన సీతారాం ఏచూరి(సీపీఎం), దిలీప్ పాండ్య(భాజపా), డి.బంద్యోపాధ్యాయ్(టీఎంసీ)లతో తమకున్న అనుభవాలను, అనుబంధాన్ని సభ్యులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సీతారాం ఏచూరి అత్యుత్తమ పార్లమెంటేరియన్ అంటూ డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ కొనియాడారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్, డెరెక్ ఓబ్రియాన్(టీఎంసీ), డి.రాజా(సీపీఐ) తదితరులు ఏచూరి ఆదర్శప్రాయమైన నేత అని, పార్లమెంటేరియన్‌గా ఉత్తమ ప్రమాణాలు పాటించారంటూ కితాబునిచ్చారు. ఎగువసభలో ఏచూరి పక్కనే కూర్చునే సమాజ్‌వాదీ ఎంపీ రాంగోపాల్ యాదవ్... వీడ్కోలు సందేశం ఇచ్చేటప్పుడు ఉద్వేగానికి లోనవటంతో మాట్లాడలేకపోయారు.

నెలాఖరుకల్లా కేంద్ర మంత్రివర్గ విస్తరణ!

- పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు
- భాజపాలో ఖాళీ పదవుల భర్తీ

ఈనాడు, దిల్లీ: కేంద్ర మంత్రివర్గంలో ఈ నెలాఖరు నాటికి మార్పులు చేర్పులు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతో పాటే 6 రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం, భాజపాలో వ్యవస్థాగత మార్పులు చేపట్టనున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల వరకు ఉన్న కీలక సమయాన్ని దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం, భాజపాలు మార్పులు చేయనున్నట్లు సమాచారం. దాదాపు 20 మంది వరకు సీనియర్, జూనియర్ మంత్రులకు శాఖలు మార్చడం లేదా ఉద్వాసన పలికే అవకాశం ఉంది. పార్టీ పదవుల్లోకి కొందరిని తీసుకోనున్నారు. ఏపీ, హిమాచల్‌ప్రదేశ్‌లకు కొత్తగా పార్టీ ఇన్‌ఛార్జులను నియమించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేంద్ర మంత్రివర్గంలో కీలకమైన రక్షణ శాఖ అదనపు బాధ్యతలను ఆర్థిక మంత్రి జైట్లీ చూస్తున్నారు. ఆ శాఖ బాధ్యతలు చూసే పారికర్ గోవా సీఎంగా వెళ్లిన సంగతి తెలిసిందే. అలాగే ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు అంతవరకు బాధ్యతలు నిర్వర్తించిన పట్టణాభివృద్ధి; సమాచార, ప్రసార శాఖల అదనపు బాధ్యతలను మరో ఇద్దరు నిర్వర్తిస్తున్నారు. పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న అనిల్‌దవే మృతి చెందిన నేపథ్యంలో ఆ శాఖ అదనపు బాధ్యతలను సైన్స్, టెక్నాలజీ మంత్రి హర్షవర్ధన్‌కు అప్పగించారు. ఆయా శాఖలకు పూర్తిస్థాయి మంత్రులను నియమించాల్సి ఉంది. అలాగే జేడీయూ ఇటీవల ఎన్‌డీఏలో చేరడంతో ఆ పార్టీకి రెండు మంత్రి పదవులు (ఒక కేబినెట్, ఒక సహాయ) కేటాయించే అవకాశం ఉంది. జేడీయూకు రాజ్యసభలో 10 మంది, లోక్‌సభలో ఇద్దరు సభ్యులున్నారు. అన్నాడీఎంకే చీలికవర్గాలు కలిసిన అనంతరం ఆ పార్టీ కేంద్ర మంత్రివర్గంలో చేరవచ్చని తెలుస్తోంది. అన్నాడీఎంకేకు లోక్‌సభలో 37, రాజ్యసభలో 13 మంది సభ్యుల బలం ఉంది. దక్షిణాదిన పార్టీని విస్తరించే వ్యూహంలో భాగంగా రెండు చీలికవర్గాలకూ ఉన్నతస్థాయి కేబినెట్ మంత్రి ఒకరు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రివర్గంలో 75 ఏళ్ల లోపు వారికే చోటు కల్పించే అలిఖిత సంప్రదాయం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కలరాజ్ మిశ్రా 76వ ఏట అడుగిడటంతో ఆయనను ఏదో ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించవచ్చన్న ప్రచారం ఉంది. ప్రస్తుతం తెలంగాణ, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, తమిళనాడు, బిహార్, మేఘాలయ రాష్ట్రాలకు గవర్నర్లు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉత్తరాఖండ్ గవర్నర్‌ను మార్చే అవకాశమూ ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. భాజపా జాతీయ ఉపాధ్యక్షుల్లో ఒకరైన దినేశ్ శర్మ యూపీ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మరోఇద్దరు ఉపాధ్యక్షులు దత్తాత్రేయ, ముక్తార్ అబ్బాస్‌నఖ్వీలతో పాటు.. ప్రధాన కార్యదర్శులు నడ్డా, రాజీవ్ ప్రతాప్ రూఢీ మంత్రివర్గంలో చేరారు. పార్టీ జాతీయ స్థాయి కార్యదర్శులు శ్రీకాంత్ శర్మ, సిద్ధార్థ్‌నాథ్ సింగ్, మహేంద్ర సింగ్.. భాజపా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దారాసింగ్ చవాన్‌లు యూపీ ప్రభుత్వంలో చేరారు. వీరిలో ఇద్దరు ఏపీ, హిమాచల్ ప్రదేశ్‌ల పార్టీ ఇన్‌ఛార్జులు కావడంతో ఆ రెండు రాష్ట్రాలకు కొత్త ఇన్‌ఛార్జులను నియమించే అవకాశం ఉంది.

విశాఖ బాలిక ప్రపంచ రికార్డు

- విజయవంతంగా స్టాక్ కాంగ్రీ పర్వతారోహణ



స్టాక్ కాంగ్రీ పర్వత శిఖరంపై తల్లిదండ్రులతో కామ్యా కార్తికేయన్

ఈనాడు, విశాఖపట్నం: సముద్రమట్టానికి 20,180 అడుగుల (6,153మీ.) పైన గడ్డ కట్టే మంచుతో ఉండే స్టాక్ కాంగ్రీ పర్వతాన్ని అధిరోహించి విశాఖకు చెందిన తొమ్మిదేళ్ల బాలిక కామ్యా కార్తికేయన్ ప్రపంచ రికార్డు సృష్టించింది. తూర్పు నౌకాదళం కమాండర్ కార్తికేయన్ కుమార్తె కామ్యాకు చిన్ననాటి నాటి నుంచి పర్వతారోహణపై మక్కువ. దేశంలోని పలు పర్వతాలను బాలిక అధిరోహించింది. పర్వతారోహణంలో ప్రావీణ్యం ఉన్న తల్లిదండ్రుల శిక్షణలోనే కామ్యా రాటుదేలింది. వీరు మరో 40 మందితో కలిసి హిమాలయాల్లోని స్టాక్ కాంగ్రీ పర్వతారోహణకు ఈ నెల 4న శ్రీకారం చుట్టారు. తొలుత గత నెల 29న లెహ్ పట్టణానికి చేరుకున్న వీరు అక్కడే ఉండి స్థానిక వాతావరణానికి అలవాటుపడ్డారు. నాల్గో తేదీన స్టాక్ అనే గ్రామం నుంచి పర్వతారోహణ మొదలుపెట్టారు. మంచుకొండల్లో ప్రమాదకర మార్గాల్లో ప్రయాణించారు. మంచు కారణంగా పలుచోట్ల మార్గాన్ని గుర్తించడం కష్టమైనప్పటికీ మొక్కవోని దీక్షతో ముందుకు సాగారు. తొలిరోజు 16 కిలోమీటర్లు నడిచి 4500 మీటర్ల ఎత్తులో ఉన్న మన్‌కార్మో ప్రాంతానికి చేరుకున్నారు. దశలవారీగా రాత్రి పగలు తేడాలేకుండా ప్రయాణిస్తూ ఏడోతేదీ ఉదయం 9.45 గంటలకు 20,180 అడుగుల ఎత్తున్న స్టాక్ కాంగ్రీ పర్వత శిఖరాగ్రానికి చేరుకున్నారు. వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక ఈ ప్రయాణంలో పలువురు మధ్యలోనే వెనక్కి మళ్లారు. చివరకు బాలికతో సహా 15 మంది మాత్రమే చేరుకోగలిగారు.

ప్రత్యేక రైళ్లకు అదనపు బోగీలు

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్-కాకినాడల మధ్య తిరిగే ప్రత్యేకరైళ్లకు అదనంగా రెండు ఏసీ బోగీలు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. 11న సికింద్రాబాద్ నుంచి కాకినాడ వెళ్లే రైలు (నెం.07075)కు, 12 కాకినాడ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైలు (నెం.07076)కు ఒక్కో త్రీటైర్ ఏసీ బోగీ అదనంగా ఉంటుంది. నిరీక్షణ జాబితా(వెయిటింగ్ లిస్ట్) ఎక్కువగా ఉండటంతో ఈ ఏర్పాటు చేశారు.

హసన్ అలీ కేసులో ఈడీ సోదాలు

ముంబయి: గుర్రపు పందాల వ్యాపారి హసన్ అలీ ఖాన్ అక్రమ నగదు చలామణి కేసుకు సంబంధించి ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) సోదాలు నిర్వహించింది. ముంబయిలోని అతనికి సంబంధించిన నాలుగు ప్రదేశాల్లో గురువారం సోదాలు జరిపినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇదే కేసులో గతఏడాది ఈడీ డజనుకు పైగా ప్రదేశాల్లో దాడులు నిర్వహించింది. హసన్‌పై తొలిసారిగా ఈడీ 2011లో అభియోగాలు నమోదు చేసింది.

బియ్యం సేకరణ వేగవంతం

నెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తిచేయాలి: సీవీ ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: 'భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గిడ్డంగుల్లో ఖాళీ స్థలం లేదనే సాకు ఇక కుదరదు. మిల్లర్లు గతంలో చేసిన ఫిర్యాదుల మేరకు దిల్లీ నుంచి హైదరాబాద్ వరకు అధికారులంతా స్పందించారు. స్థలాన్ని అందుబాటులో ఉంచారు' అని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఆయన గురువారం జిల్లా సంయుక్త కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కస్టం మిల్లింగ్ పథకం కింద మిల్లులకు కేటాయించిన ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని ఈనెలఖరులోగా ఎఫ్‌సీఐకి అందచేయాలన్నారు. మిల్లర్లు రోజుకు 70 వేల మెట్రిక్ టన్నులు ఇస్తే కాని లక్ష్యాన్ని పూర్తి చేయటం సాధ్యం కాదన్నారు. 25.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉండగా బుధవారం వరకు 13.67 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. గత ఖరీఫ్‌లో జగిత్యాలలోని ఒక్క రైస్ మిల్లు మినహా అన్ని జిల్లాల్లోని మిల్లుల నుంచి 99.94 శాతం బియ్యం సేకరించగలిగామన్నారు.

తూకంలో తేడాలు రావద్దు: చౌకధరల దుకాణాల డీలర్లకు ఇచ్చే బియ్యం తూకంలో తేడాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ప్రతి క్వింటాకు రెండు కిలోలు తక్కువగా ఇస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయని, అలాంటి ఫిర్యాదులు పదేపదే వస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గోదాముల్లో వే బ్రిడ్జిలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

మరోవైపు ఈ-పాస్ విధానం అమలులో ఉండేలా జాయింట్ కలెక్టర్లు శ్రద్ధచూపాలన్నారు. ఇప్పటి వరకు 5,775 దుకాణాల్లో ఏర్పాటు చేశామని, ఈనెల 19 నాటికి మరో 4,159దుకాణాల్లో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీంతో 17,200దుకాణాలకు గాను 10వేల దుకాణాల్లో ఏర్పాటు చేసినట్లవుతుందన్నారు.



శ్వేతసౌధం ముందు ఆందోళనకారులు ఎగురవేసిన కోడి గాలిబొమ్మ

శ్వేతసౌధం ముందు ట్రంప్ ముఖాకృతితో కోడిబొమ్మ

- 30 అడుగుల గాలిబొమ్మ ఎగురవేసిన నిరసనకారులు
- ఆందోళనకు నేతృత్వం వహించిన తరణ్‌సింగ్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరికి నిరసనగా ఆయన ముఖాకృతిని పోలిన, కోడి వలే రూపొందించిన 30 అడుగుల గాలిబొమ్మను శ్వేతసౌధం ముందు ప్రదర్శనగా ఉంచారు. శ్వేతసౌధానికి దక్షిణాన, వాషింగ్టన్ స్మారక కట్టడానికి సమీపాన గల పచ్చిక బయళ్లలో 'చికెన్ డాన్' పేరిట దీన్ని ఎగురవేశారు. ఈ నిరసన ప్రదర్శనకు జాతీయ ఉద్యానవన సేవలు, నిఘా విభాగం నుంచి ఆందోళనకారులు అనుమతి పొందారు. ఈ ప్రదర్శన జరిగిన సమయంలో ట్రంప్ శ్వేతసౌధంలో లేరు. న్యూజెర్సీలో గల బెడ్‌మినిస్టర్‌లోని గోల్ఫ్‌కోర్సులో గల నివాసంలో ఉన్నారు. డాక్యుమెంటరీల రూపకర్త, భారతీయ మూలాలున్న తరణ్‌సింగ్ బ్రార్ ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శన జరిగింది. కొన్ని నెలల ముందుగానే ఈ గాలిబొమ్మ తయారీకి అవసరమైన నిధుల సేకరణను ఆన్‌లైన్ ద్వారా చేపట్టారు. ప్రస్తుతం ఈబేలో సుమారు రూ.96,000 ధరకు ఈ కోడిబొమ్మమ అమ్ముతున్నారు. ఆదాయపు పన్ను చెల్లింపుల వివరాలు వెల్లడించని ట్రంప్ ఓ పిరికిపంద అని, ఉత్తరకొరియాతో వ్యవహరించడంలో విఫలం చెందుతున్నారని, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అంటకాగుతున్నారని నిరసనకారులు ఆరోపించారు.

ఏపీలోని ఆ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి అవసరం లేదు

- కేంద్ర సహాయ మంత్రి సంజీవ్‌కుమార్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్న చిన్నచిన్న ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి అవసరం లేదని కేంద్ర జలవనరుల శాఖ సహాయమంత్రి సంజీవ్‌కుమార్ బాలియాన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రాజెక్టులపై తెరాస లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి సమాధానమిచ్చారు. "తెలంగాణలో వర్షాలు ఆలస్యమవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆలమట్టిలో నీరు లేదని ఓ పక్క చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి బేసిన్‌లో పట్టిసీమ, పురుషోత్తపట్నం, ముచ్చెర్ల, గుండ్రేవుల, గాజులదిన్నె, గురు రాఘవేంద్ర, పులికనుమ, సిద్ధాపురం, మున్నేరు ఇలా పలు ఎత్తిపోతల పథకాలు ప్రారంభించారు. ఓ పక్క నీరు లేక మరో పక్క అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ఎత్తిపోతలు నిర్మిస్తోంది. ఆయా ప్రాజెక్టుల నిర్మాణంపై కేంద్రం ఏ చర్యలు తీసుకుంది" అని జితేందర్‌రెడ్డి ప్రశ్నించారు. "సాధారణంగా పెద్ద ప్రాజెక్టుల అనుమతి కోసం కేంద్రం వద్దకు వస్తారు. ఏపీలో ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ నుంచి కేంద్రానికి ఫిర్యాదు వచ్చింది. ఇద్దరు ముఖ్యమంత్రులు కేంద్రమంత్రి సమక్షంలో చర్చించారు. మా స్థాయిలో సమస్య పరిష్కరించుకుంటామని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల ఏర్పాటుకి కేంద్రం అనుమతి అవసరం లేదు. నీటి కేటాయింపులకు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ఉంది. ట్రైబ్యునల్ నిర్ణయం తర్వాత ఏదైనా చేయగలం" అని బాలియాన్ తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై కూడా జీఎస్టీ తరహా మండలి ఏర్పాటు చేయాలేమోనని సభాపతి సుమిత్రా మహాజన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.



మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మధుబాల మైనపు విగ్రహం

దిల్లీ: బాలీవుడ్ అలనాటి అందాల తార మధుబాల మైనపు విగ్రహాన్ని దిల్లీలోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో గురువారం ఆవిష్కరించారు. 1960నాటి 'ముఘల్-ఇ-ఆజం' సినిమాలో మరపురాని 'అనార్కలి' పాత్రలో జీవించిన ఆమెకు.. పలువురు కళాకారులు మళ్లీ జీవం పోశారు. 'జబ్ ప్యార్ కియాతో డర్నా క్యా' పాటలో ఆమె చేసిన నృత్యం భంగిమ రూపంలో తీర్చిదిద్దారు. విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె సోదరి మధుర్ బ్రిజ్ పాల్గొన్నారు. 'సినిమా చిత్రీకరణను మమ్మల్ని(కుటుంబ సభ్యుల్ని) చూడనిచ్చేవారు కాదు. జబ్ ప్యార్ కియాతో డర్నా క్యా పాట చిత్రీకరణ సమయంలో చివరిసారిగా సెట్స్‌లో చూసినట్లు గుర్తు. ఆ పాటను చిత్రీకరించిన భవంతిని చూడటానికి పర్యాటకులు వెల్లువెత్తేవారు' అని ఆమె పేర్కొన్నారు. గుండె జబ్బు కారణంగా తన 36 ఏళ్ల వయస్సులో మధుబాల 1969లో కన్నుమూశారు.

నేడు దిల్లీలో విపక్షాల భేటీ

దిల్లీ: వివిధ అంశాలపై కేంద్రంలోని ఎన్డీఏ సర్కారును ఇరుకున పెట్టడానికి అనుసరించాల్సిన వ్యూహాన్ని రచించడం కోసం కాంగ్రెస్ నేతృత్వంలో 18 విపక్ష పార్టీలు శుక్రవారం దిల్లీలో సమావేశం కానున్నాయి. పార్లమెంటు గ్రంథాలయంలో జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ అధ్యక్షత వహిస్తారు. ఆమె తరఫున రాజ్యసభ కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ విపక్ష పార్టీలన్నిటికీ ఆహ్వానాలు పంపించారు. మమతా బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), మాయావతి (బీఎస్పీ), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), సీతారాం ఏచూరి (సీపీఎం) తదితర నేతలంతా దీనికి హాజరు కానున్నారు. ఉమ్మడి ప్రయత్నం ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి నెలకోసారి చొప్పున సమావేశం కావాలని 18 పార్టీలూ ఇదివరకే నిర్ణయించుకున్నాయి. మమతా బెనర్జీ బుధవారమే దిల్లీ చేరుకున్నారు. రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ తదితరులతో ఆమె భేటీ అయ్యారు.

నీట్‌లో ఏకరూప ప్రశ్నపత్రం ఉండాలి

- సీబీఎస్ఈకి సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ప్రమాణపత్రం దాఖలుకు ఆదేశం

దిల్లీ: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)లో ఆంగ్లం, హిందీ భాషలతో పాటు ప్రాంతీయ భాషల్లోనూ ఏకరూప/సమరూప పశ్నప్రతం ఉండాలని సీబీఎస్ఈకి సుప్రీంకోర్టును స్పష్టం చేసింది. దీని అమలుకు సంబంధించి ప్రమాణపత్రాన్ని దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ ఏడాది నిర్వహించిన నీట్‌లో ప్రాంతీయ భాషల్లో ఇచ్చిన ప్రశ్న పత్రాల స్థాయి...ఆంగ్లం, హిందీ భాషల్లో ఇచ్చిన పశ్నపత్రాల స్థాయి కన్నా కఠినంగా ఉందని, దీనివల్ల ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాసిన వారికి నష్టం జరిగిందంటూ గత నెలలో కొందరు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే 2017 నీట్‌ను రద్దు చేయటానికి తిరస్కరించిన సుప్రీంకోర్టు ఇదే అంశంపై గురువారం విచారణ కొనసాగించింది. ప్రశ్న పత్రం ఏ భాషలో ఉన్నప్పటికీ ఏకరూప/సమరూపంలోనే ఉండాలని, వచ్చే ఏడాది నుంచి దీనిని అమలుచేసేందుకు ఏమిచేయబోతున్నారో ప్రమాణపత్రంలో తెలియజేయాలని జస్టిస్‌లు దీపక్ మిశ్రా, అమితవరాయ్, ఏఎం ఖాన్విల్కర్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 10వ తేదీకి వాయిదా వేసింది.

2020నాటికి ప్రభుత్వ వ్యయం రూ.26 లక్షల కోట్లు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ వ్యయం 2019-20 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.26 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గురువారం పార్లమెంటుకు సమర్పించిన ఆర్థిక శాఖ అధికార పత్రం వెల్లడించింది. మూలధన వ్యయం 25% పెరిగి ఆ ఆర్థిక సంవత్సరం నాటికి రూ.3.9 లక్షల కోట్లకు చేరుతుందనీ, ఒక్క రక్షణ రంగ వ్యయమే 22% పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొంది. రెవెన్యూ వ్యయంతో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు రూ.21.46 లక్షల కోట్లుగా, వచ్చే ఏడాది రూ.23.4 లక్షల కోట్లుగా ఉంటుందని తెలిపింది. ప్రభుత్వ మొత్తం వ్యయంలో 30% వరకు రక్షణ రంగంపైనే ఖర్చవుతోంది. ఎరువులపై రాయితీ ఈ ఏడాదిలో, 2020లో కూడా రూ.70వేల కోట్లుగానే స్థిరంగా ఉంటుంది. పెట్రోలియం ఉత్పత్తులపై రాయితీ మాత్రం క్రమేణా తగ్గనుంది. పన్నుల్లో వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) వాటా ఏటా 30 బేసిస్ పాయింట్లు చొప్పున పెరగనుంది. రెవెన్యూ లోటు- స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2 శాతానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే తగ్గనుండగా, వచ్చే ఏడాది 1.9%గా ఉంటుంది.

పద్దు	2017–18 (రూ.కోట్లు)	2018–19 (రూ.కోట్లు)	2019–20 (రూ.కోట్లు)
రక్షణ రంగం	91,580	1,01,137	1,11,706
ఆహార రాయితీ	1,45,000	1,75,000	2,00,000
పెట్రోలియం రాయితీ	25,000	18,000	10,000

ఈనాడు

రైతు కలిమి... జాతికి బలిమి!

వ్యవసాయ ప్రధాన దేశమైన ఇండియాలో రైతుల ఉసురుపోసుకుంటున్నవి- రుణాలు, దానికి సంబంధించిన దారుణాలు! కష్టాలే పెట్టుబడిగా, నష్టాలే దిగుబడిగా ఆరుగాలం శ్రమించే సాగుదారులకు సకాలంలో సరైన పరపతి పుట్టడంలేదు. గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారుల్ని ఆశ్రయిస్తే, విపరీత రేటు పోటూ తప్పడంలేదు. రైతులకు రుణాలివ్వడాన్ని సామాజిక బాధ్యతగా అభివర్ణించి, ఆ మేరకు విధ్యుక్తధర్మం విస్మరించడం క్షమార్హం కాని నేరమని ఎవరు ఎంతగా మొత్తుకుంటున్నా- మెజారిటీ రైతాంగానికి సంస్థాగత రుణాలు దక్కడంలేదు. పార్లమెంటు స్థాయీసంఘం తాజా నివేదికాంశాల ప్రకారం- బ్యాంకులు, సహకార సంఘాలనుంచి రుణవసతికి నోచుకుంటున్న గ్రామీణ కుటుంబాల సంఖ్య 17శాతానికి పడిపోయింది. రుణాల మంజూరులో సుదీర్ఘ ప్రక్రియను సరళీకరించి, ఎక్కువమందికి అధిక మొత్తంలో పరపతి సదుపాయం కల్పిస్తేనే ప్రైవేటు వడ్డీ మోత తగ్గుతుందనడంలో ఇంకో మాట లేదు. రిజర్వ్ బ్యాంకు, నాబార్డ్ ఈ కీలకాంశాన్ని లోతుగా పరిశీలించాలన్న వీరప్ప మొయిలీ సంఘం- క్షేత్రస్థాయి స్థితిగతులకు అనుగుణంగా ప్రాధాన్యరంగ రుణ నిబంధనలు రూపుదిద్దుకోవాలంటోంది. రైతులతో స్వయం సహాయ సంఘాలు నెలకొల్పి తగినంత నిధి సమకూర్చి, సాగుదారుల అవసరాలను కాచుకునే ప్రయోగం- పరిమిత స్థాయిలో సుమారు పాతికేళ్ల క్రితమే పట్టాలకు ఎక్కింది. ఇన్నేళ్ల అనుభవాల్ని క్షుణ్నంగా మదింపు వేశాకనే ఆ దిశగా విస్తరణ చేపట్టడం మేలు. స్థాయీసంఘం సూచిస్తున్నట్లు- నిబంధనావళిలో మార్పులు, చేర్పులతోనే గుణాత్మక పరివర్తన సాధ్యపడదు. విశిష్ట సామాజిక బాధ్యతా నిర్వహణలో ఏటికి ఎదురీదుతున్న రైతాంగం పట్ల యావత్ బ్యాంకింగ్ వ్యవస్థ దృక్పథమే మారాల్సి ఉంది!

దేశంలో ఆరు దశాబ్దాల క్రితం సుమారు అయిదుకోట్ల టన్నులకే పరిమితమైన ఆహార ధాన్యోత్పత్తి నేడు అయిదింతలకు పైబడింది. వ్యవస్థాగతంగా రైతులకు అత్యావశ్యకమైన తోడ్పాటు ఒనగూడి ఉంటే వారు నిస్సంశయంగా మరిన్ని అద్భుతాల్ని సుసాధ్యం చేసేవారే! విత్తు మొదలు పంటల విక్రయాల వరకు సర్కారీ సంస్థల సాయం అరకొరేనని, చెరకు మినహా ఇతర పంటలకు కనీస మద్దతూ కరవేనని జాతీయ నమూనా సర్వే చేదు నిజాలెన్నింటినో తెలియజెప్పింది. గత్యంతరం లేక వెలుపలి నుంచి రుణాలు దూసితెచ్చి గిట్టుబాటు ఎండమావై దేశవ్యాప్తంగా సగానికి పైగా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు వివిధ అధ్యయనాలు గణాంక సహితంగా చాటుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో 89శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 93శాతం దాకా రైతులు అప్పుల పాలై ఉక్కిరిబిక్కిరవుతున్నారు. భారీ వడ్డీలకు రుణాలు తెచ్చిన రైతులు- ప్రకృతి విపత్తులు కాటేసినా, విపణి శక్తులు దగా చేసినా నిభాయించుకోలేక బలవన్మరణాలకు తెగబడుతున్నారు. 1995 నుంచి అలా అర్ధాంతరంగా ఉసురు తీసుకున్న అభాగ్య రైతుల సంఖ్య మూడు లక్షలకు మించిపోవడం- దేశంలో తీవరించిన పరపతి అవ్యవస్థకు ప్రబల దృష్టాంతం. 'రైతుబంధు' పథకాల్లాంటివి ఉన్నా మిరప సాగుదారులకు బ్యాంకుల్లో అప్పు పుట్టని దురవస్థ ఇటీవలి బాగోతమే. ఆర్‌బీఐ మార్గనిర్దేశాల ప్రకారం, మొత్తం బ్యాంకు రుణాల్లో సేద్యం వాటా 18 శాతానికి తగ్గకూడదు. 'పుస్తక సర్దుబాట్ల'ను కలిపి లెక్కించినా రుణ వితరణ 11 శాతం లోపేనని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. నికరంగా గ్రామీణ సేద్యానికి దక్కుతున్నది అందులో సగమైనా లేదు. ముఖ్యంగా కౌలురైతులకు అడుగడుగునా తిరస్కరణ ఎదురవుతోంది. జాతికి అన్నదాతలైన రైతుల వాస్తవిక అవసరాల పట్ల ఆర్‌బీఐ, బ్యాంకుల అవగాహన రాహిత్యం ఇన్నేళ్లుగా ఎనలేని చెరుపు చేసింది. ఈ దుస్థితిని రూపుమాపే దిద్దుబాటు చర్యలు తక్షణం ఊపందుకోవాలి!

సగటు రైతుకుటుంబం నెల ఆదాయం ఆరువేల రూపాయల లోపేనని జాతీయ స్థాయి అధ్యయనం నిగ్గుతేల్చింది. ఇటీవలి వేతన సిఫార్సుల ప్రకారం, అట్టడుగు ఉద్యోగి జీతంగా కేంద్రం ప్రకటించిన రూ.18వేలలో అది మూడోవంతుకన్నా తక్కువ! కొన్నిసార్లు కోత ఖర్చులు సైతం రాకపోవడంతో రైతులే పంటకు మంటపెట్టడం కన్నా దౌర్భాగ్యం ఉంటుందా? పెట్టుబడి ఆసరాకు నోచని రైతన్నను అసమగ్ర పంటల బీమా మరింతగా కుంగదీస్తోంది. నిరుడు ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన లక్ష్యాలు బాగున్నా అమలులో లోటుపాట్లు సాగుదారుల పుట్టి ముంచుతున్నట్లు శాస్త్ర పర్యావరణ కేంద్రం (సీఎస్ఈ) నివేదిక పక్షం రోజుల క్రితమే నిర్ధారించింది. కొన్ని పైర్లకే బీమాను పరిమితం చేయకుండా దేశమంతటా అన్ని రకాల పంటలకూ వర్తింపజేయాలన్న పార్లమెంటు స్థాయీసంఘం తాజా సిఫార్సు వినసొంపుగా ఉంది. అటు బ్యాంకు రుణాలు, ఇటు సమగ్ర బీమా పరికల్పనతోపాటు- రైతుల బలవన్మరణాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం అమలుపరచదగ్గ 14 సూత్రాల కార్యాచరణను రెండేళ్లక్రితమే జాతీయ సదస్సు సిద్ధం చేసింది. అసలు రైతు జీవన భద్రతతోనే జాతి ఆహార భద్రత ముడివడి ఉందంటూ, ఇతర రంగాలకు రైతుల వలసల్ని నిలువరించి, యువతరాన్నీ సేద్యంవైపు ఆకర్షించేలా డాక్టర్ స్వామినాథన్ చేసిన మేలిమి సిఫార్సులెన్నో పోగుపడి ఉన్నాయి. పంట రుణాల నుంచి సహేతుక గిట్టుబాటు వరకు సకల పార్శ్వాల్నీ మానవీయ సంస్కరణలతో స్పృశించి, బడుగు రైతుల ఇంట సౌభాగ్యం కొలువయ్యే విధివిధానాల స్థిరీకరణకు ప్రభుత్వాలు అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి. రైతు బతుకు గాలిలో దీపమైన దుస్థితిని పరిమార్చనంత కాలం- సేద్యానికి, దేశ ఆహార భద్రతకు పెనుముప్పు పొంచే ఉంటుంది!

కొత్త మార్గంలో చేనేత మగ్గం!



దేశ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక- చేనేత. దానికి సాంకేతికత జత కలిస్తే అద్భుతాలు సాధ్యమవుతాయి. అందుకే నిరంతర పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలతో చేనేత రంగాన్ని బలోపేతం చేయాలి'- ప్రధాని నరేంద్ర మోదీ గత జూన్ 30న గుజరాత్‌లో 'టెక్స్‌టైల్స్ ఇండియా-2017' ప్రారంభోత్సవ సభలో ఇచ్చిన పిలుపు అది. దేశవ్యాప్తంగా చేనేత, జౌళి రంగాల అభివృద్ధికి కట్టబెట్టాల్సిన ప్రాధాన్యం ఆ మాటల్లో వ్యక్తమైంది. 'వస్త్రపరిశ్రమకు చేనేత రంగమే మూలం. అది భారతీయ ఆత్మకు ప్రతీక' అని ఒక సందర్భంలో మహాత్మాగాంధీ అభివర్ణించారు. కళానైపుణ్యం నిండి ఉండే భారతీయ వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి. కానీ కొన్ని ఆధునిక మార్పులు, స్వేచ్ఛావాణిజ్య విధానాల తీరుతెన్నులు చేనేత పురోగతికి ప్రతిబంధకంగా మారాయి. మిల్లు వస్త్రాల విపరీత ఆధిపత్యం, అసంఘటిత రంగంలో ఉండటం వల్ల చేనేతను చిరకాలంగా వెంటాడుతున్న కష్టనష్టాలు- అభివృద్ధిని దెబ్బతీశాయి. పలు సంఘాలు ఉన్నప్పటికీ, వాటి ద్వారా కార్మికులకు కలుగుతున్న ప్రయోజనాలు అంతంతమాత్రమే. విప్లవాత్మక మార్పులు, ఆధునిక పోకడల దిశగా చేనేత ఎంతమాత్రం ఎదగలేదు. సొంతంగా పెట్టుబడులు పెట్టలేక, సరైన విక్రయ వసతులు లేక నేత కార్మికులు నానాపాట్లు పడుతున్నారు. గుంత మగ్గాల వల్ల అవస్థలతో పాటు, రంగులు-రసాయనాల ప్రభావంతో పలువురు అనారోగ్యం పాలవుతున్నారు. పరిశోధనలు, నూతన ఆవిష్కరణల సంగతి చెప్పనే అక్కర్లేదు.

సమన్వయమే ప్రధానం

కార్మికుల కష్టాన్ని, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించే విధానాలేవీ చేనేత రంగంలో రాలేదు. వారు నేసే వస్త్రాల విక్రయాలకు అనుగుణమైన విపణి అసలే లేదు. ఇప్పటికీ పాతకాలపు మగ్గాలు, రాట్నాలే కనిపిస్తున్నాయి. రంగులు, రసాయనాలను కలిపే పద్ధతిలోనూ మార్పు రాలేదు. 'మాస్టర్ వీవర్లు' సూచించిన ప్రకారమే వారు వస్త్రాలు నేయాలి. ఆ మేరకు వచ్చే ప్రతిఫలాన్నే తీసుకోవాలి. సొంతంగా వస్త్రాలు నేసినా, వాటిని వ్యాపారులు నిర్ణయించిన ధరలకే దుకాణాల్లో విక్రయించాలి. నేత కార్మికులకు తగినన్ని ఆరోగ్య సంరక్షణ పథకాలు లేవు. ఉన్న కొన్ని పథకాలూ కొద్దిపాటి సేవలకే పరిమితమవుతున్నాయి. ఆయా కార్మికులకు సోకే క్యాన్సర్, క్షయ వంటి జబ్బులకు సంపూర్ణ చికిత్సను అవి అందించలేకపోతున్నాయి. అనేకమందికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేవు. కార్మికులకు పని వసతి మరో పెద్ద సమస్య. నేత పనులకు ఇంటితో పాటు 'వర్క్ షెడ్లు' అవసరమవుతాయి. ప్రభుత్వం గతంలో ప్రత్యేక పథకాన్ని చేపట్టినా, మంజూరైన షెడ్లను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. నేతపనినే నమ్ముకున్న కార్మికులు వీడలేకపోతున్నారు. కాలక్రమంలో వస్త్ర పరిశ్రమలోకి వివిధ వర్గాలవారు ప్రవేశించారు. ఎనిమిదో దశకం నుంచి ఆ పరిశ్రమ పరిధి విస్తృతమైంది. పశ్చిమ్ బంగ, ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో జౌళి మిల్లుల సంఖ్య పెరిగింది. తెలుగునేలపై నేత ఉత్పత్తులు పోచంపల్లి, ధర్మవరం, గద్వాల, ఉప్పాడ, వెంకటగిరి, నారాయణపేట వంటి ప్రాంతాలకే పరిమితమయ్యాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు ప్రాంతాల్లో చేనేత కార్మికుల సంఖ్య ఎక్కువ. దాదాపు 20 లక్షలమంది ఈ వృత్తిపైనే ఆధారపడినట్లు అంచనా. అయినప్పటికీ, పెద్ద స్థాయి వస్త్ర పరిశ్రమలేవీ ఏర్పాటు కాలేదు.

చైనాలో చేనేత పనికి యంత్రపరికరాల్ని అనుసంధానించారు. అక్కడ అత్యాధునిక పద్ధతులతో ఉత్పత్తి సాగుతోంది. మనదేశంలో చేనేత, మరమగ్గాల మధ్య 'స్పష్టమైన విభజన' కొనసాగుతోంది. చీరలు, ధోవతులు సహా 11 రకాల వస్త్రాల నేతకు సంబంధించి- కేంద్రప్రభుత్వం గతంలోనే చట్టం తెచ్చింది. కానీ- తగినంత ఆదాయం, జీవనోపాధికి అనువైన పరిస్థితులు లేకపోవడంతో చేనేత రంగంలోని కార్మికుల సంఖ్య ఏటా తగ్గుతోంది. కొత్తగా ఈ రంగంలోకి యువత రావడం లేదు. ప్రభుత్వాలు ఎటువంటి చొరవా చూపడం లేదు. నీతి ఆయోగ్ అధ్యయనం ప్రకారం, దేశంలోని చేనేత కార్మికులకు ఏడాదిలో కేవలం 234 రోజులకే పని దొరుకుతోంది. చేనేత, మరమగ్గాల మధ్య సమన్వయ లోపం వల్ల వస్త్ర పరిశ్రమ రెండు వర్గాలుగా చీలి ఉంది. ఈ పరిస్థితులూ వస్త్ర పరిశ్రమ అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నాయి. పత్తిసాగుకు సంబంధించి, భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ఉన్ని, పట్టు, జనపనార ఉత్పత్తులూ ఇక్కడే అధికం. అయినా వస్త్రోత్పత్తి రంగంలో మన వాటా కేవలం అయిదుశాతమే! దేశీయ అవసరాలకు పోను విదేశాలకు ఎగుమతి చేసే సామర్థ్యమైతే నేత పరిశ్రమకు ఉంది. వాస్తవంలో, దాదాపు 15 శాతమే ఎగుమతి చేయగలుగుతోంది. మరోవైపు, విదేశాల నుంచి పెద్దయెత్తున ఉత్పత్తులు మనదేశానికి వస్తున్నాయి. అతి పురాతనమైన భారతీయ కళానైపుణ్యంతో కూడిన చేనేతపై ప్రభుత్వాలు దృష్టి నిలపాలి. ఆ వస్త్ర పరిశ్రమను గణనీయంగా అభివృద్ధి చేయాలి. దీనికి విప్లవాత్మక చర్యలు అవసరమవుతాయి. చేనేతను నిరాదరణీయ రంగం కానివ్వకూడదు. దాన్ని సార్వత్రిక వినియోగ పరిధిలోకి తేవాలి. తమిళనాడులో చేనేత, జౌళిలను విలీనం చేశారు. 'కో-ఆప్టెక్స్' సంస్థ ద్వారా రెండింటికీ వ్యాపారావకాశాల్ని పెంచారు. తిరుపూరు వంటి కేంద్రాలు కళకళలాడుతున్నాయి. ఉపాధి అవకాశాలు లేక ఇతర రంగాల వైపు మొగ్గుచూపుతున్న యువతను ఈ రంగంలోకి ఆకర్షించాలి. పాఠ్యాంశాల్లో చేనేత, జౌళి ఉత్పత్తి అంశాల్ని చేర్చాలి. నైపుణ్య శిక్షణ కేంద్రాల్ని ఏర్పాటు చేయాలి. సమీకృత నైపుణ్య శిక్షణ విధానం అత్యవసరం. 'నిఫ్ట్'తో పాటు ఫ్యాషన్ రంగం పురోభివృద్ధికి నూతన శిక్షణ సంస్థల అవసరం ఎంతైనా ఉంది. మేటి నిపుణులతో అన్ని రాష్ట్రాల్లోనూ శిక్షణ సదుపాయాలు కల్పించాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శ్రేణిలోకి చేనేత, జౌళి రంగాలను పూర్తిగా చేర్చాలి. చేనేత యూనిట్‌ను ఒక పరిశ్రమగా గుర్తించి, రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. జౌళి రంగంలో విరివిగా పరిశ్రమల్ని స్థాపించడంతో పాటు మరిన్ని టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలి.



గుజరాత్‌లో 'టెక్స్‌టైల్స్ ఇండియా–2017' ప్రారంభోత్సవ సభలో ప్రధాని మోదీ ప్రసంగం (పాత చిత్రం)

ప్రోత్సాహకాలతో నేతన్నకు ఉన్నతి

దేశంలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఆసక్తి కలిగిన వారికి నేత, అల్లిక, దుస్తుల తయారీలో శిక్షణ ఇవ్వాలి. సంప్రదాయ చేనేత ఉత్పత్తులకు విదేశాల్లో మంచి ఆదరణ ఉంది. సరైన విపణి వ్యూహాన్ని అమలుచేస్తే ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. చేనేతపై ఇప్పటికే రాష్ట్రాల మధ్య ఆకర్షణీయమైన పోటీ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు చేనేత, జౌళికి ఊతమిస్తున్నాయి. కొత్త చేనేత సమూహాలను ఏపీలో ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం వరంగల్, సిరిసిల్ల తదితర ప్రాంతాల్లో అంతర్జాతీయ జౌళి పార్కులు నెలకొల్పుతోంది. చేనేత కార్మికులకు ఉపశమనం కలిగించేందుకు వీలుగా రుణ మాఫీని రెండు ప్రభుత్వాలూ చేపట్టాయి. నిరంతర ఉపాధి కల్పనకు కృషిచేస్తున్నాయి. కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలను కొనుగోలు చేయడంతో పాటు ప్రతి జిల్లాలోనూ చేనేత బజార్లు ఏర్పాటు చేస్తున్నారు.

చొరవతో ముందడుగు

ఎగుమతులపై కేంద్రంతో పాటు ప్రతి రాష్ట్రమూ దృష్టి కేంద్రీకరించాలి. పెద్దయెత్తున విదేశ మారకద్రవ్యం లభించడంతో పాటు, కార్మికుల కష్టానికి తగిన ప్రతిఫలం సమకూరుతుంది. నవ్యత, నైపుణ్యం, నాణ్యత- ఎగుమతులకు ప్రాణప్రదమైనవి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక డిజైన్లను అందుబాటులోకి తేవడం ద్వారా చేనేత, జౌళి రంగం పుంజుకొంటుంది. భివాండి, సూరత్, షోలాపూర్, మీర్జాపూర్, కంచి వంటి వస్త్రోత్పత్తి నగరాల్లో మొదట చేనేత ఉత్పత్తులే ప్రారంభమయ్యాయి. ఆ తరవాత వాటికి గడ్డుకాలం ఏర్పడింది. ఎగుమతుల అభ్యున్నతికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ప్రధాని గతంలోనే నిర్దేశించారు. చేనేత, జౌళి రంగాలు నిరంతరం అభివృద్ధి పథంలో సాగాలని, అవి వస్త్రోత్పత్తిలో భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలని ఆయన ఆకాంక్షించారు. కేంద్రప్రభుత్వం గతంలోనే ప్రసిద్ధ వస్త్రాల డిజైనర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి అనుగుణంగా, వారు చేనేత కార్మికులతో కలిసి పనిచేస్తారు. అందువల్ల చేనేత ఉత్పత్తుల విపణిలో ఎంతో పెరుగుదలకు అవకాశముంది. జాతీయ సార్వత్రిక విద్యాసంస్థ ద్వారా, చేనేత రంగంపై ప్రత్యేక పాఠ్యప్రణాళిక రూపుదిద్దుకొంది. తెలంగాణ ప్రభుత్వం ప్రసిద్ధ ఆన్‌లైన్ విక్రయ సంస్థ 'అమెజాన్'తో చేనేత వస్త్రాల విక్రయాలకై ఒప్పందం చేసుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ద్వారా కొత్త డిజైన్లను రూపొందించడంతో పాటు, చేనేత కార్మికులకు అధునాతన శిక్షణ ఇప్పించాలని సర్కారు నిర్ణయించింది. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు చేనేత దినోత్సవం సందర్భంగా ఫ్యాషన్ షోలను నిర్వహించి ఆ వస్త్రాలకు ప్రాచుర్యం కల్పిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని 90 లక్షలమంది మహిళలకు నేత చీరలు పంపిణీ చేయనుంది. ఏపీ ప్రభుత్వం 'చంద్రన్న కానుక' పథకంలో భాగంగా చీర, ధోవతి చేర్చింది. ఇతర రాష్ట్రాలూ ఇటువంటి చొరవ కనబరచడం వల్ల, చేనేతకు ఎంతో ఊతం లభిస్తుంది!

– ఆకారపు మల్లేశం

పుస్తకమే సమస్తం

'మానవ జాతి మౌలికావసరాల జాబితాలో గాలి, నీరు, ఆహారం, వసతి తరవాత విజ్ఞానం అత్యంత కీలకమైంది' విఖ్యాత మేధావి డీపే కెంప్ చేసిన వ్యాఖ్య ఇది. మానవాళి వేల సంవత్సరాల అనుభవసారంగా పోగుబడిన విజ్ఞాన సంపదను పదిలంగా కాపాడటం, పదిమందికీ దానిని పంచిపెట్టడమే సామాజిక వికాసానికి మూలాధారం. నాగరికత పరిణామ క్రమంలో ఒక్కో దశను దాటే కొద్దీ మనిషి తన చుట్టూ ఉన్న పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సంబంధించి ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నాడు. ఎప్పటికప్పుడు కొత్తగా దఖలుపడుతున్న విజ్ఞానాన్ని తరవాతి తరాల కోసం జాగ్రత్తపరచేందుకు రకరకాల విధానాలు అందిపుచ్చుకున్నాడు. వివిధ దశల్లో తాను సంపాదించిన విజ్ఞానాన్ని మట్టి పలకలు, జంతుచర్మాలు, చెట్ల బెరడులు, తాళపత్రాలు, కాగితాలు, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో నిక్షిప్తం చేస్తూ ముందుకు కదులుతున్నాడు. ఈ అనంత విజ్ఞాన భాండాగారాన్ని సమాచార కేంద్రాలు, గ్రంథాలయాల ద్వారా విశ్వపరివ్యాప్తం చేస్తున్నాడు. సామాజికాభివృద్ధిలో గ్రంథాలయ నిర్వాహకుల పాత్ర ఎనలేనిది. దురదృష్టవశాత్తూ గ్రంథపాలకుల కృషికి నేడు సరైన గౌరవమే లభించడం లేదు. గ్రంథాలయ శాస్త్రానికి సహేతుక ప్రాతిపదికలు నిర్ధారించి, ఆధునిక లైబ్రరీకి రూపకల్పన చేసిన ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని ఏటా ఆగస్టు 12న జాతీయ గ్రంథాలయ పాలకుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. గ్రంథాలయ శాస్త్ర పితామహుడిగా పేరెన్నికగన్న రంగనాథన్ సేవలను ఈ సందర్భంగా తరచిచూడటం ఎంతో అవసరం.

గణాంక శాస్త్రవేత్తగా ప్రస్థానం ప్రారంభించిన డాక్టర్ శియాలీ రామామృత రంగనాథన్ 1924లో తన 32వ ఏట మద్రాసు విశ్వవిద్యాలయంలో గ్రంథపాలకుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. గ్రంథాలయ నిర్వహణకు సంబంధించి దేశంలో అంతంత మాత్రంగా ఉన్న విధానాలను సమూలంగా సంస్కరించి, శాస్త్రీయ భూమికను ఏర్పరచడంకోసం ఆయన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్‌కు వెళ్ళి పాశ్చాత్య పద్ధతులనూ ఔపోసన పట్టారు. గ్రంథాలయ శాస్త్రానికి తనవైన అయిదు సూత్రీకరణలు చేయడం ద్వారా లైబ్రరీ విద్యను ఆయన కొత్త పుంతలు తొక్కించారు. పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచాలని, వారి అభిరుచులను గౌరవిస్తూ గ్రంథాలను సమీకరించాలని, ప్రతి ఒక్కరి అవసరాలకూ విడిగా పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, లైబ్రరీల్లో పాఠకులు తమకు అవసరమైన పుస్తకాలను చిటికెలో వెదికిపట్టుకోగల వీలుండాలని, కాలానుగుణ అవసరాలకు అనుగుణంగా గ్రంథాలయం ఎప్పటికప్పుడు కొత్త హంగులు సంతరించుకోవాలని రంగనాథన్ అయిదు కీలక సూత్రాలు ప్రతిపాదించారు. పుస్తక విజ్ఞానాన్ని సామాజిక ఆస్తిగా తీర్మానించిన రంగనాథన్ సిద్ధాంతం ఈ సూత్రీకరణల్లో అడుగడుగునా ప్రతిఫలిస్తోంది.



ఎస్.ఆర్.రంగనాథన్: గ్రంథాలయ పితామహుడు

రేపు జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

గ్రంథాలయ నిర్వాహకుడిగా ఆయన కనబరచిన నిబద్ధత ఆశ్చర్యం కలిగిస్తుంది. తనకు వివాహమైన రోజున మధ్యాహ్నం సమయానికంతా లైబ్రరీ విధులకు ఆయన ఠంచనుగా హాజరుకావడం పుస్తకమే ప్రాణంగా ఆయన బతికిన తీరును వెల్లడిస్తుంది. మద్రాసు విశ్వవిద్యాలయ గ్రంథపాలకుడిగా ఎప్పుడూ సెలవు తీసుకోకుండా 20 ఏళ్ల పాటు వారమంతటా రోజూ 13గంటలపాటు నిర్విరామ బాధ్యతలు నిర్వహించారాయన. గ్రంథాలయంతో ముడివడిన అన్ని విభాగాల్లోనూ పనిచేసిన రంగనాథన్- ఎన్నో పుస్తకాలూ రచించారు. గ్రంథాలయ వర్గీకరణ, పుస్తక జాబితా రూపకల్పన, సూచికా సేవలు, పాలన నిర్వహణ, గ్రంథపాలన తత్వం వంటి వివిధ అంశాలపై ఆయన లోతైన విశ్లేషణ చేస్తూ పుస్తకాలు వెలువరించారు. ఈనాటికీ అవి ప్రామాణిక గ్రంథాలుగా ఉన్నాయి. కేవలం పుస్తకాలు రాయడంతో సరిపెట్టలేదాయన. రాసిన ప్రతి విషయాన్నీ స్వయంగా ఆచరించి చూపారు. లైబ్రరీల్లో పుస్తక వర్గీకరణ, జాబితా రూపకల్పనలకు సంబంధించి శాస్త్రీయ పద్ధతులు ప్రవేశపెట్టారు. 'కోలన్' పద్ధతిని ఉపయోగించి గ్రంథాల వర్గీకరణ, పుస్తక జాబితాకు సంబంధించిన ప్రత్యేక విధానం, గ్రంథాలను అంకెలవారీగా అమర్చడం వంటి శాస్త్రీయ పద్ధతులకు ఆయన ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆదర్శ ప్రజా గ్రంథాలయ బిల్లునూ రూపొందించారాయన.

తమిళనాడులోని తంజావూరులో 1892 ఆగస్టులో జన్మించిన రంగనాథన్- అనితరసాధ్య నిబద్ధతను కనబరచి గ్రంథాలయ నిర్వహణ తీరుతెన్నులను గుణాత్మకంగా మార్చివేశారు. లైబ్రరీ నిర్వహణకు శాస్త్రం స్థాయి కల్పించారాయన. తొలి దశలో మద్రాసు విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్‌గా బాధ్యతలు నిర్వహించిన రంగనాథన్- 1945-'47 మధ్యకాలంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలోనూ, ఆ తరవాత 1947-'55లోనూ గ్రంథాలయ శాస్త్ర ఆచార్యుడిగా పనిచేశారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ లైబ్రేరియన్‌షిప్‌కి తొలి డైరెక్టర్‌గా ఉండి ఎందరో విద్యార్థులకు గ్రంథాలయ శాస్త్రంలో పట్టాలను బహూకరించారు. 1944-'53 మధ్యకాలంలో భారత గ్రంథాలయ సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అంతర్జాతీయ సమాచార, డాక్యుమెంటేషన్ (ఎఫ్ఐడీ) సంస్థ గౌరవ సభ్యుడిగా 1957లో ఎంపికైన ఆయన- ఆ తరవాత గ్రేట్ బ్రిటన్ గ్రంథాలయ సంస్థకు జీవితకాల ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. బెంగళూరులోని భారత గణాంక సంస్థలో 1962లో డాక్యుమెంటేషన్ పరిశోధన, శిక్షణ కేంద్రం ఏర్పాటుకు రంగనాథన్ తీవ్రంగా కృషి చేశారు. విభిన్న రంగాల్లో కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం రంగనాథన్‌ను 'జాతీయ పరిశోధనా ఆచార్యుడి'గా గుర్తించి గౌరవించింది. గ్రంథాలయ శాస్త్రంలో కృషికిగాను 1957లో పద్మశ్రీ పురస్కారమూ ఆయనను వరించింది. దేశ గ్రంథాలయాల ముఖచిత్రాన్నే గణనీయంగా మార్చివేసిన అలాంటి మహనీయుడి కృషి సదా స్ఫూర్తిమంతం!

– ప్రొఫెసర్ వి.విశ్వమోహన్

ఈనాడు లేఖలు

ఆర్టీసీ తీరు మారాలి

ప్రయాణికుల రోజువారీ అవసరాలు పెరుగుతున్నాయి. వాటికి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు, ఎప్పటికప్పుడు అదనపు ట్రిప్పులు వేయాల్సిన బాధ్యత రోడ్డు రవాణా సంస్థపై ఉంది. పండుగ సెలవులు, పరీక్షలు, ఉత్సవాలు, ఇతర సందర్భాల్లో బస్సు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాటిని ముందుగానే గమనించి తగినన్ని ఏర్పాట్లు చేయాల్సిన అధికార యంత్రాంగం కొన్నిసార్లు ఆ బాధ్యత విస్మరించినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలకు ఎటువంటి ఇబ్బందులూ ఎదురుకాకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. అటువంటివి తరచుగా లోపిస్తుండటంతో, ప్రయాణికులు నానాపాట్లు పడాల్సి వస్తోంది. కొన్ని రూట్లలో బస్సుల సంఖ్యను ఇష్టానుసారం తగ్గిస్తున్నారు. అదనపు ట్రిప్పుల గురించి అసలే పట్టించుకోవడం లేదు. ఇవి చాలవన్నట్లు- ప్రత్యేక బస్సుల పేరుతో సాధారణ బస్సులనే తిప్పి అధికంగా సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో అదనంగా బస్సులు వేశామని ప్రకటించి ఎక్కువ మొత్తాల్ని ఛార్జీల రూపంలో వసూలుచేయడమూ ఆర్టీసీకి అలవాటవుతోంది. అది తన విధానాన్ని సమీక్షించుకొని, కనీసం ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించడం ఎంతైనా అవసరం!

- పద్మినీ ప్రియదర్శిని, హైదరాబాద్

నేరాలకు మద్యమే మూలం

మద్యం మహమ్మారి సమాజంలో పలు సమస్యలకు కారణమవుతోంది. అనేక చోట్ల వెలుస్తున్న సారా దుకాణాలు, అక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా తయారవుతున్నా పట్టించుకోని శాఖల తీరు వల్ల నేరాలు నానాటికీ ఎక్కువవుతున్నాయి. వీటిని అరికట్టాలంటే సారాపై ఉక్కుపాదం మోపడం ఒక్కటే మార్గం. సారా తయారీ, నిల్వ, రవాణా, క్రయవిక్రయాలు- అన్నింటిపైనా ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తేనే సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యపడుతుంది.

- పవన్‌కుమార్, చెన్నై

మాటే మంత్రం!

మాటలు ముత్యాలసరాల్లా ఉండాలి. ఆసాంతం మనోజ్ఞత నిండాలి. అలా మాట్లాడటాన్ని 'మంజుభాషణం' అని వ్యవహరిస్తారు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అంటారు పెద్దలు. మాటకు అంతటి విలువ ఉంటుంది. అందుకే వీలైనంత వరకు అప్రియాలు మాట్లాడకూడదన్నది 'సుభాషిత రత్నావళి' కావ్యకర్త భర్తృహరి మాట.

ఎంతటి ప్రియమైన మాటలనైనా ఆచితూచి మాట్లాడాలంటారు. మనసు విప్పి మాట్లాడాలి. అలా అని ఇతరుల్ని కించపరచేలా మాట్లాడకూడదు. ఎవరినీ నొప్పించకూడదు.

రామలక్ష్మణులు సీతాన్వేషణ చేస్తూ కిష్కింధకు వెళ్లినప్పుడు, ఆ సమాచారం వెంటనే సుగ్రీవుడికి చేరుతుంది. కక్ష కట్టిన అన్న వాలి, తనను వధించేందుకే వారిద్దరినీ పంపి ఉంటాడని అతడు అనుమానిస్తాడు. రామలక్ష్మణుల గురించి తెలుసుకొని రమ్మని హనుమను పంపుతాడు. అప్పుడు ఆయన మాట్లాడిన తీరు గమనించిన రాముడికి మానసిక ఉల్లాసం కలుగుతుంది. హనుమ మాటల్లోని మంజులత్వం, ముఖ కవళికలు, పెదవుల కదలికలు, భృకుటి తీరుతెన్నులు చూసి ముగ్ధుడవుతాడు.

మనసులోని భావం మాటల్లో వ్యక్తం కావాలి. అంతేకాని, నోరు మాట్లాడుతూ నొసలు వెక్కిరించకూడదు. స్నేహితుణ్ని శత్రువుగా చేసినా, వైరిని మిత్రుడిగా మార్చినా అది మాటే! ఇతరులకు సదా మేలు కలిగేలా మాట ఉండాలని అక్రూరుడు ఒక సందర్భంలో కర్ణుడికి చెబుతాడు.

లౌక్యంగా మాట్లాడటం ఒక కళ. పనిమీద పెద్దల వద్దకు వెళ్లినప్పుడు, అతిగా మాట్లాడకూడదంటాడు కౌటిల్యుడు. ముందుగా తాను అక్కడికి వచ్చిన అవసరమేమిటో వివరించాలి. 'మీరు చేయగలరనే నమ్మకంతో వచ్చాను' అనాలి. పనిగట్టుకొని పొగడ్తలు, అతిగా మర్యాదల వల్ల మొదటికే మోసం రావచ్చు. అతి వినయం ధూర్త లక్షణం అనేది అందుకే!

వివాహ సంబంధాలు కుదుర్చుకునే సమయంలోను, తగవులు తీర్చి రాజీ చేయాల్సిన వేళల్లోను మాటకారి వ్యక్తులనే వెంట తీసుకువెళతారు. మంచివాడు ఎప్పుడూ ఆ విధంగానే మాట్లాడతాడు. సమాజమూ అటువంటి వారినే మన్నిస్తుంది. దూతలుగా వెళ్లి మాట్లాడటం ద్వారా ఇతరుల మనసు గెలిచిన విదురుడు, సంజయుడు వంటి వారి ఉదంతాలు పురాణాల్లో కనిపిస్తాయి. సౌమ్య సంభాషణ వల్ల, వారికి ఎవరితోనూ శత్రుత్వం కలగలేదు.

గౌతమబుద్ధుడు ఒకసారి వైశాలి నగరాన్ని సందర్శిస్తాడు. అక్కడి అంబవనంలో ఆయన ప్రవచనాలు ఉంటాయన్న ప్రచారం సాగుతుంది. వేదిక వద్దకు బుద్ధుడు చేరేలోగా, ఒక వ్యక్తి సిద్ధాంత చర్చ లేవదీస్తాడు. దాన్ని కొందరు సమర్థించడం, మరికొందరు ఖండించడంతో మాటల యుద్ధం ప్రారంభమవుతుంది. అదే సమయంలో అక్కడికి చేరుకున్న బుద్ధుడు వేదికపైకి వెళ్లి 'సంఘం శరణం గచ్ఛామి' అని చేయెత్తి ఉద్బోధిస్తాడు. ఆ వదనంలో చిరునవ్వు, మృదుభాషణం అక్కడి అందర్నీ మంత్రముగ్ధుల్ని చేస్తాయి.



అంతర్యామి

'దైవత్వాన్ని కాదనేవాణ్ని కాను. మీ అందరిలోనూ దేవుణ్ని చూస్తున్నాను. ఒకరితో మరొకరు మనసును ఆకట్టుకునేలా మాట్లాడటం మంచిది. పరనింద ప్రమాదకరం. అశాంతి ఒక భ్రాంతి. శాంతి నిత్య సత్యం' అని బుద్ధుడు ప్రవచిస్తాడు. అటువంటి బోధలే ఆయనను భగవానుణ్ని చేశాయి.

మాటల్లో మర్యాద, సభ్యత వ్యక్తం కావాలి. మనిషి వ్యక్తిగత జీవితంలో, సామాజిక జీవితంలోనూ మాటల సాత్వికత ఉండాలని తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి అనేవారు. ఆ అన్యోన్యత అనుభవానికి వచ్చిననాడు, మన సాన్నిహిత్యాన్ని ఎదుటివారు సహజంగానే కోరతారు. శంకర భగవత్పాదులు, వివేకానందుడు అటువంటి మృదుభాషణులు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్నవారికి, వైద్యం కంటే శ్రేయోభిలాషుల మాటలే ఎనలేని ధైర్యమిస్తాయి. మనిషికి దేవుడిచ్చిన వరం- మాట! 'సర్వే జనా స్సుఖినో భవన్తు' అని వేదవాక్కు. అదే భావాన్ని హృదయపూర్వకంగా వ్యక్తం చేయగలిగితే, ఆ మాటే మంత్రమవుతుంది!

– అప్పరుసు రమాకాంతరావు

మనసు ముక్కలై.. నెత్తుటి చుక్కలై

- యువతలో పెరుగుతున్న స్వీయహాని తలంపు
- తమకు తాము హాని చేసుకునే వారిలో 70 శాతం యువతరమే
- పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ ధోరణి 4 రెట్లు ఎక్కువ
- ప్రతి 15 క్షణాలకొక్కరు.. ఈ తరహాలో బాధితులవుతున్నట్లు అంచనా
- ప్రవర్తనా లోపమే కారణమంటున్న నిపుణులు

ఈనాడు - హైదరాబాద్

ప్రమోద(18) ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల చిన్నచిన్న విషయాలకే తీవ్రంగా స్పందిస్తోంది. తనక్కావాల్సింది వెంటనే ఇవ్వకపోతే తనను తాను గాయపర్చుకుంటోంది. తల్లి మానసిక వైద్యుణ్ని సంప్రదించింది. ఆమెతో చర్చించిన తర్వాత ఈ ప్రవర్తనపై వైద్య నిపుణుడో అంచనాకు వచ్చారు. 'తల్లిదండ్రులిరువురూ ఉద్యోగులే కావడంతో యువతి ఒంటరితనాన్ని అనుభవిస్తోంది. ఇంట్లో ఉన్న సమయంలోనూ తల్లిదండ్రులు తరచూ గొడవపడుతుండటం, తల్లిపై తండ్రి పదేపదే చేయిచేసుకోవడాన్ని బాల్యం నుంచీ గమనిస్తోంది. 'అది తన కిష్టం లేదంటూ' గొంతెత్తి అరవాలనిపిస్తున్నా..తమాయించుకుంటూ వస్తోంది. దాని పర్యవసానమే' ఈ ప్రవర్తన అన్నది వైద్యుని విశ్లేషణ.

■ లక్ష్మి(24) గృహిణి. పీజీ చదువుకుంది. భర్త ప్రైవేటు సంస్థలో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. ఎలాంటి దురలవాట్లు లేవు. భార్యంటే ప్రేమే. ఉద్యోగరీత్యా పొద్దున 8 గంటలకు వెళ్తే రాత్రి 10 గంటలకుగానీ ఇంటికి తిరిగిరాడు. శని, ఆదివారాల్లోనూ అత్యధిక సమయం ఉద్యోగ సేవలకే పరిమితమవుతుండటంతో ఆమెలో అసహనం మొదలైంది. తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఇటీవల కత్తితో చేతిపై కోసుకోవడం, తలను గోడకేసి బాదుకోవడం లాంటి స్వీయహాని చర్యలకు పాల్పడుతున్న లక్ష్మి.. వాటిని సెల్ఫీ తీసి మరీ భర్తకు పంపిస్తోంది.

తమని తాము గాయపర్చుకునే ధోరణి యువతలో ఇటీవలి కాలంలో పెరిగిపోతోంది. స్వీయహానికి పాల్పడే వారిలో సుమారు 70 శాతం మంది యువతే ఉండగా..పురుషులతో పోలిస్తే తమను తాము హింసించుకునే ధోరణి మహిళల్లో నాలుగు రెట్లు అధికమని నిపుణులు గుర్తించారు. దేశంలో ప్రతి 15 క్షణాలొకరు చొప్పున ఎక్కడోచోట ఇలా స్వీయహానికి పాల్పడుతుంటారని అంచనా వేశారు. ఇదో రకమైన ప్రవర్తనా లోపంగా నిపుణులు చెబుతున్నారు. కౌమారంలో గుర్తించి చికిత్స అందిస్తే ఆ రుగ్మత నుంచి బయటపడడం సులభమేనని, లేదంటే వయసు పెరుగుతున్న కొద్దీ(35 ఏళ్ల వయసొచ్చే నాటికి) ఇలాంటి వాళ్లు రకరకాల మానసిక రుగ్మతలకు లోనయ్యే అవకాశాలున్నాయని విశ్లేషిస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల ప్రముఖ వైద్యపత్రిక 'లాన్సెట్'లోనూ కథనం ప్రచురితమైంది.

అంతర్గత కుంగుబాటే.. అంతిమ కారణం

ప్రవర్తనపరమైన లోపాలు బహిర్గతమయ్యేందుకు అనేక కారణాలున్నాయని, ప్రధాన కారణం బలహీనమవుతున్న కుటుంబ బంధాలేనని నిపుణులు పేర్కొంటున్నారు. తండ్రి రోజూ తాగొచ్చి తల్లిని కొడుతుండడం..పిల్లలపైనా చేయిచేసుకోవడం..క్రమశిక్షణ పేరిట కఠినంగా శిక్షించడం..కుటుంబ సభ్యుల మధ్య ఆగ్రహావేశాలు తరచూ కొనసాగడం..తమ పట్ల పెద్దలు నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తున్నారన్న భావన తదితరాలు పిల్లల్లో అంతర్గత సంఘర్షణకు కారణమవుతాయి. ఇంట్లో పరిస్థితులను నియంత్రించలేని నిస్సహాయ స్థితిలో వాళ్లు కుంగుబాటుకు గురవుతారు. ఈ క్రమంలో అంతర్గతంగా రగిలిపోతున్న ఉద్రేకాన్ని తగ్గించుకునే మార్గాలను అన్వేషిస్తారు. కసితీరా తమలోని ఆవేదనను వెళ్లగక్కాలని భావిస్తారు. కొందరు తమను తాము హింసించుకోవడానికే మొగ్గుచూపుతారు. ఇలాగైతేనే పెద్దలు తమ బాధను అర్థం చేసుకుంటారని భావిస్తారు. ఇదొక రకమైన నిరసన ప్రదర్శనగా వైద్యులు అభివర్ణిస్తున్నారు. ఇలాంటి మానసిక ప్రవృత్తి ఉన్న వారిలో ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఉండదని, కొన్ని సందర్భాల్లో మాత్రం అది ఆత్మహత్యకు కూడా దారితీయొచ్చని హెచ్చరిస్తున్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ హార్మోన్లలో మార్పుల ప్రభావంతో ఆ ప్రవర్తన మరింత హింసాత్మకంగా మారే ప్రమాదం లేకపోలేదంటున్నారు.

లోపాన్ని గుర్తించేదెలా?

- ఇలాంటి వారిలో చీటికి మాటికి భావోద్వేగాలు మారిపోతుంటాయి.
- విపరీతమైన కోపాన్ని ప్రదర్శించిన తర్వాత పది నిముషాల వ్యవధిలోనే అదే వ్యక్తిపై అతి ప్రేమ కురిపిస్తారు.
- పదునైన వస్తువులతో గాయపర్చుకుంటారు.
- తలను గోడకేసి బాదుకోవడం, నేలకేసి కొట్టుకోవడం వంటివి చేస్తుంటారు.
- శరీరాన్ని కాల్చుకుంటారు.
- మోతాదుకు మించి ఔషధాలను వేసుకుంటారు.

ఎవరిలో ఎక్కువ?

- వ్యక్తిత్వ లోపాలున్న వారిలో..
- కుంగుబాటుకు లోనైన వారిలో
- చిన్నతనంలో లైంగిక వేధింపులకు గురైన వారిలో..
- ఆందోళనకరమైన రుగ్మతలున్న వారిలో..
- తల్లిదండ్రులు విడిపోయిన పిల్లల్లో..



కౌన్సెలింగ్ ద్వారా సరిచేయొచ్చు



శారీరక, జన్యు, మెదడుపరమైన లోపాలతోపాటు.. పెరుగుతున్న వాతావరణమూ మానసిక రుగ్మతలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. తమను తాము హింసించుకునే వారు సాధారణంగా అతి సున్నిత మనస్కులై ఉంటారు. వ్యక్తిత్వ లోపముంటే కౌన్సెలింగ్ ద్వారా సరిచేయొచ్చు. కుంగుబాటు వంటి రుగ్మతలుంటే ఔషధ చికిత్స అవసరమవుతుంది.

– డాక్టర్ ప్రసాదరావు, ప్రముఖ మానసిక వైద్యనిపుణులు

కుటుంబ సభ్యుల పాత్ర ముఖ్యం



కుటుంబ సంబంధాలు మెరుగ్గా ఉంటే చాలావరకు మానసిక సమస్యలు తగ్గుముఖం పడతాయి. స్వీయహాని చేసుకునే వారికి చికిత్స ఇవ్వడం ఎంత ముఖ్యమో..వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వడమూ అంతే ముఖ్యం. మానసిక రుగ్మతగా గుర్తించిన పక్షంలో..అలాంటి వారి పట్ల కుటుంబ సభ్యులు మరింత బాధ్యతగా వ్యవహరించాలి తప్ప..వదిలేయకూడదు. ప్రేరేపించేలా, రెచ్చగొట్టేలా ప్రవర్తించడం మానుకోవాలి.

– డాక్టర్ చంద్రశేఖర్, ప్రముఖ మానసిక వైద్యనిపుణులు

ఇంటర్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి

- డీఈడీ లేకున్నా ఉపాధ్యాయులుగా చేస్తున్నవారికి వర్తింపు
- సార్వత్రిక విద్య ద్వారా మళ్లీ ఇంటర్ చదవాల్సిందే


ఈనాడు, హైదరాబాద్: డీఈడీ విద్యార్హత లేకున్నా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు ఆ కోర్సును పూర్తి చేయడమే కాక, ఇంటర్‌లో 50శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని కేంద్రం నిబంధన విధించింది. డీఈడీ, బీఈడీ లేని వారు ఆ విద్యార్హతలను సాధించేందుకు 2019 మార్చి 31వరకు గడువు ఇచ్చింది. ప్రాథమిక తరగతులు బోధించేవారికి డీఈడీతోపాటు ఇంటర్‌లో 50శాతం మార్కులుండాలని ఆదేశించింది. వారు సెప్టెంబరు 15లోపు డీఈడీ కోర్సులో పేరు నమోదు చేసుకోవాలి. ఇంటర్‌లో 50 శాతం మార్కులు లేకుంటే డీఈడీ పూర్తయ్యేలోపు సార్వత్రిక విద్య ద్వారా ఇంటర్‌లో చేరి ఆ మార్కులు సాధించాలని నిబంధన విధించారు. పాఠశాల విద్యాశాఖ గణాంకాల ప్రకారం

డీఈడీ లేదా బీఈడీ లేకుండా 3,905మంది...

రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 92,675మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా వారిలో 3,905మంది డీఈడీ లేదా బీఈడీ లేకుండానే పనిచేస్తున్నారు. 720 ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే 3,177మందిలో 25మందికి ఉపాధ్యాయ విద్యార్హత లేదు. ప్రైవేట్ పాఠశాలల్లో 32లక్షల మంది విద్యార్థులున్నారు. వాటిల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడి చొప్పున పనిచేస్తున్నారు. ఈక్రమంలో కనీసం రెండు లక్షల మంది ఉపాధ్యాయులు ఉంటారని, అయితే సగం మందినే అధికారికంగా చూపిస్తున్నారన్న అనుమానాలు విద్యాశాఖ వర్గాలు వ్యక్తంచేస్తున్నాయి. దీని వెనుక మతలబును మాత్రం చెప్పలేకపోతున్నారు. రుసుముల నియంత్రణ అమల్లోకి వస్తే అప్పుడు ఎక్కువమంది ఉపాధ్యాయులను లెక్కల్లోకి చూపించే అవకాశముందని భావిస్తున్నారు.

19లోగా డిగ్రీ కళాశాలల్లో చేరాలి

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి చివరి విడత సీట్లు కేటాయించిన నేపథ్యంలో విద్యార్థులు ఈనెల 19లోగా కళాశాలల్లో చేరాలని డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) అధికారులు తెలిపారు.



91ఏళ్ల బామ్మకు డిగ్రీ పట్టా

బ్యాంకాక్: చదువుకోవడానికి వయస్సు అడ్డంకి కాదని థాయ్‌లాండ్‌లోని 91ఏళ్ల బామ్మ నిరూపించింది. కిమ్లున్ జినకుల్ అనే మహిళ పదేళ్లపాటు కష్టపడి చదివింది. మానవ, కుటుంబాభివృద్ధి అంశంలో కోర్సు పూర్తిచేసింది. ఆ దేశ రాజు మహా వజిరలాంగ్‌కార్న్ చేతులమీదుగా పట్టాను అందుకుంది.



ట్రాఫిక్‌జామ్‌కు టాటా.. నదిలో ఈదుకుంటూ ఆఫీసుకు!

మ్యూనిచ్: జర్మనీలోని మ్యూనిచ్‌కు చెందిన బెంజమిన్ డేవిడ్ అనే ఉద్యోగి తన నివాసం నుంచి ఐసర్ నది గుండా ఆఫీసుకు ఈదుకుంటూ వెళ్తున్న దృశ్యమిది. నగరంలో ట్రాఫిక్‌జామ్ ఎక్కువగా ఉండటంతో బస్సు, కారు, ద్విచక్రవాహనాలపై వెళ్తుంటే ఎక్కువ సమయం పడుతోందట. నదిలో ఇలా ఈదుకుంటూ వెళ్తే 12 నిముషాల్లో వెళ్లిపోతున్నాడు. ఇలా వెళ్తే ఎంతో హాయిగా ఉంటుందని, వేసవిలో తరచూ ఇలాగే వెళ్తున్నానని చెబుతున్నాడు. చలికాలంలో నదిలో నీళ్ల ఉష్ణోగ్రత నాలుగు డిగ్రీల సెల్సియస్ ఉండటం వల్ల కొంచెం కష్టంగా ఉంటుందంటున్నాడు. తన ల్యాప్‌టాప్, దుస్తులను నీటిలో తడవని సంచిలో పెట్టి తరచూ ఇలా నదిలో వెళ్తున్నాడు.

ఎస్సీలను విడదీయొద్దు

కిరీట్ సోలంకికి మాలమహానాడు విజ్ఞప్తి


ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీలను విడదీయొద్దని ఎస్సీఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ స్థాయీ సంఘం ఛైర్మన్ కిరీట్ సోలంకికి మాలమహానాడు విజ్ఞప్తి చేశారు. గురువారమిక్కడ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం మాలమహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితరులు సోలంకితో భేటీ అయ్యారు. అనంతరం చెన్నయ్య మీడియాతో మాట్లాడుతూ.. సజాతీయ వర్గీయులను ఎట్టి పరిస్థితుల్లోనూ వీడదీయబోమని సోలంకి హామీ ఇచ్చారన్నారు.

పి.ఎఫ్.శాఖ అధికారికి రెండేళ్ల కారాగార శిక్ష

విశాఖపట్నం: గుంటూరు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ విభాగంలో అవినీతికి పాల్పడుతూ సీబీఐకు చిక్కిన ప్రావిడెంట్ ఫండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి జి.రాజకుమారికి విశాఖ సీబీఐ కోర్టు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.4వేలు జరిమానా విధించింది. సీబీఐ రెండో అదనపు ప్రత్యేక జడ్జి జి.సత్యప్రభాకరరావు గురువారం ఈమేరకు తీర్పు వెలువరించారు. ఒక ఉద్యోగి పీఎఫ్ ఖాతా పైకానికి సంబంధించి రూ.7వేలు లంచంగా తీసుకుంటూ ఆమె సీబీఐకి పట్టుబడ్డారు.

ఉపముఖ్యమంత్రిగా పన్నీర్‌సెల్వం!

చెన్నై: అన్నాడీఎంకేలో పళనిస్వామి, పన్నీర్‌సెల్వం వర్గాలు ఏకమవుతాయా? అనే ప్రశ్నకు మద్దతుదారులు అవుననే సమాధానమిస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్‌సెల్వం ఒక అవగాహనకు వచ్చారని అంటున్నారు. పన్నీర్‌కు ఉప ముఖ్యమంత్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి పదవులు ఇవ్వడానికి పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అమ్మ వర్గం అంగీకరించినట్లు వారు చెబుతున్నారు. ఇదే సమయంలో శశికళ, టీటీవీ దినకరన్‌లకు అడ్డుకట్ట వేసేలా వ్యూహం రచించారని సమాచారం. తీహార్ జైలుకు వెళ్లిన దినకరన్ బెయిలుపై వచ్చాక దూకుడు పెంచారు. జైల్లో ఉన్న చిన్నమ్మ శశికళతో తొలిసారి సమావేశమైన అనంతరం తనకు 30 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల రెండోసారి భేటీ తర్వాత 122 మంది ఎమ్మెల్యేలూ తనవైపే ఉన్నారని ప్రకటించి పళనిస్వామికి హెచ్చరికలు పంపారు. ఆ మేరకు ఈ నెల 5న పార్టీ ప్రధాన కార్యాలయానికి వస్తానని, అందరూ రావాలని తన మద్దతుదారులకు పిలుపు ఇచ్చారు. అయితే తర్వాత ఆయన వెనుకడుగు వేశారు. దీంతో ముఖ్యమంత్రి పళనిస్వామి అప్రమత్తమై దినకరన్‌కు ఎలా కళ్లెం వేయాలన్న అంశంపై మంత్రులతో చర్చించారు. పన్నీర్‌సెల్వం వర్గంతో సర్దుకుపోతే పూర్తికాలం అధికారంలో ఉండటంతోపాటు ఎంజీఆర్, జయలలిత వారసులమని నిరూపించుకోవచ్చని నిర్ణయించారు. ఆ మేరకు పన్నీర్‌సెల్వం డిమాండ్లను అంగీకరించడంతోపాటు ఉప ముఖ్యమంత్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి పదవులు ఇవ్వడానికి ముందుకొచ్చినట్లు తెలిసింది. మరోవైపు భవిష్యత్తు రాజకీయాల నేపథ్యంలో అన్నాడీఎంకే రెండు వర్గాలు విలీనం కావాలని కేంద్రం కూడా చూస్తోంది. అందులో భాగంగా ఇటీవల దిల్లీలో.. ఆ పార్టీలోని రెండు వర్గాలను కలపడానికి మధ్యవర్తిత్వం కూడా నిర్వహించిందని సమాచారం. 22వ తేదీన అమిత్‌షా తమిళనాడులో పర్యటించనుండగా... ఆలోగానే విలీన ప్రకటన వస్తుందని ప్రచారం సాగుతోంది.



పన్నీర్‌సెల్వం పళనిస్వామి

టీటీవీ దినకరన్ నియామకం చెల్లదు

చెన్నై: పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా ఉన్న టీటీవీ దినకరన్ నియామకం పార్టీ నిబంధనలకు విరుద్ధమని, అది చెల్లదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అమ్మ వర్గం తీర్మానించింది. గురువారం నగరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కీలక నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని రోజులుగా తలనొప్పిగా మారిన టీటీవీ దినకరన్ వ్యవహారంపై చర్చించారు. అనంతరం పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా ఉన్న టీటీవీ నియామకం పార్టీ నిబంధనల ప్రకారం విరుద్ధమని, అది చెల్లదని తీర్మానించారు. 5 సంవత్సరాల వరకు పార్టీకి సంబంధించిన ఎలాంటి కార్యక్రమాల్లోనూ దినకరన్ పాల్గొనకూడదని పేర్కొన్నారు. ఆయన్ను పార్టీ శ్రేణులు కూడా పట్టించుకోవద్దని సూచించారు. పార్టీకి శశికళ కూడా తాత్కాలిక ప్రధాన కార్యదర్శి మాత్రమేనని, కొత్తగా ఎవరైనా ఎంపికయ్యే వరకే ఆమె ఆ పదవిలో కొనసాగుతారని తెలిపారు. సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి జయకుమార్ ఈ తీర్మానం విషయాన్ని వెల్లడించారు. త్వరలోనే పళనిస్వామి, పన్నీర్‌సెల్వం విలీన విషయమై సమావేశమవుతారని వ్యాఖ్యానించారు.



పాలీహౌస్‌లో టమాట.. సిరుల బాట

తగినంత దిగుబడి లేక రాష్ట్రవ్యాప్తంగా టమాట ధరలు వినియోగదారులకు చుక్కలు చూపించాయి. దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి కూడా దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడిప్పుడే టమాట ధరలు కాస్త తగ్గుముఖం పడుతున్నాయి. వాతావరణ మార్పులకు తోడు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులపై టమాట పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారం గ్రామానికి చెందిన ఔత్సాహిక రైతు ఒకరు పాలీహౌస్ విధానంలో ఈ ఏడాది పావు ఎకరంలో టమాట సాగు చేశారు. ఇప్పటివరకు అధిక దిగుబడి లభించడంతో పాటు రూ.వేలల్లో ఆదాయం లభించిందని ఆయన చెప్పారు. –ఈనాడు, రంగారెడ్డి జిల్లా

తలాక్ తీర్పును సత్వరమే ఇవ్వండి

సీజేఐని కోరిన ముస్లిం మహిళలు

దిల్లీ: ముమ్మారు తలాక్ అంశంపై తీర్పును వీలైనంత త్వరగా వెలువరించాలని కోరుతూ ఇస్లాం మతానికి చెందిన కొంతమంది మహిళలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్‌కు లేఖ రాశారు. ఏకపక్షంగా విడాకులు పొంది నరకాన్ని అనుభవిస్తున్న వేల మంది ముస్లిం మహిళలు తీర్పును వినేందుకు ఆశగా ఎదురుచూస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఈ లేఖలో భారతీయ ముస్లిం మహిళా ఆందోళన సంఘానికి చెందిన కొంత మంది స్త్రీలు సంతకాలను చేశారు. మహిళలకు రాజ్యాంగపరమైన సమాన హక్కులను సమర్థిస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి పదవీ కాలం ఈ నెల 27న ముగియనుంది. తలాక్ రాజ్యాంగ బద్ధతను పరిశీలిస్తున్న విస్తృత ధర్మాసనానికి ఖేహర్ నాయకత్వం వహిస్తున్నారు.


తెలుగు రాష్ట్రాల్లో మనుగుడి ఏర్పాట్లు పూర్తి

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించనున్న మనగుడి కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గోకులాష్టమిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 1,250 మండలాల్లో ఎంపిక చేసిన ఆలయాల్లో తితిదే మనగుడి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

వీగిపోయిన టాస్క్‌ఫోర్సు కార్యాలయం పేల్చివేత కేసు

ఈనాడు - హైదరాబాద్

మానవ బాంబుతో హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న టాస్క్‌ఫోర్సు కార్యాలయం పేల్చివేత కేసు 12 ఏళ్లపాటు సుదీర్ఘ విచారణ కొనసాగి నీరుగారిపోయింది. నేరం రుజువు కాకపోవడంతో నిందితులను నిర్దోషులుగా పేర్కొంటూ నాంపల్లి 7వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి టి.శ్రీనివాసరావు గురువారం తీర్పు వెలువరించారు. నిందితులు అబ్దుల్ కలీం (ఎ-4), మహమ్మద్ అబ్దుల్ జాహెద్ (ఎ-5), నఫీకుల్ బిశ్వాస్ (ఎ-6), షేక్ అబ్దుల్ ఖాజా (ఎ-9), మహ్మద్ హిలాలుద్దీన్ (ఎ-12), షకీల్ (ఎ-15), సయ్యద్ హాజీ (ఎ-16), అజ్మల్ అలీఖాన్ (ఎ-17), సయ్యద్ అజ్మత్ అలీ (ఎ-18), మహ్మద్ బరూద్‌వాలా (ఎ-19)లను నిర్దోషులుగా పేర్కొంటూ తీర్పు వెలువరించారు. జైలులో ఉన్న 9 మంది నిందితులను పోలీసులు గురువారం కోర్టు ముందు హాజరుపరిచారు. బరూద్‌వాలా ఆరోగ్య కారణాలతో బెయిలు పొందారు. నిందితులపై నేరం రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. 2005 అక్టోబరు 12న బంగ్లాదేశ్‌కు చెందిన డాలిని శరీరానికి బాంబులను అమర్చుకుని టాస్క్‌ఫోర్సు కమిషనర్ కార్యాలయాన్ని పేల్చివేశాడు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారించి 20 మందిని నిందితులుగా పేర్కొని కేసులు నమోదు చేసింది. కుట్రలో కీలక పాత్రధారి గులాం యజ్దానీ, షాహెద్ బిలాల్‌లు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.



హైదరాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయం పేల్చివేత కేసులో న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటించిన వ్యక్తులు

కోర్టు తీర్పుతో ఏడుగురిని చంచల్‌గూడ జైలు నుంచి విడుదల చేసినట్లు జైలు పర్యవేక్షణాధికారి సైదయ్య తెలిపారు. బిశ్వాస్, హిలాలుద్దీన్‌లు శ్రమజీవి ఎక్స్‌ప్రెస్ విధ్వంసం కేసులో నిందితులైనందున వారిని యూపీలోని జాన్‌పూర జైలుకు తరలించామని చెప్పారు.

హైకోర్టులో అప్పీలు

తీర్పు తుది కాపీని పరిశీలించి హైకోర్టులో అప్పీలు దాఖలు చేస్తామని డీసీపీ (నేర పరిశోధన) అవినాశ్ మొహంతి తెలిపారు. తీర్పును స్వాగతిస్తున్నామని ఎంబీటీ పార్టీ అధికార ప్రతినిధి అమ్జదుల్లా ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దోషులు తప్పించుకున్నారు

శామీర్‌పేట, న్యూస్‌టుడే : 'టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవ బాంబు దాడి సంఘటనలో అమాయకుడైన నా భర్త సత్యనారాయణ ప్రాణాలు కోల్పోయాడు. బాధ్యులైన వారికి మరణ శిక్ష పడుతుందని ఎదురు చూశా. నిర్దోషులుగా తీర్పు రావటంతో నా భర్త మృతి చెందిన దానికంటే ఎక్కువగా బాధపడ్డా. సొంత ఇల్లు లేని దుస్థితిలో ముగ్గురు పిల్లలను ఎన్నో ఇబ్బందులు పడి పోషించా. అవసరమైతే సుప్రీం కోర్టు వరకైనా వెళ్లి బాధ్యులకు శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఆర్థికసాయం, నా పెద్దకొడుక్కి డీజీపీ ఆఫీస్‌లో హోంగార్డుగా ఉద్యోగం ఇచ్చింది. కనీసం తెలంగాణ ప్రభుత్వంలోనైనా రెండు పడకల ఇల్లు ఇస్తే మాకు ఆసరాగా ఉంటుంది.



భర్త చిత్రపటం వద్ద లక్ష్మి

–'న్యూస్‌టుడే'తో మృతుచెందిన హోంగార్డు సత్యనారాయణ భార్య లక్ష్మి

డ్రాగన్ బొంకెన్



● డోక్లామ్ మాది కాదని చెప్పలేదు: భూటాన్ ● చైనా నైజం బట్టబయలు

దిల్లీ: పొరుగుదేశాల భూభాగాలు, జలాల్లోకి చొచ్చుకెళ్లే తన విస్తరణదానికి భారత్ సవాల్ రువ్వేసరికి చైనా గంగవెర్రిలెత్తిపోతోంది. డోక్లామ్‌లోని భూటాన్ భూభాగంలో రోడ్డు వేసేందుకు తాను చేసిన ప్రయత్నాన్ని భారత్ అడ్డుకోవడంతో 50 రోజులుగా అవాకులు చెవాకులు పేలుతోంది. ముఖ్యంగా ఆ దేశ అధికారిక మీడియా.. యుద్ధం తప్పదంటూ భయపెట్టేందుకు ప్రయత్నించింది. ఈ రంకెలకు భారత్ రవ్వంత కూడా అదరకపోవడంతో చివరికి బొంకులకూ వెరవలేదు. వివాదాస్పద డోక్లామ్ ప్రాంతం తమది కాదని భూటాన్ చెప్పినట్లు చైనా అగ్రశ్రేణి దౌత్యాధికారి చెప్పుకొచ్చాడు. ఈ వాదనను భూటాన్ తాజాగా ఖండించింది.

సైనిక ప్రతిష్టంభనకు కారణమైన డోక్లామ్ ప్రాంతం తమ భూభాగం కాదని దౌత్యమార్గాల ద్వారా భూటాన్ తమకు తెలియజేసినట్లు చైనా విదేశాంగ శాఖలో సరిహద్దు, సముద్ర వ్యవహారాల విభాగ డైరెక్టర్ జనరల్ వాంగ్ వెన్లి భారత మీడియా బృందానికి మంగళవారం తెలిపారు. అయితే ఈ వాదనకు మద్దతుగా ఎలాంటి ఆధారాలను ఆమె ఇవ్వలేదు. దీన్ని భూటాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. "డోక్లామ్‌లో సరిహద్దు అంశంపై మా వైఖరి విస్పష్టం. జూన్ 29న మా విదేశాంగ శాఖ వెబ్‌సైట్‌లో ప్రచురితమైన మా అధికారిక ప్రకటనను ఒకసారి చూడండి' ' అని భూటాన్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మా భూభాగంలో రోడ్డు నిర్మించడం.. రెండు దేశాల మధ్య సరిహద్దు నిర్వచన ప్రక్రియను, ఒప్పందాలను ఉల్లంఘించడమే అవుతుందని ఆ ప్రకటనలో భూటాన్ పేర్కొంది. జోంపెల్రిలోని తమ సైనిక శిబిరానికి దారి తీసే విధంగా ఈ రోడ్డు నిర్మాణం ఉందని అందులో తెలిపింది.

కొత్త ఒప్పందం కుదుర్చుకోవాలి

సిక్కిం ప్రాంతంలో కొత్తగా సరిహద్దు ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని చైనా సైనిక విశ్లేషకులు సూచిస్తున్నారు. తద్వారా అది మరింత సమకాలీనంగా ఉంటుందని తెలిపారు. 1890లో బ్రిటన్-చైనాల నడుమ కుదిరిన ఒప్పందం స్థానంలో ఇది అవసరమన్నారు. నాడు 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' లేదని, భారత్ కూడా బ్రిటన్ పాలనలో ఉందని చెప్పారు. ' 'భారత్-చైనా సరిహద్దుల్లోని తూర్పు, మధ్య, పశ్చిమ విభాగాల్లో ప్రాదేశిక వివాదాలు ఉన్నందువల్ల ఇది అవసరం. సిక్కిం ప్రాంతంలోనే మనకు నిర్దిష్ట సరిహద్దు ఉంది. అందువల్ల సాధ్యమైనంత త్వరగా కొత్త ఒప్పందం అవసరం" అని సెంటర్ ఆన్ చైనా-అమెరికా డిఫెన్స్ రిలేషన్స్ సంస్థ డైరెక్టర్ ఝూవో జియావోజౌ తెలిపారు. చైనాలో పర్యటిస్తున్న భారత మీడియా బృందంతో ఆయన మాట్లాడారు.

రాజీ ఉండదు

డోక్లామ్ ప్రతిష్టంభనకు ముగింపు పలికే విషయంలో చైనా ఎలాంటి రాజీకి దిగబోదని ఝూవో చెప్పారు. చైనా భూభాగంలోకి బలగాలను పంపడం ద్వారా చైనా విషయంలో భారత్ తప్పుడు నిర్ణయాన్ని తీసుకుందన్నారు. ప్రమాదకరమైన ఈ నిర్ణయం పట్ల చైనా ప్రభుత్వం, ప్రజలు, సైన్యం ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. భారత చర్యకు సంబంధించి ఇప్పటివరకూ తాము 'దురాక్రమణ' అనే పదాన్ని ఉపయోగించలేదని 'చొరబాటు' వంటి పదాలనే ఉపయోగించామని తెలిపారు. ఇది చైనా సుహృద్భావ చర్య అని పేర్కొన్నారు. రెండు దేశాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని భారత్ బేషరతుగా వైదొలగాలని కోరారు. భారత బలగాలను భూటాన్ ఆహ్వానించలేదన్నారు. పాకిస్థాన్ తరఫున తాము భారత సరిహద్దులను దాటి లోపలికి వస్తే ఏం చేస్తారని భారత మీడియా బృందాన్ని ప్రశ్నించారు.

డోక్లామ్‌లో చైనా దుందుడుకు చర్యలు

భారత్-చైనా నడుమ నెలకొన్న ప్రతిష్టంభనపై అమెరికాకు చెందిన అగ్రశ్రేణి కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి ఆందోళన వ్యక్తంచేశారు. ఆ ప్రాంతంలో చైనా దుందుడుకు చర్యలను చేపడుతోందని, ఫలితంగా రెండు దేశాల నడుమ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల తాను భారత్‌లో పర్యటించినప్పుడు ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యాయని తెలిపారు. ఆ సందర్భంగా అనేక అంశాలపై చర్చించామని, డోక్లామ్ వ్యవహారం చర్చకు రాలేదన్నారు. ఈ ప్రతిష్టంభనపై దౌత్య మార్గంలో శాంతియుత పరిష్కార మార్గాన్ని కనుగొనాలని సూచించారు. మరోవైపు అమెరికాకు చెందిన వ్యూహకర్తలు కూడా చైనా వైఖరిపై మండిపడుతున్నారు. డోక్లామ్‌లో రోడ్డు నిర్మాణానికి చైనాకు అనుమతిస్తే భారత్‌కు ఇబ్బందులు ఎదురవుతాయని విల్ ఎడ్వర్డ్స్ అనే విశ్లేషకుడు పేర్కొన్నారు.

40 సర్కారు బడులకు స్వచ్ఛ పురస్కారాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని 40 ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్ర స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. ఇవన్నీ 23 జిల్లాల్లో ఉన్నాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా నుంచి ఆరు, రంగారెడ్డి నుంచి నాలుగు పాఠశాలలు ఎంపికయ్యాయి. యాదాద్రి, సంగారెడ్డి జిలాల్లో మూడు చొప్పున, నల్గొండ, సూర్యాపేట, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో రెండు చొప్పున ఉన్నాయి. కేంద్ర మానవ వనరులశాఖ మార్గదర్శకాల మేరకు పరిసరాల పరిశుభ్రత, శౌచాలయాల నిర్వహణ, చేతులు శుభ్రం చేసుకునేందుకు అందుబాటులో సబ్బులు, హ్యాండ్‌వాష్ ఉండటం తదితర కొలమానాలను పరిగణలోకి తీసుకొని వీటిని ఎంపిక చేశారు. త్వరలో ఈ పాఠశాలలకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. ఈ పాఠశాలలకు సంబంధించిన 10 నిమిషాల వీడియోను కేంద్ర మానవ వనరులశాఖకు ఈనెలాఖరులోపు పంపించాలి. వాటిల్లో కొన్ని పాఠశాలలను జాతీయ స్థాయిలో ఎంపిక చేస్తారు.

స్వచ్ఛభారత్‌పై ఆలోచనలు పంపండి: సీఎస్

ఈనాడు, హైదరాబాద్: స్వచ్ఛభారత్ కార్యక్రమంపై రాష్ట్రంలోని వివిధ వర్గాల వారు తమ ఆలోచనలు, సూచనలను భారత ప్రభుత్వం వెబ్‌సైట్ ద్వారా పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. దేశంలోని దీర్ఘ కాలిక సమస్యల్లో కొన్నింటిని ఇలాంటి సలహాలు, సూచనల ద్వారా పరిష్కరించటమే ధ్యేయంగా 'స్వచ్ఛ భారత్ హ్యాకతాన్' కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఆలోచనలను ఆగస్టు 25వ తేదీలోగా పంపాలని, ఎంపికైన వారి వివరాలను సెప్టెంబరు 8న ప్రకటిస్తారని పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి: సీఎస్

ప్రభుత్వ ఉద్యోగులతోపాటే పింఛనుదారులకూ డీఆర్ బకాయిలు అందిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ తెలిపారు. వైద్యఖర్చుల తిరిగి చెల్లింపుపై ప్రస్తుతమున్న పరిమితిని తొలగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. రాజీవ్ స్వగృహ కింద నిర్మించిన గృహాలను ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు కేటాయించే విషయంపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి ప్రతిపాదనలు పంపించాలని గృహనిర్మాణశాఖను ఆదేశించారు. విశ్రాంత ఉద్యోగుల ఐకాస నేతలతో సీఎస్ నిర్వహించిన సమావేశంలో పింఛనుదారులు సమస్యలు, డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పింఛనులో వ్యత్యాసాన్ని తగ్గించాలని..75 ఏళ్ల తర్వాత ఇచ్చే ఫించను పెంపును 70 ఏళ్లకు తగ్గించి పింఛను పెంచాలని, పీఆర్సీ బకాయిల్ని రెండువిడతలుగా చెల్లించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల వైద్యసేవల సమాచారానికి కాల్‌సెంటర్ ఏర్పాటు చేయాలని ఉద్యోగుల వైద్యసేవల సీఈఓను సీఎస్ ఆదేశించారు. తమ సమస్యల పరిష్కారానికి సీఎస్ సానుకూలంగా స్పందించారని ఐకాస ప్రతినిధులు కె.లక్ష్మయ్య, రవితాకూర్ తెలిపారు.

అంతర్‌రాష్ట్ర బదిలీల్లో అనారోగ్యానికి గురైనవారికి అవకాశం కల్పించండి

అంతర్‌రాష్ట్ర బదిలీల్లో మరికొందరికి అవకాశం కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌కు టీఎన్జీవోల సంఘం విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా అనారోగ్య పీడితులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య బదిలీలకు అనుమతి ఇవ్వాలని కోరినట్టు సంఘ అధ్యక్షులు కారం రవీందర్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి నాలుగోదశ అమరుల స్ఫూర్తి యాత్ర

ఈనాడు, హైదరాబాద్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలని, రైతు ఆత్మహత్యలు లేని సమగ్ర వ్యవసాయ విధానం రావాలని కోరుతూ తెలంగాణ ఐకాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరుల స్ఫూర్తి యాత్ర నాలుగో దశ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమవుతుంది. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనే లక్ష్యంగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం తెలిపారు. ఈ నెల 11న ఉదయం సికింద్రాబాద్‌లోని అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి యాత్రలో పాల్గొనడానికి బయలుదేరి వెళ్తామన్నారు. ఉదయం 9 గంటలకు కామారెడ్డి జిల్లా బస్వాపూర్ వద్ద అమరుల స్ఫూర్తి యాత్ర ప్రారంభమై అక్కడినుంచి కామారెడ్డి, లింగంపేట, ఎల్లారెడ్డి,బాన్సువాడల్లో తొలిరోజు కొనసాగుతుంది. 12న బీర్కూరు, కోటగిరి, రుద్రూరు, బోధన్, నవీపేట, సారంగాపూర్‌ల మీదుగా రెండోరోజు యాత్ర కొనసాగి నిజామాబాద్‌లో బహిరంగసభతో ముగుస్తుందన్నారు.

'కాళేశ్వరం' పర్యావరణ అనుమతులపై 22 నుంచి బహిరంగ విచారణ

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులకు సంబంధించి ఈ నెల 22 నుంచి నీటిపారుదల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బహిరంగ విచారణ నిర్వహించనున్నారు. నాలుగు రోజుల పాటు 15 జిల్లాల్లో ఈ విచారణలు జరగనున్నాయి. పర్యావరణ అనుమతి లభించాలంటే బహిరంగ విచారణ నిర్వహించి ప్రాజెక్టు కోసం చేపట్టిన భూసేకరణ, పునరావాసం, అటవీ భూములు తదితర వివరాలను వెల్లడించడంతోపాటు ఈ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తారు. మండలాలు, గ్రామాల వారీగా ఆయకట్టు వివరాలను వెల్లడిస్తారు. ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొంటారు. పంచాయతీల తీర్మానాలను కూడా పంపుతారు. ఈ నెల 22న కరీంనగర్, నిజామాబాద్, మేడ్చల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో విచారణ జరుగనుంది. 23న పెద్దపల్లి, కామారెడ్డి, సంగారెడ్డి, నల్గొండ, 24న మెదక్, జగిత్యాల, నిర్మల్, 26న జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో బహిరంగ విచారణ జరగనుంది.

అభివృద్ధి పేరిట అన్యాయం చేయొద్దు

తెలంగాణ భూ నిర్వాసితుల పోరాట కమిటీ డిమాండ్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి పేరిట భూ నిర్వాసితులకు అన్యాయం చేయొద్దని తెలంగాణ భూ నిర్వాసితుల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. గురువారమిక్కడ భూ నిర్వాసితుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకట్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని ముంపు ప్రాంతాల్లో ఇసుక క్వారీలు, ఇతర సహజ వనరులపై హక్కులను నిర్వాసితులకే కల్పించాలన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే భూ నిర్వాసితులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని కోరారు. నల్గొండ జిల్లాలో రాంకీ అక్రమ భూమి కొనుగోలుపై విచారణ జరిపించి యాజమాన్యంపై చర్యలు చేపట్టి, తిరిగి పేదలకు భూములను ఇప్పించాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని రంగాలనూ నిర్వీర్యం చేస్తూ హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రజా సంఘాల ప్రతినిధులు ధర్మానాయక్, వెంకటేష్, ప్రసాద్, చంద్రారెడ్డి, సంజీవరెడ్డి, శోభన్ పాల్గొన్నారు.



ప్రధాని మోదీకి వినతిపత్రం సమర్పిస్తున్న తెదేపా ఎంపీ కె.నారాయణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తదితరులు

బీసీలకు ప్రజాస్వామ్య ఫలాలు అందడం లేదు

ప్రధాని మోదీతో బీసీ నేతల భేటీ

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా బీసీలకు ప్రజాస్వామ్య ఫలాలు అందడం లేదని పలువురు బీసీ నేతలు ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం దిల్లీలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, శాసనసభ్యుడు ఆర్.కృష్ణయ్య, తెదేపా పార్లమెంట్ సభ్యులు నిమ్మల కిష్టప్ప, కొనకళ్ల నారాయణల నేతృత్వంలో పలువురు బీసీ నేతలు ప్రధానమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని వారు కోరారు. దేశంలో 56శాతం జనాభా ఉన్న బీసీలు చట్టసభల్లో 14శాతం కూడా ప్రాతినిధ్యం వహించడం లేదని తెలిపారు. బీసీలకు ప్రజాస్వామ్య ఫలాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రధానిని సత్కరించారు.

బీసీకులాలకు సమన్యాయం చేస్తాం: కేంద్రమంత్రి గెహ్లాట్

బీసీల్లోని అన్ని కులాలకు కేంద్రం సమన్యాయం చేస్తుందని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ తెలిపారు. కేంద్రంలో ఓబీసీలను వర్గీకరించడానికి త్వరలోనే బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గురువారమిక్కడ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో పలువురు బీసీ నేతలు కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. బీసీల సమస్యలపై చర్చించారు. వచ్చే సమావేశాల్లో బీసీ బిల్లు పాస్ అవుతుందని కేంద్ర మంత్రి వారికి హామీ ఇచ్చారు.

హైదరాబాద్ జాయ్ రైడ్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగర విహంగ వీక్షణం కోసం ఏర్పాటు చేసిన జాయ్ రైడ్‌లో హెలికాప్టర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. గురువారం తుంబి ఏవియేషన్స్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులోని హెలిప్యాడ్‌లో రైడ్ ప్రారంభమైంది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ప్రారంభమైన జాయ్‌రైడ్ నగరాన్ని రెండు పర్యాయాలు సందర్శకులతో చుట్టి వచ్చింది. మూడోసారి వెళ్లేందుకు ప్రయాణికులను ఎక్కించుకున్న హెలికాప్టర్ పది అడుగులు పైకి ఎగిరి ఒక్కసారిగా కిందకి దిగింది. వినాయకుల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన బేబీపాండ్‌కు హుస్సేన్‌సాగర్ మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో ఉన్న బురద నేలను స్వల్పంగా తాకగానే పైలట్ వెంటనే హెలికాప్టర్‌ను పైకి ఎగిరేలా చేశాడు. అందులో ఉన్న ఏడుగురు యాత్రికులు కుదుపునకు భయాందోళనకు గురయ్యారు. భారీ కుదుపునకు గురైనా ఆపకుండా టేకాఫ్ తీసుకుని వెళ్లడంతో యాత్రికుల బంధువులు పైలట్‌ను విమర్శించారు.

'ఆరెకటికలను ఎస్సీలుగా గుర్తించాలి'

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఆరెకటికలను ఎస్సీలుగా గుర్తించాలని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్‌కు ఆరెకటిక పోరాట సమితి విజ్ఞప్తిచేసింది. గురువారమిక్కడ ఎంపీ దేవేంద్రసింగ్ అలియాస్ భోలే సింగ్‌తో కలిసి సమితి నేతలు గోగిరార్ సుధాకర్ తదితరులు కేంద్ర సహాయమంత్రితో సమావేశమయ్యారు. ఆరెకటికలు ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నారని వారికోసం ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఐఐటీఏలో ముగిసిన శిక్షణ

ధ్రువపత్రాలు అందజేసిన ఎస్ఐబీ ఐజీ సజ్జనర్

మొయినాబాద్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఇంటెలిజెన్స్ ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్(ఐఐటీఏ) అకాడమీలో పది రోజులుగా డీఎస్‌డబ్ల్యు, సీఎస్‌డబ్ల్యు, గ్రేహౌండ్స్, ఐఎస్‌డబ్ల్యు సిబ్బందికి ఆర్ఎస్పీ(రెండరింగ్ సేఫ్ ప్రాసెస్)పై శిక్షణ ఇచ్చారు. గురువారం జరిగిన ముగింపు కార్యక్రమానికి స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) ఐజీ సజ్జనార్ హాజరై శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందించారు. తెలంగాణకు సంబంధించిన 43 మంది పోలీసు అధికారులకు పది రోజుల పాటు ఆర్ఎస్పీపై శిక్షణ ఇచ్చారు. బాంబులను ఎలా గుర్తించాలి? వాటిని ఎలా నిర్వీర్యం చేయాలి? తదితర అంశాలపై ఈ శిక్షణ సాగింది. అంతకుముందు ఐఐటీఏలో ఇచ్చే శిక్షణల గురించి సజ్జనార్ అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిపాలనా విభాగం భవనం, శిక్షణా స్థలం తదితర వాటిని పరిశీలించారు. శిక్షణార్థులతో మాట్లాడి శిక్షణ తీరు గురించి వివరాలు తెలుసుకున్నారు.



శిక్షణ పొందిన పోలీసుకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఐజీ సజ్జనార్

పారిశ్రామికవేత్తల సదస్సుకు ట్రంప్ కుమార్తె

● నవంబరులో హైదరాబాద్‌లో నిర్వహణ
● ట్విట్టర్‌లో ప్రధాని మోదీ వెల్లడి
● హర్షం వ్యక్తంచేసిన సీఎం కేసీఆర్



ఈనాడు, హైదరాబాద్: భారత, అమెరికా దేశాల ఆధ్వర్యంలో జరిగే ప్రతిష్ఠాత్మక ప్రపంచ శిఖరాగ్ర పారిశ్రామికవేత్తల సదస్సు (గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్)-2017కు తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. నవంబరు 28 నుంచి 30 వరకు జరిగే ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయ ఇవాంకా ట్రంప్ కూడా పాల్గొంటారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం రాత్రి ట్విట్టర్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రధాని ప్రకటనపై ముఖ్యమంత్రి కేసీఆర్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌లు ఆనందం వ్యక్తంచేశారు. ప్రపంచ పారిశ్రామిక శిఖరాగ్ర సదస్సును పదేళ్లుగా వివిధ దేశాల్లో నిర్వహిస్తున్నారు. ఈసారి దీనిని భారత్‌లో జరపాలని నిర్వాహకులు నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను సూచించగా, వారు అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని ప్రధాని మోదీ ట్విట్టర్‌లో తాజాగా వెల్లడించారు. రెండు దేశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే శిఖరాగ్ర సదస్సు భారత్‌కు గొప్ప అవకాశమని, ఈ వేదికపై ప్రపంచ పారిశ్రామికవేత్తలతో ఇక్కడి పారిశ్రామికవేత్తలు, అంకుర పరిశ్రమల వారు వేదికను పంచుకోవచ్చని అన్నారు. ఈ సదస్సులో పాల్గొనే అమెరికా బృందానికి ఇవాంకా ట్రంప్ నాయకత్వం వహిస్తారని, ఆమె రాక ఆనందదాయకమని అన్నారు.

ఔత్సాహికులకు ప్రోత్సాహకరం: సీఎం

పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సుకు హైదరాబాద్‌ను ఎంపిక చేయడం తెలంగాణకు గర్వకారణమని సీఎం కేసీఆర్ అన్నారు. ప్రధాని మోదీతో పాటు ఇవాంకా ట్రంప్ హాజరుకానుండడం ఆనందదాయమని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సదస్సులో పాల్గొనడం ఔత్సాహికులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదస్సు గురించి ప్రధాని స్వయంగా తమ ట్విట్టర్‌లో ప్రపంచానికి వెల్లడించినందుకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని ట్విట్టర్‌పై కేటీఆర్ స్పందిస్తూ ఇది తెలంగాణకు గొప్పగౌరవంగా భావిస్తున్నామని ట్విట్టర్‌లో తెలిపారు. తమకు అవకాశం ఇచ్చినందుకు ఆయన మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ వైద్యుల భద్రతపై చిత్తశుద్ధితో ఉన్నాం: మంత్రి లక్ష్మారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఉస్మానియా ఆసుపత్రిలో పీజీ వైద్య విద్యార్థులు(జూడాలు) చేస్తున్న సమ్మెపై గురువారం సచివాలయంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షించారు. జూడాలతోనూ వారి సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులకు భద్రత కల్పించడంపై సర్కారు చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. అవసరమైన మేరకు తప్పనిసరిగా భద్రత కల్పిస్తామని జూడాలకు మంత్రి హామీ ఇచ్చారు. సర్కారు దవాఖానాల్లో మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అధునాతన వైద్యపరికరాలు, సదుపాయాలు కల్పిస్తున్నామని, ఇంకా లోటుపాట్లను చక్కదిద్దాల్సిన అవసరముందని చెప్పారు. జూడాల సమస్యలపై స్థానిక ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు సరైన రీతిలో స్పందించడం లేదనే పీజీ వైద్యవిద్యార్థుల ఫిర్యాదుపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆసుపత్రి పరిపాలనాధికారుల తీరుపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకపై జూడాల సమస్యలపై స్పందించి తక్షణ పరిష్కారాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. సమ్మె విరమించడానికి జూడాల ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేసినా, అందరితో చర్చించాక శుక్రవారం తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని జూడాలు తెలిపారు.

కేసీఆర్ కుటుంబ పాలన పతనం మొదలైంది

● టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
● 15న అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన పతనం మొదలైందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ అహంకారం, అవినీతి, దళిత వ్యతిరేకతను తెలంగాణ సమాజం చూస్తోందన్నారు. టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో 'దళితులపై అత్యాచారాలు - దాడులు' అనే అంశంపై అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. టీపీసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఆరేపల్లి మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నేరళ్ల ఘటనలో కేసీఆర్ కుటుంబం వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. బాధితులు సిరిసిల్ల డీఎస్పీకి ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయని అంశంపై ఈ నెల 11న డీజీపీని అఖిలపక్షం కలుస్తుందన్నారు. పంద్రాగస్టున అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి సమస్యను జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు, 21, 22వ తేదీల్లో అఖిలపక్షం దిల్లీకి వెళ్లి రాష్ట్రపతికి సమయం కోరడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈలోగా వినతిపత్రం సమర్పించేందుకు గవర్నర్‌ను సమయం కోరామన్నారు. అప్పటికీ న్యాయం జరగని పక్షంలో పాదయాత్రగా సిరిసిల్లకు వెళ్లి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఆచార్య కోదండరాం మాట్లాడుతూ కులం పేరుతో దూషించి మహిళలను అవమానపర్చిన అధికారులపై అట్రాసిటీ కేసులు పెట్టాలన్నారు. తెదేపా శాసనసభాపక్ష నేత రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నేరళ్ల బాధితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ తీర్మానం ప్రవేశపెట్టాలని, అన్ని పార్టీల నుంచి మద్దతిస్తామని తెలిపారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క మాట్లాడుతూ అభాగ్యులకు న్యాయం జరిగేదాకా పోరాటం చేద్దామన్నారు. సమావేశంలో తెదేపా సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, భాజపా నేత సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నేరెళ్ల బాధితులతో అఖిలపక్ష నేతలు భట్టివిక్రమార్క, రేవంత్‌రెడ్డి, మోత్కుపల్లి నరసింహులు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులు

'అధికార దుర్వినియోగంతో హక్కులు కాలరాస్తున్నారు'

అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రాష్ట్రంలో దళితులు, అణగారిన వర్గాల హక్కులు కాలరాస్తున్నారని వక్తలు ఆరోపించారు. నేరళ్ల ఘటనపై ఫొటోలు, పత్రికల్లో కథనాలతో ప్రదర్శనను తెతెదేపా గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసింది. దీనికి హాజరైన తెలంగాణ ఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం మాట్లాడుతూ ఇసుక దందా కచ్చితంగా మాఫియానే అన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ నేరళ్ల బాధితులను పనులు చేసుకోలేకుండా హింసించారని వాపోయారు. ఈ ఘటనకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ అన్నారు. తెతెదేపా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ కేటీఆర్ నియోజకవర్గంలో దళితులపై దమన కాండగా పేర్కొన్నారు. తెదేపా శాసనసభాపక్ష నేత రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అంతా కేసీఆర్ కుటుంబ కనుసన్నల్లో నడుస్తోందని ఆరోపించారు. మైనింగ్‌శాఖ మంత్రి కేటీఆర్, సిరిసిల్ల ఎమ్మెల్యే ఆయనే, కాంట్రాక్టరు వారి బంధువులేనన్నారు. తెదేపా సీనియర్‌నేత మోత్కుపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కనిపిస్తోందన్నారు.

బ్లూవేల్ గేమ్ ఆడుతూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఇండోర్: గత కొద్దిరోజులుగా ఆన్‌లైన్ నీలి తిమింగలం (బ్లూవేల్ గేమ్)ఆట ఆడుతున్న ఓ విద్యార్థి(13) గురువారం ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. ఇండోర్ జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన ఏడోతరగతి విద్యార్థి పాఠశాలభవనం మూడో అంతస్తు నుంచి దూకేందుకు ప్రయత్నించగా అక్కడున్న మిగతా విద్యార్థులు అతణ్ని వెనక్కి లాగారని ఏఎస్పీ రూపేశ్ తెలిపారు. ఆవిద్యార్థి తనతండ్రి చరవాణిలో కొన్నాళ్లుగా బ్లూవేల్‌గేమ్ ఆడుతున్నారన్నారు. తీవ్ర భయాందోళనలోఉన్న అతను ఆటలోని 50వ దశను పూర్తిచేయడానికి ఆత్మహత్య ప్రయత్నం చేసి ఉంటారని తెలిపారు.

ఎల్పీసెట్ నిర్వహణపై వివరణ ఇవ్వండి

● ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: భాషా పండితుల(తెలుగు, హిందీ, ఉర్దూ) ప్రవేశాల కోసం నిర్వహించాల్సిన ఎల్పీసెట్(లాంగ్వేజ్ పండిట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నిర్వహించపోవడంపై వివరణ ఇవ్వాలని ఉమ్మడిహైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎల్పీసెట్ నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ఎస్.బాలరాజ్ మరో ఏడుగురు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం జస్టిస్ చల్లా కోదండరాం విచారణ చేపట్టగా.. పిటిషనర్ల తరఫు న్యాయవాది ఎన్.ఎస్.అర్జున్‌కుమార్ వాదనలు వినిపిస్తూ బీఏ(లాంగ్వేజెస్) పూర్తి చేసినవారికి గురుకులాలతోపాటు ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో భాషా పండితుల పోస్టుల ద్వారా ఉపాధి లభిస్తుందన్నారు. దీనికి అర్హత సాధించడానికి భాషా పండితుల శిక్షణ పొందాల్సి ఉందన్నారు. బీఏ(లాంగ్వేజెస్) పూర్తి చేసినవారికి బీఎడ్ చేయడానికి అవకాశం లేదని, భాషా పండితుల శిక్షణ మాత్రమే పొందాల్సి ఉందన్నారు. భాషా పండితుల శిక్షణకు ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రవేశాలు చేపట్టకపోవడంతో ప్రభుత్వం చేపట్టే నియామకాల్లో అవకాశాలు కోల్పోతున్నారని చెప్పారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ప్రవేశపరీక్ష లేకుండా కాలేజీలు ప్రవేశాలు ఇవ్వడానికి ఉన్న అభ్యంతరాలేమిటని ప్రశ్నించగా..జీవో 31ప్రకారం ప్రవేశపరీక్ష ద్వారానే అడ్మిషన్లు చేపట్టాల్సి ఉందని న్యాయవాది తెలిపారు. ఎల్పీసెట్ ద్వారా అడ్మిషన్లు పొందినవారికి ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.14 వేలు వస్తుందన్నారు. ఉపాధ్యాయ విద్య జాతీయమండలి(ఎన్‌సీటీఈ) దక్షిణ ప్రాంత కమిటీ ఎల్పీసెట్ నిర్వహణకు 2015లోనే అనుమతి ఇచ్చిందని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వికాస్ తెలుగు పండిట్ శిక్షణ కళాశాల దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎల్పీసెట్ నిర్వహించాలని గతేడాది హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోలేదని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఎల్పీసెట్ నిర్వహణపై ప్రభుత్వ వైఖరిని చెప్పాలంటూ విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

అనుమతుల్లేకుండా టెండర్లు పిలవడంపై కౌంటర్లు దాఖలు చేయండి

● మల్లన్నసాగర్ వ్యవహారంలో రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
● టెండర్ల నోటిఫికేషన్‌పై స్టేకు నిరాకరణ

ఈనాడు, హైదరాబాద్: చట్టబద్ధమైన అనుమతులు రాకుండా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం నిమిత్తం జారీచేసిన టెండరు నోటిఫికేషన్‌లపై కౌంటర్లు దాఖలు చేయాలని గురువారం హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేవలం కొందరు దాఖలు చేసిన పిటిషన్లపై ప్రాజక్టు టెండరును నిలిపివేయలేమంటూ మధ్యంతర ఉత్తర్వులివ్వడానికి నిరాకరించింది.

పర్యావరణ అనుమతుల్లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ పనుల నిమిత్తం గతనెల 20న జారీ చేసిన టెండరు నోటిఫికేషన్లు, భూసేకరణ నిమిత్తం గతనెల 29న ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌లను రద్దు చేయాలంటూ సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్‌కు చెందిన గండ్ల లక్ష్మి మరో అయిదుగురు పిటిషన్ వేశారు. గురువారం జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీహెచ్ రవికుమార్ వాదిస్తూ పర్యావరణ అనుమతులు లేకుండా టెండరు నోటిఫికేషన్ జారీచేయడం చట్టవిరుద్ధమన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అధికంగా ప్రజలు ఆమోదం చెబుతుండగా కొందరు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని అడ్వొకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి వాదించారు. ప్రాజెక్టుకు అవసరమైన 17 వేల ఎకరాల భూమిలో ఎక్కువ శాతం భూమిని సేకరించామన్నారు. ఇందులో 1600 నుంచి 2 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని, ఇందుకోసం 2013 భూసేకరణ చట్టం కింద నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ పనులకు ఈ దశలో పర్యావరణ అనుమతులు అవసరం లేదన్నారు. తాగునీటి అవసరాల పనులు చేపట్టడానికి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. దీనికి సంబంధించి జాతీయ హరిత ట్రైబ్యునల్‌లోనూ పిటిషన్ పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ కొందరి కోసం ప్రాజెక్టు పనులను నిలపడం సరికాదని వ్యాఖ్యానించారు. పిటిషనర్లు హరిత ట్రైబ్యునల్‌ను ఎందుకు ఆశ్రయించరాదని ప్రశ్నించారు. దీంతో పిటిషనర్ల తరఫు న్యాయవాది స్పందిస్తూ 2013 భూసేకరణ నోటిఫికేషన్‌కు సంబంధించి పిటిషనర్లు అభ్యంతరాలు చెప్పారని, వాటిని పరిష్కరించకుండానే ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు చేపట్టడానికి ప్రయత్నిస్తోందన్నారు. దీనిపై ఏజీ సమాధానమిస్తూ అభ్యంతరాలను పరిష్కరించకుండా భూమి నుంచి ఖాళీ చేయించబోమని హామీ ఇచ్చారు. ఈమేరకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్లు దాఖలు చేయాలని విచారణను 4 వారాలకు వాయిదా వేశారు.

వసుంధర

ఫ్యాషన్ ఫ్యాషన్

బెనారసీ చీరల ప్రత్యేకతే వేరు. తరాలు మారినా చెక్కుచెదరని అందంతో వేడుక చేసే సొగసు కాబట్టే సందర్భం ఏదైనా నిండుగా, హుందాగా కనిపిస్తుంది. ఈ కాలానికి తగినట్టుగా... వైవిధ్యమైన డిజైన్లతో, ఆకట్టుకునే రంగుల్లో సందడి చేస్తోన్న అలాంటి బెనారసీ చీరల్ని మరోసారి చూసేద్దాం..

అంచులో తాజ్ అందం!



గులాబీ, పీచ్ వర్ణాలకి జతగా యాంటిక్ అంచు తోడైన బెనారసీ అందం.



నీలి, ఆకుపచ్చ రంగుల వర్ణ విన్యాసానికి నిండుదనం తెస్తున్న వెండి వర్ణాల మయూరాలు.



నల్లని బెనారసీ చీర అంచుపై సందడి చేస్తున్న తాజ్ మహల్ అందాలు.



ఉదారంగు బెనారసీ చీరకి ప్రత్యకత తెస్తున్న ఆకుపచ్చ అంచు.



వెండీ, బంగారు యాంటిక్ అంచులతో మనసుని కట్టిపడేస్తున్న నీలిరంగు సోయగం.

మోడల్: షరోన్ ఫెర్నాండెజ్ ఫొటోలు: డి. శ్రీనివాసరావు

ఆత్మవిశ్వాసం పెంచేద్దామా!



పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరగాలంటే... వారికి అదేపనిగా హితబోధ చేయడం కాదు. మీరు వారిపట్ల చూపే ప్రేమతోనే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అదెలాగంటే...

- మనం అన్నివేళలా తోడుంటామనే మానసిక ధైర్యాన్ని పిల్లల్లో పెంచాలి. వాళ్లు ఏ మాత్రం నిరుత్సాహంగా ఉన్నా దగ్గరకు తీసుకుని కబుర్లు చెప్పాలి. హత్తుకోవాలి. భుజంతట్టాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మీ ప్రేమను స్పర్శద్వారా వారికి తెలియజేయాలి. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.
- పిల్లలతో మాట్లాడేటప్పుడు వారి కళ్లల్లోకి చూడాలి. అప్పుడే మీ ప్రేమ వారికి అర్థమవుతుంది. వారిని కూడా అలాగే మాట్లాడమనాలి. ఇలా చేయడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- మీరు ఉద్యోగం చేస్తున్నా, ఇంటిపనులతో తీరికలేకపోయినా.. పిల్లలతో వీలైనంత ఎక్కువగా సమయం కేటాయించేలా చూసుకోవాలి. రోజులో కనీసం గంట, కుదిరితే అంత ఎక్కువ సమయం పిల్లలతో గడిపేలా చూసుకోవాలి. అది మీ మధ్య బంధాన్ని పెంచడమే కాదు... వారిలో ధైర్యాన్నీ నింపుతుంది.
- పిల్లలు విసిగించినప్పుడూ, ఇబ్బంది పెడుతున్నప్పుడూ తల్లిదండ్రులు వెంటనే చేసే పని.. నాలుగు దెబ్బలు వేయడం లేదా గట్టిగా కోప్పడటం. అలా చేయడం వల్ల వాళ్లు మరింత మొండిగా మారతారు తప్ప మాట వినరు. అందుకే ఆ సమయంలో కాసేపు మౌనంగా ఉండి.. తరవాత నిదానంగా చెప్పండి. వాళ్ల గురించి వాళ్లకే తెలుస్తుంది.

ఎప్పటికప్పుడు కొత్తగా...

కొంతమంది కెరీర్‌లో వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుని దూసుకుపోతుంటే... మరికొందరు మాత్రం అలాగే ఉంటారు. ఆ కొందరు తమను తాము ఎలా మార్చుకోవాలో చూద్దామా...

- జీవితం అయినా ఉద్యోగం అయినా స్పష్టత ఉండాలంటారు కెరీర్ నిపుణులు. అవును.. మనకేం కావాలో స్పష్టంగా తెలిసినప్పుడే దేన్నయినా సాధించగలం. ఆ రంగానికి సంబంధించిన కోర్సులు చేయడం, లోతుగా అధ్యయనం చేయడం వంటివి మనం ఎంచుకున్న రంగంలో బలపడటానికి ఉపకరిస్తాయి.
- ఎప్పుడూ ఒకే రకం పనికాకుండా కొత్తదనం వెతకాలి! లేదా



కొత్త సవాళ్లను స్వీకరించేందుకు ముందుండాలి. అలా అయితేనే మన పురోభివృద్ధి కనిపిస్తుంది. మనం ఎక్కడ నుంచి మొదలయ్యాం... ఎక్కడున్నాం, ఎక్కడకు వెళ్లాలనే విషయంలో ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటే దూసుకుపోవడం ఖాయం.

- ఉద్యోగం మొదలుపెట్టిన కొత్తల్లో ఎవరికైనా ఉత్సాహం, నేర్చుకోవాలనే తపనా, ఆసక్తీ ఉంటాయి. కానీ రోజురోజుకీ అవి నీరుగారిపోతుంటాయి. అలా కాకుండా ప్రతిరోజునీ ఉద్యోగంలో చేరిన మొదటిరోజులా భావిస్తే వెనకడుగు వేసే అవకాశం ఉండదు.
- కుటుంబం, ఉద్యోగం, అభిరుచులు... వేటినీ వదులుకోవాల్సిన అవసరం లేదు. కానీ దేని ప్రాధాన్యం దానికే ఇవ్వాలి. రెండింటికీ వేర్వేరుగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలి. అశ్రద్ధ, నిర్లక్ష్యం ఉండకూడదని గుర్తుంచుకోవాలి.

అక్కడ రోగులే... పాఠాలు చెప్తారు!



వైద్యం చదివేవాళ్లకి శస్త్రచికిత్సా నైపుణ్యం, మందులపై లోతైన పరిజ్ఞానం ఎలాగూ వస్తుంది. కానీ మనం అంతకన్నా దృష్టిపెట్టాల్సింది రోగులతో వైద్యులు మాట్లాడే విధానంపైనే! వ్యాధి చిన్నదైనా సరే లోపల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులున్నాయేమోనని భయపడతారు చాలామంది. కాకపోతే అవన్నీ వైద్యులకి చెప్పరు. వారి మనసులోని భయం తెలియాలంటే వాళ్లతో ప్రేమగా మాట్లాడాలి. మాటలే కాదు వృత్తిగత ప్రవర్తనా, నైతిక విలువలూ ప్రతి వైద్యునికీ వెన్నెముకలాంటివి. అందుకే మా సంస్థలో ఎక్కడాలేని విధంగా వీటిపై విద్యార్థుల కోసం ప్రత్యేక పేపర్ పెట్టాను..!' అంటారు మాధవి! అలా లాంక్‌షైర్ టీచింగ్ హాస్పిటల్స్ బోధనాసుపత్రిలో అండర్‌గ్రాడ్యుయేట్-డీన్‌గా వివిధ వైద్య కోర్సుల కింద చదివే మూడువందల మంది విద్యార్థులకి అవసరమైన పాఠ్యప్రణాళికని రూపొందించారామె. మార్కులే కొలమానం కాకుండా విద్యార్థి ప్రవర్తనకీ పెద్ద పీట వేశారు. ఇందుకోసం ప్రత్యేక ధ్రువపత్రాన్నిచ్చి.. కొత్త ఒరవడి సృష్టించారు. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఇక్కడి విద్యార్థులతో తమ అనుభవాలు పంచుకుంటారు. యూకే మొత్తంలో ఈ రకమైన విద్యాబోధన ఉన్న రెండు విద్యాసంస్థల్లో 'లాంక్‌షైర్ టీచింగ్ హాస్పిటల్స్' ఒకటి. ఇది ఆమె ప్రత్యేకతకో మచ్చుతునక.


అది బ్రిటిష్ రాజ్యం.. యూకే! అక్కడ లాంక్‌షైర్ అని ఓ రాష్ట్రం (కౌంటీ). ఆ రాష్ట్రంలో 'లాంక్‌షైర్ టీచింగ్ హాస్పిటల్స్' అని ఓ బోధనాసుపత్రి. ఎక్కడో యూకేలో ఉన్న ఓ బోధనాసుపత్రి గురించి మనకెందుకంటారా? ఇక్కడో వినూత్న పద్ధతుంది. ఇక్కడి విద్యార్థులకు... అంటే కాబోయే వైద్యులకు రోగులే వచ్చి పాఠం చెబుతారు!! ఇదొక్కటే కాదు.. ఇలాంటి విభిన్న విధానాలు ఎన్నో ఉన్నాయి. అందుకే ఆ మధ్య నిర్వహించిన ఓ సర్వేలో బోధనాపరంగా అత్యుత్తమ సంస్థగా ఇది నిలిచింది. ఈ వినూత్న పద్ధతుల్ని రూపొందించింది మన విజయవాడ ఆడపడుచు డాక్టర్ పాలడుగు మాధవి కాబట్టి! ఆమె ఈ బోధనాసుపత్రికి డీన్ కాబట్టి!!

ఉత్తమ విద్యాసంస్థగా.. ఇవన్నీ ఒక ఎత్తైతే విద్యార్థులకు అత్యవసర చికిత్సా, శస్త్రచికిత్సలపై బోధించేందుకు నిజమైన ఆసుపత్రిలాంటి వాతావరణం సృష్టిస్తారిక్కడ. మరి ఇది బోధనాసుపత్రేగా.. అంటారా? అలాకాదు. యూకేలో వైద్య విద్యార్థులు శస్త్రచికిత్సల్లో నేరుగా పాల్గొనే అవకాశం అంతగా ఉండదు. అలాంటివాళ్లకి ఓ రోగిలాంటి రూపం ఉన్న నమూనాలూ, అలాంటి వాతావరణం యథాతథంగా సృష్టించి బోధించడం కత్తిమీద సాము! దీన్నే సిమ్యులేషన్ పద్ధతి అంటారు. అందులోనూ ఈ బోధనాసుపత్రిని మేటిగా నిలిపారు మాధవి! అందువల్లే మిగతా వైద్య విద్యాలయాలతో పోలిస్తే.. లాంక్‌షైర్ టీచింగ్ హాస్పిటల్స్ విద్యార్థులు అన్నింటా ముందువరుసలో ఉంటారు. మాధవి రూపొందించిన వినూత్న పద్ధతులపై ఓ సంస్థ 'ఇన్నోవేషన్స్ టీచింగ్ మెథడ్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' పేరుతో ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించింది. దీన్ని లండన్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్యులు హాజరయ్యే రాయల్ సొసైటీ ఆఫ్ మెడిసిన్ అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శించారు! ఓ తెలుగు మహిళకు దక్కిన అరుదైన గౌరవం ఇది. అంతేకాదు.. యూకేలో నిర్వహించిన నేషనల్ స్టూడెంట్స్ సర్వేలో అత్యుత్తమ వైద్య విద్యాలయంగా ఇది నిలిచింది! ఓ పరాయిదేశంలో, ఓ మహిళ ఇంత ప్రగతి ఎలా సాధించగలిగారు...

తండ్రి కల ఇది.. కృష్ణాజిల్లా ఇందుపల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన పాలడుగు పూర్ణచంద్రరావు విజయవాడలో స్థిరపడ్డారు. నేషనల్ శాంపిల్ సర్వే(ఎన్ఎస్ఎస్‌వో)లో ఉద్యోగం చేసేవారు. చదువుతోనే సమస్త ప్రగతి సాధ్యమని నమ్మిన ఆయన తన కుమార్తె మాధవిని, ఇద్దరు కొడుకులతో సమానంగా చదివించారు. అలా ఆమె వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. అందులోనే అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, గైనకాలజీ విభాగాలతో కలిపి ఏకంగా 11 బంగారు పతకాలు సాధించారు. బెస్ట్ అవుట్‌గోయింగ్ విద్యార్థిగా నిలిచారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాది పనిచేశారు. 1988-1991 మధ్యలో కాకతీయ మెడికల్ కళాశాలలో పీడియాట్రిక్స్‌లో ఎండీ పూర్తిచేసి చెన్నైలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైల్డ్‌హెల్త్(ఐసీహెచ్)లో చేరారు. నెలలు నిండని శిశువులకు అందించే వైద్య చికిత్సకు సంబంధించిన ఎంఆర్‌సీపీసీహెచ్, ఎఫ్ఆర్‌సీపీసీహెచ్ కోర్సులు చదివేందుకు తొలిసారి యూకే వచ్చారు. ఇంగ్లండ్‌లోని బెర్క్లీ ఆసుపత్రిలో చేరారు. వైద్యురాలిగా సేవలందిస్తూనే ఎమ్మెస్సీ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ పూర్తిచేశారు. అలా లాంక్‌షైర్ టీచింగ్ హాస్పిటల్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరారు. అంచెలంచెలుగా ఎదిగి లాంక్‌షైర్ ఆసుపత్రిలో 2014లో డీన్‌గా మారారు. మాధవి భర్త డాక్టర్ నగేష్ యూకేలో జనరల్ హెల్త్ వైద్యుడు. కూతురు ప్రత్యూష ఎంబీబీఎస్ పూర్తిచేసి... ప్రస్తుతం పీజీ చేస్తోంది. కుమారుడు అభిషిక్త్ ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు.

– మరిశర్ల జగదీష్‌కుమార్, ఈనాడు, అమరావతి

బంగారం వెండి



10న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	29,820	29,400
ఆర్నమెంట్	-------	-------	27,700	27,400
వెండి (కిలో)	-------	-------	40,300	38,600
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	29,800	29,500	29,470	29,170
ఆర్నమెంట్	27,590	27,370	27,560	27,270
వెండి (కిలో)	39,900	39,000	39,200	38,500
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	29,920	29,540	-------	-------
ఆర్నమెంట్	27,530	27,180	2,756 గ్రా	2,727 గ్రా
వెండి (కిలో)	39,900	39,500	41.90 గ్రా	41.10 గ్రా


నజరానా

జీడిపప్పు, ఎండుద్రాక్ష పురుగు పట్టకుండా ఉండాలంటే... అవి నిల్వచేసే డబ్బాలో నాలుగైదు లవంగాలు వేసి చూడండి.

నోటిచుట్టూ నలుపు.. తగ్గేదెలా?

? నాకు 38 ఏళ్లు. నా నోటి చుట్టూ నల్లగా ఉంటుంది. దాన్ని పోగొట్టడానికి రకరకాల క్రీంలు రాసుకున్నా తగ్గడంలేదు. ఏం చేయమంటారు?

- ఓ సోదరి



డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని, కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

✔ నోటి చుట్టూ నల్లగా ఉండటం అనేది వంశపారంపర్యంగా వచ్చే లక్షణం. ఇలా వంశపారంపర్యంగా వచ్చిన వారిలో ఈ సమస్య 14 ఏళ్ల తర్వాత మొదలై క్రమక్రమంగా పెరుగుతుంది. అదే కాకుండా ఎక్కువగా బ్లీచ్ చేసుకునే వారిలోనూ ఈ సమస్య బాగా కనిపిస్తుంది. పెరివోరల్ డెర్మటైటిస్ అనే సమస్య ఉన్నవారిలోనూ ఇలా నోటిచుట్టూ నల్లగా ఉంటుంది. ఎండలో ఎక్కువగా తిరగడం వల్లా దీని తీవ్రత పెరగొచ్చు. కొందరు నాలుకతో పెదాలూ, నోటిచుట్టూ అదేపనిగా తడుపుతూ ఉంటారు. ఆ లాలాజలం వల్ల కూడా నల్లగా మారుతుంది. మరికొందరు రుమాలుతో అదేపనిగా తుడుచుకుంటారు. ఇలా చేసేవారిలోనూ ఈ సమస్య కనిపిస్తుంది. కొన్నిరకాల క్రీంలు పడకపోయినా, చలికాలంలోనూ ఈ సమస్య కనిపించొచ్చు. దీన్ని అదుపులో ఉంచాలంటే ముందు నాణ్యమైన మాయిశ్చరైజర్‌ని రాసుకోవాలి. ఆ తరవాత దానిపై కోజిక్ యాసిడ్, హైడ్రోక్వినాన్, గ్లైకోలిక్ యాసిడ్, విటమిన్ సి ఉన్న క్రీంని వాడటం వల్ల చాలా తక్కువ సమయంలో మార్పు కనిపిస్తుంది. అన్నింటి కంటే ముఖ్యమైంది సన్‌స్క్రీన్. ఉదయం కోజిక్ యాసిడ్, విటమిన్ సి ఉన్న క్రీం, రాత్రిపూట గ్లైకోలిక్ యాసిడ్ ఉన్న క్రీం రాసుకోవాలి. ఒకవేళ సమస్య మరీ తీవ్రంగా ఉంటే... సూపర్‌ఫిషియల్ కెమికల్ పీల్స్ చేయించుకోవడం మంచిది. ఏవయినా సరే నిపుణుల సలహాతో ఎంచుకోవడం మేలు. ఇవి వాడుతున్నా ఇంట్లో దొరికే వస్తువులతోనూ ఆ తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేయొచ్చు. ఎలాగంటే... చెంచా కమలాపండు తొక్కపొడీ, పాలమీగడా, తేనె అరచెంచా చొప్పున తీసుకుని అన్నింటినీ కలిపి నోటి చుట్టూ రాసుకోవాలి. పదినిమిషాల తరవాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తే ఫలితం ఉంటుంది. అలాగే చెంచా కలబంద గుజ్జుకు అరచెంచా చొప్పున నిమ్మరసం, తేనె కలిపి రాసుకున్నా ఫలితం ఉంటుంది. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల నలుపును కొంతవరకూ తగ్గించొచ్చు.

సెల్ఫీ సమయంలో... ఓ పుస్తకం!



కొందరు లేస్తూనే ఫోన్ ఎక్కడుందా అని వెతుకుతుంటారు. లేచినప్పటి నుంచీ రాత్రి నిద్రపోయేవరకు దాన్ని అసలు వదలరు. ఇదనే కాదు.. అదేపనిగా ఫేస్‌బుక్ చూడటం.. అప్‌డేట్లు పెట్టడం కూడా ఏ మాత్రం సరికాదు. క్రమంగా అదో వ్యసనంగా మారిపోతుంది. మరి దీన్ని తగ్గించాలంటే...

- వాట్సాప్ మెసేజ్‌లూ, ఫేస్‌బుక్ చాట్‌లు మిమ్మల్ని మీ రోజువారీ జీవితానికి దూరం చేస్తాయి. కాబట్టి వీలైనంత వరకు వాటి వాడకాన్ని తగ్గించండి. వాటిని చూసేందుకు ఒక నిర్ణీత సమయాన్ని పెట్టుకోండి. ఆ సమయంలోనే వాటిని చూసి, సమాధానాలు ఇవ్వడం అలవాటుగా మార్చుకోండి. మొదట్లో కచ్చితంగా పాటిస్తే.. క్రమంగా అలవాటైపోతుంది. నిర్ణీత సమయం కాగానే అలారం మోగే విధంగా సెట్ చేసుకోండి. ఇది మోగగానే చేస్తున్న పని ఆపేయాలన్నమాట.
- మీరు ఖాళీగా ఉన్నారనుకుందాం. ఆ సమయంలో ఫోన్ కాకుండా ఓ కొత్త పని నేర్చుకోండి. లేదా మరేదయినా వ్యాపకం కల్పించుకోండి. చివరకి వంటలైనా సరే... దీనివల్ల మీరు కొత్త విషయాలు నేర్చుకుంటారు.
- ఫేస్‌బుక్‌లో అదేపనిగా అప్‌డేట్లు పెట్టే బదులు ఆ సమయాన్ని మీ కుటుంబ సభ్యులూ, స్నేహితులకు కేటాయించండి. వారితో కాసేపు మీ సుఖదుఃఖాలను పంచుకోండి. వారి ఆనందాన్ని ఆస్వాదించండి. ఆ సమయంలో కూడా సెల్ఫీలంటూ ఫోన్‌లకే అతుక్కుపోవద్దు.
- మీకు ఇష్టమైన పుస్తకాలను చదవండి. వాటివల్ల మీకు జ్ఞానం పెరుగుతుంది. వారం/నెల/సంవత్సరంలో ఇన్ని పుస్తకాలు చదవాలని ఓ లక్ష్యం పెట్టుకోండి. దాన్ని పూర్తిచేసేలా చూడండి. సెల్ఫీలు తీస్తూ సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం కంటే ఓ పుస్తకం చదవడం వల్ల మీకు లాభం కలుగుతుంది.

సెన్సెక్స్ ▼267 **31531** | నిఫ్టీ ▼ 88 **9820** | రూపాయి 64.08 ▼ (ఒక అమెరికా డాలరుకు) 24 పైసలు | బంగారం 29,070 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 340 | వెండి 38,995 ▲ ముంబయిలో కిలో రూ.లలో 1120 | ముడి చమురు 52.13 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,921	–127
నాస్‌డాక్	6,256	–96
నిక్కీ 225 (జపాన్)	19,730	–09
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	27,444	–313
షాంఘై(చైనా)	3,262	–14
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,390	–108
డాక్స్ (జర్మనీ)	12,014	–140

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)




కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.21	67.50
పౌండ్ స్టెర్లింగ్	75.62	87.75
యూరో	68.34	79.26
జపనీస్ యెన్/100	52.91	61.36
ఆస్ట్రేలియా డాలరు	45.81	53.00
సింగపూర్ డాలరు	42.66	50.55
థాయ్ బాత్/100	175.02	209.32
బహ్రెయిన్ దీనార్	157.72	180.65
కువైట్ దీనార్	175.15	218.10
ఒమన్ రియాల్	154.33	176.61
సౌదీ రియాల్	15.48	18.35
యూఏఈ దిర్హమ్	15.84	18.52

గురువారం నిఫ్టీ కదలికలు



9900 దిగువకు నిఫ్టీ

- సూచీలకు కొనసాగిన నష్టాలు
- సెన్సెక్స్‌కు 260 పాయింట్ల నష్టం
- అమెరికా- ఉత్తరకొరియా ఉద్రిక్తతల నేపథ్యం



సమీక్ష

సూచీలు వరుసగా నాలుగో రోజూ డీలాపడ్డాయి.. సెన్సెక్స్ నెల రోజుల కనిష్ఠానికి పడిపోగా.. నిఫ్టీ 9900 పాయింట్ల దిగువకు వచ్చింది. మార్కెట్ల నష్టాలకు డొల్ల కంపెనీలపై సెబీ తీసుకున్న చర్యలు ఒక కారణమైతే.. మరో కారణం అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులు. అమెరికా, ఉత్తర కొరియాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ప్రపంచవ్యాప్తంగా మదుపర్ల సెంటిమెంటు దెబ్బతింది. ఈ పరిణామం విదేశీ మార్కెట్లు సహా మన మార్కెట్‌పై ప్రభావం చూపింది.

3 రోజుల్లో 527 పాయింట్ల నష్టం: ఉదయం మార్కెట్ నష్టాలతో మొదలైంది. ఆ తర్వాత ఒడుదొడుకుల మధ్య చలించింది. మధ్యలో కాస్త కోలుకున్నట్లు కనిపించినప్పటికీ, మధ్యాహ్నం తరవాత తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైంది. సెన్సెక్స్ ఒక దశలో 380 పాయింట్లు నష్టపోయింది. చివరకు 266.51 పాయింట్లు కోల్పోయి 31,531.33 వద్ద స్థిరపడింది. గత మూడు రోజుల్లో సూచీ 527 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. నిఫ్టీ ఒక్కరోజే 87.80 పాయింట్లు నష్టపోయి 9,820.25 వద్ద ముగిసింది.

ఆజ్యం పోసిన ఫలితాలు

టాటా మోటార్స్, ఐషర్ మోటార్స్ ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్లు లేకపోవడం కూడా సూచీల నష్టాలకు మరో కారణం. త్రైమాసిక ఫలితాల ప్రభావంతో టాటా మోటార్స్ షేరు 9% వరకు నష్టపోయి రూ.380.90 వద్ద ముగిసింది. ఐషర్ మోటార్స్ 4% తగ్గి, రూ.30192 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్-30లో నష్టపోయిన వాటిలో డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా, సిప్లా, ఎస్‌బీఐ, లుపిన్, పవర్‌గ్రిడ్ ఉన్నాయి. డాలరు పుంజుకోవడంతో ఇన్ఫోసిస్, ఐటీ, విప్రో షేర్లు రాణించాయి.

ఎస్ఐఎస్‌కు ఆరంభ లాభాలు ఆవిరి: స్టాక్ ఎక్స్ఛేంజీలో అడుగుపెట్టిన తొలి రోజే సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ షేర్లు నిరాశపరిచాయి. ఆరంభ లాభాలు ఆవిరి చేసుకొని నష్టాలు మూటకట్టుకున్నాయి. ఇష్యూ ధర రూ.815 కాగా, బీఎస్ఈలో రూ.875 వద్ద నమోదైన షేరు చివరకు 7.15% నష్టపోయి రూ.756.70 వద్ద ముగిసింది.

నేటి మార్కెట్

సూచీల నష్టాలూ నేడూ కొనసాగే అవకాశం ఉంది. అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో సెంటిమెంటు బలహీనంగా ఉండటం ఇందుకు కారణం. ఈ రోజు నిఫ్టీ కంపెనీల్లో సిప్లా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సన్ ఫార్మా, బీపీసీఎల్, బాష్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హిందాల్కో ఇండస్ట్రీస్‌లు ఫలితాలు ప్రకటించనున్నాయి. ఈ ఫలితాల ఆధారంగా ఆయా రంగాలు, కంపెనీల షేర్లలో కదలికలు ఉండే అవకాశం ఉంది. నిన్న ట్రేడింగ్ అనంతరం వెలువడిన ఫలితాల ప్రభావం గెయిల్ షేరుపై ఉంటుంది. నేడు వెలువడనున్న పారిశ్రామికోత్పత్తి గణాంకాల కోసం మదుపర్లు వేచిచూస్తారు. ఈ రోజు కూడా అమ్మకాల ఒత్తిడి కొనసాగితే నిఫ్టీకి 50 రోజుల చలన సగటైన 9770 పాయింట్ల వద్ద బలమైన మద్దతు లభించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒక వేళ పైకి వెళితే 9900 పాయింట్ల వద్ద నిరోధం ఎదురు కావచ్చని చెబుతున్నారు.

లారస్ ల్యాబ్స్ లాభంలో 50 శాతం వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: ఏప్రిల్-జూన్‌లో లారస్ ల్యాబ్స్ ఏకీకృత నికర లాభం 51.7% పెరిగి రూ.38.9 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదే కాలంలో లాభం రూ.25.6 కోట్లు. జనరిక్ ఔషధాల ముడి ఔషధాలు, కేన్సర్, హెపటైటిస్ సి ఔషధాల విక్రయాల్లో వృద్ధి లాభం పెరగడానికి దోహదం చేశాయి. ఇదే కాలానికి నికర ఆదాయం 16.7% వృద్ధితో రూ.478.4 కోట్లకు చేరింది. 2016, జూన్‌తో ముగిసిన 3 నెలలకు ఆదాయం రూ.409.8 కోట్లుంది. తొలి త్రైమాసికం ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయని లారస్ ల్యాబ్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) చావా సత్యనారాయణ తెలిపారు. యూనిట్ 4 విస్తరణ జరుగుతోందని, ఇది జనరిక్ ఔషధాల తయారీలో వినియోగించే ముడి ఔషధాల సామర్థ్యాన్ని పెంచుతుందని సీఎఫ్ఓ వి.వి.రవి కుమార్ చెప్పారు.

రాణించిన యూనియన్ బ్యాంక్

దిల్లీ: ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.116.58 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో వచ్చిన లాభం రూ.166.32 కోట్లతో పోలిస్తే ఇది 30% తక్కువ. బ్యాంకు ఆదాయం రూ.8,916.51 కోట్ల నుంచి రూ.9,567.69 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)లు 12.36 శాతానికి, నికర ఎన్‌పీఏలు 7.47 శాతానికి పెరిగినట్లు బ్యాంకు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో ఇవి వరుసగా 10.16 శాతం, 6.16 శాతంగా ఉన్నాయి.

స్పైస్‌జెట్ లాభం రూ.173 కోట్లు

స్పైస్‌జెట్ వరుసగా 10వ త్రైమాసికంలోనూ లాభాలను ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.172.67 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థకు వచ్చిన లాభం రూ.149.03 కోట్లు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో సంస్థకు రూ.1,889.70 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన ఆదాయం రూ.1,543.96 కోట్లు. ఇక వ్యయాలు రూ.1,717.30 కోట్లకు పెరిగాయి.

స్వల్పంగా పెరిగిన దక్కన్ సిమెంట్స్ లాభం

ఈనాడు, హైదరాబాద్: ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి దక్కన్ సిమెంట్స్ రూ.11.38 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.11.31 కోట్లతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. మొత్తం ఆదాయం రూ.140.87 కోట్ల నుంచి రూ.160.85 కోట్లకు చేరింది.

డాక్టర్ రెడ్డీస్ బాచుపల్లి ప్లాంటు నుంచి ఈయూకు ఎగుమతులు నిలిపివేత

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్లాంటు నుంచి ఐరోపా యూనియన్ (ఈయూ)కు ఫార్ములేషన్ల ఎగుమతులు నిలిచిపోనున్నాయి. ఇటీవల ఈ ప్లాంటును జర్మనీ ఔషధ నియంత్రణ సంస్థ తనిఖీ చేసింది. ప్లాంటుకు చెందిన జీఎంపీ ధ్రువీకరణను పునరుద్ధరించలేదు. నిబంధనలకు అనుగుణంగా లేనట్లు ఇచ్చిన నోటీసు పెండింగ్‌లో ఉన్నందున, ఎగుమతులు చేయడానికి వీలు లేదని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. ఈ మేరకు జర్మనీలోని కంపెనీ అనుబంధ సంస్థకు సమాచారం అందినట్లు పేర్కొంది. మళ్లీ తనిఖీలు జరిగే వరకూ ఫార్ములేషన్లను ఐరోపా యూనియన్‌కు ఎగుమతి చేయడానికి అవకాశం ఉండదని వివరించింది.

అమెరికాలో ఔషధ ధరలు మరింత తగ్గుతాయ్

అరబిందో ఫార్మా అంచనా

ఈనాడు, హైదరాబాద్: అమెరికాలో జనరిక్ ఔషధాల ధరల క్షీణత కొనసాగుతోందని అరబిందో ఫార్మా భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలో ఇదే పరిస్థితులు కొనసాగగలవని, పోటీ, అమ్మకాల మార్గాల (చానెళ్ల) ఏకీకరణ ఇందుకు కారణమని అంచనా వేస్తోంది. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. ధరల క్షీణత రెండంకెల స్థాయిలో ఉండగలదని ఫలితాల అనంతరం మదుపర్లతో జరిగిన చర్చలో కంపెనీ వెల్లడించినట్లు తెలుస్తోంది. అరబిందో జనరిక్ ఔషధాల విక్రయాల్లో అమెరికా వాటా దాదాపు 45 శాతం ఉంది.

ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
సింఫనీ[1]	24.40	31.56	142.40	157.95
గెయిల్	1,025.64	1,335.13	11,570.38	10,832.12
ఐఓబీ	(499.09)	(1,450.50)	5,174.50	5,868.44
భెల్[2]	80.82	77.77	6,194.21	6,070.21
భారత్ ఫోర్జ్[3]	175.08	122.06	1,283.70	982.67
యునైటెడ్ బ్రూవరీస్	162.14	147.47	3,816.39	3,258.24
రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్	(47.39)	(25.84)	2.57	13.97
ఐఎఫ్‌సీఐ	(276.90)	(110.28)	467.52	832.44
మోయిల్	97.73	47.15	381.66	245.11
పవర్ ఫైనాన్స్	1,428.59	1,712.55	6,931.90	7,158.66
జైడస్ వెల్‌నెస్ (కన్సా)	25.27	22.04	115.54	116.86
పంజ్ లాయిడ్	(194.32)	(211.39)	977.34	887.57
మదర్సన్ సుమీ (కన్సా)	347.32	439.36	13,360.46	10,628.05
అదానీ పవర్ (కన్సా)	(453.85)	(232.63)	5,648.08	5,417.82
సన్‌టెక్ రియాల్టీ (కన్సా)	35.20	60.30	133.40	524.50
అదానీ ట్రాన్స్‌మిషన్ (కన్సా)	84.10	122.71	619.58	637.31

1) మధ్యంతర డివిడెండు 50% 2) 1:2 నిష్పత్తిలో బోనస్ షేర్లు 3) 1:1 నిష్పత్తిలో బోన్ షేర్లు

ఫ్రాన్స్ కంపెనీతో హెరిటేజ్ ఫుడ్స్ సంయుక్త సంస్థ

- రూ.5 ముఖ విలువతో షేరు విభజన
- త్రైమాసిక లాభం రూ.10 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: ఫ్రాన్స్ కంపెనీతో హెరిటేజ్ ఫుడ్స్ సంయుక్త సంస్థను ఏర్పాటు చేయనుంది. ఇందులో రెండు కంపెనీలకు సమాన వాటా ఉంటుంది. ఫ్రూట్, ఫ్లేవర్డ్ యోగర్ట్‌లు, పశ్చిమ దేశాల్లో ఉండే డెజర్ట్‌లను దేశీయ విపణిలోకి ప్రవేశపెట్టేందుకు ఫ్రాన్స్‌కు చెందిన నోవాండీ ఎస్ఎన్‌సీతో సంయుక్త సంస్థ (జేవీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు హెరిటేజ్ వెల్లడించింది. ఈ మేరకు బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. యోగర్ట్, డెజర్ట్‌లను సంయుక్త సంస్థ తయారు చేసి విక్రయిస్తుంది. దీని అధీకృత మూలధనం రూ.కోటి. రెండు కంపెనీల తరఫున ఇద్దరిద్దరు నామినేటెడ్ డైరెక్టర్లు ఉంటారు. ఉత్పత్తుల తయారీకి రోజుకు 20 ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన తయారీ యూనిట్‌ను దాదాపు రూ.16 కోట్లతో ఏర్పాటు చేస్తారు. 2018లో ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా ఉత్పత్తులు తయారు చేసే వీలుంది. షేర్లు తక్కువ ధరకు చిన్న మదుపర్లకు అందుబాటులో ఉండేందుకు, అవసరమైనప్పుడు వెంటనే విక్రయించుకుని నగదుగా (లిక్విడిటీ) మార్చుకునేందుకు వీలుగా హెరిటేజ్ ఫుడ్స్ షేర్లను విభజించాలని నిర్ణయించింది. ప్రస్తుతం రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును, రూ.5 ముఖ విలువ కలిగిన రెండు షేర్లుగా విభజించాలని బోర్డు నిర్ణయించింది. వాటాదారుల ఆమోదం, నియంత్రణ సంస్థల ఆమోదం మేరకు షేరు విభజన జరుగుతుంది.

ఆదాయం రూ.618 కోట్లు: ఏప్రిల్-జూన్‌లో హెరిటేజ్ ఫుడ్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.10.37 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.17.10 కోట్లతో పోలిస్తే 39 శాతం తగ్గిందని కంపెనీ వెల్లడించింది. కంపెనీ ఆదాయం రూ.468.39 కోట్ల నుంచి రూ.618.27 కోట్లకు పెరిగింది. వ్యయాలు పెరగడంతో లాభం తగ్గింది. 2016, జూన్‌తో ముగిసిన మూడు నెలల్లో వ్యయాలు రూ.435.06 కోట్లు ఉండగా.. ఈ ఏడాది ఇదే కాలానికి రూ.602.55 కోట్లకు చేరాయి.

నాట్కో షేరుకు 'కోపాగ్జాన్' సెగ!

- విడుదలపై మైలాన్ ప్రకటన ప్రభావం
- రెండు రోజుల్లో షేరు 25% పతనం

ఈనాడు, హైదరాబాద్: నాట్కో ఫార్మా షేరు గత రెండు రోజుల్లో దాదాపు 25 శాతం క్షీణించింది. కేంద్ర నాడీమండల వ్యవస్థను దెబ్బ తీసే మల్టిపుల్ స్క్లెరోసిస్ (ఎంఎస్) ఔషధం 'కోపాగ్జాన్' జనరిక్‌ను అమెరికాలో విడుదల చేయడంపై మైలాన్ చేసిన ప్రకటన నాట్కో ఫార్మా షేర్లపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపినట్లు కనిపిస్తోంది. నాట్కో షేరు బీఎస్ఈలో సోమవారం రూ.960.80, మంగళవారం రూ.925.25 వద్ద ముగియగా.. గురువారం రూ.696.65 వద్ద ముగిసింది. అమెరికా విపణిలోకి కోపాగ్జాన్ (ఔషధం పేరు గ్లాటిరమెర్ ఎసిటేట్) జనరిక్ ఔషధాన్ని విడుదల చేయడంలో జాప్యం జరిగే అవకాశం ఉందని మైలాన్ ఎన్‌వీ ప్రకటించింది. కోపాగ్జాన్ జనరిక్ తయారీలో మైలాన్‌తో నాట్కో ఫార్మా భాగస్వామిగా ఉన్నందున మైలాన్ ప్రకటనలు నాట్కో ఫార్మా షేరు ధరపై ప్రభావం చూపాయి. గతంలో కోపాగ్జాన్ జనరిక్‌ను 2017లో అమెరికా మార్కెట్‌లోకి విడుదల చేసే వీలుందని మైలాన్ వెల్లడించింది. తాజాగా వచ్చే ఏడాదిలోనే దీన్ని విడుదల చేయడానికి అవకాశం ఉందని పేర్కొన్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కోపాగ్జాన్ 20 ఎంజీ జనరిక్‌పై అమెరికా ఔషధ, ఆహార నియంత్రణ సంస్థ మైలాన్‌ను మరింత సమాచారాన్ని అడగడం, జాప్యానికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాట్కో ఫార్మా, మైలాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం నాట్కో ఫార్మా కోపాగ్జాన్ జనరిక్ ఔషధాన్ని సరఫరా చేస్తుంది. దాన్ని అమెరికాలో మైలాన్ విక్రయిస్తుంది.

నేటి బోర్డు సమావేశాలు ✦ ఎస్‌బీఐ ✦ బీఓబీ ✦ అలహాబాద్ బ్యాంక్ ✦ కార్పొరేషన్ బ్యాంక్ ✦ బీపీసీఎల్ ✦ సన్ ఫార్మా ✦ టీవీఎస్ మోటార్ ✦ ధనలక్ష్మీ బ్యాంక్ ✦ సిప్లా ✦ హిందాల్కో ✦ అవంతీ ఫీడ్స్ ✦ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ ✦ టీవీ టుడే ✦ టాటా గ్లోబల్ బెవరేజెస్ ✦ మ్యాక్స్ ఇండియా ✦ బాష్ ✦ జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ✦ ఆయిల్ ఇండియా ✦ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ ✦ జీవీకే పవర్ ✦ బీఈఎంఎల్ ✦ ఎరోస్ ✦ గోద్రేజ్ ఇండస్ట్రీస్ ✦ ఓబీసీ ✦ జీఎంఆర్ ఇన్‌ఫ్రా ✦ సన్ టీవీ నెట్‌వర్క్ ✦ బజాజ్ హిందుస్థాన్ షుగర్ ✦ సెయిల్

టెక్ మహీంద్రా



రూ.393 వద్ద ప్రారంభమై రూ.393–413.70 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.393.85తో పోలిస్తే రూ.10.15 (2.58%) లాభంతో రూ.404 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 49,90,849.

టాటా మోటార్స్



రూ.401 వద్ద మొదలై రూ.375.25–403.60 మధ్య చలించి, క్రితం ముగింపు రూ416.05తో పోలిస్తే రూ.35.85 (8.62%) నష్టంతో రూ.380.20 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 2,81,14,017.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

బ్రిటానియా ఇండస్ట్రీస్	4,233.95
ఇండియా నిప్పన్ ఎలక్ట్రికల్స్	767.75
అవధ్ షుగర్	682.85
సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్	879.80
వీ2 రిటైల్	361.90
సన్‌టెక్ రియాల్టీ	261.95

52 వారాల కనిష్ఠం (రూ.లలో)

అక్షరకెమ్	704.00
క్లేరియంట్ కెమికల్స్	574.80
సిగ్నిటీ టెక్నాలజీస్	195.55
బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్	3,843.10
అంజనీ పోర్ట్‌ల్యాండ్	195.55
అబాన్ ఆఫ్‌షోర్	166.40

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
10/08	4,385	5,556	–1171	4,085	3,263	822
09/08	3,238	4,080	–842	2,886	2,333	553
08/08	6,246	4,706	1,540	3,152	2,353	799
07/08	3,790	3,989	–199	2,572	2,264	308
03/08	5,534	5,510	24	3,069	3,458	–389

10వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	335	విశాఖపట్నం	348
చిల్లరగా (ఒక గుడ్డు)	3.95	వరంగల్	337
బెంగళూరు	365	చిత్తూరు	375
11న		చెన్నై	382
విజయవాడ/గోదావరి	343	నమక్కల్	370

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1776.70 (1819.50) 335802
ADANI PORT & 385.65 (397.25) 3177276
AMBUJA CEMEN 267.45 (273.20) 1402846
ASIAN PAINTS 1151.10 (1155.55) 649594
AUROBIND PHA 685.25 (683.60) 9038989
AXIS BANK LT 485.50 (486.95) 10095387
BAJAJ AUTO L 2796.20 (2831.15) 497306
BANK OFBAROD 148.45 (155.20) 10557366
BHARTI AIRTE 416.25 (416.05) 1497110
BHARTI INFRA 382.45 (381.70) 3050083
BOSCH LTD 23543.80 (24032.00) 29585
BPCL 481.50 (495.95) 4848050
CIPLA 548.20 (561.85) 1217416
COAL INDIA L 238.95 (242.50) 2764860
DR. REDDYS 1944.45 (2048.35) 1540007
EICHER MOTOR 30111.70 (31489.10) 77024
GAIL 365.00 (382.20) 2642144
HCL TECH 882.90 (878.75) 846537
HDFC 1709.80 (1731.65) 3177026
HDFC BANK 1760.45 (1764.45) 1947111
HERO MOTOCOR 3889.55 (3883.75) 303409
HINDALCO IND 238.00 (239.45) 10897284
HINDUSTAN UN 1170.70 (1185.35) 699787
ICICI BANK 288.75 (290.60) 17225844
INDIABULLS H 1156.50 (1159.00) 1753712
INDIAN OIL 410.30 (414.05) 4239237
INDUSINDBANK 1629.40 (1637.25) 709628
INFOSYS LTD 981.25 (969.35) 4570342
ITC 273.10 (272.85) 9995867
KOTAK MAHIND 996.80 (992.40) 2495164
LARSEN & TOU 1157.70 (1153.90) 1713614
LUPIN 936.70 (952.95) 2148029
M&M 1387.05 (1392.30) 816173
MARUTI SUZIK 7578.75 (7661.60) 385730
NTPC LTD 172.65 (173.65) 2464637
ONGC 163.70 (165.70) 8412268
POWER GRID C 217.40 (221.90) 3832683
RELIANCE IND 1584.35 (1598.80) 2328843
SBI 296.70 (302.30) 14519518
SUN PHARMA 460.80 (474.35) 10149400
TATA CONSULT 2511.45 (2512.00) 763086
TATA MOT DVR 221.45 (242.25) 9343687
TATA MOTORS 380.20 (416.05) 28114017
TATA POWER 76.70 (77.80) 10816439
TATA STEEL L 604.35 (605.05) 7684041
TECH MAHINDR 404.00 (393.85) 4990849
ULTRATECH 3907.60 (3997.85) 144452
VEDANTA LIMI 298.80 (300.20) 14153043
WIPRO 288.15 (286.50) 2708344
YES BANK LTD 1730.10 (1741.55) 2132127
ZEE ENTERTAI 520.05 (540.00) 2917821

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1341.60 (1386.35) 47753
ASHOK LEYLAN 103.45 (109.60) 12732108
BAJAJ FINANC 1635.60 (1697.70) 1835002
BAJAJ FINSER 5024.75 (5121.90) 237901
BEL 170.75 (179.25) 3736431
BHEL 126.75 (133.00) 17170905
BRITANNIA 4119.20 (4058.90) 326587
CADILA HEALT 466.15 (485.45) 1599352
COLGATE PALM 1054.65 (1056.75) 186856
CONTAINER 1145.45 (1168.85) 232209
CUMMINS INDI 893.00 (904.35) 399739
DABUR INDIA 306.55 (310.50) 566291
DIVIS LAB 626.10 (639.05) 1219649
DLF LIMITED 164.60 (178.85) 14065209
EMAMI LIMITE 1091.85 (1128.65) 57315
GLAXOSMI CON 5411.15 (5409.85) 4206
GLAXOSMI PHA 2374.55 (2392.10) 10605
GLENMARK PHA 612.75 (645.45) 1099021
GODREJ CONSU 901.75 (921.80) 664863
HAVELLS INDI 463.65 (497.95) 2008418
HINDUSTAN ZI 280.80 (286.65) 2461891
HPCL 412.45 (429.65) 6413893
ICICI PRU LI 413.80 (425.75) 934151
IDEA CELLULR 87.95 (91.05) 10457668
INTERGLOBE A 1273.70 (1303.35) 723349
JSW STEEL LT 222.75 (230.45) 5725478
LIC HOUS.FIN 657.65 (676.90) 1870489
MARICO LIMIT 320.55 (325.70) 1679678
MCDOWELL 2490.80 (2535.95) 498106
MOTHERSON 317.45 (329.05) 12066170
NHPC LTD 30.05 (30.85) 7383280
NMDC LTD 121.75 (126.15) 10395163
OIL INDIA 281.95 (282.05) 532772
ORACLE FIN S 3445.45 (3552.90) 35816
P&G HYG&HEAL 8017.60 (8104.30) 1989
PETRONET LNG 208.20 (207.45) 3959024
PIDILITE IND 795.35 (795.25) 554974
PIRAMAL ENTE 2731.10 (2851.55) 260386
PNB 143.15 (148.30) 8506146
POWER FIN CO 124.55 (134.10) 17380728
RURAL ELEC C 163.75 (175.25) 12961161
SAIL 58.85 (61.45) 5435430
SHREE CEMENT 17336.30 (17945.95) 9545
SHRIRAM TRAN 933.75 (942.75) 1028507
SIEMENS 1289.45 (1325.75) 247509
SUN TV LTD 680.80 (705.55) 1126577
TITAN IND 610.35 (619.15) 1378763
TORRENT PHAR 1228.90 (1234.70) 144495
UNITED BREWE 824.20 (832.35) 395016
UPL LIMITED 821.50 (830.50) 1278567

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 168.55 (175.80) 625990
ADANI ENTERP 115.85 (124.25) 5134939
ADANI POWER 28.70 (31.55) 15563130
ALL BANK 65.70 (68.85) 3394795
AMARA RAJA 800.25 (805.20) 213527
ANANT RAJIND 52.65 (55.50) 1441352
ANDHRA BANK 50.80 (54.10) 3879893
APOLLO HOSPI 1213.80 (1220.55) 218907
APOLLO TYRES 262.60 (270.25) 4651785
APTECH 204.20 (219.50) 320366
BAJAJ ELECT. 302.30 (319.95) 136908
BAJAJ HIND 14.60 (14.85) 5962366
BAJAJ HOLDIN 2499.95 (2554.10) 21313
BALAJI TELE 153.75 (164.30) 556050
BALLARPUR IN 14.05 (15.00) 1640392
BALRAMPUR CH 160.15 (166.35) 1225686
BANK OF MAHA 26.15 (27.05) 118146
BANK OFINDIA 148.15 (158.45) 13264178
BATA INDIA 632.05 (636.55) 802071
BGR ENERGY S 128.90 (136.55) 95249
BHARAT FORGE 1142.85 (1165.75) 3164092
BHUSHAN STEE 65.30 (67.25) 565134
BIOCON LTD 331.10 (339.00) 1985991
BOMBAY DYE 69.55 (78.10) 1552350
CANARA BANK 330.70 (343.95) 2096026
CEAT LIMITED 1699.30 (1689.60) 1299363
CENTRAL BANK 82.05 (85.05) 592774
CHAMBAL FERT 124.60 (135.70) 1388153
CHENNAI PETR 381.70 (398.25) 1986523
CITY UNIBANK 156.85 (162.00) 449487
CORPO BANK 46.40 (50.25) 641574
COX & KINGS 269.10 (271.95) 238480
D B REALTY L 34.20 (36.80) 1160575
DELTA CORP L 162.45 (168.85) 2699415
DENA BANK 31.75 (32.50) 656885
DHANALAKBANK 33.70 (35.55) 995705
EDELWEISS CA 232.50 (250.40) 4249356
EDUCOMP SOLU 7.90 (8.00) 278097
EID PARRY 302.55 (307.40) 174583
EIH 131.25 (131.30) 96105
ESSAR SHIPPI 25.00 (25.70) 26765
ESTER INDUST 32.45 (34.35) 40055
EXIDE INDUST 199.95 (207.20) 2532119
FEDERAL BANK 104.70 (108.30) 8889947
FINOLEX CABL 490.25 (490.45) 239192
G E SHIP LTD 375.30 (388.00) 457358
GAMMON INDIA 8.75 (9.05) 524659
GAMMON INFRA 3.70 (4.00) 8530905
GATI LIMITED 109.25 (114.55) 491092
GAYATRI PROJ 153.15 (159.45) 45922
GITANJALIGEM 56.05 (58.70) 290178
GMR INFRASTR 15.90 (16.95) 35718794
GODREJ IND 576.70 (601.90) 877923
GRASIM IND 1070.75 (1091.80) 2467728
GUJ ALK&CHEM 390.25 (403.95) 117525
HCL INFOSYS 41.75 (43.60) 1322161
HEXA TECH 253.75 (260.20) 1041495
HIMACHAL FUT 15.15 (16.55) 9120700
HINDU MOTORS 7.25 (7.85) 335395
HOUSING DEV 56.20 (57.20) 54747748
IDBI 53.80 (55.95) 3142851
IDFC 54.65 (56.40) 7875252
IFCI 22.80 (24.45) 9621153
IL&FS TRANS 76.10 (83.45) 594408
IND SWIFTLAB 33.90 (35.45) 26867
INDBULLS REL 227.95 (249.40) 26263179
INDIA CEM 174.80 (186.30) 6958468
INDIAN BANK 273.85 (296.20) 932333
INDO RAMA SY 28.10 (29.10) 82724
INDRAPRASTHA 1214.20 (1231.00) 381209
IND-SWIFTLTD 7.85 (8.25) 47263
INGERSOLL-R 787.55 (800.70) 10965
IOB 23.10 (23.95) 1300261
IPCA LAB 419.85 (436.95) 210690
IRB INFRA DE 200.75 (211.45) 2232732
J&K BANK 75.00 (79.20) 381104
JAI CORP 72.25 (77.20) 576364
JAIN IRRIGAT 92.15 (99.40) 6146616
JAYPEE INFRA 18.85 (19.80) 1086330
JAYSHREE TEA 95.80 (99.30) 53069
JET AIRWAYS 560.30 (613.70) 3028441
JINDAL SAW 89.90 (92.80) 1081477
JINDAL STEEL 123.30 (135.95) 16399537
JK LAKSHMI C 417.60 (429.45) 66429
JK PAPER LIM 91.50 (93.75) 661725
JM FINANCIAL 117.40 (124.25) 775834
JP ASSOCIATS 23.30 (25.60) 124038759
JSW ENERGY L 64.90 (70.55) 10479145
JUBILANT FOO 1317.95 (1299.20) 1926331
JUBILANT ORG 642.90 (669.20) 423132
JYOTHY LABS 381.10 (374.15) 166472
KARNATA BANK 138.05 (146.40) 3185613
KEC INTL LTD 290.15 (300.50) 392489
KOLTE PATIL 144.85 (155.85) 120963
KPIT CUMMINS 108.75 (116.10) 2001728

ఘనం (+)

నిఫ్టీ	10న	మార్పు %
TECH MAHINDRA	404.00	2.58
INFOSYS	981.25	1.23
WIPRO	288.15	0.58
HCL TECHN	882.90	0.47
KOTAK MAHI BANK	996.80	0.44
LARSEN & TOUBRO	1157.70	0.33
AUROBINDO PHAR	685.25	0.24

గ్రహణం (-)

నిఫ్టీ	10న	మార్పు %
TATA MOTORS	380.20	-8.62
TATA MOTORS DVR	221.45	-8.59
DR. REDDYS LABO	1944.45	-5.07
GAIL (INDIA)	365.00	-4.50
EICHER MOTORS	30111.70	-4.37
BOB	148.45	-4.35
ZEE ENTERTAIN	520.05	-3.69

L&TFIN.HOLD 165.15 (172.15) 6599252
LAK VIL BANK 171.90 (177.35) 644841
M & M FINANC 407.30 (423.60) 1834107
M & M FINANC 407.30 (423.60) 1834107
MANAPPURAM G 93.30 (98.70) 6356764
MMTC LIMITED 55.45 (57.05) 1531757
MOSER-BEAR 4.35 (4.80) 748815
MPHASIS LTD 572.90 (581.50) 57842
MRPL 119.50 (134.40) 5028311
MTNL 17.75 (18.50) 690993
NAGARJUNA OI 3.75 (3.90) 342072
NCC LIMITED 83.25 (89.60) 5567130
NETWORK18 FI 51.05 (52.25) 494825
NEULAND LAB 1226.50 (1359.60) 21377
NIIT LTD 85.80 (86.85) 563182
NIIT TECHNOL 475.35 (482.45) 355151
OMAXE LTD 201.30 (202.20) 442340
ONMOBILE GLO 55.10 (58.75) 507733
ORIENT PAPER 89.35 (94.75) 512292
ORIENTALBANK 126.95 (136.05) 2839939
PATEL ENGG 68.30 (75.65) 300938
PFIZER 1791.50 (1798.70) 18319
POLARIS SOFT 230.15 (232.80) 207253
POWERTRADING 108.75 (117.10) 4405272
PRAJ IND 68.35 (73.20) 575431
PRISM CEMENT 114.40 (118.70) 217111
PROVOGUE (IN 4.00 (4.10) 124698
PUNJ LLOYD 19.00 (19.90) 2186469
PUNJAB & SIN 48.20 (50.55) 155268
PURAVANKARA 66.70 (72.10) 257840
PVP VENTURES 4.60 (4.85) 286074
PVR LIMITED 1332.60 (1358.00) 247374
RADICO KHAIT 139.30 (146.40) 640276
RAJ OIL MILL 1.30 (1.35) 89512
RAJESH EXPOR 714.05 (718.40) 269592
RALLIS INDIA 226.70 (238.25) 168201
RAMCO IND 232.55 (240.45) 154603
RAMCO SYS 352.55 (370.70) 68719
RAMKY INFRA 80.60 (87.40) 297267
RAYMOND 723.30 (781.15) 568067
RELIANCE CAP 764.25 (799.50) 7274484
RELIANCE COM 21.20 (22.20) 19092243
RELIANCE INF 474.45 (514.40) 3722914
RELIANCE POW 39.00 (41.25) 3632908
ROLTA INDIA 52.50 (54.55) 369827
SAGAR CEMENT 809.95 (832.10) 7989
SAREGAMA 358.85 (365.90) 238438
SHANTHI GEAR 130.60 (130.50) 60761
SHIPPNG CORP 88.00 (90.60) 2549677
SHREE RENUKA 16.85 (17.80) 4011182
SINTEX IND 27.25 (29.50) 26689518
SOBHA DEVELO 360.15 (373.40) 148491
SOUTHINDBANK 26.25 (27.70) 23600510
STERLITE TEC 212.85 (230.65) 1282703
SUJANA METAL 1.55 (1.80) 484807
SUN PHARMA 341.05 (359.95) 281445
SUND FASTNER 373.60 (384.50) 129827
SUZLON ENERG 15.40 (16.30) 70837694
SYND. BANK 63.80 (69.00) 3345589
TATA CHEM 576.75 (579.05) 1066641
TATA COFFEE 119.70 (122.10) 302308
TATA COMMUN 594.25 (606.95) 766184
TATA GLOBAL 156.00 (162.10) 2470478
TATA METALIK 607.45 (647.25) 157016
TATA TELESER 6.60 (6.95) 2637142
THE INDIAN H 124.75 (126.15) 305563
TORRENT POWE 189.30 (195.50) 1286165
TRIVENI ENGG 88.30 (94.05) 2730253
TTK PRESTIGE 6179.95 (6194.05) 2392
TV TODAY NET 216.45 (228.55) 246230
TV18 BROADCA 35.35 (36.45) 3644861
TVS MOTOR 580.75 (590.70) 1369241
UCO BANK 30.50 (31.85) 521138
UNION BANK 134.45 (141.60) 4981645
UNITECH 7.40 (7.85) 55545462
UNITED BANK 18.75 (18.95) 1086947
USHA MARTIN 18.90 (20.40) 1165020
VADILAL INDU 864.85 (892.75) 30274
VENKYS 1816.30 (2100.15) 433169
V-GUARD IND 173.45 (179.35) 851993
VIJAYA BANK 67.50 (67.85) 1293475
VIP 183.80 (190.05) 464592
VOLTAS 520.15 (527.60) 1088376
ZEE LEARN LI 39.85 (41.45) 452049
ZUARI GLOBAL 120.85 (126.95) 10280
ZYDUS WELLNE 882.10 (885.05) 6253

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AMAR RAJA BA 798.85 (802.45) 18169
ANDHRA BANK 50.85 (54.15) 345820
ANDHRA CEMEN 8.81 (9.06) 46075
ANDHRA PAPER 283.25 (299.70) 12067
ANDHRA PETRO 24.90 (25.60) 59902
ANDHRA SUGAR 319.75 (332.95) 5390
ASTRA MICROW 120.65 (126.75) 45778
AUROBINDO PH 683 (684.15) 940187
AVANTEL SOFT 214.30 (223.20) 6852
AVANTI FEEDS 1573.40 (1703.90) 51203
AVON ORG 5.42 (5.90) 8028
BALAJI AMIN 300.80 (322.85) 9273
BARTRONICS 13.65 (14.40) 26283
BN RATHI SEC 30.55 (31.85) 8457
BRILLIANT SE 7.59 (7.78) 1431407
COROMAN FERT 404.15 (424.65) 34555
DIVI'S LAB 624.65 (638.90) 172332
DR REDDY 1948.95 (2046.65) 186906
GATI CORPN 109.50 (114.30) 129958
GMR INFRASTR 15.90 (16.95) 3012669
GOLDST INFRA 102.20 (92.95) 108190
GOLDSTONE EN 11.62 (12.23) 10111
GRANULES (I) 107.30 (116.90) 317092
GSS AMERICA 20 (19.80) 8650
GVK POWER 12.05 (12.93) 3219496
HBL NIFE POW 43.90 (44.75) 70572
HYD INDUS 984.70 (1039.75) 6252
ILFS ENGINEE 39.75 (42.25) 18672
INCAP 51.10 (50.65) 6827
INNAREDY COM 2.70 (2.87) 13800
IVRCL INFRAS 5.39 (5.69) 446729
JEEVAN SCIEN 39.15 (39.60) 23041
KAKATIYA CEM 337.55 (365.75) 9297
KALLAM SPG 27.80 (28) 120673
KAVERI SEED 531.50 (607.80) 166273
KCP LTD 96.10 (100.15) 38802
KERNEX MICRO 33.25 (34.10) 57270
KREBS BIO 94.70 (99.65) 7637
LANCO INDUS 346.80 (362.80) 31446
LANCO INFRAT 1 (1.05) 841495
LAURUS LABS 525.65 (552.50) 14130
LOKESH MACH 77.10 (79.70) 23974
MADHUCON PRO 28.65 (29.95) 54101
MEGA SOFT 14.10 (14.75) 19727
MIC ELECTRON 7.38 (7.75) 73477
NAGARJAGRICH 31.10 (33.70) 57979
NATCO PHARMA 696.65 (830.60) 580031
NAVA BH VENT 121.70 (125.65) 63537
NCC 82.35 (89.65) 545216
NCL IND 200.40 (207.05) 30331
NEHA INTER 5.54 (5.54) 15526
NETTLINX 110.90 (107.15) 13745
NIHAR INFO 13.65 (17) 130
NILE 613.85 (621.55) 11599
PANKAJ POLY 10.51 (10.01) 10841
PANYAM CEMEN 56.80 (60.60) 27461
PENNER IND 49.40 (51.15) 94182
PHYTOCHEM I 50.10 (55.45) 12746
PITTI LAMIN 47.75 (50.95) 12461
PRAJAY ENGS 8.57 (9.02) 11443
PRISM CEMENT 113.60 (117.60) 19833
PRUDENTL PHA 4.09 (4.19) 130099
RAIN INDUSTR 112 (131.60) 778473
RAJ PACKAGIN 53.95 (55.20) 23799
SAMKRG PIST 251.60 (263.10) 15840
SATVAH. ISPA 37.50 (40.75) 10176
SOUTH BIO TE 3.06 (3.55) 159215
SREE RAYAL A 26 (28.20) 482844
STEEL EXCHAN 84.45 (82.85) 277280
SUJANA METAL 1.50 (1.76) 330604
SUJANA TOWER 3.80 (4.20) 11800
SUJANA UNIVE 0.93 (1.01) 114041
SURANA TELE 4.62 (4.80) 7547
SURYALAKSH.C 100.35 (103.75) 14130
SUVEN PHARMA 160.60 (164.65) 71021
TANLA 31.20 (33.15) 138723
TERA SOFTWAR 65.15 (66.10) 8651
TRANS BIOTEK 2.13 (2.22) 39607
TRENDY KNIT 0.19 (0.20) 10250
VICEROY HOTE 17.20 (18.30) 43224
VIJAY TEXTIL 57.90 (60.90) 18972
VISAKA IND 431.25 (459.85) 9974
VISTA PHARMA 29.15 (30.65) 67616
VIVIMED LABS 109.35 (116.55) 186848
YBRANT DIGIT 6.61 (6.81) 118725
ZENOTECH LAB 45.05 (47.40) 61388
ZENTECH 50.70 (54.05) 30549

అస్థిర వ్యాపారులకూ జీఎస్టీ నమోదు

దిల్లీ: అస్థిర (క్యాజువల్) వ్యాపారులు కూడా జీఎస్టీ కింద నమోదు చేసుకునే సదుపాయాన్ని జీఎస్టీ నెట్‌వర్క్ (జీఎస్టీఎన్) ప్రారంభించింది. అస్థిర వ్యాపారులు అంటే సందర్భానికి అనుగుణంగా వ్యాపారం నిర్వహించేవారు. వీరికి స్థిరమైన వ్యాపారకేంద్రం ఉండదు. వీరి రిజిస్ట్రేషన్ 90 రోజులు మాత్రమే వర్తిస్తుందని జీఎస్టీఎన్ ఛైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. గడువు తీరాక మరో 90 రోజుల వరకు రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించుకోవచ్చు. 'వ్యాపార ప్రారంభానికి కనీసం ఐదు రోజుల ముందు క్యాజువల్ పన్ను చెల్లింపుదార్లు నమోదుకావాల'ని కుమార్ తెలిపారు. సాధారణ పన్ను చెల్లింపుదార్ల మాదిరి నమోదు చేసుకోవడంతో పాటు వ్యాపారం చేయని నెలల్లో శూన్య (నిల్) రిటర్న్‌లను సమర్పించాల్సి ఉంటుంది.



రోమింగ్‌లోనూ స్థానిక ఆఫర్లు: బీఎస్ఎన్ఎల్

దిల్లీ: ఒక టెలికాం సర్కిల్ పరిధిలోని చందాదార్లకు, టెలికాం సంస్థలు ప్రత్యేక ఆఫర్లు ఇస్తుంటాయి. ప్రత్యేక టారిఫ్ ఓచర్లతో, కాల్స్, సంక్షిప్త సందేశాలు (ఎస్ఎంఎస్) వంటివాటిలో రాయితీలు లభిస్తాయి. సర్కిల్ దాటితే ఇవి వర్తించవు. ఇప్పటికే దేశవ్యాప్తంగా రోమింగ్ ఛార్జీలు రద్దు చేసిన బీఎస్ఎన్ఎల్ ఇప్పుడు తన చందాదార్లకు, ఈ అవకాశం కూడా కల్పించనుంది. స్థానిక సర్కిల్‌లో వర్తించే ఆఫర్లే రోమింగ్‌లో కూడా వర్తింప చేస్తామని, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15 నుంచి అమలు చేస్తామని బీఎస్ఎన్ఎల్ బోర్డ్ డైరెక్టర్ ఆర్‌కే మిత్తల్ తెలిపారు.

ఇంటి వద్దకే విడి భాగాలు

- అశోక్ లేలాండ్ ఎండీ వినోద్ దాసరి
- నాలుగు మొబైల్ యాప్‌లు విడుదల



ముంబయి: విక్రయానంతర సేవల ద్వారా లభించే ఆదాయాన్ని రూ.4,000 కోట్లకు పెంచుకోవాలని అశోక్ లేలాండ్ భావిస్తోంది. ఇందులో భాగంగా ట్రక్కుల కోసం నాలుగు రకాల మొబైల్ యాప్‌లు తీసుకొచ్చింది. ఇందులో ఒకటి ఐఅలర్ట్.. ట్రక్కు ప్రయాణించే మార్గంతోపాటు దాని పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే యజమాని మొబైల్‌కు సందేశాన్ని పంపుతుంది. రెండోది సర్వీస్‌మండి.. సుశిక్షితులైన, నైపుణ్యం కలిగిన మెకానిక్‌లు, ఆయా సేవలకు వసూలు చేసే ధరలు వంటి వాటిని ఈ యాప్ తెలుపుతుంది. 3,000 మంది మెకానిక్‌లు ఇప్పటికే ఇందులో నమోదు చేసుకున్నారు. ఈ సంఖ్యను మరో రెండేళ్లలో 20,000కు పెంచేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోంది. మూడోది ఇ-డయాగ్నోస్టిక్స్. మరమ్మతుకు సంబంధించి దృశ్యపరమైన సలహాలు ఈ యాప్ ఇస్తుంది. నాలుగోది లేకార్ట్. అసలైన విడిభాగాలను రోజులో ఎప్పుడైనా కొనుగోలు చేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఇంటి వద్దకే విడిభాగాలను సరఫరా చేసే వెసులు బాటు కూడా ఉంది. రానున్న 5 ఏళ్లలో ఈ యాప్‌ల ద్వారా దాదాపు రూ.1,000 కోట్ల ఆదాయం వస్తుందని సంస్థ అంచనా వేస్తోంది. ప్రస్తుతం విక్రయానంతర సేవల ద్వారా రూ.1,000 కోట్ల ఆదాయం వస్తోందని దీన్ని రానున్న 3-5 ఏళ్లలో రూ.4,000 కోట్లకు పెంచుకోవాలని భావిస్తున్నట్లు అశోక్ లేలాండ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) వినోద్ దాసరి వెల్లడించారు.

మార్చిలోపు 10 వాణిజ్య వాహనాలు

టాటా మోటార్స్

ముంబయి: వాణిజ్య వాహనాల విపణిలో వాటా పెంచుకోవడంపై టాటా మోటార్స్ దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో మరిన్ని కొత్త వాహనాలు ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. మధ్య-భారీ తరహా వాణిజ్య వాహనాల్లో ఆరు రకాలు, ఇంటర్మీడియెట్ వాణిజ్య వాహనాల్లో నాలుగు రకాలు తీసుకురానున్నట్లు తెలిపింది. 2017-18లో తేలికపాటి, మధ్య-భారీ వాణిజ్య వాహనాల విభాగం 10 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగంలో వీటి అమ్మకాలు పుంజుకోవచ్చని అంచనావేస్తోంది. టియాగో, టిగోర్, హెక్సా వంటి వాహనాలు ప్రయాణికుల విభాగాన్ని మరింత బలోపేతం చేయగలవని అభిప్రాయపడింది.

మరో 150 ట్రూ వ్యాల్యూ కేంద్రాలు: మారుతీ

ముంబయి: వినియోగించిన కార్లను విక్రయించే 'ట్రూ వ్యాల్యూ' కేంద్రాలను నవీకరిస్తున్నామని, వచ్చే ఏడాది మార్చి వీటి సంఖ్యను 150కి చేరుస్తామని మారుతీ సుజుకీ ఇండియా తెలిపింది. రెండు, మూడేళ్లలో వీటి సంఖ్యను 300కు పెంచాలన్నది సంస్థ ప్రణాళికగా మారుతీ సుజుకీ విక్రయాలు, మార్కెటింగ్ విభాగ సీనియర్ కార్యనిర్వాహక డైరెక్టర్ ఆర్.ఎస్.కల్సీ అన్నారు. ఈ కేంద్రాల్లోని కార్ల వివరాలను పోర్టల్‌లో కూడా ఉంచడం ద్వారా, కొనుగోలుదార్లకు సులభంగా సమాచారం చేరుతుందని పేర్కొన్నారు. మూడేళ్లక్రితం 10 శాతంగా ఉన్న వినియోగించిన కార్ల కొనుగోళ్లు..గతేడాది 22 శాతం పెరిగాయి. ఈ ఏడాది ఇవి 30శాతానికి చేరవచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ కేంద్రాల ద్వారా గతేడాది 3.50 లక్షల వినియోగ కార్లను సంస్థ విక్రయించింది.

స్కోడాకు టాటా

- భాగస్వామ్యం వద్దనుకున్న దిగ్గజం
- ప్రయోజనాలు తక్కువనే అంచనాలే కారణం



దిల్లీ: ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్‌నకు చెందిన స్కోడాతో జట్టు కట్టడానికి టాటా మోటార్స్ వెనుకడుగు వేసింది. మనుగడ సాధ్యాసాధ్యాలను అంచనా వేసుకున్నాక ఈ నిర్ణయానికి వచ్చినట్లు గురువారం ప్రకటించింది. నాలుగు నెలల క్రితం ప్రతిపాదిత భాగస్వామ్యం కోసం కుదుర్చుకున్న ఒప్పందం అలా ముగిసింది. ఇరు కంపెనీలు నిర్వహించిన సంయుక్త సాంకేతిక సాధ్యాసాధ్యాల సర్వే ప్రకారం.. అనుకున్న దాని కంటే ఇరు కంపెనీలకు వ్యూహాత్మక ప్రయోజనాలు తక్కువ స్థాయిలోనే ఉండొచ్చని తేలింది. దీంతో కొద్ది నెలలుగా సాగిన చర్చలు ముగిశాయని.. అయితే భవిష్యత్‌లో భాగస్వామ్యాలకు ఇది అడ్డుకోబోదని టాటా మోటార్స్ సీఈఓ, ఎండీ గుంటర్ బుషెక్ ఒక ప్రకటనలో తెలిపారు.

'అటు సాంకేతికంగా చూసినా.. ఇటు ఆర్థికంగా చూసినా ఇరు కంపెనీలకు ప్రయోజనం కలిగించేలా ఈ ఒప్పందం కనిపించలేదు. అందువల్ల ప్రస్తుతానికి భాగస్వామ్యం వద్దనుకున్నామ'ని చెక్ రిపబ్లిక్‌కు చెందిన స్కోడా ఆటో ఒక ప్రకటనలో తెలిపింది.

ఇదీ నేపథ్యం: దీర్ఘకాల భాగస్వామ్యంలోకి అడుగుపెట్టనున్నట్లు ఈ ఏడాది మార్చిలో టాటా మోటార్స్, ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్‌నకు చెందిన స్కోడా ప్రకటించాయి. 2019 కల్లా తొలి ఉత్పత్తిని తీసుకువచ్చేలా సంయుక్తంగా కార్లను అభివృద్ధి చేస్తామని తెలిపాయి. టాటా మోటార్స్‌తో కలిసి అందుబాటు ధరలో వాహనాలను అభివృద్ధి చేయడానికి ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ తరఫున స్కోడా ఆటో ముందుకు వచ్చింది. అయితే జూన్‌లో ఈ ఒప్పందంపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి? వ్యాపారం రాణిస్తుందా? అన్న అంశాలపై ఇరు వర్గాలకు భేదాభిప్రాయాలు వచ్చాయి. దీంతో ప్రతిపాదిత భాగస్వామ్యానికి తెరపడింది.

వజ్రం కావాలా.. నాయనా!

- నెలకు రూ.900 కట్టండి చాలు
- ప్రపంచంలోనే తొలిసారి వజ్రాల ట్రేడింగ్
- ప్రారంభించనున్న ఇండియన్ కమొడిటీ ఎక్స్ఛేంజ్

ముంబయి



వజ్రాలు కొనడం అంటే మాటలు కాదు. అయితే అత్యంత నాణ్యత గల వజ్రాలను నెలకు కేవలం రూ.900 చొప్పున చెల్లించి సొంతం చేసుకునే అవకాశాన్ని ఇండియన్ కమొడిటీ ఎక్స్ఛేంజ్(ఐసీఈఎక్స్) తీసుకువస్తోంది. రిటైల్ మదుపర్లు ఈ విధంగా క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక(సిప్) ద్వారా రెండున్నరేళ్ల పాటు వాయిదాలు చెల్లిస్తే ఓ వజ్రం సొంతం అవుతుందన్నమాట.

ఇప్పటిదాకా భారత మదుపర్లు మ్యూచువల్ ఫండ్‌లు లేదా బంగారం ఫండ్‌లలో మాత్రమే సిప్ ద్వారా పెట్టుబడులు పెడుతూ వచ్చారు. ప్రపంచంలోనే తొలిసారిగా వజ్రాలను సైతం సిప్ పద్ధతిలో కొనుగోలు చేయడానికి అవకాశం రావడం విశేషమని ఐసీఈఎక్స్ అధికారులు అంటున్నారు. ప్రపంచంలోనే తొలి వజ్రాల ట్రేడింగ్ ఎక్స్ఛేంజీ సైతం ఐసీఈఎక్స్ కావడం గమనార్హం.

ఇలా కొనుగోలు చేయవచ్చు

- ✦ వజ్రాల సిప్ పథకం కింద.. కొనుగోలు దారు ఐసీఈఎక్స్‌లో బ్రోకరేజీ సంస్థ ద్వారా ఖాతా ప్రారంభించాలి.
- ✦ బ్రోకరు వద్ద కొంత నగదు జమ చేయాలి. ప్రతి నెలా ఏ తేదీన కొనుగోలు చేయాలన్నదీ కూడా తెలిపాలి.
- ✦ ఐసీఈఎక్స్ ప్రస్తుతానికి మూడు పరిమాణాల్లో వజ్రాల కాంట్రాక్టులను తీసుకురానుంది. అవి.. 30 సెంట్లు, 50 సెంట్లు, 100 సెంట్లు(ఒక క్యారెట్).
- ✦ స్టాక్ మార్కెట్ తరహాలోనే ఈ వజ్రాల కాంట్రాక్టుల ట్రేడింగ్ సైతం ఎలక్ట్రానిక్ రూపం(డీమ్యాట్)లోనే జరుగుతుంది.
- ✦ కనీసం 30 సెంట్లు తమ ఖాతాలో పడ్డ తర్వాతే ఖాతాదారు ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న వజ్రాన్ని.. భౌతికంగా మార్చుకోవడానికి వీలుంటుంది.

ఈ నెలాఖరులో నమూనా ట్రేడింగ్‌ను ఐసీఈఎక్స్ ప్రారంభించనుంది. ప్రస్తుత ధరల వద్ద 30 సెంట్ల వజ్రం ఖరీదు రూ.27,000గా ఉంది. అంటే 30 నెలల పాటు నెలకు రూ.900 చెల్లిస్తే ఆ మేరకు వజ్రం మన చేతుల్లోకి వస్తుంది. నెలవారీ సిప్ ధర.. ఎక్స్ఛేంజీలో వజ్రం ధరపై ఆధారపడి ఉంటుందన్నది గుర్తుంచుకోవాలి.

ఫ్లిప్‌కార్ట్‌లోకి సాఫ్ట్‌బ్యాంక్

రూ.16,250 కోట్ల పెట్టుబడులు

- 20 శాతం దాకా వాటా వశం
- స్నాప్'డీల్' కుదరని నేపథ్యం
- భారత ఇ-కామర్స్ రంగంలో అతిపెద్ద పెట్టుబడి ఇదే



దిల్లీ

అందరూ అనుకున్నట్లే జరిగింది. స్నాప్'డీల్' ద్వారా ఫ్లిప్‌కార్ట్‌లో పరోక్షంగా పెట్టుబడులు పెట్టాలనుకున్న సాఫ్ట్‌బ్యాంక్‌కు, ఆ అవకాశం రాలేదు. ఇక నేరుగానే ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టుబడులు పెడుతుందని రెండు వారాల కిందట అందరూ భావించారు. ఇపుడు అదే జరిగింది.

2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.13,000 కోట్ల) మేర పెట్టుబడులు పెట్టొచ్చని అంచనా వేసినా, అంతకు మించి అంటే 2.5 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.16,250 కోట్లు) పెట్టుబడులను ఫ్లిప్‌కార్ట్‌లోకి పంపింది. భారత టెక్నాలజీ కంపెనీల్లోకి వచ్చిన అతిపెద్ద ప్రైవేటు పెట్టుబడి ఇదే కావడం గమనార్హం.

సాఫ్ట్‌బ్యాంక్ ఏర్పాటు చేసిన సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ తమ కంపెనీలో భారీ పెట్టుబడులు పెట్టిందని ఫ్లిప్‌కార్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఒప్పందానికి దగ్గరి సంబంధమున్న వ్యక్తుల సమాచారం మేరకు 2.5 బిలియన్ డాలర్లలో.. 1.5 బిలియన్ డాలర్లను నేరుగా ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టుబడులు పెడుతుంది. మరో 1 బిలియన్ డాలర్లను, ఫ్లిప్‌కార్ట్‌లో టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్స్‌కు ఉన్న వాటాలో కొంత భాగాన్ని కొనడానికి వినియోగిస్తుంది. మొత్తం మీద సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్‌కు ఫ్లిప్‌కార్ట్‌లో 20 శాతం దాకా వాటా దక్కుతుందని వారంటున్నారు. తాజా పెట్టుబడులతో ఫ్లిప్‌కార్ట్ నగదు నిల్వలు 4 బిలియన్ డాలర్లకు చేరతాయి.

ఫ్లిప్‌కార్ట్‌లోకి ఇవీ పెట్టుబడులు

ఈ ఏడాది ఏప్రిల్‌లో ఫ్లిప్‌కార్ట్ ప్రకటించిన నిధుల సమీకరణలో తాజా పెట్టుబడులు ఒక భాగంగా చెప్పొచ్చు. టైగర్ గ్లోబల్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే టెన్సెంట్, మైక్రోసాఫ్ట్, ఇబేల నుంచి 1.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాబట్టుకుంది. ఆ సమయంలో కంపెనీ విలువ 11.6 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. తాజా పెట్టుబడులతో ఇప్పటిదాకా కంపెనీ సమీకరించిన నిధుల విలువ 5 బిలియన్ డాలర్లకు చేరింది.

అంతక్రితం ఏం జరిగిందంటే..

స్నాప్‌డీల్‌ను ఫ్లిప్‌కార్ట్‌లో విలీనం చేయడానికి సాఫ్ట్‌బ్యాంక్ బాగా ప్రయత్నించింది. స్నాప్‌డీల్‌లో సాఫ్ట్‌బ్యాంక్‌కు వాటా ఉండటం ఇందుకు నేపథ్యం. తద్వారా ఫ్లిప్‌కార్ట్‌లోనూ ఎంచదగ్గ రీతిలో వాటా సొంతం చేసుకోవాలని భావించింది. అయితే స్నాప్‌డీల్ బోర్డు విలీనానికి అంగీకరించకపోవడంతో ఫ్లిప్‌కార్ట్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టాలని సాఫ్ట్‌బ్యాంక్ నిర్ణయించుకుంది.

ఫ్లిప్‌కార్ట్‌కు మేలే

తాజా పెట్టుబడులతో అమెజాన్‌తో పోటీ పడడానికి ఫ్లిప్‌కార్ట్‌కు మరింత బలం చేకూరినట్లవుతుంది. స్నాప్‌డీల్‌ను విలీనం చేసుకోవాలని అనుకున్నది కూడా అమెజాన్‌తో పోటీపడడం కోసమే. ఒక అంచనా ప్రకారం.. దేశీయంగా ఇంటర్నెట్ వినియోగిస్తున్న వారు 50 కోట్ల మంది. వీరిలో యువతే ఎక్కువ కనుక, ఏటా 30 శాతం సమ్మిళిత వృద్ధితో ఇ-కామర్స్ మార్కెట్ వృద్ధి చెందడానికి అవకాశం ఉంది. తాజా పెట్టుబడుల వల్ల ఫ్లిప్‌కార్ట్ బ్యాలెన్స్ షీట్ బలోపేతమై.. మార్కెట్ వాటా పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని కంపెనీయే చెబుతోంది. ఆన్‌లైన్లో విక్రేతలు, కొనుగోలుదార్ల సంఖ్యను పెంచుకోడానికి మౌలిక వసతుల కల్పన కోసం అటు అమెజాన్.. ఇటు ఫ్లిప్‌కార్ట్ లక్షల కొద్దీ డాలర్లను వెచ్చిస్తున్నాయి. ఈ ఏడాది ఫ్లిప్‌కార్ట్ 4 బిలియన్ డాలర్లను సమీకరించగా.. అమెజాన్ ఈ ఏడాదిలో భారత్‌లోని వివిధ ఇభాగాల్లో 600 మిలియన్ డాలర్లను వెచ్చించింది.

మరి సాఫ్ట్‌బ్యాంక్‌కు..

భారత్‌లో గెలుపుగుర్రాలపై పెట్టుబడులు పెట్టడమే తమ అభిమతమని సాఫ్ట్‌బ్యాంక్ అంటోంది. తద్వారా తానూ లబ్ధి పొందాలని చూస్తోంది. జపాన్‌కు చెందిన టెలికమ్యూనికేషన్, ఇంటర్నెట్ దిగ్గజ సంస్థ అయిన సాఫ్ట్‌బ్యాంక్ భారత్‌లోని పలు అంకుర సంస్థల్లో పెట్టుబడులు పెట్టింది. స్నాప్‌డీల్, ఓలా వంటి వాటిలో 2014లోనే 10 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.65,000 కోట్లు) పెట్టుబడులు పెట్టింది. ఈ ఏడాది మేలోనూ 1.4 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.9079 కోట్లు)ను పేటీఎమ్ కోసం వెచ్చించింది. యాపిల్, ఫాక్స్‌కాన్, పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ఆఫ్ కింగ్‌డమ్ ఆఫ్ సౌదీ అరేబియా వంటివి సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్‌లో భాగస్వాములుగా ఉన్నాయి.

> **ఇది ఫ్లిప్‌కార్ట్‌కు, భారత్‌కు మరవలేని ఒప్పందం. అంతర్జాతీయంగా కేవలం కొన్ని దేశాలే ఇటువంటి దిగ్గజ పెట్టుబడుదార్లను ఆకర్షించగలవు.**
>
> - ఫ్లిప్‌కార్ట్ సహ-వ్యవస్థాపకులు బిన్నీ బన్సాల్, సచిన్ బన్సాల్

యాంబీ వ్యాలీ వేలాన్ని నిలిపివేయం: సుప్రీం

సుబ్రతా రాయ్‌కి నిరాశ

దిల్లీ: సహారా గ్రూప్ అధిపతి సుబ్రతా రాయ్‌కు నిరాశ ఎదురైంది. గ్రూప్‌నకు చెందిన యాంబీ వ్యాలీ ప్రాజెక్టు (విలువ దాదాపు రూ.34,000 కోట్లు)ను వేలం వేయకుండా నిలిపివేయాలన్న రాయ్ విజ్ఞప్తిని సుప్రీం కోర్టు గురువారం తోసిపుచ్చింది. వేలం ప్రక్రియను నిలిపివేసినా లేదా వాయిదా వేసినా.. రూ.1500 కోట్లు జమ చేస్తామన్న రాయ్ ప్రతిపాదన నమ్మశక్యంగా లేదని న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. వేలం ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని.. ఒక వేళ సెప్టెంబరు 7కల్లా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ)-సహారా ఖాతాలో రూ.1500 కోట్లు జమ చేస్తే.. అప్పుడు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపింది. ఆగస్టు 14 నుంచి యాంబీ వ్యాలీ వేలం ప్రక్రియ మొదలవుతుందని.. కనీసం సెప్టెంబరు 16 నాటికి వాయిదా వేస్తే, అప్పటికి నగదు సర్దుబాటు చేసుకోవడానికి వీలవుతుందని రాయ్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. న్యూయార్క్‌లోని హోటళ్లను విక్రయిస్తున్నారని.. సహారా ఖాతాలోకి నగదు వచ్చిన వెంటనే సెబీ-సహారా రిఫండ్ ఖాతాలోకి సెప్టెంబరు 7 కల్లా రూ.1500 కోట్లు జమ చేస్తామని ఆయన అన్నారు. అయితే ప్రక్రియ మొదలవుతున్న ప్రతి సారీ ఏదో ఒక కారణం చూపుతూ, ఆలస్యం చేయాలని సహారా చూస్తోందని సెబీ తరఫు న్యాయవాది అరవింద్ దాటర్ కోర్టుకు తెలిపారు. ఈ వాదనలు విన్న అనంతరం తాము ఎటువంటి ఆదేశాలను జారీ చేయట్లేదని.. వేలం ప్రక్రియను నిలిపివేయడం కానీ.. వాయిదా వేయడం కానీ జరగదని ధర్మాసనం స్పష్టం చేసింది.

మైజియో యాప్.. 10 కోట్ల డౌన్‌లోడ్లు

దిల్లీ: రిలయన్స్ జియోకు చెందిన 'మై జియో' అప్లికేషన్ దేశంలోనే అత్యధికంగా డౌన్‌లోడ్ చేసుకున్న రెండో యాప్‌గా రికార్డు సృష్టించినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫాం ద్వారా ఏడాదిలోపే 10కోట్ల మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సమాచారం. ఇదేవిధంగా టీవీ యాప్ 'జియో టీవీ'ని 5 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని వెల్లడించారు. ఇప్పటివరకు అత్యధికంగా డౌన్‌లోడ్ అయిన యాప్‌గా 'హాట్ స్టార్' మొదటి స్థానంలో ఉంది.

దర్యాప్తు చేయకుండానే ఆదేశాలా?

- సెబీ తీరు సరికాదన్న శాట్
- జేకుమార్ ఇన్‌ఫ్రా, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌పై ఆంక్షలు నిలిపివేత
- నేటి నుంచి షేర్ల ట్రేడింగ్ యథాతథం



కోల్‌కతా డొల్ల కంపెనీల పన్ను బకాయిలు రూ.40,000 కోట్లు!

కోల్‌కతా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న డొల్ల కంపెనీలు దాదాపు రూ.40,000 కోట్ల వరకు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉందని ఆదాయపు పన్ను విభాగ వర్గాలు వెల్లడించాయి. ఈ తరహా కంపెనీలు ఇక్కడ వేల సంఖ్యలో ఉండొచ్చని అంచనా. ప్రభుత్వం గుర్తించిన 331 అనుమానిత డొల్ల కంపెనీల్లో 150కి పైగా కోల్‌కతాకు చెందినవే కావడం గమనార్హం. మూడేళ్ల క్రితమే కోల్‌కతాలోని డొల్ల కంపెనీలపై దర్యాప్తును ఆదాయపు పన్ను విభాగం ప్రారంభించింది. ప్రస్తుతం దర్యాప్తు చాలా వరకు పూర్తయ్యింది. అలాగే ఈ కంపెనీలకు సంబంధించి పన్ను కేసులు అప్పిలేట్ ట్రైబ్యునల్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు కోల్‌కతాలో ఈ తరహా కంపెనీలకు అండగా నిలుస్తోన్న చార్టర్డ్ అకౌంటెంట్లపైనా ఆదాయపు పన్ను విభాగం చర్యలు చేపట్టింది.

ముంబయి: జేకుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌కు ఊరట లభించింది. ఈ రెండు కంపెనీల షేర్ల ట్రేడింగ్‌పై ఎక్స్ఛేంజీలు విధించిన ఆంక్షలను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) నిలిపివేసింది. దీంతో నేటి నుంచి ఈ షేర్ల ట్రేడింగ్ యథాతథంగా కొనసాగనుంది. ప్రభుత్వం గుర్తించిన 331 అనుమానిత డొల్ల కంపెనీల ట్రేడింగ్‌పై పరిమితులు విధించాలంటూ ఎక్స్ఛేంజీలకు సెబీ సూచించిన సంగతి తెలిసిందే. ఈ 331 కంపెనీల్లో జేకుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, ప్రకాశ్ ఇండస్ట్రీస్ కూడా ఉన్నాయి. అయితే సెబీ ఆదేశాలను సవాలు చేస్తూ ఈ రెండు కంపెనీలు శాట్‌ను ఆశ్రయించాయి. వీటి అప్పీళ్లను పరిశీలించిన అనంతరం ట్రేడింగ్ ఆంక్షలపై శాట్ స్టే విధించింది. పైగా ఎటువంటి దర్యాప్తు చేయకుండానే షేర్ల ట్రేడింగ్‌పై ఆంక్షలు విధిస్తూ, సెబీ ఆదేశాలు జారీ చేసిందని శాట్ అభిప్రాయపడింది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గుర్తించిన 331 సంస్థలు అనుమానిత డొల్ల కంపెనీలుగా నిర్ధరించే ముందు సెబీ కనీస దర్యాప్తు నిర్వహించాల్సిన అవసరం ఉందని 11 పేజీల ఆర్డరులో శాట్ పేర్కొంది. 'మంత్రిత్వ శాఖ నుంచి జాబితా వచ్చిన రెండు నెలల్లో సెబీ ఆదేశాలు జారీ చేసింది. కంపెనీల మూలాలు, వాస్తవాలు పరిశీలించకుండా అత్యవసరంగా ఆదేశాలు జారీ చేయాల్సిన పరిస్థితి లేదనే విషయం స్పష్టమవుతోంద'ని తెలిపింది. ఆదేశాలను వెనక్కి తీసుకోవాల్సిందిగా ఎక్స్ఛేంజీలను శాట్ ఆదేశించింది. దీంతో నేటి నుంచి ఈ రెండు కంపెనీల షేర్ల ట్రేడింగ్ నేటి నుంచి కొనసాగుతుందని బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు కూడా తెలిపాయి. 'తీర్పు ఆలస్యమయ్యే కొద్దీ సెక్యూరిటీస్ మార్కెట్లో ఈ కంపెనీలకున్న పేరుకు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉన్నందున, వీటి ఫిర్యాదులను స్వీకరించి తాత్కాలిక ఊరటనిస్తూ ఆదేశాలు జారీ చేశామ'ని ట్రైబ్యునల్ తెలిపింది. సెప్టెంబరు 4న తదుపరి విచారణను శాట్ చేపట్టనుంది.

దర్యాప్తు నిర్వహించలేదు..

డొల్ల కంపెనీలపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలను మాత్రమే తాము అమలు చేశామని, స్వతంత్ర దర్యాప్తేదీ నిర్వహించలేదని సెబీ అంగీకరించింది. తమకు వివరణ ఇచ్చుకునే అవకాశం లేకుండా సెబీ ఆదేశాలు జారీ చేసిందని కంపెనీలు పేర్కొన్నాయి. మొత్తం 331 కంపెనీల్లో 160కి పైగా కంపెనీల షేర్లు స్టాక్ మార్కెట్‌లో చురుకుగా ట్రేడయ్యేవే కావడం గమనార్హం.

మరో రెండు కంపెనీల పిటిషన్లపై విచారణ నేడు: డొల్ల కంపెనీలుగా వర్గీకరించడంతో పాటు షేర్ల ట్రేడింగ్‌పై పరిమితులు విధించడాన్ని సవాలు చేస్తూ పార్శ్వనాథ్ డెవలపర్స్, కవిత్ ఇండస్ట్రీస్‌లు కూడా శాట్‌ను ఆశ్రయించాయి. ఈ అప్పీళ్లపై నేడు శాట్ విచారణ చేపట్టనుంది.

సంప్రదాయేతర విద్యుత్‌తో యూపీఎస్‌లకు గిరాకీ

ఈనాడు, హైదరాబాద్: సౌర విద్యుత్ వంటి సంప్రదాయేతర ఇంధనాల వాడకం పెరుగుతున్నందున దేశంలో యూపీఎస్ (అన్‌ఇంటరప్టబుల్ పవర్ సప్లై యూనిట్లు)లకు కనీసం వచ్చే అయిదేళ్లు గిరాకీ పెరగనుంది. దేశంలో బ్యాటరీలతో కలిపి యూపీఎస్ మార్కెట్ విలువ రూ.5,000 కోట్ల వరకూ ఉంటుందని, ఒక్క యూపీఎస్‌లనే తీసుకుంటే రూ. 2,500 కోట్లని జర్మనీ కంపెనీ లెగ్రాకు చెందిన యూపీఎస్‌ల తయారీ సంస్థ న్యూమరిక్ ఇండియా ముఖ్య అమ్మకాల అధికారి (సీసీఓ) పలాశ్ నందీ తెలిపారు. 'ఈ మార్కెట్ ఏడాదికి 5-7 శాతం వృద్ధి చెందుతోంది. డిజిటల్ టెక్నాలజీల వినియోగం, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ వ్యయం, అత్యాధునిక రిటైల్ రంగం, ఆరోగ్య సంరక్షణ రంగాలు వంటివి యూపీఎస్ విక్రయాలు పెరగడానికి దోహదం చేస్తున్నాయి. విలువ పరంగా సంఘటిత రంగంలో 65 శాతం మార్కెట్ ఉందన్నా'రు. అవసరాలను బట్టి గృహాలలో వినియోగించే చిన్న యూపీఎస్‌లతోపాటు సింగిల్, ట్రిపుల్ ఫేజ్, మాడ్యులర్ రకం యూపీఎస్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని, కంపెనీలు, సంస్థలు, పరిశ్రమల అవసరాల కారణంగా మొత్తం విక్రయాల్లో 50 శాతం వాటా ట్రిపుల్ ఫేజ్ యూపీఎస్‌లదేనని నందీ అన్నారు. కంపెనీకి చెందిన కొత్త శ్రేణి ట్రిపుల్ యూపీఎస్‌లను విడుదల చేయడానికి వచ్చిన సందర్భంగా ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. సాధారణంగా యూపీఎస్ జీవిత కాలం 8 సంవత్సరాలు ఉంటుందని, సర్వీసు సదుపాయాలు, అవగాహన, మరింత చిన్నవైన యూపీఎస్‌లు అందుబాటులోకి రావడం వంటి కారణాలతో వినియోగదారులు 4-5 ఏళ్లకే యూపీఎస్‌లను మార్చి వేస్తున్నారని తెలిపారు. న్యూమరిక్‌కు దేశీయ మార్కెట్‌లో 12-15 శాతం వాటాఉందని, ప్రధానంగా 25 కంపెనీల వరకూ యూపీఎస్‌లను విక్రయిస్తున్నాయని చెప్పారు.



తెలుగు సినిమా సరైన దారిలోనే వెళ్తోంది

"ప్రతిసారీ ఓ కొత్త కథని అందించడానికి ప్రయత్నిస్తున్నా. 'బాహుబలి 2', 'ఘాజీ' ఈ యేడాది నాకు మంచి పేరు తీసుకొచ్చాయి. 'నేనే రాజు నేనే మంత్రి' కొత్త దారిలో నడిచే కథే" అంటున్నారు రానా. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమిది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు రానా.

తెలుగు సినిమా బలోపేతం అవుతున్నది సాంకేతికత పరంగానా? కథల పరంగానా?

కేవలం సాంకేతికత వల్ల సినిమాలు ఆడవు. అద్భుతమైన కథని ఇంకాస్త మెరుగ్గా చెప్పడానికి టెక్నాలజీ ఉపయోగపడుతుందంతే. సినిమాకి ఆత్మ కథ మాత్రమే. మన దగ్గర మంచి కథలు వస్తున్నాయి. అందుకే తెలుగు సినిమా గురించి మాట్లాడుకొంటున్నారు.

సొంత సంస్థలో సినిమా చేయడానికి ఇంత కాలం పట్టిందేంటి?

ఎప్పటి నుంచో అనుకొంటున్నాం. కానీ నాకూ, మా నాన్నగారికి ఉమ్మడిగా నచ్చే కథలు దొరకడం లేదు. నాకేమో కొత్త తరహా సినిమాలు చేయాలని ఉంటుంది. నాన్నేమో పక్కా కమర్షియల్ సినిమాల వైపు మొగ్గు చూపిస్తుంటారు. ఆ రెండు లక్షణాలూ ఈ కథలో కనిపించాయి.

తేజ ట్రాక్ రికార్డు గురించి ఆలోచించలేదా?

ట్రాక్ రికార్డులు పట్టించుకోను. 'బాహుబలి' తరవాత కొత్త దర్శకుడు సంకల్ప్‌తో చేశా కదా. అంతకు ముందు అతని అనుభవం ఏమిటి? ఐఫోన్‌లో సినిమా తీశాడంతే. దర్శకుడెవరైనా సరే ఎలాంటి కథ చెబుతున్నాడో చూడాలంతే. జోగేంద్ర జీవిత కథలో ఒడిదుడుకులు ఎన్నో ఉంటాయి. అలాంటి కథ రాయాలంటే చాలా అనుభవం కావాలి. తేజ గారు తప్ప ఇలాంటి కథ ఎవరూ రాయలేరు.

పొలిటికల్ డ్రామా అనగానే 'లీడర్'తో పోలికలు వస్తాయి కదా?

ఈ రెండు కథలకూ ఏమాత్రం సంబంధం లేదు. 'లీడర్'లో అర్జున్ ప్రసాద్ చాలా మంచోడు. సమాజానికి ఏదో చేయాలని ప్రయత్నిస్తాడు. 'నేనే రాజు నేనే మంత్రి'లో జోగేంద్ర అలా కాదు. అతనో వడ్డీ వ్యాపారి. సాధారణ జీవితం. కొన్ని పరిస్థితుల వల్ల రాజకీయాల్లోకి వస్తాడు. ఓ సామాన్యుడు రాజకీయాల్లోకి వెళ్తే ఎలా ఉంటుందో చూపిస్తున్నాం. ఇది రాజకీయాలకు సంబంధించిన కథ కాదు. రాధ - జోగేంద్రల ప్రేమ కథ.

తమిళనాడు రాజకీయాల్ని టచ్ చేసినట్టున్నారు..?

'వంద మంది ఎమ్మెల్యేలను తీసుకెళ్లి స్టార్ హోటెల్‌లో పెడితే సాయింత్రానికల్లా నేనూ అవుతా సీఎం' అనే డైలాగ్ అందరికీ కనెక్ట్ అయిపోయింది. అయితే మేం కావాలని ఆ డైలాగ్ వాడలేదు. ఆ సన్నివేశాన్ని మేం ఎప్పుడో అక్టోబరులో తీశాం. ఆ తరవాత తమిళనాట అదే జరిగింది. తమిళ డబ్బింగ్‌లో మాత్రం 'స్టార్ హోటెల్'కి బదులుగా 'రిసార్ట్' అని జోడించాం. దాంతో మరింత కనెక్ట్ అయిపోయారు.

కథానాయకుడు, ప్రతినాయకుడు... ఇలా రెండు పడవల ప్రయాణం చేస్తారా?

కొత్త తరహా సినిమాలు చేద్దామనే నటుడ్ని అయ్యా. చేసే పాత్ర నుంచి నేనేం నేర్చుకొంటున్నా అనేదే నాకు ముఖ్యం. ప్రతిసారీ ఒకే పాత్ర చేస్తూ వెళ్తే నాకూ మీకూ బోర్ కొట్టేస్తుంది.

డ్యాన్సులు, డ్యూయెట్లు మీకు పెద్దగా రుచించవా?

ఎందుకో ఓ సినిమా చూస్తున్నప్పుడు మధ్యలో పాట వస్తే... ఆ కథతో నాకు లింకు తెగిపోతుంది. అనవసరంగా పాట పెట్టారనిపిస్తుంది. ఆ పాట పూర్తయిన మరో అయిదు నిమిషాల వరకూ కథలోకి వెళ్లలేను. అందుకే నేనూ ఆ తరహా కథలు ఒప్పుకోలేను.

హాలీవుడ్‌లో ఓ సినిమా చేస్తానన్నారు...

ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. తొందర్లోనే ఓ స్పష్టత వస్తుంది.

ఒకేసారి మూడు సినిమాలు వస్తున్నాయి. ఈ వారం కాస్త పోటీ గట్టిగా ఉన్నట్టుంది..

పోటీ గురించి నేను పట్టించుకోను. నేను చేసే సినిమాలు ఇంకెవరూ చేయరన్నది నా బలమైన అభిప్రాయం. ఈ వారం మూడు సినిమాలొస్తున్నా ఒక సినిమాకీ మరో సినిమాకీ పోలిక లేదు. పైగా వరుసగా సెలవులు వస్తున్నాయి. నా చిన్నప్పుడు ఒకేసారి నాలుగైదు సినిమాలు వస్తోంటే సంబరపడిపోయేవాడ్ని. ఇప్పుడూ అలానే ఉంది.

నేనే రాజు నేనే మంత్రి' టైటిల్ వెనుక కథేంటి?


కథానాయకుడి పాత్ర చిత్రణకు తగ్గట్టే టైటిల్ ఉండాలని ముందు నుంచీ అనుకొంటూనే ఉన్నాం. 'రాధా జోగేంద్ర', 'జోగేంద్ర' ఇలా కొన్ని టైటిళ్లు అనుకొన్నాం. 'నేనే రాజు - నేనే మంత్రి' నా పాత్ర తత్వానికి దగ్గరగా ఉంటుందనిపించింది.

మీ సొంత సంస్థ నుంచి వస్తున్న సినిమా కాబట్టి మీమీద చాలా బాధ్యతలు ఉంటాయి కదా?

నేను నటుడిగానే చాలామందికి తెలుసు. అయితే తెర వెనుక సినిమాకి సంబంధించి చాలా పనులు కూడా నాకు వచ్చు. చాలా సినిమాలు కథల వల్ల కాదు, అనుకొన్న బడ్జెట్‌లో తీయకపోవడం వల్ల ఫ్లాప్ అవుతున్నాయి. ఆ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం.

విడుదలకు ముందే ఓ సినిమాకి లాభాలొస్తే విజయం సాధించినట్టేనా?

ఆర్థికంగా అది విజయమే కదా. తెలుగు అనే కాదు, ప్రపంచంలో ఎక్కడ చూసుకొన్నా విజయాల శాతం 5 మాత్రమే. హిందీ, తమిళ, కన్నడ, మలయాళ చిత్రాల విజయాల రేటు క్రమంగా తగ్గుతూ వస్తోంది. మనం మాత్రం ఆ 5 శాతాన్ని పెంచుకొంటూ వెళ్తున్నాం. 'బాహుబలి' లాంటి సినిమాల వల్ల థియేటర్ ఆక్యుపెన్సీ కూడా బాగా పెరిగింది. నిర్మాతలు ధైర్యంగా ముందడుగు వేయగలుగుతున్నారు. కొత్త కథలు చేయడానికీ, భారీ బడ్జెట్ చిత్రాలు రూపొందించడానికి ముందుకు వస్తున్నారు. దానికి తగ్గట్టే మంచి ఫలితాలు వస్తున్నాయి. ఇవన్నీ చూస్తుంటే తెలుగు చిత్రసీమ సరైన దారిలోనే వెళ్తోందనిపిస్తోంది.



శర్వానంద్

పొలాచ్చిలో 'మహానుభావుడు'

శర్వానంద్ కథానాయకుడిగా యూవీ క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. మెహరీన్ కథానాయిక. ఈ చిత్రానికి 'మహానుభావుడు' అనే పేరు ఖరారు చేశారు. ప్రస్తుతం పొలాచ్చిలో శర్వా, మెహరీన్, వెన్నెల కిషోర్ తదితరులపై 'ఎప్పుడు అయినా నీ రూపం..' అనే గీతాన్ని చిత్రీకరిస్తున్నారు. తమన్ స్వరపరిచిన ఈ పాటని సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించారు. దాదాపు మూడొంతుల చిత్రీకరణ పూర్తయింది. "భలే భలే మగాడివోయ్'లానే ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో సాగే సినిమా ఇది. మారుతి శైలిలోనే వినోదాత్మకంగా సాగుతుంది. 'మహానుభావుడు' అనే పేరు ఎందుకు పెట్టామో... సినిమా చూస్తే మీకే అర్థం అవుతుంద"ని చిత్రబృందం తెలిపింది.

గీతోపదేశం

ప్రేమించు
ప్రేమ పంచు
ప్రేమగా జీవించు
ద్వేషమెందుకు
సాటి మనిషిని
సోదరుడిగా ఆదరించు
హింసలెందుకు సమస్యలను
నవ్వుతూ పరిష్కరించు
క్రోధమెందుకు కరుణ పంచు
స్వార్థమెందుకు సహకరించు
పంతమెందుకు పలకరించు
కక్షలెందుకు కౌగిలించు

గీతం: దేశమంటే...
చిత్రం: ఝుమ్మంది నాదం
రచన: చంద్రబోస్
- పంపినవారు: లక్ష్మీదాస్, సికింద్రాబాద్

పంచ్ డైలాగ్

సింహం, చీమ యుద్ధంలో వెనుతిరగవు. సింహం చచ్చేవరకు కొట్టి కొట్టి చంపుతుంది. చీమ చచ్చేవరకు కుట్టి కుట్టి చంపుతుంది!

చిత్రం: గౌతమిపుత్ర శాతకర్ణి
- పంపినవారు: కిల్లి శ్రీనివాసరావు, బాణాపురం

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

ఈనాడు సినిమా



'పైసా వసూల్'లో బాలకృష్ణ



నందు, ప్రగ్యాజైస్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, బోయపాటి శ్రీను, సాయి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి

ఇలాంటి కథ దొరకడం చాలా అరుదు

"ప్రేమ, వినోదం, భావోద్వేగాలు, యాక్షన్... ఇలా అన్ని అంశాలూ కలిసిన కథ దొరకడం చాలా అరుదు. ఇవన్నీ 'జయ జానకి నాయక'లో కనిపిస్తాయి" అన్నారు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వం వహించిన చిత్రమిది. బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్‌ప్రీత్ సింగ్ జంటగా నటించిన ఈ చిత్రం శుక్రవారం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా గురువారం చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. దర్శకుడు మాట్లాడుతూ "భద్ర, తులసి, సింహా, దమ్ము, లెజెండ్, సరైనోడు.. ఇవన్నీ వేటికవే ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్నాయి. వాటితో పోలిస్తే 'జయ జానకి నాయక' కొత్తగా కనిపిస్తుంది. క్లాస్, మాస్ ప్రేక్షకులు ఒకే వరుసలో కూర్చుని, సినిమా చూసి ఆస్వాదించాలన్న తపనతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం" అన్నారు. "ఇది నా సినిమా అని జీవితాంతం గర్వంగా చెప్పుకొనేలా ఉంటుందీ చిత్రం. జానకి పాత్రలో రకుల్ నటన ఆకట్టుకొంటుంది. జగపతిబాబులాంటి అనుభవజ్ఞులతో పనిచేయడం నాకు సరికొత్త అనుభవం" అన్నారు బెల్లంకొండ శ్రీనివాస్. "నిజమైన ప్రేమ ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూపించారు బోయపాటి. జానకి లాంటి పాత్ర దొరకడం నా అదృష్టం" అని రకుల్ చెప్పింది. "ఈ సినిమాతో చాలా నేర్చుకోగలిగా" అంది ప్రగ్యా జైస్వాల్. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించిన నందు మాట్లాడుతూ "బోయపాటి నుంచి నవతరం దర్శకులు చాలా నేర్చుకోవాల"న్నారు. "బలమైన కథ చుట్టూ కమర్షియల్ అంశాలు జోడించడం బోయపాటి శైలి. అది ఈ చిత్రంలో కనిపిస్తుంది' ' అన్నారు నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి.

శ్రీమతి మీసం మెలేస్తే..!



మీసం... మగాడికి అదో అందం... ఆకర్షణ. అందుకే మగాళ్లు మీసం అంచుని స్టైల్‌గా తిప్పేస్తుంటారు. కోర మీసం మగాళ్లు అంటే మగువలకూ ఇష్టమే. సాక్షాత్తు కట్టుకున్న భార్యే భర్త మీసం మెలితిప్పుతుంటే అబ్బో ఆ దర్పమే వేరు. ఇప్పుడు అలాంటి ఆనందమే పొందుతున్నారు రాజ్‌కుంద్రా. బాలీవుడ్ అందాల భామ శిల్పాశెట్టి జీవిత భాగస్వామి ఈయన. ఈ మధ్య జరిగిన ఓ కార్యక్రమంలో ఇదిగో ఇలా భర్త మీసం మెలేసి అందర్నీ ఆకర్షించింది శిల్ప. బాలీవుడ్ అనగానే మీసం లేని కథానాయకులే గుర్తొస్తారు. అందుకేనేమో భర్త మీసం చూసి మురిసిపోతోంది శిల్ప.



సమంత

మా విషయంలో తప్పు చేస్తే...

"నా అందం గురించీ, ఆరోగ్యం గురించీ నాకంటే దర్శకులకే బెంగ ఎక్కువ. కాబట్టి ఈ విషయంలో నాకేం కంగారు లేదు" అంటోంది సమంత. 'రంగస్థలం.. 1985', 'సావిత్రి', 'రాజుగారి గది 2' చిత్రాలతో బిజీగా ఉంది సమంత. తను మాట్లాడుతూ "ఓ సినిమా నా దగ్గరకు వచ్చిందంటే... అది ఒప్పుకోవాలా, వద్దా? అనే విషయంలో నేనేం పెద్దగా తటపటాయించక్కర్లేదు. ఎందుకంటే నా పాత్ర గురించి నా కంటే దర్శకులకే ఎక్కువ తెలుస్తుంది. నన్ను బాగా చూపించాల్సిన బాధ్యత వాళ్లదే. కథానాయికల్ని ఎలా చూపించాలి? వాళ్లతో ఏ తరహా కాస్ట్యూమ్స్ వేయించాలి? అనే విషయంలో దర్శకులు చాలా విధాలా ఆలోచిస్తారు. ఒకవేళ మా విషయంలో తప్పు చేస్తే. . 'ఈ కథానాయికని సరిగ్గా ఉపయోగించుకోలేదు' అనే విమర్శ కూడా వాళ్లకే. దర్శకుడు చెప్పింది చేయడమే మా పని. 'అది బాలేదు, ఇది బాలేదు...' అని దర్శకులకు సలహాలిచ్చేంత పెద్దవాళ్లమేం కాదు" అంది.

శుభలేఖలొచ్చేశాయ్: నాగచైతన్య - సమంతల పెళ్లి అక్టోబరు 6న జరగబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు పెళ్లి పనులు కూడా మొదలైపోయాయి. గోవాలో పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించారు. శుభలేఖల పంపకం కూడా మొదలైంది. సమంత - నాగచైతన్య పెళ్లి శుభలేఖ కూడా ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. సినీ, రాజకీయ ప్రముఖుల్లో అతి ముఖ్యమైన వాళ్లకే వివాహ ఆహ్వానం అందుతోందట. పెళ్లయ్యాక హైదరాబాద్‌లో ప్రత్యేక విందు ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బాధపెట్టే ఉంటాను!



కంగనా రనౌత్

"ఏంటో... నా జీవితంలో ప్రతి చిన్న విషయం కోసం పోరాటం చేయడమే అయిపోయింది. కానీ అందులోనే ఆనందం వెతుక్కుంటాను" అంటోంది కంగనా రనౌత్. ఇటీవలే కంగనా నటిస్తున్న 'సిమ్రన్' ట్రైలర్ విడుదలైంది. తన నిజ జీవితానికి దగ్గరగా ఉన్న పాత్రను ఈ చిత్రంలో కంగనా పోషిస్తుందని సమాచారం. "నా జీవితం వైవిధ్యమైంది. ముంబయిలో ప్రెస్‌మీట్‌కు వెళుతున్నానంటే అక్కడ నన్ను ఎలాంటి ప్రశ్నలు అడుగుతారో... అడగరో ఇలా నా ఆలోచనలు సాగుతాయి. నా జీవితమే అందరికంటే భిన్నమేమో.. అందుకే నేనూ ఆలాగే ఆలోచిస్తున్నానేమో అనిపిస్తుంది"అని చెప్పింది కంగనా. సిమ్రన్ చిత్ర దర్శకుడు హన్సల్ మెహతా కంగనాతో సినిమా చేయాలని ఎప్పట్నించో అనుకునేవారట. ఓ రోజు కథ వినడానికి తన ఆఫీసుకు కంగనాను రమ్మంటే నిర్మొహమాటంగా రాను అని చెప్పేసిందట. దీని గురించి కంగనా మాట్లాడుతూ "ఆయన ఇగో దెబ్బతిందని హన్సల్ చెబుతున్నారు. నాకైతే గుర్తు లేదు. నేనైతే ఆయన్ని కచ్చితంగా బాధపెట్టే ఉంటాను"అని చెప్పింది కంగనా.

తెలంగాణ ప్రభుత్వము-రెవెన్యూ (భూసేకరణ) విభాగం

జిల్లా కలెక్టర్, రాజన్న సిరిసిల్ల జిల్లా

ఫారం - 7

(చూడుము సవరించిన రూల్-25, సెక్షన్-19(1) చట్టము 30/2013)

రూఢీ ప్రకటన

ఆర్.సి. నెం. [illegible]/612/2017 తేది: 08-08-2017

రాజన్న సిరిసిల్ల జిల్లా [illegible] మండలం [illegible] గ్రామ పరిధిలో [illegible] 120.13 గుంటలు [illegible] ప్రాజెక్ట్ ప్యాకేజీ నెం. 10 లో [illegible] చట్టం 30/2013 ప్రకారం [illegible]

పైన [illegible] ప్రాజెక్ట్ ప్యాకేజీ నెం. 10 లో [illegible] రాజన్న సిరిసిల్ల జిల్లా, [illegible] మండలం, [illegible] గ్రామంలో [illegible] 120.13 గుంటలు [illegible]

షెడ్యూల్

గ్రామము: [illegible] మండలము: [illegible] జిల్లా: రాజన్న-సిరిసిల్ల

క్ర. సం.	సర్వే నెం.	భూమి స్వభావం	భూమి రకం	సేకరించవలసిన భూమి విస్తీర్ణం	పట్టాదారు పేరు/ అనుభవదారు పేరు	బావులు, బోరుబావులు, చెట్లు/ఇతర కట్టడాలు
1	2	3	4	5	6	7
			డి-5 కెనాల్			
1	1011	పట్టా	ఖుష్కి	0.03½	[illegible]	
2	898	పట్టా	తరి	0.26	[illegible]	పైప్‌లైన్, [illegible]
3	893	పట్టా	తరి	0.13	[illegible]	పైప్‌లైన్
4	894	పట్టా	తరి	0.39	[illegible]	పైప్‌లైన్, [illegible]
5	897	పట్టా	తరి	0.09½	[illegible]	పైప్‌లైన్
6	895	పట్టా	తరి	0.19½	[illegible]	
7	896	పట్టా	తరి	0.13½	[illegible]	
8	1040	పట్టా	ఖుష్కి	3.24½	[illegible]	[illegible]
9	1049	పట్టా	ఖుష్కి	1.25	[illegible]	[illegible]
10	1048	పట్టా	ఖుష్కి	3.34	[illegible]	[illegible]
11	1161	పట్టా	ఖుష్కి	1.25	[illegible]	
12	1158	పట్టా	ఖుష్కి	1.23	[illegible]	వేప (2)
13	1164	పట్టా	ఖుష్కి	0.02	[illegible]	
14	1157	పట్టా	ఖుష్కి	0.20	[illegible]	[illegible]
15	1156	పట్టా	ఖుష్కి	0.27	[illegible]	[illegible]
16	1155	పట్టా	ఖుష్కి	2.29	[illegible]	[illegible]
17	1151	పట్టా	ఖుష్కి	0.02	[illegible]	
18	150	పట్టా	ఖుష్కి	2.17	[illegible]	[illegible]
19	149	పట్టా	ఖుష్కి	2.11	[illegible]	[illegible]
20	53	పట్టా	ఖుష్కి	0.12	[illegible]	
21	54	[illegible]	తరి	0.33	[illegible]	
22	82	పట్టా	తరి	0.19	[illegible]	
23	83	పట్టా	తరి	0.33	[illegible]	
24	88	పట్టా	తరి	0.38	[illegible]	
25	80	పట్టా	తరి	0.00½	[illegible]	
26	89	పట్టా	తరి	0.28	[illegible]	
27	90	పట్టా	తరి	0.23	[illegible]	
28	79	పట్టా	తరి	0.06	[illegible]	[illegible]
29	91	పట్టా	తరి	0.15	[illegible]	[illegible]
30	77	పట్టా	తరి	0.21	[illegible]	
31	92	పట్టా	తరి	0.08	[illegible]	
32	75	పట్టా	తరి	0.26	[illegible]	
33	94	పట్టా	తరి	0.31	[illegible]	బావి (1) వేప (2)
34	73	పట్టా	తరి	0.07	[illegible]	
35	72	పట్టా	తరి	0.26½	[illegible]	పైప్‌లైన్
36	71	పట్టా	తరి	0.05½	[illegible]	
37	70	పట్టా	తరి	0.26	[illegible]	పైప్‌లైన్
38	65	పట్టా	తరి	0.07	[illegible]	వేప (1) [illegible]
39	66	పట్టా	తరి	0.08	[illegible]	
40	67	పట్టా	తరి	0.08	[illegible]	
41	69	పట్టా	తరి	0.09	[illegible]	
42	100	పట్టా	తరి	0.02	[illegible]	
43	101	పట్టా	తరి	0.35	[illegible]	వేప (1)
44	102	పట్టా	తరి	0.00½	[illegible]	
45	324	పట్టా	ఖుష్కి	1.33½	[illegible]	[illegible]
46	323	పట్టా	ఖుష్కి	1.15	[illegible]	[illegible]
		మొత్తం		40.38		
			డి-6 కెనాల్			
47	560	పట్టా	ఖుష్కి	1.38	[illegible]	[illegible]
48	549	పట్టా	ఖుష్కి	5.14	[illegible]	[illegible]
49	542	పట్టా	ఖుష్కి	2.19	[illegible]	[illegible]
50	541	పట్టా	ఖుష్కి	1.16½	[illegible]	[illegible]
				0.07½	రోడ్డు	
51	540	పట్టా	ఖుష్కి	1.19	[illegible]	[illegible]
52	539	పట్టా	ఖుష్కి	3.12	[illegible]	వేప (4) [illegible]
53	532	పట్టా	ఖుష్కి	0.38	[illegible]	[illegible]
54	531	పట్టా	ఖుష్కి	0.05	[illegible]	[illegible]
55	530	పట్టా	ఖుష్కి	0.13	[illegible]	
		మొత్తం		17.22		
			డి-4 కెనాల్			
56	900	పట్టా	ఖుష్కి	0.38½	[illegible]	బోర్ (1)
				0.09½	రోడ్డు	
57	1011	పట్టా	ఖుష్కి	3.21	[illegible]	[illegible]
58	1037	పట్టా	ఖుష్కి	2.05	[illegible]	
59	1036	పట్టా	ఖుష్కి	3.17	[illegible]	వేప (1)
60	1056	పట్టా	ఖుష్కి	1.03	[illegible]	
61	1059	పట్టా	ఖుష్కి	1.03	[illegible]	వేప (1)
62	1057	పట్టా	ఖుష్కి	0.24	[illegible]	
63	1058	పట్టా	ఖుష్కి	1.39	[illegible]	[illegible]
64	1063	పట్టా	ఖుష్కి	1.30	[illegible]	[illegible]
65	1121	పట్టా	ఖుష్కి	0.35	[illegible]	
66	1120	పట్టా	ఖుష్కి	3.01	[illegible]	
67	1119	పట్టా	ఖుష్కి	0.35	[illegible]	
68	1122	పట్టా	ఖుష్కి	0.21	[illegible]	
69	1123	పట్టా	ఖుష్కి	2.30	[illegible]	
70	1124	పట్టా	ఖుష్కి	1.08	[illegible]	
71	1115	పట్టా	ఖుష్కి	0.07½	[illegible]	
72	1126	పట్టా	ఖుష్కి	1.28	[illegible]	
73	1114	పట్టా	ఖుష్కి	0.12	[illegible]	
74	1127	పట్టా	ఖుష్కి	0.22	[illegible]	
75	1113	పట్టా	ఖుష్కి	2.17	[illegible]	వేప (1)
76	160	పట్టా	ఖుష్కి	2.12	[illegible]	
77	162	పట్టా	ఖుష్కి	2.33	[illegible]	[illegible] వేప (1)
78	178	పట్టా	ఖుష్కి	2.07	[illegible]	
79	177	పట్టా	ఖుష్కి	1.36	[illegible]	
80	199	పట్టా	తరి	0.31	[illegible]	
81	198	పట్టా	తరి	0.12	[illegible]	
82	200	పట్టా	తరి	0.22	[illegible]	
83	217	పట్టా	తరి	0.12	[illegible]	వేప (1)
84	210	పట్టా	తరి	0.18	[illegible]	
85	211	పట్టా	తరి	0.18	[illegible]	
86	214	పట్టా	తరి	0.16	[illegible]	
				0.01	రోడ్డు	
87	212	పట్టా	తరి	0.17	[illegible]	వేప (4)
88	213	పట్టా	తరి	0.15 1/2	[illegible]	[illegible]
				0.00 1/2	రోడ్డు	
89	215	పట్టా	తరి	0.02 1/2	[illegible]	[illegible]
				0.00 1/2	రోడ్డు	
90	226	పట్టా	తరి	0.04 1/2	[illegible]	
91	225	పట్టా	తరి	0.10	[illegible]	[illegible] (2)
				0.01	రోడ్డు	
92	389	పట్టా	తరి	0.18 1/2	[illegible]	[illegible] (1)
93	224	పట్టా	ఖుష్కి	0.32	[illegible]	
94	223	పట్టా	ఖుష్కి	2.22	[illegible]	[illegible]
		మొత్తం		48.25 1/2		
			డి-3 కెనాల్			
95	1136	పట్టా	ఖుష్కి	0.01	[illegible]	
96	1114	పట్టా	ఖుష్కి	2.22	[illegible]	వేప (1)
97	1113	పట్టా	ఖుష్కి	0.08	[illegible]	
98	1111	పట్టా	ఖుష్కి	0.02 1/2	[illegible]	
99	1112	పట్టా	ఖుష్కి	2.38	[illegible]	
100	1099	పట్టా	ఖుష్కి	0.17½	[illegible]	[illegible] (1)
101	1098	పట్టా	ఖుష్కి	3.16½	[illegible]	
				0.03½	రోడ్డు	
102	168	పట్టా	ఖుష్కి	1.36	[illegible]	
				0.01	రోడ్డు	
103	169	పట్టా	ఖుష్కి	1.20½	[illegible]	
		మొత్తం		13.07½		
		మొత్తం		120.13		

భూసేకరణ చట్టము నెం. 30/2013లో సెక్షన్-15 [illegible] RFCT & LA RR చట్టము, 2013 సెక్షన్ 16 [illegible]

పై భూసేకరణలో [illegible]

సం/-, [illegible]
భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, సిరిసిల్ల

సం/-
[illegible]
సంయుక్త కలెక్టర్, రాజన్న సిరిసిల్ల

[illegible]
జిల్లా కలెక్టర్, రాజన్న సిరిసిల్ల

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం : వనపర్తి

లేఖ సంఖ్య : భూ/168/2016 తేది : 31.07.2017

(భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) ననుసరించి)

ఫారం-7 రూఢి ప్రకటన (డిక్లరేషన్ ఆఫ్ డిక్లరేషన్)

షెడ్యూలు

క్రమ సంఖ్య	సర్వే నెం.	పట్టా వర్గీకరణం	భూ విస్తీర్ణం	సేకరించవలసిన విస్తీర్ణం	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	
1	2	3	4	5	6	7	8
[illegible]							

రహదారి వనాలు!

- సిద్దిపేట జిల్లాలో భారీగా అవెన్యూ ప్లాంటేషన్
- 400 గ్రామాలు.. 1,200 కిమీ మేర రహదారికి ఇరువైపులా మొక్కలు

ఈనాడు – హైదరాబాద్

రహదారి మార్గాల్లో పచ్చదనంతోపాటు ప్రయాణంలో ఆహ్లాదాన్ని కలిగించే అవెన్యూ ప్లాంటేషన్ పంచాయతీ రహదారి మార్గాల్లోనూ ప్రారంభమైంది. తెలంగాణలో మొట్టమొదటిసారిగా సిద్దిపేట జిల్లాలో మొత్తం అన్ని గ్రామాల్లో దీన్ని చేపడుతున్నారు. దీనికింద నాలుగు వందల గ్రామాల్లో పన్నెండు వందల కిలోమీటర్ల మేర మొక్కలు నాటుతున్నారు. మొత్తంగా సుమారు 4.80 లక్షల మొక్కలను మార్చి నాటికి నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఒక్కో ఊరికి మూడు కిలోమీటర్లు

ఊర్లోకి అడుగుపెట్టగానే పచ్చదనం కన్పించేలా గ్రామానికి ఈ చివర నుంచి ఆ చివర వరకు మొక్కలు నాటనున్నారు. సగటున ఒక్కో ఊరి పరిధిలో మూడు కిలోమీటర్ల అవెన్యూ ప్లాంటేషన్ రానుందని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. రంగురంగుల పూలతో కన్పించే గుల్‌మోహర్, మహాఘని, తబూబియా వంటి రకాలతో పాటు సురాయి, కదంబ, రావి, వేప మొక్కలను నాటుతున్నారు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 1,200 కిమీ రహదారుల్ని ఎంపిక చేయగా అటవీశాఖ రెండొందల కిలోమీటర్ల పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్ మొదలుపెట్టింది. మరో వెయ్యి కిలోమీటర్ల రహదారులపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు దీన్ని చేపడతాయి. గ్రామీణ రహదారులూ పచ్చదనంతో కళకళలాడేలా ఒక్కో కిలోమీటర్ రహదారికి సగటున 400 మొక్కలు నాటుతున్నట్లు అటవీశాఖ అధికారి ఒకరు తెలిపారు.



సిద్దిపేట జిల్లా కొమటిబండ గ్రామంలో రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు

మొక్కల సంరక్షణకు బాధ్యులు

నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక కమిటీలను నియమిస్తున్నారు. పంచాయతీయ కార్యదర్శి, ఉపాధ్యాయుడు, పంచాయతీ సభ్యుడు.. ఇలా ఎనిమిది, తొమ్మిది మందితో కూడిన బృందానికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 50 శాతం వరకు మొక్కలు నాటినట్లు సమాచారం. అటవీశాఖ నిధులతోపాటు ప్రధానంగా ఉపాధి హామీ పథకం కింద ఈ మొక్కలు నాటడం, వాటి నిర్వహణ పనులు చేపడుతున్నారు.

చిరుధాన్యాలకు భారీ కొరత!

- భవిష్యత్తుపై భూతాపం.. అప్రమత్తతే శరణ్యం
- పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫార్సులు

ఈనాడు, దిల్లీ: భవిష్యత్తులో దేశం చిరుధాన్యాలకు తీవ్ర కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ పార్లమెంటరీ స్థాయీసంఘం అంచనా వేసింది. అయితే ఆహారధాన్యాలకు మాత్రం కొరత ఉండకపోవచ్చని పేర్కొంది. హుకుందేవ్ నారాయణ్ యాదవ్ నేతృత్వంలోని స్థాయీసంఘం ఆహారభద్రతకు సంబంధించిన నివేదికను గురువారం పార్లమెంటు ముందుంచింది. భూతాపం కారణంగా దక్షిణాసియా దేశాలు తీవ్ర సవాళ్లను ఎదుర్కోబోతున్నట్లు కమిటీ పేర్కొంది. వాతావరణంలో వస్తున్న తీవ్ర మార్పుల ప్రభావంతో భారత వ్యవసాయరంగం అత్యంత దుర్బలంగా మారే ప్రమాదం ఉందని తెలిపింది. దీనివల్ల భారతీయ రైతులు దేశానికి ఆహారభద్రతను కల్పించలేకపోయే ప్రమాదం ఉందని అంచనా వేసింది. 2050 నాటికి దేశ జనాభా 165 కోట్లకు చేరే అవకాశం ఉంది.. అందులో 50 శాతం మంది పట్టణ ప్రాంతాల్లోనే నివాసం ఉంటారని అంచనా వేసిన కమిటీ వివిధ అంశాలను విశ్లేషించింది. తీవ్రతను తగ్గించుకోవడానికి పలు సిఫార్సులు కూడా చేసింది.

డిమాండ్.. ఉత్పత్తి: దేశంలో ఆహారధాన్యాల డిమాండ్ 2025 నాటికి 291 మిలియన్ టన్నులు, 2050 నాటికి 377 మి.ట.లకు చేరనుంది. అదే సమయంలో ఉత్పత్తి 2025 నాటికి 292 మి.ట.లు. 2050 కల్లా 385 మి.ట.లకు చేరుతుంది. ఇది డిమాండ్ కంటే 2 శాతం అధికం కాబట్టి ఆహారధాన్యాలకు కొరత ఉండకపోవచ్చు అయితే చిరుధాన్యాలు, నూనెగింజలు, పప్పుదినుసుల ఉత్పత్తి మాత్రం భారీగా పడిపోయే ప్రమాదం ఉంది. చిరుధాన్యాల కొరత 2025 నాటికి 33 శాతం, 2050 నాటికి 43 శాతం మేర పెరిగే అవకాశం ఉంది. పప్పు దినుసుల కొరత 2025 నాటికి 3 శాతం, 2050 నాటికి 7 శాతం ఉంటుంది.

సాగుబడి పెంపుతోనే..: చిరుధాన్యాలు, పప్పు దినుసులకొరతను అధిగమించాలంటే వాటిసాగు విస్తీర్ణం పెంచాలని యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను రైతులకు అందజేయాలి. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి వ్యవసాయశాఖకు తగిన బడ్జెట్‌ను కేటాయించాలి.

దిగుబడులపైవాతావరణం: ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పుల ప్రభావంతో గోధుమ, వరి, మొక్కజొన్న దిగుబడుల నిష్పత్తి తగ్గే అవకాశం ఉంది. 2020నాటికి వివిధ పంటల ఉత్పాదకత 6 శాతం తగ్గే అవకాశం ఉండగా.. 2100 నాటికి దీనివల్ల 10-40 శాతం మేర ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉంది. దీన్ని తట్టుకొనే విధంగా ఆర్ అండ్ డీని పెంచడానికి కేంద్రం నిధులు పెంచాల్సి ఉంటుంది.

పాడి పరిశ్రమపైనా..: దేశీయ పాడిపరిశ్రమపైనా వాతావరణ ప్రభావం తీవ్రంగానే ఉంటుంది. దేశీయ ఆవుల ద్వారా 0.33 మిలియన్ టన్నుల మేర పాలఉత్పత్తిని కోల్పోయే అవకాశం ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లో పాల ఉత్పత్తి భారీగా తగ్గే అవకాశం ఉంది. పాల ఉత్పత్తి తగ్గుదల సంకరజాతి పశువుల్లో 0.63, గేదెల్లో 0.5, దేశీయ పశువుల్లో 0.4 శాతం మేర ఉండే అవకాశం ఉంది. భవిష్యత్తు ప్రమాదాన్ని ముందే పసిగట్టి వాతావరణ మార్పుల ప్రభావ పరిష్కారపథ పథకాలు చేయడానికి ఐసీఏఆర్ ఇప్పటికిందే పరిశోధనలు మొదలుపెట్టాలి. పశువులకు మరింత శక్తిమంతమైన దాణాను అందుబాటులోకి తేవాలి.

రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన మెహబూబా

దిల్లీ: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ గురువారమిక్కడ కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. దాదాపు 45 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో ఏయే అంశాలపై చర్చించిందీ వెల్లడి కాలేదు. ఆమె శుక్రవారం ప్రధాని మోదీతో సమావేశమయ్యే అవకాశముంది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలవనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం : వనపర్తి

లేఖ సంఖ్య : భూ/167/2016 తేది : 31.07.2017

(భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) ననుసరించి)

ఫారం-7 రూఢి ప్రకటన (డిక్లరేషన్ ఆఫ్ డిక్లరేషన్)

షెడ్యూలు

క్రమ సంఖ్య	సర్వే నెం.	పట్టా వర్గీకరణం	భూ విస్తీర్ణం	సేకరించవలసిన విస్తీర్ణం	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	
1	2	3	4	5	6	7	8
[illegible]							
		మొత్తం		77.06			

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయడమైనది.

భూసేకరణ అధికారి / రాజస్వ మండలాధికారి, వనపర్తి — జిల్లా రెవెన్యూ అధికారి వనపర్తి — సంయుక్త కలెక్టర్ వనపర్తి — జిల్లా కలెక్టర్ వనపర్తి

DIPR RO No.: 842/LA/PP/2017-18

నాటుకోళ్లతో నాగాలాండ్ విజయం

ఐసీఏఆర్ సహకారంతో గిరిజనులకు రూ.1.25 కోట్ల ఆదాయం

వనరాజా, శ్రీనిధి రకాల పెంపకంలో ఆదర్శం

ప్రాజెక్టు అమలులో విఫలమైన తెలంగాణ పశువైద్య వర్సిటీ

ఈనాడు, హైదరాబాద్: ఇంటి పక్కనే ఉన్నవాటిని ఎవరూ పెద్దగా పట్టించుకోరని నానుడి. దేశంలో నాటుకోళ్ల పెంపకం ద్వారా ప్రజలకు పోషకాహారం, పెంపకందారులకు ఆదాయం పెంచవచ్చని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) చెబుతున్న మాటలు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయ పట్టలేదు గానీ....నాగాలాండ్ రాష్ట్రంలోని అటవీ గ్రామాల గిరిజనులు అందిపుచ్చుకుని మంచి లాభాలను రాబట్టారు. మారుమూల గ్రామాల గిరిజనులకు పోషకాహారం, ఆదాయం పెంచడానికి నాటుకోళ్ల పెంపకం మంచి మార్గమని ఐసీఏఆర్ దేశవ్యాప్తంగా ప్రత్యేక పరిశోధనా ప్రాజెక్టులు అమలుచేస్తోంది. వ్యవసాయ పరిశోధనా మండలి తరఫున జాతీయ కోళ్ల పరిశోధనా కేంద్రం రాజేంద్రనగర్‌లో ఉంది. దీనికి ఎదురుగానే వీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉంది. నాటుకోళ్లపై పరిశోధనకు ఈ వర్సిటీకి ఐసీఏఆర్ జాతీయ ప్రాజెక్టు(ఏఐసీఆర్‌పీ) గతంలో ఇచ్చింది. కానీ సరిగా నిధులు కేటాయించకపోవడం, కొత్త ఫలితాలను ఆవిష్కరించకపోవడంతో ఏడాది క్రితమే దీనిని రద్దు చేసింది. నాటుకోళ్లపై పరిశోధనల ద్వారా కొత్త కోడి జాతులను సృష్టించడం, వాటి వ్యాధి నిరోధక శక్తి, దాణా తదితర అంశాలపై నూతన ఆవిష్కరణలు చేయడానికి జాతీయ ప్రాజెక్టులను దేశవ్యాప్తంగా ఐసీఏఆర్ ఇస్తుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టులపై నిధులకు తగ్గట్టు పనితీరు లేదని మూడుసార్లు మందలి హెచ్చరించినా ఎవరూ శ్రద్ధ చూపలేదు.



నాటుకోళ్లను పెంచుతున్న నాగాలాండ్ మహిళ

గిరిజనులెలా సాధించారు..: నాగాలాండ్ రాష్ట్రానికున్న ఐసీఏఆర్ ప్రాంతీయ పరిశోధనా కేంద్రం అక్కడి 17 అటవీ గ్రామాల్లోని 738 గిరిజన కుటుంబాలను ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసింది. వీరికి వనరాజా, శ్రీనిధి రకాలకు చెందిన 25,319 నాటుకోడి పిల్లలను ఇచ్చింది. వీటికి దాణా, రోగాల నివారణకు టీకాలు వేయడానికి రూ.42.55 లక్షలను మండలి కేటాయించింది. టీకాలు వేయడం, మెరుగైన దాణా పెట్టడంలో గిరిజన కుటుంబాలకు మండలి శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. వీటిని 3 నుంచి 4 నెలల దాకా పెంచిన తరవాత 58,985 కిలోల మాంసాన్ని, కోళ్లను అమ్మడం ద్వారా రూ.1.25 కోట్లకు పైగా ఆదాయాన్ని గిరిజనులు పొందారని ఐసీఏఆర్ తాజా నివేదికలో వెల్లడించింది. నాగాలాండ్‌లోనే కాకుండా అస్సాం, మణిపూర్, మేఘాలయ వంటి ఈశాన్య రాష్ట్రాల ప్రజల్లో ఎక్కువ శాతం గిరిజనులున్నారు. వీరిలో ఎక్కువ మంది మాంసాహారం తింటారు. కానీ పోషకాహారలోపంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. నాటుకోళ్లపై ఆధారపడి జీవించే కుటుంబాలకు రెండు విధాలా లబ్ధి చేకూర్చడానికి నాటుకోళ్ల పెంపకాన్ని ఐసీఏఆర్ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది. నాగాలాండ్ గిరిజనుల విజయం దేశవ్యాప్తంగా రైతుల కుటుంబాలకు ఆదర్శమని ఐసీఏఆర్ కోళ్ల ప్రధాన శాస్త్రవేత్త 'ఈనాడు'కు చెప్పారు. హైదరాబాద్‌లోనే కోళ్ల జాతీయ పరిశోధనా కేంద్రం ఉన్నా తెలుగు రాష్ట్రాల శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులు పెద్దగా ఉపయోగించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో బ్రాయిలర్ కోడిమాంసం తినడం ప్రజలకు బాగా అలవాటవడంతో నాటుకోళ్ల పెంపకం తగ్గిపోయిందన్నారు.

రక్త క్యాన్సర్‌పై పోరాడే కొత్త ఔషధం

లండన్: రక్త క్యాన్సర్‌గా వ్యవహరించే ల్యూకేమియాతో బాధపడే రోగులకు సమర్థ చికిత్స అందించేలా సరికొత్త ఔషధాన్ని పరిశోధకులు అభివృద్ధి పరిచారు. ఇది క్యాన్సర్ కణాల అమరత్వ సామర్థ్యాన్ని తొలగింపజేస్తుందని చెబుతున్నారు. 'హెచ్‌ఎక్స్‌ఆర్9' గా పిలిచే ఈ ఔషధం అనారోగ్య, దెబ్బతిన్న కణాలు వాటంతట అవే నశించేసే అపోప్టోసిస్ ప్రక్రియ నుంచి క్యాన్సర్ కణాలు దూరం జరగడాన్ని నివారిస్తుంది. ఈ ఔషధం అక్యూట్ మైలాయిడ్ ల్యూకేమియా(ఏఎంఎల్)కు చికిత్స అందజేయడంలో ఉపయోగపడుతుందని యూకేలోని బ్రాడ్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు పేర్కొన్నారు. ఇది హెచ్‌ఎక్స్9గా పిలిచే నిర్దిష్ట జన్యువుల్ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తుంది. ఏఎంఎల్ విలీన్స్, తీవ్రస్థాయి వ్యాధి అనీ, పలు రకాల చికిత్సపద్ధతులకు లొంగదనీ, తాజా ఔషధం దీనిని సమర్థంగా లక్ష్యంగా చేసుకుంటుందని పరిశోధకులు రిచర్డ్ మోర్గాన్ పేర్కొన్నారు.

ఆ స్టెరాయిడ్‌తో కిడ్నీ రోగుల్లో తీవ్రదుష్ప్రభావాలు

దిల్లీ: ఓ స్టెరాయిడ్ వల్ల కిడ్నీ రోగుల్లో తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. మూత్రంలో అధిక ప్రోటీన్‌ను విసర్జించే, ఐజీఏ నెఫ్రోపతీ లాంటి కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నవారు మిథైల్‌ప్రెడ్నిసోలోన్ స్టెరాయిడ్ మాత్రల చికిత్స తీసుకున్నప్పుడు కలుగుతున్న ఫలితాలను పరిశోధించారు. జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ సంస్థ ఈ అధ్యయనం చేపట్టింది. ఈ స్టెరాయిడ్ కారణంగా రోగుల ఇన్‌ఫెక్షన్లు, పేగు, ఎముక సంబంధిత సమస్యలకు గురయ్యే ముప్పు ఎక్కువగా ఉందని గుర్తించింది. రోగుల్లో తీవ్ర సమస్యలు తలెత్తడంతో ప్రయోగ పరీక్షలను మధ్యలోనే ఆపివేసినట్లు తెలిపింది. 20 మంది (14.7 శాతం) రోగుల్లో తీవ్ర దుష్ప్రభావాలు కనిపించాయని.. ఇద్దరు మరణించారని పరిశోధకులు తెలిపారు. ప్రస్తుతం భారత్‌లోని చాలాచోట్ల కేంద్రాల్లో తక్కువ మోతాదులో ఈ ఔషధాన్ని ఇస్తూ ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ భారత విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివేకానంద్ ఝా తెలిపారు.

1	2	3	4	5	6	7	8
[illegible]							
		మొత్తం		145.18 1/2			

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయడమైనది.

భూసేకరణ అధికారి / రాజస్వ మండలాధికారి, వనపర్తి — జిల్లా రెవెన్యూ అధికారి వనపర్తి — సంయుక్త కలెక్టర్ వనపర్తి — జిల్లా కలెక్టర్ వనపర్తి

DIPR RO No.: 835/LA/PP/2017-18

నీతి ఆయోగ్‌కు నిఖార్సైన ఆర్థికవేత్త



విషయం ఏదైనా నిష్కర్షగా తన అభిప్రాయాలు చెబుతారు.. ఆర్థికాంశాల మీద మాత్రమే కాదు, సమకాలీన రాజకీయ సామాజిక మార్పులను కూడా తనదైన కోణంలో చూస్తారు. కుండబద్దలు కొట్టినట్లు వ్యాఖ్యానాలు చేస్తారు. దానివల్ల ఒక్కోసారి చిక్కుల్లో పడతారు కూడా. అయితేనేం.. ఆయన ప్రధానమంత్రి మోదీ విధానాలకు మద్దతుదారుడు. జీఎస్‌టీ, పెద్దనోట్ల రద్దు.. వంటి నిర్ణయాలతో దేశానికి మేలు జరుగుతుందని బహిరంగంగా సమర్థిస్తారు. ఆయనే నీతిఆయోగ్ నూతన వైస్‌ఛైర్మన్ డాక్టర్ రాజీవ్‌కుమార్. ఇప్పటి వరకూ ఆ పదవిలో ఉన్న అరవింద్ పనగడియా రాజీనామా చేయటం తెలిసిందే. ఆర్థికవేత్తగా, పలు సంస్థల్లో క్రియాశీలకమైన బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ రాజీవ్ కుమార్‌ను కొత్త వైస్ ఛైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాల్సిన విధానాలు, ప్రణాళికలు, భవిష్యత్తు పరిణామాలు విశ్లేషించి సరైన పథనిర్దేశం చేసేదిగా నీతి ఆయోగ్ రూపుదిద్దుకుంటున్న విషయం విదితమే. ఈ సంస్థకు ఛైర్మన్‌గా వ్యవహరించే ప్రధానమంత్రికి కళ్లు చెవుల మాదిరిగా వ్యవహరించే అవకాశం వైస్‌ఛైర్మన్‌కు ఉంటుంది. అంటే.. రాజీవ్‌కుమార్ నియామకం అత్యంత కీలకమైనదో అర్థమవుతుంది.

దిల్లీ రాజకీయాలకు చిరపరిచితుడే...

ఇప్పటివరకూ నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరించిన అరవింద్ పనగడియా దిల్లీలో అధికార యంత్రాంగంతో ఎలా మసులుకోవాలో తెలియక ఇబ్బందిపడినట్లు ప్రచారంలో ఉంది. కాని రాజీవ్ కుమార్‌కు అటువంటి సమస్య లేదు. దిల్లీ రాజకీయాలు, పరిపాలనా విధానాలు ఆయనకు కొత్త కాదు. సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌లో, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డులో, ఫిక్కీ, సిఐఐలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ దిల్లీలో తిరిగిన వాడే. అధికార యంత్రాంగంలో, రాజకీయ నాయకులతో ఎలా మెలగాలో స్పష్టంగా తెలిసిన వ్యక్తి. అందువల్ల కొత్త బాధ్యతల్లో సులువుగా ఇమిడిపోతారని భావిస్తున్నారు.

ఆ అభిప్రాయంతో ఇబ్బంది....

'లూటెన్స్ దిల్లీ ప్రచారాన్ని విశ్వసిస్తే మరికొంతమంది భారతీయ అమెరికన్ ఆర్థికవేత్తలు రాజీనామా చేసే అవకాశం ఉంది' అని ఆయన తాజాగా ఒక పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొనటం పెద్ద దుమారాన్ని సృష్టించింది.

స్పష్టమైన అభిప్రాయాలకు పెట్టింది పేరు...



ఎంత కీలకమైన అంశాల మీదైనా రాజీవ్‌కుమార్ తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించేందుకు వెనకాడబోరు. ఆయన అభిప్రాయాలు చాలావరకు నూతన ఆర్థిక విధానాలను, ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను సమర్థించేలా ఉంటాయి. వాటిలో కొన్ని..

జీఎస్‌టీ: దీనిని అమలు చేసిన ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ మీద పన్నుల భారం గణనీయంగా తగ్గింది.

పెద్ద నోట్ల రద్దు: పెద్ద నోట్లను రద్దు చేయటం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నల్లధనంపై కోలుకోలేని దెబ్బతీశారు.

హైటెక్ నోటు: రూ. 2,000 నోటు హైటెక్ నోటు.

ఐటీ వేధింపులు ఉండొద్దు: పెద్ద నోట్ల రద్దు సత్ఫలితాలు ఇవ్వాలంటే ప్రజలపై ఆదాయపు పన్ను శాఖ వేధింపులు లేకుండా చూడాలి. అదేవిధంగా రాజకీయ అవినీతిపై దృష్టి సారించాలి. కేంద్ర ప్రభుత్వం ఈ రెండు కీలకమైన చర్యలు తీసుకోని పక్షంలో పెద్దనోట్ల రద్దు రూపంలో వచ్చిన గొప్ప అవకాశాన్ని చేజార్చుకున్నట్లవుతుంది.

వ్యవసాయ రుణాల మాఫీ: రాజకీయ పార్టీలు స్వప్రయోజనాలను పరిరక్షించుకునేందుకే వ్యవసాయ రుణాల మాఫీ నిర్ణయం ఉపయోగపడుతోంది.

మేధో సంపత్తి హక్కులకు ప్రోత్సాహం: భారతదేశం శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్పు చెందుతోంది. ప్రపంచ మార్కెట్లో తన వాటా పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ తరుణంలో తక్కువ వ్యయంలో నూతన ఉత్పత్తులు ఆవిష్కరించగలగాలి. అందుకు స్పష్టమైన మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) వ్యవస్థ ఉండాలి.

ఉద్యోగావకాశాల కల్పన: మెరుగైన ఆర్థిక వృద్ధి సాధించటం మాత్రమే కాదు, మెరుగైన ఉద్యోగావకాశాల కల్పన ఇప్పుడు దేశం ముందున్న అతిపెద్ద సవాలు. కొత్త ఉద్యోగాల కల్పన తక్కువగా ఉందనేది విస్పష్టం. అందువల్ల ఉద్యోగావకాశాల కల్పన ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ అరవింద్ పనగడియా భారతీయ- అమెరికన్ ఆర్థికవేత్త. అలాగే ఆర్‌బిఐ గవర్నర్‌గా పనిచేసిన రఘురామ్ రాజన్ కూడా అమెరికాలో బోధనా రంగం నుంచి వచ్చినవారే. రాజన్‌కు ఆర్బీఐ గవర్నర్‌గా రెండోసారి పనిచేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. పనగడియా ముందుగానే రాజీనామా చేశారు. దేశ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఉన్న ఇక్కడి ఆర్థిక వేత్తలు మనకు చాలని, అమెరికా నుంచి దిగుమతి చేసుకోవలసిన అవసరం లేదని అభిప్రాయం వచ్చేలా రాజీవ్‌కుమార్ వ్యాఖ్యానించటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యావేత్త, రచయిత...

రాజీవ్‌కుమార్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. విద్యాధికుడు, రచయిత, సలహాదారుడు. లక్నో విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆ తర్వాత అక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో డీఫిల్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో, పలు కార్పొరేట్ సంస్థల్లో క్రియాశీలకమైన బాధ్యతలు నిర్వహించారు. పెహలే ఇండియా అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. పుణెలోని గోఖలే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పోలిటిక్స్‌కు ఛాన్స్‌లర్‌గా ఉన్నారు. అగ్రశ్రేణి వర్తక సంస్థలైన ఫిక్కీ, సిఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ)లో క్రియాశీలకమైన స్థానాల్లో పనిచేశారు. పలు పుస్తకాలు రాశారు. పత్రికలు, పుస్తకాల్లో సమకాలీన అంశాలపై వ్యాసాలు రాస్తారు.

గట్టి పునాది వేసిన ప్రణాళికా సంఘం

దేశానికి స్వాంతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో అన్ని రంగాలు సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నాయి. వ్యవసాయం, ఆహార భద్రత, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు.. అన్నీ సవాళ్లే. ప్రణాళికాబద్ధమైన కార్యాచరణే దీనికి పరిష్కారమని అప్పట్లో నేతలు భావించారు. తత్ఫలితంగా రూపుదిద్దుకున్నదే ప్రణాళికా సంఘం. ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఛైర్మన్‌గా 1950లో ఈ సంఘం ఏర్పాటైంది. వాస్తవానికి బ్రిటిష పాలనలోనే 1944 నుంచి 1946 వరకూ 'ప్లానింగ్ బోర్డు' ఉంది. ప్రణాళికా సంఘాన్ని నెలకొల్పాలనే ఆలోచనకు అదే పునాది. 1951 నుంచి పంచవర్ష ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు తయారు చేయటంలో ప్రణాళికా సంఘం క్రియాశీలకమైన పాత్ర పోషించింది. 2014 వరకూ అప్రతిహతంగా ప్రణాళికా సంఘం కార్యకలాపాలు సాగాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం రాగానే దీన్ని రద్దు చేసింది. ఆ స్థానంలో నీతి ఆయోగ్ (నేషనల్ ఇనిస్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) ఏర్పాటైంది. భవిష్యత్తు అవసరాలను విశ్లేషించి విధాన పత్రాలు తయారు చేయటం, ప్రభుత్వానికి వివిధ అంశాలపై సూచనలు, సలహాలు ఇవ్వటం, సమాజంలోని అన్ని వర్గాల స్థితిగతులు, ప్రయోజనాలను పరిగణలోకి తీసుకొని కార్యక్రమాలు తయారు చేయటం ఈ సంస్థకు నిర్దేశించిన లక్ష్యాలు. భారతీయ అమెరికన్, కొలంబియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అయిన అరవింద్ పనగడియా నీతి ఆయోగ్ తొలి వైస్-ఛైర్మన్‌గా నియమితుయ్యారు.

అరవింద్ పనగడియా ప్రత్యేకతే వేరు

ప్రఖ్యాత ఆర్థికవేత్త జగదీష్ భగ్‌వతి శిష్యుడైన అరవింద్ పనగడియాకు సరళీకృత ఆర్థిక విధానాలను గట్టిగా సమర్థించే వ్యక్తిగా పేరుంది. విప్లవాత్మకమైన ఆలోచనలతో వచ్చిన ఆయన నీతి ఆయోగ్‌ను గత రెండున్నరేళ్ల కాలంలో ఒక పరిశోధనా కేంద్రంగా, స్పష్టమైన కార్యాచరణను నిర్దేశించే సంస్థగా తయారు చేశారు. అవినీతి ముద్ర పడిన భారతీయ వైద్య మండలిని రద్దు చేయాలనే ఆలోచన నీతి ఆయోగ్ నుంచి వచ్చిందే. దాని స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ ఏర్పాటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం, ప్రభుత్వరంగ విమానయాన సంస్థ అయిన ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించాలనే యోచన.. తదితర కీలకమైన నిర్ణయాల్లో పనగడియా పాత్ర ఉంది. ఉన్నత విద్యా రంగంలో సంస్కరణలు, నిరుద్యోగ గణాంకాల తయారీ.. వంటి ముఖ్యమైన కార్యక్రమాలను నీతి ఆయోగ్ చేపట్టింది. కానీ ఆయన పదవీకాలం సాఫీగా సాగలేదనే చెప్పాలి. దేశ రాజకీయ వ్యవస్థ మీద, ప్రభుత్వ యంత్రాంగం వ్యవహారశైలి మీద తగినంత అవగాహన లేకపోవటం ఆయనకు నష్టం చేసింది. ఎంతో బలమైన అధికార యంత్రాంగం మెప్పు పొందలేకపోయారు. నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌కు నిర్దిష్టమైన పదవీ కాలాన్ని నిర్దేశించలేదు. కానీ ప్రస్తుత ప్రధానమంత్రి ఉన్నంత కాలం కొనసాగే అవకాశం ఉంది. కానీ ఎందుకనే ముందే వైదొలగాలని నిర్ణయించుకున్నారు. మళ్లీ కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడి బాధ్యతల్లోకి వెళ్లిపోతానని చెప్పి నీతి ఆయోగ్ నుంచి తప్పుకున్నారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం.



డాక్టర్ రాజీవ్ కుమార్ పుస్తకాలు

- మోదీ అండ్ హిజ్ ఛాలెంజెస్ (2016)
- రిసర్జెంట్ ఇండియా: ఐడియాస్ అండ్ ప్రయారిటీస్ (2015)
- ఎక్స్‌ప్లోడింగ్ ఆస్పిరేషన్స్: అన్‌లాకింగ్ ఇండియాస్ ఫ్యూచర్ (2014)

ఎన్నో పదవుల్లో...

- ఛాన్సలర్- గోఖలే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పోలిటిక్స్, పుణె.
- వ్యవస్థాపక డైరెక్టర్- పెహలే ఇండియా ఫౌండేషన్
- సెక్రటరీ జనరల్- ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ)
- ఛీఫ్ ఎగ్జిక్యూటివ్- ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ (ఐసీఆర్ఐఈఆర్)
- ముఖ్య ఆర్థికవేత్త- కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)
- సభ్యుడు- అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ సిస్కో ఇండియా
- ప్రధాన ఆర్థికవేత్త- ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్
- ఆర్థిక సలహాదారుడు- ఆర్థిక వ్యవహారాల విభాగం, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.
- సభ్యుడు- కింగ్ అబ్దుల్లా పెట్రలియం స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్, రియాద్.

మోకాళ్లపై నిల్చొని దళిత క్రిస్టియన్ల నిరసన

ఈనాడు, దిల్లీ: ఎస్సీల్లో చేర్చాలంటూ వందలాది మంది దళిత క్రిస్టియన్లు గురువారం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం అఖిల భారత క్రిస్టియన్ సమాఖ్య ప్రతినిధులు జార్జి శ్రీమంతుల, రాజేశ్‌బాబు, జెరుషలేము మత్తయ్య, మట్టా ప్రభాత్‌కుమార్ తదితరుల నేతృత్వంలో తెరాస, తెదేపా, కాంగ్రెస్, వైకాపా ఎంపీలను కలిసి తమ డిమాండ్లను పార్లమెంటులో ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ రిజర్వేషను ఫలాలు 67 సంవత్సరాలుగా దళిత క్రిస్టియన్లకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పార్లమెంటు, రాష్ట్రపతిభవన్‌ల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి వారు నిరసనవ్యక్తం చేశారు.

ఉద్యోగ అవకాశాలు



కొనుగోలు 'దారులు' మూసేద్దాం..!

- ఓపెన్ యాక్సెస్‌కు అడ్డుకట్టే లక్ష్యంగా డిస్కంల ప్రణాళిక
- అదనపు సర్‌ఛార్జీలకు ప్రతిపాదన
- అన్యాయమంటున్న పరిశ్రమల వినియోగదారులు
- సలహాలు, అభ్యంతరాలను ఆహ్వానించిన ఈఆర్‌సీ

ఈనాడు, హైదరాబాద్: ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్కేంద్రాల నుంచి విద్యుత్ కొనుగోలుచేసే వారి సంఖ్య తగ్గితేనే.. బహిరంగ విపణిలో విద్యుత్ ధరలు తగ్గుతాయని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు భావిస్తున్నాయి. ఈ వ్యూహంలో భాగంగా ఓపెన్ యాక్సెస్ విధానంలో విద్యుత్తు కొనుగోళ్లపై సర్‌ఛార్జి వసూలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించగా... ఈ నిర్ణయంపై పరిశ్రమల వర్గాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

తెలంగాణలో విద్యుత్తు వినియోగం రికార్డుస్థాయిలో పెరుగుతున్నందున రోజూవారీ సరఫరా తాలూకా డిమాండును తీర్చడానికి డిస్కంలు స్పాట్ ఎక్స్ఛేంజీలో నిత్యం విద్యుత్తును కొనాల్సి వస్తోంది. అక్కడ షేర్ మార్కెట్‌లో మాదిరిగా సైతం పోటీదారులు పెరిగే కొద్దీ ధరలు పెరుగుతున్నందున తెలంగాణ డిస్కంలపై ఆర్థిక భారం పెరుగుతోంది. ఉదాహరణకు గత నెలలో ఎక్స్ఛేంజీలు యూనిట్ విద్యుత్తును రూ.1.02 నుంచి గరిష్ఠంగా రూ.3.44 వరకూ విక్రయించాయి. నెల మొత్తమ్మీద చూస్తే సగటున ఉత్తరాది రాష్ట్రాలు యూనిట్‌ను రూ.2.54 చొప్పున కొంటే... దక్షిణాది రాష్ట్రాలు యూనిట్‌కు రూ.2.59 చొప్పున చెల్లించాయి. తాజాగా రికార్డు స్థాయిలో ఈ నెల 7న 191 మిలియన్ యూనిట్లు (9397 మెగావాట్లు) విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రజలు వినియోగించారు. ఇందులో 39 మిలియన్ యూనిట్లను డిస్కంలు స్పాట్ ఎక్స్ఛేంజీలోనే కొన్నాయి. రోజుకు యూనిట్‌కు 5 పైసలు అదనంగా చెల్లించినా..నెలలో వందల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందన్నమాట.

నష్టాల బేరం

తెలంగాణ విద్యుత్ సంస్థలకు సొంత విద్యుదుత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉన్నందున అవి అత్యధికశాతం కరెంటును బయటే కొంటున్నాయి. ఈ దృష్ట్యా దీర్ఘకాలిక ఒప్పందాలు, ఇతర ఖర్చుల వల్ల సగటున ఒక యూనిట్ సరఫరాకు రూ.4.50 నుంచి రూ.5 వరకు వ్యయమవుతోంది. ఈ ధర అధికంగా ఉందని భావిస్తున్న పెద్ద పరిశ్రమల వినియోగదారులు ఓపెన్ యాక్సెస్‌లో (డిస్కంల నుంచి కాకుండా నేరుగా బయటి విద్యుత్కేంద్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడాన్ని ఓపెన్ యాక్సెస్ విధానం అని పిలుస్తారు. రోజుకు మెగావాట్ కన్నా ఎక్కువ కరెంటు వినియోగించేవారినే ఓపెన్ యాక్సెస్‌కు అనుమతిస్తారు.) విద్యుత్తును బయటే కొంటున్నారు. స్పాట్ ఎక్స్ఛేంజీలో యూనిట్ ధర బాగా పడిపోయినప్పుడు ఓపెన్ యాక్సెస్‌లో ప్రైవేటు కొనుగోళ్లు 500 మెగావాట్లకు పైగా ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

భారమైన ఒప్పందాలు

గతంలో ఓపెన్ యాక్సెస్‌కు వెళ్లేవారు పెద్దగా లేనందున గిరాకీకి తగ్గట్టుగా సరఫరా చేసేందుకు వీలుగా 9 వేల మెగావాట్ల వరకూ కొనుగోలుకు తెలంగాణ డిస్కంలు వివిధ విద్యుత్కేంద్రాలతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఇప్పుడు పెద్ద వినియోగదారులు బయటి కొనుగోళ్లకు వెళ్లిన సమయాల్లో..తొలి ఒప్పందాల ప్రకారం కొన్న విద్యుత్‌ను ఎక్కడ అమ్ముకోవాలన్నది డిస్కంలకు సమస్యగా మారుతోంది. ఒక్కోసారి డిమాండు బాగా పడిపోతే విధిలేని పరిస్థితుల్లో సొంత థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తిని సైతం ఆపివేస్తున్నారు. దీనివల్ల వ్యాపారం తగ్గి ఆదాయం కోల్పోవడంతోపాటు.. బయటి కేంద్రాల నుంచి ఒప్పందాల ప్రకారం కొనాల్సి వస్తోందని డిస్కంలు వాపోతున్నాయి. ఈ సమస్యలన్నింటి నుంచి గట్టెక్కాలంటే ఓపెన్ యాక్సెస్‌కు వెళ్లేవారిని తగ్గించేలా అదనపు సర్‌ఛార్జీ పెంచడమే మార్గమని డిస్కంల యోచిస్తున్నాయి. వీరికి కరెంటు సరఫరాలో భాగంగా లైన్ల రవాణా ఛార్జీలే కాకుండా అదనంగా మరికొంత సర్‌ఛార్జి వసూలుకు అనుమతించాలని కోరాయి. ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో ఇలా వసూలు చేస్తున్నాయని ఈర్‌సీకి తెలిపాయి. ఒక్కో యూనిట్‌కు అదనంగా రూపాయిన్నర దాకా వసూలు చేయాలని ప్రతిపాదిస్తున్నాయి. తద్వారా ఓపెన్ యాక్సెస్‌కు వెళ్లాలనుకునే వారు ఆర్థికభారంతో వెనక్కి తగ్గుతారని డిస్కంలు యోచిస్తున్నాయి. దీనిపై పెద్ద పరిశ్రమల యాజమాన్యాల వాదన మరోలాఉంది. తెలంగాణ డిస్కంల అంతర్గత నిర్వహణ వ్యయం అధికమవడం వల్ల విద్యుత్ సరఫరా ధరలు పెరుగుతున్నాయని, చౌకగా దొరుకుతున్నందున స్పాట్ ఎక్స్ఛేంజీలో కొంటున్నామని వాదిస్తున్నాయి.

6వ తేదీ లోపు అభ్యంతరాలను పంపవచ్చు

ఓపెన్ యాక్సెస్ వినియోగదారుల నుంచి అదనపు సర్‌ఛార్జి వసూలు చేయాలని డిస్కంల ప్రతిపాదనలపై ప్రజలెవరైనా సలహాలు, అభ్యంతరాలను పంపవచ్చని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) మంగళవారం తెలిపింది. వచ్చే నెల 6లోగా మండలికి ఈమెయిల్ లేదా స్వయంగా వీటిని అందజేయవచ్చని తెలిపింది.

విద్యుత్ స్పాట్ ఎక్స్ఛేంజీలో రోజుకు సగటున కరెంటు కొనుగోళ్లు (మెగావాట్లలో)

ప్రాంతం	జులై	జూన్
దక్షిణాది రాష్ట్రాలు	2,008	1,119
పశ్చిమ రాష్ట్రాలు	1,019	1,973
ఉత్తరాది రాష్ట్రాలు	990	1,178
తూర్పు రాష్ట్రాలు	747	989
ఈశాన్య భారతం	176	184

రాష్ట్రంలో 879 కి.మీ. జాతీయ రహదారులుగా మార్పు

కేంద్ర సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో గత మూడేళ్లలో 879 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటించినట్లు కేంద్ర రహదారులు, రవాణాశాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్ తెలిపారు. గురువారం లోక్‌సభలో ఎంపీలు నగేష్ గోడం, బీబీ పాటిల్‌లు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం 2014-17 మధ్య మూడేళ్లలో రూ.3,656.21 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దీనికి అదనంగా రూ.1,905 కోట్ల వ్యయంతో చేపట్టే 99 కిలోమీటర్ల పొడవైన ఒక రహదారిని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ మంజూరు చేసినట్లు చెప్పారు.

150 పత్తికొనుగోలు కేంద్రాలకు వినతి

2017-18లో తెలంగాణలో 150 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు కేంద్ర జౌళి శాఖ సహాయమంత్రి అజయ్‌టమ్‌టా తెలిపారు. గురువారం లోక్‌సభలో ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఈ మేరకు జులై 4న రాష్ట్ర సాగునీరు, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు తమకు లేఖ రాసినట్లు చెప్పారు. 2016-17లో సీసీఐ అక్కడ 84 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పత్తి కొనుగోలు సీజన్‌లో మార్కెట్‌కు తరలివచ్చే సరుకును గరిష్ఠస్థాయిలో కొనుగోలుచేసేందుకు అవసరమైనంత మేర సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని చెప్పారు.

నారు.. ఎక్కడ పడితే అక్కడ కొనేరు!

- అనుమతుల్లేని నర్సరీలు అనేకం..
- బడా కంపెనీ పేరు చెప్పి నాసిరకం విత్తనాలతో పెంచేస్తున్నారు
- ఉద్యానశాఖ తనిఖీల్లో వెలుగుచూస్తున్న వాస్తవాలు



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లిలో లైసెన్సు లేకుండా నడుస్తున్న నర్సరీలోని మిరప నారును తనిఖీ చేస్తున్న ఉద్యాన అధికారి


ఈనాడు, హైదరాబాద్: 'అధిక దిగుబడినిచ్చే విత్తనాలతో పెంచిన నారు ఇది. దీన్ని తీసుకుంటే మీ పంట పండినట్లే' అని చెప్పి రైతులకు విక్రయిస్తూ నర్సరీలు మోసాలకు పాల్పడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు నర్సరీలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిగా అన్నదాతలను ముంచేస్తున్నారు. ఇకపై వీటన్నింటినీ తనిఖీ చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉద్యానశాఖ క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. నర్సరీ చట్టం ఉమ్మడి రాష్ట్రంలోనే వచ్చినా దాన్ని ఇప్పటి వరకు సరిగా అమలు చేయలేదు. గత జనవరి నుంచి ఈ చట్టంలో మరిన్ని కఠిన నిబంధనలు చేరుస్తూ ఉద్యానశాఖ కొత్త ఉత్తర్వులిచ్చింది. గతేడాది మిరప, టమాటా, ఇతర కూరగాయల పంటల నారు కొని రైతులు మోసపోయారు. మిరప రైతుల నష్టాలపై విచారణ చేయగా నర్సరీల్లో జరుగుతున్న మోసాలు వెలుగులోకి వచ్చాయి. కొందరు దళారులు, వ్యాపారులు గ్రామాల్లో ఇష్టారీతిగా నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న బహుళ జాతి కంపెనీల విత్తనాలతో నారు పెంచుతున్నట్లు ప్రచారం చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారు. ఉదాహరణకు ఓ బహుళ జాతి కంపెనీ టమాటా విత్తనాల ధర కిలో రూ.80 వేలుండగా స్థానిక కంపెనీలవి రూ.20 వేలలోపే ఉంది. దీంతో స్థానిక కంపెనీలు, రైతుల నుంచి సేకరించిన విత్తనాలతో నర్సరీల్లో నారు పెంచుతున్నారు.

రికార్డుల్లో వివరాలు రాయాలి..

- ప్రతి నర్సరీలో నారు పెంచేందుకు హరితపందిరి తరహా ఏర్పాట్లు ఉండాలి. ఆరుబయట వాతావరణంలో నారు పెంచడం నేరం.
- ఏ కంపెనీ నుంచి విత్తనాలు కొన్నారు? వాటి జన్యు లక్షణాలేమిటి? అవి ఎక్కడ ఉత్పత్తయ్యాయి? అక్కడ విత్తు పంటకు వచ్చిన దిగుబడి ఎంత, రైతు సాధారణ పొలంలో సాగుచేస్తే ఎంత దిగుబడి వస్తుంది..? వంటి వివరాలు, బిల్లులన్నీ నర్సరీ యజమాని వద్ద ఉండాలి. రైతులడిగితే వీటిని చూపాలి.
- రైతుకు అమ్మే మిరప నారు వయసు 40-45 రోజులు, ఎత్తు 15-24 సెంటీమీటర్లుండాలి.
- కనీసం 7-8 ఆకులతో 20 సెం.మీ. ఎత్తు ఉంటేనే టమాటా మొక్కలు అమ్మాలి. నారు అమ్మిన తర్వాత దాని వివరాలు ఐదేళ్ల పాటు భద్రపరచాలి. ఆలోగా రైతులు ఎప్పుడు ఫిర్యాదుచేసినా సాక్ష్యాలన్నీ వెల్లడించాలి.
- ఏదైనా మోసం చేస్తే ఏడాది పాటు జైలుశిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తారు.


రాష్ట్రంలో వేలాది నర్సరీలున్న మాట వాస్తవమేనని, అన్నింటినీ తనిఖీ చేసి లైసెన్సు ఇస్తున్నామని, ఇప్పటికి 110 ఇచ్చినట్లు ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి చెప్పారు. నారు పెంపకంలో మోసాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఇకపై రైతులంతా ఉద్యానశాఖ లైసెన్సు ఉన్న నర్సరీల్లోనే నారు కొనాలని సూచించారు. లైసెన్సు లేకుండా ఎవరైనా నారు అమ్ముతుంటే ఫిర్యాదు చేయాలన్నారు.

మాయ చేస్తారు.. జాగ్రత్త!



తుమ్మ బాల్‌రాజ్
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఆర్థిక విషయాల్లో ఎంతో అప్రమత్తత అవసరం. లేకుంటే.. మోసగాళ్లు, మోసపూరిత పథకాల బారిన పడి మన కష్టార్జితాన్ని కోల్పోవాల్సి వస్తుంది. ఎప్పటికప్పుడు కొత్త మార్గాల్లో ఆర్థిక మోసగాళ్లు ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నారు. దీన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు మనం సన్నద్ధంగా ఉండాలి. వారి ఎత్తులకు పైఎత్తులు వేయగలగాలి. అప్పుడే బాధితుల జాబితాలో మన పేరు లేకుండా చూసుకోగలం.



అధిక వడ్డీ ఆశ...

ఏ పథకమైనా ఒకటి రెండు నెలల్లోనే రెట్టింపు రాబడులు ఇవ్వదు. ఇది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన విషయం. ఇటీవల కాలంలో ఆర్థిక మోసాలను గమనిస్తే.. స్వల్ప కాలంలో అధిక రాబడి ఆశతోనే చాలామంది లక్షలకు లక్షల రూపాయలు కోల్పోతున్నారు. ఇలాంటి పథకాల్లో కొన్నాళ్లు బాగానే ఉంటుంది. ముందు మదుపు చేసిన వారికి తర్వాత వారి నుంచి వచ్చిన డబ్బుతో కొన్నాళ్ల పాటు బాగానే చెల్లిస్తారు. ఆ తర్వాతే అసలు చిక్కులన్నీ వస్తాయి. చెల్లింపులు ఆగిపోవడంతోపాటు.. అసలు మొత్తం కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఇలాంటిదే ఇంకోటి.. ఒక పథకంలో మీరు చేరండి.. మీతోపాటు మరో ముగ్గురిని చేర్పించండి.. అంటూ వచ్చే గొలుసుకట్టు పథకాలు. ఇవి కూడా ముందు చెప్పినట్లుగానే చెల్లింపులు చేస్తాయి. సభ్యుల సంఖ్య పెరిగిన తర్వాత.. మొత్తానికే మోసం చేసేస్తారు. ఇవన్నీ కూడా ఎలాంటి నియంత్రణ లేని పథకాలు, సంస్థల ద్వారానే జరుగుతాయి.

ఏం చేయాలి?: ఏ పథకమైనా ఒకటి రెండు నెలల్లో రెట్టింపు లాభాలను ఇస్తుందని ప్రకటిస్తే.. అది కచ్చితంగా మోసమే అని గుర్తించండి. పెట్టుబడులు పెట్టేప్పుడు సంస్థలకు ఉన్న గుర్తింపును ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయండి. నిజంగా అధీకృత గుర్తింపు ఉంటేనే పెట్టుబడి పెట్టాలా వద్దా అనేది ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

వ్యక్తిగత రుణాలిస్తామంటూ..

తక్కువ వడ్డీకి.. అధిక మొత్తంలో వ్యక్తిగత రుణం ఇస్తామంటూ తరచూ ఫోన్లు, ఈమెయిళ్లు వస్తుంటాయి.. ఐటీ రిటర్నుల లాంటి పత్రాలు అక్కర్లేదంటూ చెబుతుంటారు. ముందుగా రూ.2,500- రూ.5,000 వరకూ పరిశీలన రుసుముల కింద చెల్లించాలని చెబుతుంటారు. ఈ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సిందిగా సూచిస్తారు. సాధారణంగా ఇవి వ్యక్తిగత ఖాతాలు, నిర్మాణ సంస్థల పేరిట, లేదా ఏదైనా ప్రైవేటు సంస్థ పేరుపై ఉంటాయి. ఆ తర్వాత రెండు మూడు రోజులకు మీకు రుణం మంజూరు చేసామనే ఉత్తరం వస్తుంది. ఇదీ నకిలీదే. ఇక నుంచి అసలు కథ ప్రారంభం అవుతుంది.. రుణం మొత్తం మీ ఖాతాలో జమ చేసే ముందు ప్రాసెసింగ్ రుసుము కింద కొంత మొత్తం చెల్లించాలని పేర్కొంటారు. ఇది రూ.25వేల నుంచి రూ.1,00,000 వరకూ కూడా ఉండొచ్చు. రుణ దరఖాస్తుతో పాటు మీ పాన్, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర ముఖ్యమైన పత్రాలన్నీ జత చేయాలని చెప్పి, వాటిని సేకరిస్తారు.. ఆ తర్వాత ఇక కనిపించరు..

ఇదే తరహాలో.. తనఖా రుణాలను కూడా ఆస్తుల అసలు విలువకంటే, చాలా అధిక మొత్తంలో ఇప్పిస్తామని చెబుతుంటారు. ముందుగా 5-10శాతం కమిషన్ ఇవ్వాలంటారు. ఆస్తికి సంబంధించి సర్వేకు వచ్చినట్లు నటిస్తుంటారు. నకిలీ గుర్తింపు కార్డులు కూడా ఉంటాయి. మీరు నిజమే అని నమ్మి కమిషన్ చెల్లించిన తర్వాత ఇక వారి నుంచి ఏ స్పందనా ఉండదు.

ఏం చేయాలి?: ముందే కొంత మొత్తాన్ని జమ చేయాలని కోరుతున్నారంటే అది కచ్చితంగా మోసమే అని గుర్తించాలి. మీకు నిజంగా అవసరం ఉన్నప్పుడే వ్యక్తిగత రుణం జోలికి పోవాలి. అంతేకానీ, ఇస్తున్నారు కదా అని తీసుకోవడం ఆర్థికంగా ఏ మాత్రం మంచిది కాదు. ఇక మీకు ఇలాంటి ఫోన్లు వస్తే.. ముందుగా మీ బ్యాంకు, లేదా ఆ ఫోన్‌లో చెప్పిన సంస్థ వినియోగదారుల సేవా కేంద్రానికి మీరే స్వయంగా ఫోన్ చేయండి. పూర్తి వివరాలు తెలుసుకోండి. బ్యాంకు/రుణ సంస్థ అధీకృత వ్యక్తులకు మాత్రమే మీకు సంబంధించిన ముఖ్యమైన పత్రాలను అందించండి. కమిషన్ ఇస్తే చాలు.. మీకు కావాల్సినంత మొత్తం ఇప్పిస్తాం అంటూ వచ్చే వారిని ప్రోత్సహించకండి.

చెక్కులతోనూ..

ఇదో కొత్త తరహా మోసం.. ఇటీవలే నోయిడాలో 6కేసులు నమోదయ్యాయి.. వ్యక్తిగత రుణం, క్రెడిట్ కార్డులు ఇస్తామంటూ.. తరచుగా ఫోన్ చేస్తారు. బ్యాంకు అధీకృత వ్యక్తులం అంటూ నమ్మించి, మిమ్మల్ని వ్యక్తిగతంగా కలుస్తారు.. పాన్, ఆధార్, టెలిఫోన్ బిల్లు, చిరునామా ధ్రువీకరణలు, ఫొటోలు.. ఇలా అన్నీ తీసుకొంటారు. పత్రాల మీద సంతకాలు చేయిస్తారు. రద్దు చేసిన, ఖాళీ చెక్కులను సంతకం చేసి ఇవ్వాల్సిందిగా సూచిస్తారు. డబ్బులు అడగటం లేదు కాబట్టి, మనకూ అనుమానం రాదు. ఇక్కడే మోసగాళ్లు తెలివి ప్రదర్శిస్తారు. సంతకాలన్నీ వారు ఇచ్చిన పెన్నుతోనే చేయాల్సిందిగా అడుగుతారు. ఈ పెన్నుతో మీరు చెక్కుపై 'క్యాన్సిల్' అని రాసిన అక్షరాలను ఏ మాత్రం అనుమానం రాకుండా సులువుగా చెరిపేందుకు వీలుంటుంది. ఆ తర్వాత ఆ చెక్కుపై మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బును రాసేసుకొని, ఆ మొత్తాన్ని తమ ఖాతాలోకి మళ్లిస్తారు. కొన్నిసార్లు మీ మొబైల్ నెంబరుపై కొత్త సిమ్ కార్డు కూడా తీసేసుకొని, ఓటీపీల్లాంటివి వారికే వచ్చేలా చూసుకుంటారు. బ్యాంకుకు వెళ్తే తప్ప మనం మోసపోయామనే సంగతి తెలియదు.

ఏం చేయాలి?: రుణం ఇస్తామని ఎవరైనా ఫోన్ చేసినా, వ్యక్తిగతంగా వచ్చి కలిసినా.. వారి గుర్తింపు కార్డులను పరిశీలించాలి. వారి గుర్తింపు కార్డును ఫోనులో ఫొటో తీసుకొని పెట్టుకోవాలి. పత్రాలు ఇచ్చే ముందు బ్యాంకుకు ఫోన్ చేసి, అధీకృత వ్యక్తి ఎవరు, అతని పేరు, ఫోన్ నెంబరులాంటివి తీసుకొని పెట్టుకోవాలి. మీ దగ్గర ఉన్న పెన్నుతోనే సంతకం చేయడం, చెక్కును క్యాన్సిల్ చేసినప్పుడు తేదీ, మొత్తం రాసే చోట కూడా పూర్తిగా గీతలు కొట్టేయాలి.

ఐఆర్‌డీఏ పేరుతో...

రద్దయిన పాలసీ నుంచి డబ్బు ఇప్పిస్తాం.. లేదా మీరు ఇప్పటికే తీసుకున్న పాలసీకి చెల్లించిన కమిషన్‌ను తిరిగి మీ ఖాతాలో జమ చేస్తాం.. అంటూ ఐఆర్‌డీఏ లేదా ఇన్సూరెన్స్ వెరిఫికేషన్ డిపార్ట్‌మెంట్ పేర్లతో ఫోన్లు వస్తుంటాయి. రద్దయిన పాలసీల నుంచి డబ్బు వెనక్కి అనగానే మనం కొంత ఆసక్తి చూపిస్తాం కదా! అదే మోసగాళ్లకు వరం! ఆ డబ్బును మీ ఖాతాలోకి జమ చేసేందుకు బ్యాంకు ఖాతా వివరాలను తెలియజేయాల్సిందిగా కోరతారు. మీ ఖాతా మీకు సంబంధించిందే అని ధ్రువీకరించడం కోసం.. మీ ఖాతా నుంచి కొంత సొమ్మును వారు పేర్కొన్న ఖాతాలోకి జమ చేయమంటారు.. లేదా కొత్త పాలసీనేదైనా తీసుకోమని కోరుతుంటారు. మీరు అలా జమ చేశారా? ఇక అంతే సంగతులు! ఆ డబ్బు గురించి మర్చిపోవాల్సిందే.

ఏం చేయాలి?: బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏ) ఎప్పుడూ పాలసీదారులకు నేరుగా ఫోన్లు చేయడంగానీ, ఈమెయిల్ పంపించడంలాంటివి చేయదు. పాలసీదార్లను అప్రమత్తం చేసేందుకు మాత్రమే సందేశాలను పంపిస్తుంటుంది. క్లెయింలు, కొత్త పాలసీల్లాంటి వాటి గురించి మాట్లాడితే.. వెంటనే ఫోన్ పెట్టేయండి. అవసరమైతే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయండి.

ఈ షేర్లు కొనండి...

ఫలానా షేర్లు కొంటే.. ఈ రోజు ఇంత లాభం వస్తుంది అంటూ సంక్షిప్త సందేశం వస్తుంది.. వివరాల కోసం.. ఈ ఫోన్ నెంబర్లో సంప్రదించండి అని సూచిస్తారు. వారిని సంప్రదించినప్పుడు.. వివరాలు తెలియజేసేందుకు కొంత రుసుము చెల్లించాలంటారు. అన్నీ పూర్తయ్యాక.. కొన్ని షేర్ల పేర్లు చెప్పి, వాటిలో మదుపు చేయాలని సూచిస్తుంటారు. ఇవన్నీ ఆపరేటింగ్ షేర్లే అయ్యుంటాయి. ఇలాంటి వాటిలో మదుపు చేసినప్పుడు మీరు మీ పెట్టుబడిని పూర్తిగా కోల్పోయే అవకాశం ఉంది.

ఏం చేయాలి?: షేర్ మార్కెట్‌లో మదుపు చేసేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎవరో చెప్పారని ఒక షేరును కొనడం ఎప్పుడూ శ్రేయస్కరం కాదు. పూర్తిగా అవగాహన ఉన్నప్పుడే నేరుగా షేర్లలో మదుపు చేయాలి. నమ్మకమైన స్టాక్ బ్రోకర్‌ను ఎంచుకొని, వారి ద్వారా మాత్రమే లావాదేవీలను పూర్తి చేయాలి.

డిపాజిట్లు తీసుకోవడం...

కొన్ని సంస్థలు తాము డిపాజిట్లను స్వీకరిస్తున్నామంటూ.. బ్యాంకు వడ్డీతో పోలిస్తే 2-3 శాతం వరకూ అధిక వడ్డీ ఇస్తున్నామంటూ పేర్కొంటాయి. ఏజెంట్లకు అధిక కమిషన్ల ఆశ చూపి, డిపాజిట్‌దారులను చేర్పించేలా ప్రోత్సహిస్తాయి. ఇందులో కొన్ని ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏలాంటి నియంత్రణ సంస్థల గుర్తింపు ఉన్నట్లు కూడా నకిలీ ధ్రువీకరణలు చూపిస్తాయి. కరపత్రాల రూపంలో ప్రచారం చేస్తుంటాయి. మొదటి ఆరేడు నెలలు అధిక వడ్డీ చెల్లిస్తాయి. కానీ, ఆ తర్వాత బిచాణా ఎత్తేస్తాయి.

ఏం చేయాలి?: ఒక సంస్థ తమకు గుర్తింపు ఉందని చెబితే.. అది వాస్తవమా? కాదా? అని ధ్రువీకరించుకోవాలి. దీనికోసం నియంత్రణ సంస్థల వెబ్‌సైట్లను పరిశీలించవచ్చు. పెట్టుబడులు పెట్టేప్పుడు నష్టభయాన్ని కూడా అంచనా వేసుకోవాలి. నియమ నిబంధనలను స్పష్టంగా తెలుసుకోవాలి.

ఇలా కూడా ఉంటాయి...

✦ మీ వ్యక్తిగత వివరాలను బ్యాంకులో 'అప్‌డేట్' చేసుకోవాలని సూచిస్తూ ఒక మెయిల్ వస్తుంది. చూడ్డానికి అచ్చం మీ బ్యాంకు వెబ్‌సైటులాగానే ఉంటుంది.. ఇందులో మీ వ్యక్తిగత వివరాలు.. ప్రస్తుత పాస్‌వర్డ్‌లాంటివి అన్నీ అడుగుతారు. మీరు వివరాలు పూర్తి చేసిన క్షణాల్లో మీ ఖాతాలో డబ్బు మాయం అవుతుంది.

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. వ్యక్తిగత వివరాలను బ్యాంకు ఎప్పుడూ అడగదు. ఒకవేళ అడిగినా మీకు సమీపంలోని బ్యాంకు శాఖకు వెళ్లాలని సూచిస్తుంది.

✦ క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు స్కిమ్మింగ్ తదితర ప్రక్రియల ద్వారా తస్కరిస్తారు. మీ వ్యక్తిగత రహస్య సంఖ్యను నమోదు చేసేప్పుడు దాన్ని తెలివిగా గ్రహించి, మీ కార్డును కొనుగోళ్ల కోసం ఉపయోగిస్తారు.

మీరు చేయని వ్యవహారాలకు సంబంధించిన సమాచారం రాగానే వెంటనే కార్డు సంస్థకు ఫోన్ చేసి కార్డును తాత్కాలికంగా నిలిపి వేయాల్సిందిగా సూచించాలి.

✦ బహుమతులు, లక్కీ డ్రాలో విజేతలు... కోట్ల రూపాయలను మీరు గెల్చుకున్నట్లుగా వచ్చే ఈ సందేశాలకు ఎప్పుడూ స్పందించవద్దు. పేరు, ఖాతా వివరాలు, చిరునామాలాంటివి పంపించకండి. ఏ పరిస్థితుల్లోనూ డబ్బును వారి ఖాతాల్లో జమ చేయకండి.

గుర్తుంచుకోండి...

✦ మీకు సంబంధించిన కీలక సమాచారాన్ని ఎప్పుడూ ఎవరికీ ఇవ్వకండి. వ్యక్తుల, సంస్థల గుర్తింపును పూర్తి స్థాయిలో పరిశీలించాకే వీటిని ఇవ్వండి. ముఖ్యంగా, ఆధార్, పాన్ కార్డుల నకళ్లను ఎవరికీ ఇవ్వకండి.

✦ నియంత్రణ, పారదర్శకత ఉన్న సంస్థలనే పెట్టుబడుల కోసం ఎంచుకోండి.

✦ కొత్త కొత్త ఆర్థిక నేరాలు బయటపడుతూనే ఉన్నాయి. ఇలాంటి వాటి గురించి పత్రికల్లో వస్తూనే ఉంటాయి. వీటి గురించి తెలుసుకోవాలి. మనం ఆ మోసాల బారిన పడకుండా అప్రమత్తం కావాలి.

✦ మీ డెబిట్, క్రెడిట్ కార్డులను ఇతరులు వినియోగించకుండా చూసుకోండి. పిన్ వివరాలు ఎవరికీ చెప్పకండి. నెలకోసారి మీ ఖాతా వివరాలు, మీ కార్డు లావాదేవీలను సరిచూడండి.

✦ పూర్తి సురక్షితం, నమ్మకమైన వెబ్‌సైట్ల నుంచి మాత్రమే కొనుగోళ్లు చేయండి. మోసపోయినట్లుగా గమనిస్తే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

✦ ఏదైనా పథకంలో చేరేందుకు దరఖాస్తు పత్రం పూర్తి చేస్తుంటే.. నియమ నిబంధనలు పూర్తిగా తెలుసుకోండి. చిన్న అక్షరాల్లో మనకు ఇబ్బంది కలిగించే షరతులు ఎన్నో ఉంటాయి. వీటిని గమనించకుండా సంతకం చేసేస్తే.. తర్వాత వచ్చే ఇబ్బందులకు బాధ్యత వహించాల్సింది మనమే.

రిటర్నులు దాఖలు చేయలేదా?



పరిమితికి మించిన ఆదాయం ఉన్నవారు.. నిబంధనల మేరకు ఆదాయపు పన్ను చెల్లించి, రిటర్నులు దాఖలు చేయాల్సిందే. 2016-17 ఆర్థిక సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్ 2017-18) రిటర్నులు సమర్పించే గడువు తేదీ ఆగస్టు 5తో ముగిసింది. మరి, దీన్ని పూర్తి చేయలేకపోతే ఏం జరుగుతుంది? ఇప్పటికీ అవకాశం ఉందా?

ఏప్రిల్ 1, 2016 నుంచి మార్చి 31, 2017 వరకూ ఆర్జించిన ఆదాయ వివరాలకు సంబంధించిన లెక్కలతో ప్రస్తుతం ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయాలి. అయితే, ఆరోగ్యం సహకరించకనో.. ఏదైనా అత్యవసర పని ఉండటం వల్లో.. ఆధార్, పాన్ అనుసంధానం కుదరకపోవడం ఇలా పలు కారణాలతో ఎంతో మంది ఇప్పటికీ రిటర్నులు దాఖలు చేయలేదు. అయినా, ఆందోళన అక్కర్లేదు. ఎందుకంటే.. 2016-17ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటర్నులను మార్చి 31, 2018 వరకూ దాఖలు చేసుకునే వెసులుబాటు చట్టం కల్పిస్తోంది. వాస్తవ గడువు తీరిన తర్వాత కూడా పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు ఆదాయపు పన్ను శాఖ అనుమతినిస్తోంది. అయితే, సమయం ఉంది కదా అని నిర్లక్ష్యం చేయకండి. వీలైనంత తొందరగా దాఖలు చేసేందుకు ప్రయత్నించండి.

నిర్ణీత గడువు తేదీలోపు మీరు రిటర్నులు దాఖలు చేయకపోవడం వల్ల మీరు కొన్ని ప్రయోజనాలు కోల్పోయే అవకాశం ఉంది. పన్ను రిఫండు మీద వడ్డీ చెల్లించకపోవడం లేదా మీరు పన్ను బాకీ పడితే దానిపై కాస్త అధిక వడ్డీని విధించే ఆస్కారం ఉంది.

రిఫండు రావాల్సి ఉంటే..

ఉద్యోగులు తాము చెల్లించాల్సిన పన్ను కన్నా అధికంగా చెల్లించిన సందర్భాల్లో వారికి రిఫండు లభిస్తుంది. ఈ రిఫండుపై ఏప్రిల్ 1 నుంచి 0.5శాతం వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తుంది. గడువు తీరిన తర్వాత రిఫండును దాఖలు చేసినా.. రిఫండును పొందే అవకాశం ఉంది. అయితే, వడ్డీ పొందేందుకు మాత్రం వీలుపడదు.

పన్ను చెల్లించాలా?

మీరు పన్ను చెల్లించాల్సి ఉన్నప్పుడు గడువు తేదీలోగా రిటర్నులు దాఖలు చేసి, చెల్లించాల్సిన పన్నును చెల్లించేయాలి. ఇప్పుడు గడువు తేదీ ముగిసింది కాబట్టి, సెక్షన్ 234 ఏ కింద రిటర్నులు దాఖలు చేసి, చెల్లించాల్సిన పన్నుకు అదనంగా 1శాతం వడ్డీని చేర్చి చెల్లించాలి. మీరు ఆలస్యం చేస్తున్న కొద్దీ చెల్లించాల్సిన వడ్డీ పెరుగుతూనే ఉంటుంది.

కొన్నిసార్లు.. ఆలస్యం చేసినందుకు.. ఈ వడ్డీతోపాటు.. అపరాధ రుసుముగా రూ.5వేల వరకూ చెల్లించాలని అసెసింగ్ ఆఫీసర్ అడిగే అవకాశం ఉంది. అయితే, ఇది అసెసింగ్ ఆఫీసర్ విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. మీ ఆదాయపు పన్ను వివరాలను బట్టి, ఈ రుసుము విధించేదీ లేనిదీ ఆధారపడి ఉంటుంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. గడువు తేదీలోపు రిటర్నులు దాఖలు చేయనప్పుడు, ఏదైనా మూలధన నష్టాలు ఉంటే.. వాటిని తదుపరి సంవత్సరానికి సర్దుబాటు చేసుకోవడం కుదరదు.

కారణం ఏదైనా... ఇప్పటికే రిటర్నుల సమర్పణకు ఆలస్యం అయ్యింది. వ్యవధి ఉంది కదా అని మరింత ఆలస్యం చేయకుండా.. వెంటనే రిటర్నుల ప్రక్రియను పూర్తి చేయండి.

- అర్చిత్ గుప్తా, సీఈఓ, ClearTax

పింఛను పథకాలు ఎంచుకోవాలా?

■ **మాకు ఇద్దరు అబ్బాయిలు. వారి పేరుమీద ఏదైనా జీవిత బీమా పాలసీలు తీసుకోవాలని అనుకుంటున్నాను. ఇది మంచి ఆలోచనేనా? నా పేరు మీద రూ.2లక్షల బీమా మాత్రమే ఉంది. నెలకు రూ.5వేల వరకూ పెట్టుబడి పెట్టేందుకు ఏ పథకాలు ఎంచుకోవాలి? -దుర్గాప్రసాద్**

✿ పిల్లల పేరుమీద బీమా పాలసీ తీసుకోవాలనుకోవడం కన్నా.. మీ పేరుమీదే పాలసీ తీసుకోవడం ఉత్తమం. మీకున్న బాధ్యతలను బట్టి చూస్తే మీరు తీసుకున్న బీమా మొత్తం ఏమాత్రం సరిపోదనిపిస్తోంది. ముందుగా మీ వార్షికాదాయానికి 10 రెట్ల వరకూ జీవిత బీమా రక్షణ ఉండేలా చూసుకోండి. దీనికోసం ఆన్‌లైన్ టర్మ్ పాలసీలను పరిశీలించవచ్చు. ఇక పెట్టుబడి విషయానికి వస్తే.. 15ఏళ్ల వ్యవధితో ఉండే ప్రజా భవిష్య నిధిలో రూ.2వేలు మదుపు చేయండి. మిగతా రూ.3వేలను ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లకు కేటాయించండి. మీ ఆదాయం పెరిగినప్పుడు ఫండ్లలో పెట్టుబడిని పెంచుకోండి.



■ **నా వయసు 47ఏళ్లు. నెలకు రూ.16వేలు చొప్పున నేను పదవీ విరమణ చేసే వరకూ మదుపు చేయాలని ఆలోచిస్తున్నాను. పింఛను వచ్చేలా ఉండేందుకు ఎలాంటి పథకాలు తీసుకోవాలి? - శంకర్**

✿ ఇప్పటి వరకూ ఎలాంటి పెట్టుబడులు పెట్టకపోయినా.. భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకొని, ఇప్పటి నుంచైనా మదుపు ప్రారంభించడం ఎంతో అవసరం. మీరు రూ.16వేలను ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో దీర్ఘకాలానికి మదుపు చేయండి. ఇలా రూ.16 వేలను 15శాతం రాబడినిచ్చే ఫండ్లలో 13ఏళ్లపాటు మదుపు చేస్తే.. దాదాపు రూ.17లక్షల వరకూ సమకూరే అవకాశం ఉంది. మీరు పదవీ విరమణ చేసే నాటికి వచ్చే ఇతర ప్రయోజనాలు, ఈ మొత్తం కలిపి, అప్పటి పరిస్థితులకు అనువుగా ఉన్న పింఛను పథకాలను ఎంచుకోవచ్చు.

నష్టభయం తక్కువగా..

కొత్త పథకం

బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గుతుండటంతో ఇప్పుడు చాలా మంది ప్రత్యామ్నాయ పెట్టుబడుల వైపు దృష్టి సారిస్తున్నారు. దీంతో డెట్ ఆధారిత పథకాలు వెలుగులోకి వస్తున్నాయి..

ప్రభుత్వ సెక్యూరిటీలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేట్ బాండ్లలో మదుపు చేసే వ్యూహంతో అందుబాటులోకి వచ్చిన పథకం ఎస్‌బీఐ డెట్ ఫండ్ సిరీస్ సి-2. ఈ పథకం క్రమం తప్పని రాబడిని అందించడంతోపాటు, పెట్టుబడి వృద్ధికి తోడ్పడేలా పెట్టుబడులు కేటాయిస్తుంది. ఇది క్లోజ్ ఎండెడ్ పథకం. ఇందులో కనీస పెట్టుబడి రూ.5వేలు. పెట్టిన పెట్టుబడిని కనీసం 1100 రోజులపాటు కొనసాగించాలి. ఎన్ఎఫ్ఓ చివరి తేదీ ఆగస్టు 18.

చికిత్స.. నగదు రహితంగా..

కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అత్యవసరంగా ఆసుపత్రిలో చేరినప్పుడు ఉండే ఆందోళన అంతా ఇంతా కాదు. దీంతో పాటు.. ఆర్థికంగా కూడా కొన్నిసార్లు ఇబ్బందులు తప్పకపోవచ్చు. చాలా కుటుంబాలు ఈ ఆర్థిక అత్యవసర స్థితికి సిద్ధంగా ఉండవు. కానీ, మంచి ఆరోగ్య బీమా పాలసీ ఉంటే.. ఇలాంటప్పుడు ఎంతో ఉపశమనంగా ఉంటుంది. పాలసీ ఉండగానే సరిపోదు.. నగదు రహిత చికిత్సకు కూడా ఎలాంటి ఆటంకం ఉండకూడదు.

సాధారణంగా ఆరోగ్య బీమా పాలసీలు.. పాలసీదారుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరినప్పుడు రెండు రకాలుగా పరిహారాన్ని అందిస్తుంటాయి. పూర్తి ఖర్చులను పాలసీదారుడే భరించిన తర్వాత.. ఆ ఖర్చులను తిరిగి చెల్లించడం. రెండో విధానంలో బీమా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న ఆసుపత్రిలో చేరినప్పుడు, చికిత్స పూర్తిగా నగదు రహితంగా ఉండేలా వెసులుబాటు కల్పించడం. ఇందులో నగదు రహిత చికిత్స విధానమే ఎంతో సులువైనది. ముందు బిల్లులన్నీ పాలసీదారుడు చెల్లించి, ఆ తర్వాత క్లెయిం చేసుకోవడం అంటే.. కొంత ఇబ్బందికరమే.

అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రిలో చేరినప్పుడు, 24 గంటల్లోగా బీమా సంస్థకు సమాచారం ఇవ్వాలి. మీరు బీమా సంస్థ నెట్‌వర్క్ ఆసుపత్రిలో చేరినప్పుడు మీ దగ్గరున్న ఆరోగ్య బీమా కార్డును సమర్పించాలి. మిగతా పనిని ఆసుపత్రి వారే చూసుకుంటారు. అన్నీ సరిగా ఉంటే.. మీరు వివరాలు పంపించిన 4గంటల్లోగా చికిత్సకు అవసరమైన మొత్తాన్ని పరిహారంగా అందిస్తున్నట్లు సమాచారం అందుతుంది.

◗ కొన్నిసార్లు ఆసుపత్రిలో చేరేందుకు కొంత వ్యవధి దొరుకుతుంది. ఇలాంటప్పుడు ముందుగానే బీమా సంస్థ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. మీకు సమీపంలో ఉన్న నెట్‌వర్క్ ఆసుపత్రి నుంచి చికిత్సకు సంబంధించిన సమాచారాన్ని బీమా సంస్థకు



పంపించాలి. అక్కడి నుంచి సమాచారం వచ్చాకే ఆసుపత్రిలో చేరడం ఉత్తమం.

నిబంధనలు తెలుసుకోండి..

నగదు రహిత చికిత్సను అందించడంలో బీమా సంస్థల మధ్య కొన్ని వ్యత్యాసాలు ఉంటాయి. కాబట్టి, పాలసీని ఎంచుకునేప్పుడే ఆయా బీమా సంస్థలకు సంబంధించిన నియమ నిబంధనలను పూర్తిగా ఆకళింపు చేసుకోవాలి. దాదాపు అన్ని పాలసీల్లోనూ ఆసుపత్రిలో అయ్యే వైద్య ఖర్చులకు పరిహారం లభిస్తుంది. చికిత్సేతర వ్యయాలైన నమోదు రుసుము తదితర ఖర్చులకు మాత్రం బీమా వర్తించదు. కొన్ని పాలసీల్లో ముందస్తు వ్యాధులకు, హెచ్ఐవీ/ఎయిడ్స్‌లాంటి వాటికి, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తూ ప్రమాదాల బారిన పడి, గాయాల పాలైనప్పుడు పరిశోధనలకు సంబంధించిన చికిత్సలు, కీళ్ల మార్పిడి, యుద్ధం సందర్భంలో గాయాలు తదితరాలకు పరిహారం లభించదు. మొత్తం చికిత్స వ్యయంతో సంబంధం లేకుండా.. నిర్ణీత శాతం వరకే పరిహారం ఇస్తామనే పాలసీలూ ఉంటాయి. కాబట్టి, ఏ పాలసీ తీసుకుంటున్నారన్నది ముందే తెలుసుకోవడం ఎంతో ముఖ్యమైన విషయం.

ఎంచుకునేప్పుడే..

మీరు ఎంచుకున్న పాలసీలో నగదు రహిత చికిత్సకు సంబంధించి మీరు తీసుకున్న పాలసీ ఎలాంటి నిబంధనలు విధిస్తోందో తెలుసుకోండి. బీమా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న ఆసుపత్రుల్లోనే నగదుతో అవసరం లేకుండా చికిత్స చేయించుకోవచ్చు. కాబట్టి, బీమా సంస్థకు ఎన్ని ఆసుపత్రులతో ఒప్పందం ఉందన్నదీ ఇక్కడ కీలకమే. మీకు సమీపంలో ఉన్న ఆసుపత్రులు ఈ జాబితాలో ఉన్నాయా చూసుకోండి.

◗ పాలసీ తీసుకునే తేదీ నాటికే ఉన్న వ్యాధులను ముందస్తు వ్యాధులుగా పరిగణిస్తారు. ఇలాంటివి ఉన్నప్పుడు పాలసీ ప్రతిపాదిత పత్రంలో వాటిని పేర్కొనడం తప్పనిసరి. లేకపోతే క్లెయిం సందర్భంలో ఇబ్బందులు ఎదురుకావచ్చు

◗ మినహాయింపులు, ఉప పరిమితులకు సంబంధించిన వివరాలను ఒకటికి రెండు సార్లు అడిగి తెలుసుకోండి.

వైద్య ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో సరైన మొత్తానికి ఆరోగ్య బీమా ఉండటం ఇప్పుడు ఓ తప్పనిసరి అవసరం. అదనంగా లభించే ప్రయోజనం ఏమిటంటే.. చెల్లించిన ప్రీమియానికి పన్ను మినహాయింపూ లభిస్తుంది.

- సంజయ్ దత్తా, చీఫ్ అండర్ రైటింగ్ క్లెయిమ్స్, ఐసీఐసీఐ లాంబార్డ్

నేను సైతం గాంధీకే వస్తా

- అప్పట్లో ఈ ఆస్పత్రి తీరు దారుణం
- ఇప్పుడు చూస్తే ఎంతో ముచ్చటేస్తోంది
- అధునాతన సేవలెన్నో సమకూర్చారు
- తెలంగాణ వైద్యముఖచిత్రం మారుతోంది
- గవర్నర్ నరసింహన్ వెల్లడి

ఈనాడు - హైదరాబాద్



గాంధీ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన 65 పడకల అత్యవసర చికిత్స విభాగం

'తెలంగాణ ఏర్పడిన కొత్తలో ఒకసారి గాంధీ ఆసుపత్రికి వచ్చా. ఇక్కడి పరిస్థితులు చూసి చాలా కోపం వచ్చింది. ఆవేదన కలిగింది. వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు వైద్యమంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. ఈ విషయాన్ని తర్వాత కేసీఆర్ అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. అది గతం.. ఇప్పుడు ఈ ఆసుపత్రిని చూస్తుంటే ముచ్చటేస్తోంది. వసతులు చాలా బాగున్నాయి. ఇది 'పేదల దవాఖానా కాదు. అందరి ఆసుపత్రి. నేను కూడా ఇక్కడే చికిత్స చేయించుకుంటా' అని గవర్నర్ నరసింహన్ వ్యాఖ్యానించారు. గాంధీలోని అత్యవసర బ్లాక్‌లో 65 పడకల అత్యాధునిక అత్యవసర సేవా విభాగం (ఇంటెన్సివ్ కేర్ యూనిట్), డిజిటల్ రేడియోగ్రఫీ, సిటీస్కాన్, రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను గురువారం ఆయన వైద్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానాలో ఇన్ని సదుపాయాలు అందుబాటులోకి తేవడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేయాల్సింది చేసింది.. వీటి నిర్వహణతోపాటు మెరుగైన సేవలు అందించే బాధ్యత ఇక్కడి వైద్యులు, సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు. ఇక్కడ అందుతున్న సేవలపై అధికారులు నెలానెలా సమీక్షలు నిర్వహించి మరింత మెరుగు పడేలా కృషి చేయాలని గవర్నర్ సూచించారు. మంత్రులు, అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తుండాలన్నారు.

ఫలితాలు కనిపిస్తున్నాయి..

'నేను నమ్మకంగా చెబుతున్నా.. వచ్చే ఒకటి రెండేళ్లలో తెలంగాణలో వైద్య ముఖచిత్రం సమూలంగా మారుతుంది. రాష్ట్రం ఏర్పడి 38 నెలలు అవుతోంది. తొలి ఏడాది అన్నీ సర్దుకోవడానికి సరిపోయింది. రెండో ఏడాది నుంచి పని ప్రారంభమైంది. మూడో ఏడాది ఫలితాలు కనిపిస్తున్నాయి. జిల్లాల్లో కూడా ఇదే తరహాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా వైద్యశాలలు కూడా మారాలి. వైద్యం, విద్య సేవలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది' అని గవర్నర్ పేర్కొన్నారు. ఈ విషయంలో వైద్య ఆరోగ్య శాఖ అద్భుతంగా పనిచేస్తోందని చెప్పారు. మంచి ఫలితాలు కూడా కనిపిస్తున్నాయని ఇందుకు మంత్రి లక్ష్మారెడ్డితోపాటు అధికారులను అభినందిస్తున్నట్లు తెలిపారు. అలాగే గాంధీ దవాఖానా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను బల్దియా మేయర్ బొంతు రామ్మోహన్ తీసుకోవాలని గవర్నర్ సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వ వైద్యం మీద ప్రజలకు నమ్మకం పెరిగిందని అన్నారు. గవర్నర్, సీఎం సూచనలతో గాంధీ ఆసుపత్రిని అన్ని హంగులతో తీర్చిదిద్దామని చెప్పారు.

సంచలనం కోసం వద్దు..


ఇంత పెద్ద ఆసుపత్రిలో చిన్నచిన్న తప్పులు జరుగుతుంటాయని వాటిని భూతద్దంలో పెట్టి సంచలనం చేయవద్దని గవర్నర్ నరసింహన్ మీడియాప్రతినిధులను ఉద్దేశించి హితవు పలికారు. పత్రికలు, ఛానళ్ల దృష్టికి సమస్యలు వస్తే వైద్య మంత్రి, కార్యదర్శి, ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆసుపత్రి ముందు చెత్తకనిపిస్తే దాన్ని చూపండి.. అయితే ఆ చెత్తను ఓ పదిమందితో కలిసి మీరే తీసేసి.. ఇలా చేయాలంటూ ఛానళ్లలో చూపెట్టి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రజలందరికీ ప్రభుత్వ వైద్యశాలల మీద నమ్మకం పెంచాలని గవర్నర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బొంతు రామ్మోహన్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారి, డీఎంఈ డాక్టర్ రమేష్ రెడ్డి, గాంధీ ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న రాంబాబు

ఊపిరితిత్తుల్లో రంధ్రం పూడ్చి ప్రాణం కాపాడారు

- విద్యుదాఘాతానికి గురైన వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్స
- 'ఉస్మానియా' ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణుల ఘనత



ఉస్మానియా ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి నాగప్రసాద్

వేంగళరావునగర్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురైన ఓ యువకుడికి ఉస్మానియా ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో సుమారు రూ.20లక్షల వరకు ఖర్చయ్యే ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను ఉస్మానియా ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులు ఉచితంగా నిర్వహించారు. ఐదుసార్లు శస్త్రచికిత్స నిర్వహించడంతో పాటు ఆరోగ్యశ్రీ పథకంద్వారా ఖరీదైన మందులను వినియోగించడంతో యువకుడు ప్రస్తుతం కోలుకున్నాడు. విజయనగరం జిల్లా కుంచుమ్మదరం గ్రామానికి చెందిన రాంబాబు(22) ఇప్పల్‌లో ఉంటూ కేబుళ్లు అమర్చే పనిచేస్తున్నాడు. మూన్నెల్ల కిందట యూసఫ్‌గూడ సమీపంలో వైర్లు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్‌తీగ తెగి అతని ఒడి మీదేసి ఛాతీపై తాకి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి నాగప్రసాద్ ఆధ్వర్యంలోని వైద్యనిపుణుల బృందం అనస్థీషియా, ఊపిరితిత్తుల విభాగం వైద్యుల సమన్వయంతో రాంబాబుకు ఐదుసార్లు శస్త్రచికిత్సలు నిర్వహించారు. తొలుత తీవ్రంగా కాలిపోయిన చేతిని మోచేతి దాకా శస్త్రచికిత్స చేసి తొలగించారు. తర్వాత ఎడమవైపు భుజం, ఛాతీపైపు ఉన్న కండరాన్ని తొలగించి ఎడమవైపు ఊపిరితిత్తులకు కాలిన గాయాలతో ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న రాంబాబును త్వరలోనే ఇంటికి పంపిస్తామని నాగప్రసాద్ వెల్లడించారు. తన కుమారుడిని కాపాడిన ఉస్మానియా వైద్యులకు రాంబాబు తండ్రి సూరి ధన్యవాదాలు తెలియజేశారు.

కాలుష్య వాహనాలకు బీమా పునరుద్ధరణ వద్దు

సుప్రీం కోర్టు స్పష్టీకరణ

దిల్లీ: వాహన కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు సుప్రీం కోర్టు గురువారం అనేక మార్గదర్శకాలను జారీ చేసింది. కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం (పీయూసీ)లేని వాహనాలకు బీమాను పునరుద్ధరించరాదన్న నిబంధన కూడా ఇందులో ఉంది. జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లోని అన్ని ఇంధన కేంద్రాల వద్ద పీయూసీ సెంటర్లు ఉండేలా చూడాలని స్పష్టంచేసింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి 4 వారాల గడువును ఇచ్చింది. పీయూసీ కేంద్రాల నాణ్యతపై తనిఖీల ప్రక్రియను బలోపేతం చేయాలని, అన్ని సాధనాలూ కలిగిన సంచార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని పర్యావరణ కాలుష్య నియంత్రణ ప్రాధికార సంస్థ (ఈపీసీఏ) సూచించింది. కాలుష్యాన్ని కలిగిస్తున్నట్లు కనపడుతున్న వాహనాలను కట్టడి చేయడానికి ఒక కార్యక్రమాన్ని చేపట్టాలని కోరింది. పీయూసీ కేంద్రాల్లో దాదాపు 96 శాతం వాహనాలు కాలుష్య పరీక్షల్లో ఉత్తీర్ణమవుతున్నట్లు తెలిపింది. ఆ కేంద్రాల్లోని యంత్రాల్లో లోపాలు ఉండటం కానీ ఆ కేంద్రాల పనితీరులో అవకతవకలు చోటుచేసుకోవడం కానీ జరుగుతుండొచ్చని పేర్కొంది. నిబంధనలు పాటించని, అక్రమాలకు పాల్పడే కేంద్రాలకు జరిమానా విధించాలని కోరింది. ఈ సూచనల్లో చాలా వరకూ అమలు చేయాలని ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాలుష్య ఉద్గార నిబంధనలను వాహనాలు పాటిస్తున్నాయా లేదా అన్నది తెలుసుకోవడానికి వాహనాలపై ఒక జాతీయ డేటాబేస్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరింది.

వాణిజ్య పన్నుల శాఖ రాబడి బాగు బాగు

12 శాతం పెరుగుదల నమోదు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో వాణిజ్య పన్నుల శాఖ రాబడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలల్లో గతేడాది కంటే 12 శాతం పెరిగింది. మొదటి నాలుగు నెలల్లో గతేడాది కంటే రూ.1340 కోట్లమేర వాణిజ్య పన్నుల శాఖ రాబడి ఎక్కువగా వచ్చింది. మద్యంపై పన్ను మినహా అన్నింటిలో గతేడాది కంటే ఎక్కువ రాబడి వచ్చింది. జులై నెలలో వాణిజ్య పన్నుల శాఖ వివిధ పన్నుల రాబడి గత ఏడాదితో పోలిస్తే 22 శాతం పెరిగింది. గత ఏడాది జులైలో వాణిజ్య పన్నులశాఖ రాబడి రూ.2853కోట్లు కాగా జులై రాబడి రూ.3500 కోట్లకు పెరిగింది.

జులై వరకు వచ్చిన వాణిజ్య పన్నులశాఖ రాబడి (రూ.కోట్లలో)

విభాగం	2016	2017	పెరుగుదల	పెరుగుదల/ తగ్గుదల శాతం
అమ్మకం పన్ను	5135	6411	1276	24.8
సిగరెట్ల అమ్మకం	168	171	3	1.8
ప్రభుత్వరంగ సంస్థలు	309	382	73	23.6
పెట్రోలు అమ్మకం	2424	2966	542	22.3
మద్యం అమ్మకం	3020	2233	787 (తగ్గింది)	26 (తగ్గుదల)
ఇతరచట్టాలు (వాణిజ్య పన్నులు)	280	513	233	83
మొత్తం	11336	12676	1340	11.8

అది రాజకీయ పునరుజ్జీవ సభ: పొన్నాల

ఈనాడు, దిల్లీ : హామీలు అమలు చేయలేక సీఎం కేసీఆర్ పునరుజ్జీవ సభలు నిర్వహిస్తున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. శ్రీరాంసాగర్ వద్ద నిర్వహించింది కేసీఆర్ రాజకీయ పునరుజ్జీవ సభగా ఆయన అభివర్ణించారు. గురువారమిక్కడ పొన్నాల మీడియాతో మాట్లాడుతూ.. మాటతప్పిన ప్రజానాయకుల్లో కేసీఆర్‌ది అగ్రస్థానమన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నాగార్జునసాగర్, జూరాల, దేవాదుల తదితర ప్రాజెక్టులు మోసపూరితమైనవా అని ప్రశ్నించారు. 60 టీఎంసీలతో రెండు పంటలకు నీళ్లు అంటూ శ్రీరాంసాగర్ ఆయకట్టు ప్రజలను మోసం చేస్తున్నారని పొన్నాల ఆరోపించారు.

సుఖేష్ చంద్రశేఖర్ బెయిల్ అభ్యర్థనపై దిల్లీ పోలీసులకు హైకోర్టు నోటీసులు

చెన్నై, న్యూస్‌టుడే: ఎన్నికల సంఘానికి లంచం ఇవ్వజూపిన కేసులో అరెస్టయిన సుఖేష్ చంద్రశేఖర్ బెయిల్ కోసం అభ్యర్థిస్తూ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై దిల్లీ పోలీసులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. అన్నాడీఎంకేలో శశికళ వర్గం నేత టీటీవీ దినకరన్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నారు. అన్నాడీఎంకే ఎన్నికల చిహ్నాన్ని శశికళ వర్గానికి కేటాయించేలా చేయడానికి ఆయన లంచం ఇవ్వజూపారనే ఆరోపణలు ఉన్నాయి. సుఖేష్ చంద్రశేఖర్ ద్వారా ఈ పని చేయాలని దినకరన్ ప్రయత్నించినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణను వచ్చే నెల 5వ తేదీకి జస్టిస్ అశుతోష్ కుమార్ వాయిదా వేశారు. ఆలోగా నోటీసులకు సమాధానం పంపాలని దిల్లీ పోలీసులను ఆదేశించారు.

రాజ్యాంగ ధర్మాసనానికి నివేదిద్దామా?

- నేరమయ నేతల అనర్హతపై సుప్రీంకోర్టు

దిల్లీ: శిక్షలు పడ్డ నేతలు వారి జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలన్న అభ్యర్థనను రాజ్యాంగ ధర్మాసనానికి నివేదిస్తే ఎలా ఉంటుందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అయిదేళ్లు, అంతకు మించిన శిక్షలు పడే అవకాశమున్న నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు ఉన్న వారిని ఎన్నికల్లో పోటీ చేయనీయకుండా చూడాలా వద్దా అనే విషయం ఇప్పటికే అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించి ఉన్నామని గుర్తు చేసింది. '...ఇక్కడ అభియోగాలు గురించి కాదు, శిక్షలు పడినవారి గురించి ప్రస్తావనకు వచ్చింది. దీని తీవ్రత ఎక్కువ. ఇది రాజ్యాంగ ధర్మాసనానికి వెళ్లాల్సిన అవసరం లేదా?' అని జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ నవీన్ సిన్హాల ధర్మాసనం గురువారం ప్రశ్నించింది. శిక్షలు పడిన రాజకీయ నాయకులు జీవితాంతం కాకుండా కేవలం ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధిస్తున్న ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనల్ని రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలంటూ దాఖలైన ఒక అభ్యర్థనపై ధర్మాసనం విచారణ నిర్వహిస్తోంది.

అలాంటి చట్టాన్ని వారు చేయనివ్వరు...: ప్రస్తుత పార్లమెంటులో 30-40% మంది కళంకిత సభ్యులే ఉన్నారనీ, ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేసే చట్టాన్ని వారు ఎప్పటికీ రానివ్వరని అర్జీదారుని తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులంతా వారి వేతనాల్ని ఏటా పెంచుకోవడంపైనా, కొలీజియాన్ని రద్దు చేయడంపైనా ఆసక్తి చూపిస్తారే గానీ ఇలాంటి చట్టాలు చేయడానికి ఎన్నడూ ముందుకు రారని చెప్పారు. ఈ అంశాన్ని విచారించడానికి ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం సరిపోతుందని పేర్కొన్నారు. అసంపూర్తిగా మిగిలిన వాదనల్ని ఈ నెల 23న కొనసాగించనున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేవారి కనీస విద్యార్హత, గరిష్ఠ వయో పరిమితిలపైనా నిబంధనలు విధించాలని అర్జీదారుడు కోరారు.

తెలంగాణలో ప్రాజెక్టులు చేపట్టండి

కేంద్రమంత్రులకు భాజపా నేతల విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని కేంద్రమంత్రులకు భాజపా నేతలు విజ్ఞప్తి చేశారు. గురువారమిక్కడ కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, సురేశ్‌ప్రభు, అనంతకుమార్, రాధామోహన్‌సింగ్‌లను తెలంగాణ భాజపా అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నేతృత్వంలోని బృందం విజ్ఞప్తి చేసింది. ఉజ్వల పథకాన్ని సెప్టెంబరులో తెలంగాణలో ప్రారంభిస్తామని ధర్మేంద్రప్రధాన్ హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, భూసార పరీక్షల కార్డుల పంపిణీ సరిగా లేదని దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని రాధామోహన్‌సింగ్ వారికి తెలిపారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేయాలని కేంద్ర రైల్వే మంత్రి సురేశ్‌ప్రభుకి విజ్ఞప్తిచేశారు. ఐడీపీఎల్ భూములు ప్రజలకు ఉపయోగపడేలా అనుమతిస్తామని కేంద్రమంత్రి అనంతకుమార్ వారికి హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రులను కలిసిన బృందంలో కేంద్రకార్మిక మంత్రి దత్తాత్రేయ, భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, చింతల, ఎమ్మెల్సీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి తదితరులు ఉన్నారు.

లోక్‌సభలో 'వేతనాల నియమావళి' బిల్లు

కార్మికుల హక్కులు పదిలం : దత్తాత్రేయ

దిల్లీ: అసంఘటిత రంగంలో 40 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం చేకూర్చే 'వేతనాల నియమావళి' బిల్లును ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్రానికి సార్వత్రిక కనీస వేతనాలను నిర్ణయించే సాధికారితకు ఉద్దేశించిన ఈ బిల్లును కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ ప్రవేశపెట్టారు. వేతనాల చెల్లింపు చట్టం 1936, కనీస వేతనాల చట్టం 1948, బోనస్ చెల్లింపు చట్టం 1965, సమాన ప్రతిఫల చట్టం 1976.. ఈ నాలుగింటినీ ఏకం చేస్తూ బిల్లును రూపొందించారు. ఈ బిల్లు కార్మికుల హక్కులను ఏవిధంగానూ ఉల్లంఘించదని మంత్రి స్పష్టం చేశారు. వేతనాల్లో చరిత్రాత్మక మార్పులను తీసుకొస్తుందని.. తొలిసారి సార్వత్రిక కనీస వేతనాలు అమలవుతాయని వివరించారు. కాగా స్వల్పకాల వ్యవధిలో బిల్లును ప్రవేశపెట్టడాన్ని ఆర్ఎస్‌పీకి చెందిన ప్రేమచంద్రన్ వ్యతిరేకించారు.

ఎఫ్ఆర్‌డీఐ బిల్లు..ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తుండగా.. 'ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లు, 2017'ను ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ బిల్లును ప్రవేశపెట్టారు.

టెంట్ డెకరేటర్ల రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి

- జీఎస్టీ నుంచి రాయితీ కల్పించాలి: ఏఐటీడీడబ్ల్యూఏ డిమాండ్
- రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రారంభమైన సంఘం జాతీయ సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: టెంట్ డెకరేటర్ల రంగాన్ని పరిశ్రమగా గుర్తించి జీఎస్టీ నుంచి ప్రత్యేక రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత టెంట్ డెకరేటర్స్ సంక్షేమ సంఘం(ఏఐటీడీడబ్ల్యూఏ) డిమాండ్ చేసింది. రామోజీ ఫిల్మ్‌సిటీలో అఖిల భారత టెంట్ డెకరేటర్స్ సంక్షేమ సంఘం 16వ జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. 13వ తేదీవరకు కొనసాగే ఈ సదస్సును ఏఐటీడీడబ్ల్యూఏ అధ్యక్షుడు మనోహర్‌లాల్ గులాటీ, ఛైర్మన్ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి అనిల్‌రావు, జాతీయ వైస్‌ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరజ్‌సింగ్ మల్హోత్ర, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ పవన్‌సేట్, సీనియర్ వైస్‌ఛైర్మన్ రవిజిందాల్, ప్రతినిధులు గిరీష్‌మిరల్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తౌఫిఖ్‌ఖాన్, ప్రతినిధులు ముల్తాఅజీజ్, మన్‌మోహన్‌చౌహాన్, ఎస్.ఎస్.మక్కర్, శాంతపాల్.బి తదితరులతో పాటు కమిటీ సభ్యులు, ఆయా రాష్ట్రాల ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశంలోని టెంట్ డెకరేటర్ల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమంపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.





హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీలో గురువారం ప్రారంభమైన జాతీయ సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అఖిలభారత టెంట్ డెకరేటర్ల సంక్షేమ సంఘం వైస్ ఛైర్మన్ సూరజ్‌సింగ్ మల్హోత్ర. చిత్రంలో టెంట్ డెకరేటర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు ★ జాతీయ సదస్సులోభాగంగా ఏర్పాటు చేసిన డెకరేటివ్ సామగ్రి

ఆకట్టుకున్న ప్రదర్శన: ఈ సందర్భంగా టెంట్ డెకరేటివ్ రంగంలో అత్యాధునిక, విలాసవంతమైన, ఆకర్షణీయ సామగ్రితో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన సంఘం సభ్యులు ఆసక్తిగా ప్రదర్శనను తిలకించారు. శుక్రవారం సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

త్వరలో సర్పంచుల చలో ప్రగతి భవన్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రం ఏర్పడి మూడేళ్లయినా గ్రామాలకు ఒక్క రూపాయీ దక్కలేదని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆందోళన వ్యక్తం చేసింది. సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన చెక్ పవర్‌నూ కార్యదర్శి సంతకం జోడిస్తూ తమను అవమానించేలా చేశారని ఛాంబర్ రాష్ట్రాధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాము సర్కారుపై సమరానికి సిద్ధమవుతున్నామన్నారు. గురువారం లక్డీకాపూల్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో చలో ప్రగతి భవన్ కార్యక్రమం చేపట్టనున్నామని ప్రకటించారు. 30 జిల్లాలకు చెందిన అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలకు ఇప్పటిదాకా అందాల్సిన స్టాంప్ డ్యూటీ అందలేదన్నారు. సర్పంచులకూ పింఛను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు పి.నరేందర్, కన్వీనర్ పురుషోత్తంరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

జీవ ఇంధనంపై సరికొత్త విధానం

- రూ.లక్ష కోట్ల పెట్టుబడులకు ఊతం: ధర్మేంద్ర

దిల్లీ: రవాణా రంగంలో జీవ ఇంధనాల(బయోఫ్యూయల్స్) వినియోగాన్ని ప్రోత్సహించేలా సరికొత్త విధానాన్ని తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని చమురుశాఖ సహాయ మంత్రి(స్వతంత్ర హోదా) ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. దీనిని త్వరలోనే కేబినెట్ ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. రానున్న రెండేళ్లలో జీవ ఇంధనం, సంబంధిత ఇతర రంగాల్లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులకు ఈ విధానం ఊతమిస్తుందన్నారు. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం సందర్భంగా గురువారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత్ ముడిచమురు కోసం 80 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతోందన్నారు. 2022లోగా దిగుమతులను పది శాతం మేర తగ్గించుకోవాలనే లక్ష్యం ఉన్నట్లు తెలిపారు. వంటకు వాడలేని నూనెల నుంచి ఉత్పత్తి చేసే జీవ ఇంధన వినియోగం ఈ లక్ష్యాన్ని అందుకొనేందుకు తోడ్పడుతుందన్నారు. జీవ ఇంధనాల పరిశోధన, అభివృద్ధిపై దాదాపు రూ.12,800 కోట్ల పెట్టుబడికి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ హామీ ఇచ్చాయని చెప్పారు. రానున్న సంవత్సరంలో దేశంలో 12 చోట్ల ఇథనాల్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఈ సంస్థలకు ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జీవ ఇంధనాన్ని ప్రోత్సహిస్తే ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, రైతులకు చేయూత లభిస్తుందని, ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని, దేశానికి ఇంధన భద్రత చేకూరుతుందని ధర్మేంద్ర వివరించారు. జీవ ఇంధనాల వ్యయం తక్కువని కేంద్ర రవాణా, రహదారులు, నౌకాయాన శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. వ్యవసాయ వ్యర్థాలు, మున్సిపల్ వ్యర్థాలు, ఇతర మార్గాల్లో ఉత్పత్తి చేసే జీవ ఇంధనం చమురు దిగుమతుల భారాన్ని తగ్గిస్తుందన్నారు. దేశంలో ఆటోమొబైల్ రంగం వృద్ధి 22 శాతంగా ఉందని, పర్యావరణపరంగా చూస్తే ఇది తట్టుకోలేని స్థాయి అని చెప్పారు. ఈ నేపథ్యంలోనే చౌకయిన, పర్యావరణ అనుకూల జీవ ఇంధనాలు, విద్యుత్ ఆధారిత ప్రజారవాణాను ప్రోత్సహించేందుకు పెద్దయెత్తున కృషి చేస్తున్నామని తెలిపారు.

ఎస్‌బీఐ విలీన బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో ఐదు అనుబంధ బ్యాంకుల విలీనం వల్ల పెట్టుబడి మూలం, రుణ లభ్యత పెరుగుతాయని కేంద్రం పేర్కొంది. ఈ విలీనానికి సంబంధించిన లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఎస్‌బీఐ (అనుబంధ బ్యాంకులు) చట్టం 1959ను, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ చట్టం 1956ను రద్దు చేయడానికి సభ సమ్మతి తెలిపింది. మాతృ సంస్థ అయిన ఎస్‌బీఐతో ఐదు అనుబంధ బ్యాంకుల విలీనం నేపథ్యంలో ఎస్‌బీఐ చట్టం 1955ను సవరించడానికి కూడా ఆమోదం తెలిపింది. ఈ విలీనం వల్ల ప్రపంచంలోని 50 అగ్రశ్రేణి బ్యాంకుల జాబితాలో 45వ స్థానానికి ఎస్‌బీఐ చేరిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు. రుణ లభ్యత పెరగడమే కాకుండా చిన్న బ్యాంకులకు కూడా మ్యూచువల్ ఫండ్స్ వంటి ఉత్పత్తులకు సంధానత ఏర్పడుతుందన్నారు. గత రెండేళ్లలో 29 కోట్ల బ్యాంకు ఖాతాలు కొత్తగా తెరుచుకున్నాయని చెప్పారు. అందువల్ల 25 శాతం. . శూన్య నిల్వ ఖాతాలేనన్నారు. ఏ బ్యాంకు శాఖనూ మూసివేయబోమని, పైగా అవసరమైన చోట కొత్త శాఖలను తెరుస్తామని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఐదు అనుబంధ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్ అండ్ జైపూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పటియాలా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావన్‌కోర్‌తోపాటు భారతీయ మహిళా బ్యాంకు కూడా ఎస్‌బీఐలో విలీనమయ్యాయి. దీంతో ఎస్‌బీఐ వినియోగదారుల సంఖ్య 37 కోట్లకు చేరింది. బ్రాంచీల సంఖ్య 24వేలకు, ఏటీఎంల సంఖ్య 59వేలకు పెరిగాయి.

సేవా పన్నుపై ఆందోళన: ఎస్‌బీఐలో సేవా రుసుములను పెంచడం, పొదుపు ఖాతాలపై వడ్డీ రేటును తగ్గించడంపై విపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఖాతాల్లో కనీస నిల్వ పరిమితిని రూ.వెయ్యికి పెంచడంపై కాంగ్రెస్ సభ్యుడు ముద్దహనుమే గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్‌బీఐకి వసూలు కాని రుణాలు రూ.1.40 లక్షల కోట్ల మేర ఉన్నాయని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సౌగత రాయ్ పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగంలోనే ఇది అత్యధికమని, ఆ బ్యాంకు నిర్వహణ తీరు సరిగా లేదని ఇది స్పష్టంచేస్తోందన్నారు.

భారతీయుల ఖాతాలపై దర్యాప్తు చేస్తున్నాం: జైట్లీ

దిల్లీ: పనామా పత్రాల్లో పేర్కొన్న ప్రతి బ్యాంకు ఖాతా వివరాలపైనా దర్యాప్తు జరుపుతున్నామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ గురువారం రాజ్యసభలో తెలిపారు. అయితే గత నెల్లో పాకిస్థాన్‌లో నవాజ్ షరీఫ్‌ను ప్రధాని పదవి నుంచి తొలగించినట్లుగా భారత్‌లో ఏ వ్యక్తినీ తగిన ప్రక్రియను అనుసరించకుండా శిక్షించబోమని సంకేతప్రాయంగా చెప్పారు. "భారత్‌లో చట్టబద్ధ పాలన ఉంది. పొరుగు దేశం(పాక్)లో మాదిరి మొదట వ్యక్తిని పదవి నుంచి తొలగించి తర్వాత విచారణ సాగించే పద్ధతి మన దేశంలో లేదు" అన్నారు. బ్యాంకింగ్ నియంత్రణ(సవరణ) బిల్లుపై చర్చకు సమాధానమిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎవరైనా భారతీయుల విదేశీ ఖాతాల సమాచారం తెలిసినప్పుడు తాము చేపట్టినట్లుగా మరే ప్రభుత్వమూ చర్యలు చేపట్టలేదన్నారు. కేసుల దర్యాప్తు ముగిసే వరకు పేర్లపై గోప్యత పాటించాల్సి ఉంటుందన్నారు. ప్రాసిక్యూషన్ ప్రక్రియలో భాగంగా వివరాలు కోర్టు ముందుకు వెళ్లిన తర్వాత గోప్యత నిబంధన తొలగిపోతుందని, అప్పుడు వాటిని బహిర్గతపరచవచ్చని చెప్పారు. ఇలాంటి ఇతర కేసుల్లోనూ భారతీయుల ఖాతాలు ఉన్నట్లు తెలిస్తే సంబంధిత దేశాల్లోని అధికార యంత్రాంగాన్ని సంప్రదించి తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించింది.

సభ్యుడి భాషను సరిచేసిన స్పీకర్

ప్రజల్ని హత్యచేయలేదు, వరదల్లో చనిపోయారు అని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభలో సభ్యుడి మాటలను సరిచేశారు. సభలో ప్రకృతి విపత్తులపై చర్చ జరుగుతుండగా కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్ వరదల్లో 750మంది హత్యకు గురయ్యారు అని హిందీలో చెబుతుంటే స్పీకర్ వెంటనే చనిపోయారు అని సరిచేశారు. నా హిందీని సరిచేసినందుకు ధన్యవాదాలు అని గొగోయ్ తెలిపారు.

ఏఎన్ఎంలతో నేడు వైద్యశాఖ మంత్రి చర్చలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: వందశాతం మూలవేతనం అమలుచేయాలని, సర్వీసులను క్రమబద్ధీకరించాలని కొద్దిరోజులుగా ఆందోళన చేపడుతున్న ఈసీఏఎన్ఎంలు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం కలకలం సృష్టించింది. గురువారం సాయంత్రం కోఠిలోని డైరెక్టర్ మెడికల్ హెల్త్ సర్వీసెస్ (డీఎంహెచ్ఎస్) క్యాంపస్‌కు చేరుకున్న ఈసీఏఎన్ఎంలు ఆ ఆవరణలోని తెలంగాణ వైద్యవిద్య సంచాలకులు (డీఎంఈ) భవనంపైకి ఎక్కారు. పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో అక్కడికి చేరుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు భవనంపైకి చేరి వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అక్కడినుంచే వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డితో ఫోన్లో మాట్లాడించగా శుక్రవారం ఉదయం తనను కలవాలని మంత్రి సూచించారు. శాంతించిన ఏఎన్ఎంలు కిందికి దిగారు. డిమాండ్లు పరిష్కరించాలంటూ నిరసన తెలుపుతున్నా.. మంత్రి, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వారు పేర్కొన్నారు.

'బీ3'తో గర్భస్రావ ముప్పు తగ్గుముఖం

నవజాత శిశువుల్లో పుట్టుకతోవచ్చే లోపాలకూ చెక్



మెల్‌బోర్న్: పచ్చని కూరగాయలు, మాంసాల్లో విరివిగా లభించే విటమిన్-బీ3తో గర్భస్రావ ముప్పును తగ్గించుకోవచ్చని తాజా పరిశోధనలో తేలింది. అంతేకాదు నవజాత శిశువుల్లో పుట్టుకతోవచ్చే భిన్న లోపాలనూ అడ్డుకోవచ్చని వెలుగులోకి వచ్చింది. ఈ సంచలన పరిశోధనను ఆస్ట్రేలియాలోని విక్టర్ చాంగ్ కార్డియాక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిపుణులు నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 79 లక్షల మంది చిన్నారులు భిన్నరకమైన లోపాలతో పుడుతున్నారు. చాలా మందిలో ఈ లోపాలకు కారణమేంటో కూడా అంతుచిక్కడం లేదు. దీంతో తాజా ఫలితాలు ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా మహిళల్లో గర్భస్రావాలు; నవజాత శిశువుల్లో గుండె, వెన్నెముక, కిడ్నీ సంబంధిత వ్యాధులపై వారు దృష్టిసారించారు. దీంతో నికోటినమైడ్ అడినైన్ డైన్యూక్లియోటైడ్ (ఎన్ఏడీ)గా పిలిచే ఓ ఎంజైమ్ శిశువుల అవయవాల అభివృద్ధిలో క్రియాశీలంగా పనిచేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కణాల మధ్య సమాచార బదిలీ, డీఎన్ఏ మరమ్మతులు, శక్తి ఉత్పత్తికి ఇది తోడ్పడుతుందని తేలింది. పర్యావరణ, జన్యుపరమైన కారణాలతో ఎన్ఏడీ ఉత్పత్తి దెబ్బతింటోందని, దీంతో ఎన్ఏడీ లోపం చుట్టుముడుతోందని పరిశోధకులు గుర్తించారు. ఈ రుగ్మత గర్భిణుల్లో చాలా ప్రమాదకరమని, పిండం పెరుగుదలలో లోపాలకు ఇది కారణమవుతుందని కనిపెట్టారు. '12ఏళ్ల సుదీర్ఘ పరిశోధన అనంతరం ఈ లోపాన్ని నివారించొచ్చని కనిపెట్టాం. ముఖ్యంగా విటమిన్ బీ3 స్థాయిలు ఎక్కువగా ఉండే ఆహారంతో ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గుర్తించాం'అని పరిశోధకులు సల్లీ డ్యూన్‌ఉడీ తెలిపారు.

మధుమేహానికి చెక్‌పెట్టే చికిత్స!

లండన్: మధుమేహాన్ని పూర్తిగా నయంచేసే చికిత్స త్వరలో మనముందుకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి బాటలు పరిచే "మూలకణ సాంకేతికత"ను పరిశోధకులు అభివృద్ధిచేశారు. దీని సాయంతో రోగుల చర్మ కణాలను ఇన్సులిన్ ఉత్పత్తిచేసే కణాలుగా మార్చగలిగారు. నార్వేలోని బెర్గెన్ వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. మార్పులుచేసిన కణాలను ఓ సూక్ష్మ గొట్టంలో ఉంచి, దీన్ని మధుమేహుల చర్మం కింద ప్రవేశపెట్టేందుకు వారు ప్రణాళికలు రచిస్తున్నారు. దీంతో ఈ రూపాంతర కణాలు మన శరీరంలో ఇన్సులిన్‌ను ఎలా నియంత్రించగలవో తెలుసుకోవచ్చని పరిశోధకులు హెల్జ్ రాడార్ తెలిపారు. ఈ కణాలు రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలకు అనుగుణంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తిచేసే వీలుంది. దీంతో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తరచూ పర్యవేక్షించడం, ఇన్సులిన్‌ను ఎప్పటికప్పుడు తీసుకోవడం లాంటి తిప్పలు తప్పుతాయి. ప్రపంచ వ్యాప్తంగా మధుమేహుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో.. తాజా పరిశోధన ఫలితాలు ప్రాముఖ్యం సంతరించుకున్నాయి.

ఇష్టారీతిన విద్యుత్ రుణాలు!



- ప్రైవేటు సంస్థలకు మంజూరులో నిబంధనల ఉల్లంఘన
- అనుభవం, సామర్థ్యం లేకపోయినా అప్పులు ఇచ్చిన వైనం
- మొండిబకాయిలుగా మారిన రూ.3 వేల కోట్లు
- ప్రాజెక్టుల నిర్మాణ సమయంలోనే రూ.13 వేల కోట్ల మేర పెరిగిన వడ్డీ
- గ్రామీణ విద్యుదీకరణ సంస్థ, పీఎఫ్‌సీలను తప్పుబట్టిన 'కాగ్'

ఈనాడు, దిల్లీ: ప్రైవేటు విద్యుత్ సంస్థలకు రుణాల మంజూరులో గ్రామీణ విద్యుదీకరణ సంస్థ(ఆర్‌ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) ఇష్టారీతిన వ్యవహరించినట్లు కాగ్ గుర్తించింది. 2013-14 నుంచి 2015-16 మధ్యకాలంలో స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులకు ఈ సంస్థలు రూ.47,706.88 కోట్ల రుణాలు ఇచ్చాయి. వీటిని ఇచ్చేటప్పుడు శ్రద్ధ చూపలేదని, అంతర్గత మార్గదర్శకాలను, రిజర్వు బ్యాంకు మార్గదర్శకాలను ఉల్లంఘించాయని కాగ్ తప్పుబట్టింది. విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటులో ప్రమోటర్ల అనుభవంపై నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోలేదని విమర్శించింది. ప్రమోటర్ల అనుభవరాహిత్యంవల్ల ఏ ప్రాజెక్టూ గడువులోపు పూర్తికాలేదని గురువారం పార్లమెంటకు సమర్పించిన కాగ్ నివేదిక తెలిపింది.

నివేదికలోని ముఖ్యాంశాలు..

- ప్రాజెక్టుల నిర్మాణానికి ఈక్విటీ తీసుకురావడంలో ప్రమోటర్ల సామర్థ్యాన్ని ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ సరిగా అంచనా వేయలేకపోయాయి. కాగ్ ఆడిట్ నిర్వహించిన తొమ్మిది ప్రాజెక్టుల షెడ్యూళ్లను పలు మార్లు వాయిదా వేయడంవల్ల ఆరు ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో వడ్డీ భారం రూ.13,312.78 కోట్ల మేర పెరిగింది. ఇందులోని మూడు రుణాల్లో రూ.3,038.44 కోట్లు మొండిబకాయిలు(ఎన్‌పీఏలు)గా మారాయి.
- ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పడే వడ్డీని కూడా ప్రాజెక్టు వ్యయం కిందే చేరుస్తారు. ల్యాంకో బబంద్ పవర్ ప్రాజెక్టు, ల్యాంకో విదర్భ థర్మల్ పవర్ ప్రాజెక్టు, ల్యాంకో అమర్‌కంటక్ పవర్ ప్రాజెక్టులకు రూ.3,294.35 కోట్ల రుణం మంజూరు చేసే సమయంలో ఆర్‌ఈసీ రూ.496.02 కోట్లను ఐడీసీ (ఇంటరెస్ట్ డ్యూరింగ్ కన్‌స్ట్రక్షన్) కింద సర్దుబాటు చేసుకొంది. అసలు రుణం, ఐడీసీలకు సమానమైన మొత్తం కంటే ఎక్కువ మొత్తానికి రుణాన్ని ఆమోదించారు. షెడ్యూల్ ప్రకారం బకాయిదారు డబ్బు చెల్లించకపోయినా ఐడీసీ సర్దుబాటు కారణంగా ఆ ఖాతా సమర్థవంతమైనదిగానే నిలబడింది. వడ్డీని ఐడీసీ పద్ధతిలో సర్దుబాటు చేసుకోకపోతే ఈ రుణం 2013లోనే ఎన్‌పీఏగా మారేది.
- ప్రాజెక్టులకు రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలు ఛార్టర్డ్ అకౌంటెంట్‌లు ఇచ్చే ధ్రువపత్రాలపైనే ఆధారపడకుండా అంతర్గత నియంత్రణలు, రుణముప్పును ఎదుర్కొనే వ్యవస్థను, రుణాల పంపిణీలో నాణ్యత ప్రమాణాలను పెంచుకోవాలని ఆర్‌బీఐ 2013లో మార్గదర్శకాలు జారీచేసినా ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ అలాంటి వ్యవస్థలను అభివృద్ధి చేసుకోలేదు. మంజూరైన రుణాలను సంస్థలు ఎందుకు ఉపయోగించాయో తెలుసుకోవడానికి పూర్తిగా సీఏ ధ్రువపత్రాలపైనే ఆధారపడ్డాయి. కాగ్ ఆడిట్ జరిగిన తొమ్మిది సంస్థలు సుమారు రూ.2,457.60 కోట్లను మింగేయడమో, మళ్లించడమో చేశాయి.
- రహదారి ప్రాజెక్టులు, ఇతర నిర్మాణాలు, నీటి సరఫరా, పర్యావరణ ప్రాజెక్టులు, విద్యుత్తు సరఫరా లైన్లు, స్థిరాస్తి అభివృద్ధిలో అనుభవం ఉన్న ఎన్‌సీసీ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (ఎన్‌పీపీఎల్) ప్రమోటర్లు 1,320 మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ విద్యుత్తు ప్రాజెక్టు ఏర్పాటుకు సంస్థ ఏర్పాటు చేశారు. ఈ విధానంలో విద్యుత్తు ఉత్పత్తి చేసిన అనుభవం కానీ, చేయగల సామర్థ్యం కానీ సంస్థకు లేకపోయినా ఆర్‌ఈసీ రుణం ఇచ్చింది. ఇదే తరహాలో ల్యాంకో అమర్ కంటక్ పవర్ లిమిటెడ్, ల్యాంకో బబంద్ లిమిటెడ్, ల్యాంకో విదర్భ థర్మల్ లిమిటెడ్‌లకు తగిన అనుభవం లేకపోయినా రుణం ఇచ్చింది.
- ఎన్‌సీసీ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌లో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌సీసీఎల్), గాయత్రి ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కలిపి 2014 అక్టోబర్ నాటికి రూ.1,761.72 కోట్లు ఈక్విటీ సమకూర్చాల్సి ఉంది. ఇందులో ఎన్‌సీసీఎల్ వాటా రూ.831.19 కోట్లు, గాయత్రి వాటా రూ.930.53 కోట్లు. అప్పటికే నడుస్తున్న వివిధ ప్రాజెక్టులకూ 2015 మార్చిలోగా ఎన్‌సీసీఎల్ రూ.1,478.13 కోట్లు, జీపీఎల్ రూ.1,913.03 కోట్లు ఈక్విటీ సమకూర్చాల్సి ఉంది. 2014-15 వరకు జీపీఎల్‌కు రూ.685.74 కోట్లే అందుబాటులో ఉన్నట్లు మదింపు పత్రం వెల్లడించింది. అప్పటికి ఎన్‌సీసీఎల్‌కు తగిన నిధులున్నట్లు మదింపుపత్రం పేర్కొన్నా ఆ సంస్థ 2011 నాటికే రెండు ఇతర ప్రాజెక్టులకు ఈక్విటీ సమకూర్చడంలో విఫలమైంది. ఎన్‌సీసీ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు ఈక్విటీ సమకూర్చేంత సామర్థ్యం ఈ ఇద్దరు ప్రమోటర్లకు లేదని రుణదాతలు గుర్తించలేకపోయారు.
- ల్యాంకో అమర్‌కంటక్ ప్రాజెక్టు లిమిటెడ్‌కు పీఎఫ్‌సీ రుణం మంజూరు సమయానికి ప్రమోటర్‌పై అప్పటికే అమలు చేస్తున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన రూ.5,850 కోట్ల ఈక్విటీ భారమున్నా పరిగణనలోకి తీసుకోలేదు. ల్యాంకోకు చెందిన మరో రెండు ప్రాజెక్టులకు రుణాల మంజూరులోనూ ఇలాంటి వైఖరి అనుసరించారు.
- రుణాలిచ్చిన ఏడు కేసుల్లో కాంట్రాక్టర్, ప్రమోటర్ ఇద్దరూ ఒక్కరే.
- జీవీకే ర్యాటల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టు లిమిటెడ్ ప్రమోటర్ పూర్తి నష్టాల్లో ఉన్నా 2013 ఏప్రిల్‌లో పీఎఫ్‌సీ రుణం మంజూరు చేసింది.
- కృష్ణా గోదావరి పవర్ యుటిలిటీస్ లిమిటెడ్ ప్రమోటర్లకు ఏ మాత్రం ఆర్థిక సామర్థ్యం లేకపోయినా పీఎఫ్‌సీ రుణం ఇచ్చింది. ప్రమోటర్లు వాటాను సమకూర్చలేకపోవడంతో ప్రాజెక్టు గడువు లోపు పూర్తికాలేదు.
- మీనాక్షి పవర్ లిమిటెడ్‌కు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో తగిన అనుభవం లేకపోయినా ఆర్‌ఈసీ రుణం ఇచ్చింది.
- కృష్ణా-గోదావరి పవర్ యుటిలిటీస్ లిమిటెడ్‌లోని భాగస్వాములకు అనుభవం లేకపోయినా రుణం వచ్చింది.
- ఏడు ప్రాజెక్టులు ఆర్థికంగా నిలదొక్కుకొనే పరిస్థితి లేదని తెలిసి కూడా ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ అదనపు రుణాలు ఇచ్చాయి.

జిల్లా న్యాయమూర్తుల నియామకాలకు ఉమ్మడి పరీక్ష!

- ఏకీకృత ఎంపిక వ్యవస్థ
- త్వరలో సుప్రీంకోర్టు నిర్ణయం

దిల్లీ

జిల్లా స్థాయి న్యాయమూర్తుల నియామకాలకు ఉమ్మడిగా ఒకే పరీక్ష నిర్వహించాలన్న ప్రతిపాదనపై సుప్రీం కోర్టు త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోనుంది. కేంద్రీకృత ఎంపిక వ్యవస్థ (సీఎస్ఎం) ద్వారా దిగువ న్యాయస్థానాల్లో ఖాళీలను భర్తీ చేయించాలనేది ఈ ప్రతిపాదన సారాంశం. జిల్లా, అంతకంటే దిగువస్థాయిలో సుమారు 21 వేల మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా 4800 వరకు ఖాళీలు పేరుకుపోయాయి. రాష్ట్రాలు, హైకోర్టుల మధ్య సానుకూల ఏకాభిప్రాయం ఇంకా రాకపోయినా, కేంద్ర ప్రభుత్వ నిధులతో పనిచేసే సీఎస్ఎం ద్వారా ఖాళీల భర్తీ విషయంలో ముందుకు వెళ్లాలనే సానుకూలతతో ఉన్నట్లు సుప్రీంకోర్టు ఈ నెల 4న వెల్లడించింది. ఈ ప్రతిపాదనపై ఉన్న అభ్యంతరాలను పరిష్కరించడానికి అవసరమైతే ఈ నెలలోనే ఒక రోజంతా విచారణ జరుపుతామని కూడా ప్రకటించింది.

అనిశ్చితికి అడ్డుకట్ట పడాలి

న్యాయమూర్తుల నియామకాలు సజావుగా జరగడం కోసం సీఎస్ఎం కింద 'జిల్లా న్యాయమూర్తుల నియామక పరీక్ష' (డిజురే) నిర్వహించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ఇదివరకే పేర్కొంది. 'నేరుగా గానీ, పరీక్ష ద్వారా గానీ ఏటా 300 ఖాళీలను భర్తీ చేసి, దేశ వ్యాప్తంగా రాష్ట్రస్థాయి న్యాయ సేవల్లో నియామకాల కోసం ప్రతిభావంతుల జాబితాలను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలి. అర్హులైన, ప్రతిభావంతులైన న్యాయవాదులు తగినంత మంది లేక జిల్లా న్యాయమూర్తుల ఖాళీలు భర్తీ కాకపోవడం విచారకరం. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించే వ్యవస్థ లేకపోవడమూ దీనికొక కారణం. చాలా రాష్ట్రాల్లో అభ్యర్థులు ముందుగా సన్నద్ధమయ్యేందుకు తగిన పాఠ్య ప్రణాళికా లేదు. పరీక్షలు జరిగేదీ లేనిదీ అనిశ్చితే. డిజురే ద్వారా ఈ వైఖరికి అడ్డుకట్టపడాలి' అని సుప్రీంకోర్టు ఒక పత్రంలో అభిప్రాయపడింది. 'డిజురే నిర్వహించే ఒకే పరీక్షకు హాజరుకావడం ద్వారా ఏ రాష్ట్రంలోనైనా జిల్లా న్యాయమూర్తిగా నియమితులయ్యే అవకాశం అభ్యర్థులకు లభిస్తుంది. అఖిలభారత న్యాయ సేవ, డిజురే వేర్వేరు. రాష్ట్రాల్లో రిజర్వేషన్లు, అర్హతలు, ఇతర సేవా నిబంధనలు ఏ విధంగా ఉన్నాయో అవన్నీ ఇకపైనా కొనసాగుతాయి. అందువల్ల నియామకాలపై రాష్ట్రాలకు ఉన్న స్వయంప్రతిపత్తి ఏ విధంగానూ రాజీకి గురికాదు' అని స్పష్టం చేసింది. రాతపరీక్షకు 400, మౌఖిక పరీక్షకు 200 మార్కుల్ని కేటాయించాలనేది ప్రతిపాదన. న్యాయమూర్తుల ఎంపిక అధికారం హైకోర్టులకే ఉంటుందనీ, డిజురే ద్వారా అర్హులైన అభ్యర్థుల బృందం మాత్రం సిద్ధమవుతుందనీ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

గుజరాత్‌లో అత్యధిక ఖాళీలు

సుప్రీంకోర్టు వద్దనున్న సమాచారం ప్రకారం అత్యధికంగా గుజరాత్‌లో ఖాళీలున్నాయి. అక్కడ 1953 మందికి గానూ 820 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తర్వాత స్థానంలో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక నిలుస్తున్నాయి. అతి తక్కువ ఖాళీలు సిక్కింలో ఉన్నాయి.

రాజీవ్ హత్య కేసులో దోషులకు క్షమాభిక్షపై 14న సుప్రీం విచారణ

దిల్లీ: మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషులను విడుదల చేయాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ... కేంద్ర ప్రభుత్వం దాఖలుచేసిన అభ్యర్థనపై సోమవారం (ఈ నెల 14న) విచారణ చేపట్టేందుకు సుప్రీం కోర్టు గురువారం అంగీకరించింది. కేసును త్వరగా విచారించాలని కోరుతూ జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం ముందు దోషుల్లో ఒకరైన పెరరివాలన్ తరఫున న్యాయవాది ప్రభు రామసుబ్రమణ్యం ఓ అభ్యర్థన పత్రాన్ని సమర్పించారు. పెరరివాలన్ సహా దోషులు మురుగన్, శంతన్, రోబెర్ట్ పైస్, నళిని, జయకుమార్, రవిచంద్రన్‌లను విడుదల చేయాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయంపై 2014లో సుప్రీం కోర్టు నిలుపుదల ఆదేశాలు ఇచ్చింది. జైలు శిక్ష అనుభవిస్తున్న దోషులకు క్షమాభిక్షపై కేంద్రం, రాష్ట్రాల మధ్య అధికారాలను నిర్వచించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన ఓ రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేసింది. అనంతరం కేంద్ర ప్రభుత్వ సంస్థలు దర్యాప్తు చేపట్టిన కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరించింది. దీంతో రాజీవ్ హత్య కేసులో దోషులకు క్షమాభిక్ష అంశాన్ని మరో త్రిసభ్య ధర్మాసనానికి కోర్టు అప్పగించింది. 'త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటైనా ఇప్పటివరకూ విచారణ జరగలేదు. గతంలో కూడా విచారణకు తేదీ ఇచ్చారు. మళ్లీ రద్దుచేశారు'అని ప్రభు చెప్పారు.

ఫేస్‌బుక్‌లోనూ 'వీడియో ప్రత్యక్ష ప్రసారాలు

శాన్‌ఫ్రాన్సిస్కో: సామాజిక మాధ్యమ దిగ్గజ సంస్థ ఫేస్‌బుక్ తన వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు వీడియోల ప్రత్యక్ష ప్రసారాల సౌకర్యాన్ని అందించడానికి సిద్ధమైంది. దీంతో యూట్యూబ్, నెట్‌ఫ్లిక్స్ వంటి సామాజిక మాధ్యమాలకు ఫేస్‌బుక్ గట్టి పోటీని ఇవ్వనుంది. 'వాచ్' అనే ప్రత్యేక సదుపాయం ద్వారా రియాలిటీ, హాస్య, క్రీడల ప్రత్యక్ష ప్రసారాలను వినియోగదారులు చూడవచ్చని సంస్థ తెలిపింది. 'స్నేహితులు చూసిన, మీకు ఇష్టమైన షోలను క్రమం తప్పకుండా చూడవచ్చని' ఫేస్‌బుక్ సీఈవో జుకర్‌బర్గ్ తెలిపారు. ఏదైనా షోలోని భాగాన్ని(ఎపిసోడ్) చూస్తున్న వారితో సంభాషించడంతో పాటు అలాంటి అభిరుచి గలవారితో ఒక సమూహాన్ని ఏర్పాటు చేసే సౌకర్యాన్నీ దీనిలో పొందుపరిచారు.

'సార్వత్రిక' పరీక్షలకు తత్కాల్ అవకాశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ద్వారా అక్టోబరు 5 నుంచి జరగనున్న పది, ఇంటర్ పరీక్షలకు తత్కాల్ పథకం కింద ఈనెల 16నుంచి 21 వరకు పరీక్ష రుసుం చెల్లించవచ్చని విద్యాపీఠం సంచాలకుడు వై.బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ రుసుమునకు అదనంగా పదో తరగతికి రూ.500, ఇంటర్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించాలన్నారు. గతేడాది ప్రవేశాలు పొందినవారు, గతంలో తప్పినవారు సైతం ఫీజు చెల్లించవచ్చన్నారు.

ఇంటర్ బోర్డుకు రూ.2.17 కోట్ల జరిమానా చెల్లింపు

ప్రవేశాల్లో నిబంధనల అతిక్రమణలపై విజిలెన్స్ కమిషన్ నివేదిక నేపథ్యంలో శ్రీచైతన్య, నారాయణ కళాశాలలు తెలంగాణ ఇంటర్‌బోర్డుకు రూ.2.17 కోట్లు జరిమానా చెల్లించాయి. నిబంధనలకు విరుద్ధంగా పాత రంగారెడ్డి జిల్లాలో ఈ సంస్థలు కళాశాలలను నడుపుతున్నాయని 2015లో ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు.

కేటీఆర్‌పై ఫిర్యాదును ఈసీకి పంపాం: భన్వర్‌లాల్

తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌పై వామపక్షాలు చేసిన ఫిర్యాదును కేంద్ర ఎన్నికల సంఘానికి పంపామని తెలుగురాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ గురువారం తెలిపారు. కేటీఆర్ రాష్ట్ర మంత్రిగా ఉంటూ హిమాన్షు మోటార్స్ సంస్థ డైరెక్టర్‌గా కూడా ఉన్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని వామపక్షాలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

ఇంటి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ

పుణె మహిళ కృషికి ప్రధాని మోదీ ప్రశంస, లేఖ

ఈనాడు, దిల్లీ: ఇంట్లో పోగయిన చెత్తతో పాటు చుట్టుపక్కల ఇళ్లలోని చెత్తను కూడా పోగుచేసి సేంద్రియ ఎరువు తయారుచేస్తున్న పుణె మహిళను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. స్వచ్ఛభారత్ కోసం ఆమె కొనసాగిస్తున్న కృషిని ప్రశంసిస్తూ లేఖ రాశారు. పుణెకు చెందిన ప్రాచీ బి.దేశ్‌పాండే అనే మహిళ తన ఇంట్లో పోగయ్యే వ్యర్థాలనే కాకుండా చుట్టుపక్కల ఇళ్లు, సమీప గుడిలోని చెత్తను కూడా సేకరించి ఎరువుగా మార్చి తన ఇంటి డాబాపై సేంద్రియ వ్యవసాయం ప్రారంభించారు. ఈ విషయాన్ని ప్రాచీ ఓ లేఖ ద్వారా ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ప్రధాని సమాధానమిస్తూ "సమాజం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడానికి మీరు చేస్తున్న కృషి సాకారాత్మకమైన మార్పును తీసుకొస్తుంది" అని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. స్వచ్ఛభారత్‌లో ప్రజల భాగస్వామ్యానికి ఇదో మంచి ఉదాహరణ అని అభివర్ణించారు.

చీరాలలో సినిమా హాలు భస్మీపటలం

చీరాల, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా చీరాలలోని దివంగత నిర్మాత డి.రామానాయుడి కుటుంబానికి చెందిన సురేష్‌మహల్ థియేటర్ అగ్నికి ఆహుతైంది. ప్రారంభోత్సవానికి ఒకరోజు ముందు గురువారం ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదానికి కారణం వెల్డింగ్ పనులా లేక విద్యుదాఘాతమా అన్నది స్పష్టంగా తెలియరాలేదు. ఈ సినిమాహాలును ఇటీవల కోట్లాది రూపాయలు వెచ్చించి పూర్తిస్థాయిలో నవీకరించారు. శుక్రవారం హీరో రాణా చేతుల మీదుగా ప్రారంభించి 'నేనే రాజు నేనే మంత్రి' సినిమాను విడుదల చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం..మిగిలిన ఉన్న కొద్దిపాటి పనులను చేస్తుండగా ప్రమాదం సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్యాబిన్ వద్ద విద్యుత్తు పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. ఇవి గమ్ సొల్యూషన్ (జిగురు)తో అతికిస్తున్న అలంకరణ సామగ్రిపై పడటంతో అది అంటుకుని క్షణాల్లో థియేటర్ మొత్తం మంటలు వ్యాపించాయి.



థియేటర్‌లో కాలిబూడిదైన కుర్చీలు

నేరెళ్ల ఘటనలో ఎస్ఐపై వేటు

- బాధితులను పరీక్షించిన ఎంజీఎం వైద్యనిపుణులు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటనలో ఎట్టకేలకు చర్యలు మొదలయ్యాయి. బాధితుల పట్ల విచక్షణరహితంగా వ్యవహరించినందుకు సీసీఎస్ ఎస్.ఐ. రవీందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. గతనెలలో ఇక్కడ ఇసుక లారీల కారణంగా ఒక వ్యక్తి మృతిచెందడం.. ఆ కోపంతో స్థానికులు కొందరు వాహనాలకు నిప్పుపెట్టడం.. తర్వాత పోలీసులు కొంతమంది దళిత యువకులను తీసుకువెళ్లి హింసించడం.. రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేకెత్తించడం తెలిసిందే. పోలీసు చర్యలపై వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, మానవహక్కుల సంఘం నేతలు తీవ్రంగా ధ్వజమెత్తారు. బాధితులకు వారంతా అండగా నిలిచారు. నేరెళ్ల సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనానికి దారితీసింది. న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్‌పై బాధితులను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కరీంనగర్ డీఐజీ రవివర్మను విచారణకు ఆదేశించింది. మంగళవారం వేములవాడ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన విడివిడిగా విచారించారు. పోలీసులు తమను కులంపేరుతో దూషించడంతోపాటు నాలుగు రోజులపాటు చిత్రహింసలకు గురిచేసినట్లు బాధితులు చెప్యాల బాలరాజు, కోల హరీష్, పెంట బానయ్య, గందం గోపాల్, పసుల ఈశ్వర్, చికోటి శ్రీనివాస్, గణేష్, బత్తుల మహేష్‌లు డీఐజీకి వివరించారు. ఆయన దీనిపై నివేదిక రూపొందించి వరంగల్ రేంజ్ ఐజీ నాగిరెడ్డికి సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా రాజన్నసిరిసిల్ల జిల్లా సీసీఎస్ ఎస్సై రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేరెళ్ల సంఘటనలో ప్రభుత్వం నుంచి ఇది మొదటి వేటు. తదుపరి చర్యలు ఎవరిపై ఉంటాయోనని పోలీసుల్లో ఆందోళన మొదలైంది.





సస్పెండైన ఎస్ఐ రవీందర్ ★ నేరెళ్ల బాధితులను పరిశీలిస్తున్న ఎంజీఎం వైద్యనిపుణులు

హైకోర్టు ఆదేశాల మేరకు ఎంజీఎం వైద్యుల రాక

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేరెళ్ల బాధితులను గురువారం ఎంజీఎం వైద్యనిపుణులు పరీక్షించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎంజీఎంకు చెందిన ఫోరెన్సిక్ నిపుణుడు ప్రొఫెసర్ టి.కృపాల్‌సింగ్, ప్రొఫెసర్ జి.చంద్రశేఖర్‌లు ఈ ఆసుపత్రిని సందర్శించి బాధితుల ఆరోగ్య సమస్యలను, వారు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వారి వద్ద ఉన్న మందులు, వారికి అందిస్తున్న వైద్యాన్ని పరిశీలించారు. బాధితులతో గంటకు పైగా మాట్లాడి వివరాలు సేకరించారు. వారి వంటిపై ఉన్న గాయాలను ఫొటోలు తీసుకున్నారు. తాము పరిశీలించిన వివరాలను కోర్టుకు సమర్పిస్తామని వైద్యులు తెలిపారు.

గుండె గు'బిల్లు'

- గుడిసెకు రూ. 90 వేల కరెంటు బిల్లు
- ఆందోళనతో వృద్ధుడి హఠాన్మరణం



బాబుమియా

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: పూరి గుడిసెకు రూ. 90 వేల విద్యుత్తు బిల్లు రావడంతో ఎలా చెల్లించాలోనని ఆవేదనకు గురైన ఇంటి యజమాని గుండె ఆగి చనిపోయాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం డిడ్గిలో జరిగింది. సర్పంచి పద్మమ్మ కథనం ప్రకారం ఈ గ్రామానికి చెందిన బాబుమియా (60) భార్య బిపాష, ఇద్దరు కుమారులతో కలిసి ఓ గుడిసెలో నివాసం ఉంటున్నారు. బుధవారం మీటర్ రీడింగ్ కోసం వచ్చిన విద్యుత్తు సిబ్బంది రూ. 90 వేల బిల్లు వచ్చిందని చెప్పివెళ్లారు. దీంతో అతను ఆందోళనకు గురయ్యాడు. ఇదే విషయమై మథనపడుతూ రాత్రి 9 గంటలకు ఇంట్లోనే కుప్పకూలి మృతి చెందాడు. అతడితో పాటు గ్రామంలో 100కు పైగా కుటుంబాలకు రూ. 80 నుంచి 90 వేల వరకు బిల్లులు రావడంతో సిబ్బంది బిల్లులు ఇవ్వకుండానే వెళ్లిపోయారు. విద్యుత్తుశాఖ నిర్వాకం వలన ప్రాణాలు కోల్పోయిన బాబుమియా కుటుంబానికి పరిహారం చెల్లించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గ్రామీణ ఏఈ నాగేశ్వరరావును వివరణ కోరగా సాంకేతిక లోపం వల్ల రూ.90 వేల వరకు బిల్లులు వచ్చినమాట వాస్తవమేనని, అందుకే వాటిని వినియోగదారులకు ఇవ్వలేదని చెప్పారు.

ప్రభుత్వ సిబ్బందికి ఈ-లెర్నింగ్‌పై శిక్షణ

ఈ ఏడాది తెలంగాణలో 9 వేల మందికి...

ఈనాడు, హైదరాబాద్: అధికారుల విధి నిర్వహణ సామర్థ్యం పెంపు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలను పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా ప్రభుత్వాధికారులకు ఈ-లెర్నింగ్ విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వ డీఓపీటీ సంయుక్త కార్యదర్శి దేవేష్ చతుర్వేది తెలిపారు. మొదటిగా తెలంగాణ రాష్ట్రం సహా ఎంపిక చేసిన అసోం, హరియాణా, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టు ప్రాతిపదికన 18 వేలమంది అధికారులకు ఈఏడాది శిక్షణ ఇస్తామన్నారు. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరులు అభివృద్ధి సంస్థలో శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చతుర్వేది మాట్లాడుతూ వివిధ స్థాయిల్లోని ఉద్యోగులు, అధికారులలో ఈ-లెర్నింగ్ విధానాలను అభివృద్ధి చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన ప్రణాళిక అధికారులు, ఈ-జిల్లా మేనేజర్లు, జిల్లా విద్యాశాఖాధికారులు, జిల్లా శిక్షణ సమన్వయకర్తలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ప్రారంభించామన్నారు. ప్రభుత్వ సలహాదారు జి.ఆర్.రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానం కీలకమన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య మాట్లాడుతూ తెలంగాణలో 9వేల మంది ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. బంగారు తెలంగాణ సాధనకు ఇది దోహదం చేస్తుందన్నారు. డీఓపీటీ శిక్షణ విభాగం డైరెక్టర్ విజయకుమార్ సిన్హా పాల్గొన్నారు.

విదేశీయులపై ప్రత్యేక నిఘా

- మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగంపై పోలీస్ కార్యాచరణ

ఈనాడు, హైదరాబాద్- న్యూస్‌టుడే, మెహిదీపట్నం: హైదరాబాద్‌లో ప్రకంపనలను సృష్టిస్తున్న మాదకద్రవ్యాల వ్యవహారంలో కీలక నిందితులు విదేశీయులుగా నిర్ధరణ కావడంతో అక్రమార్కులను గుర్తించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు 'ఆపరేషన్ ఫారినర్' పేరుతో గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధుల్లో నివసిస్తున్న విదేశీయుల వివరాలను సేకరించేందుకు 4833 మందిని ప్రత్యేక ప్రాంతాలకు రప్పించారు. కేంద్ర నిఘా విభాగం అధికారులు, విదేశీ వివరాల ప్రాంతీయ నమోదు కేంద్రం(ఎఫ్.ఆర్.ఆర్.ఒ), స్థానిక పోలీసులు వీరివివరాలను పరిశీలించారు. అక్రమంగా నివాసముంటున్న వారిపై చర్యలు తీసుకోనున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, లంగర్‌హౌస్, టోలీచౌకి, ఆసిఫ్‌నగర్, సైనిక్‌పురి, యాప్రాల్, రాజేంద్రనగర్, కేపీహెచ్‌బీ, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, చందానగర్, నేరేడ్‌మెట్, వనస్థలిపురం, ఎల్బీనగర్, నార్సింగి ప్రాంతాల్లో ఆఫ్రికన్ దేశస్థులుంటున్నారని ప్రాంతీయ విదేశీ నమోదు కేంద్రం, నిఘావర్గాలు పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చాయి. స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గురువారం తెల్లవారుజాము నుంచే ఆయా చిరునామాలకు వెళ్లి వాహనాల్లో తీసుకువచ్చి సమావేశపు గదుల్లో ఉంచారు. వారి పాస్‌పోర్టులు, పర్యాటక ధ్రువపత్రాలను పరిశీలించారు. అన్ని వివరాలను సక్రమంగా సమర్పించిన వారిని పంపించేశారు. పోలీసులు తీసుకువచ్చిన విదేశీయుల్లో 2 వేల మందికిపైగా వైద్యచికిత్సల కోసం వచ్చినట్టు గుర్తించారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని విడిగా ఉంచి వివరాలను సేకరించారు. సైబరాబాద్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 188మంది ఉండగా, మరో 85మంది అదనంగా ఇళ్లల్లో కనిపించారు. వీరంతా పర్యాటక వీసాలు కలిగి ఉండటంతో సమాచారమివ్వాలని కోరారు. ఇద్దరు విదేశీయులు అక్రమంగా ఉంటున్నారని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 560 మంది విచారించారు. ఇందులో 11మందిని. . నగరవ్యాప్తంగా 34మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా పాస్‌పోర్టు గడువు ముగిసినా పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోలేదు. పైగా తమ చిరునామాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో ఉంటున్నారని పశ్చిమ మండలం డీసీపీ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు, మాదక ద్రవ్యాల అంశం దృష్ట్యా ఇక్కడి విదేశీయుల వివరాలను విచారిస్తున్నామంటూ పోలీస్ ఉన్నతాధికారులు అమెరికా, ఐరోపా, ఆఫ్రికా దేశాల రాయబార కార్యాలయాలకు వారం ముందు సమాచారమిచ్చారు.



హుమయూన్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో విచారణకు వచ్చిన విదేశీ యువకులు

సురక్షితమైన రహదారుల కోసం 'స్మార్ట్‌స్ట్రీట్స్ ల్యాబ్' ఏర్పాటు

మాదాపూర్ న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానం ద్వారా హైదరాబాద్ నగరంలో రహదారి భద్రతను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం 'ది స్మార్ట్ స్ట్రీట్స్ ల్యాబ్' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రోడ్డు ప్రమాదాల నివారణ, పాదచారులు, మహిళలు, సైకిల్ తొక్కేవారి భద్రత వంటి విభిన్న అంశాలకు పరిష్కారాలను అందుబాటులోకి తీసుకురావడమే కార్యక్రమ ఉద్దేశం. ప్రముఖ పరిశోధన సంస్థ డబ్ల్యూఆర్ఐ ఇండియా రోస్ సెంటర్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) వంటి సంస్థల సహకారంతో స్మార్ట్‌స్ట్రీట్స్ ల్యాబ్ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. గురువారం మాదాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీశాఖ కార్యదర్శి జయేష్‌రంజన్, రోస్‌సెంటర్ సంచాలకులు జ్యోత్‌ఛదా అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సురక్షితమైన రహదారుల కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రానున్న ఆరు నెలల్లో పరిష్కార మార్గాలను చూపనున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద హైటెక్ సిటీలోని ఐటీ కారిడార్ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. అనంతరం జయేష్‌రంజన్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందన్నారు. దీనికి పరిష్కారంలో భాగంగా రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం ఖర్చు కూడుకున్న పని కాబట్టి స్మార్ట్ టెక్నాలజీతో ఆయా సమస్యలకు మార్గాలను అన్వేషిస్తామన్నారు. ఇందుకు స్మార్ట్‌స్ట్రీట్స్ ల్యాబ్ ఉపయోగపడుతుందన్నారు. జ్యోత్‌ఛదా మాట్లాడుతూ తమ సంస్థ తరఫున ఆరు నెలల పాటు అధ్యయనం చేసి రోడ్డు భద్రతకు సంబంధించి మెరుగైన పరిష్కార మార్గాలను కనుగొంటామన్నారు.

చాంపియన్స్



అగ్రస్థానంలో ఆనంద్

సెయింట్ లూయిస్ (యుఎస్ఏ): ఐదుసార్లు ప్రపంచ చెస్ ఛాంపియన్ విశ్వనాథ్ ఆనంద్ సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్లో అగ్రస్థానానికి ఎగబాకాడు. గురువారం ఏడో రౌండ్లో తెల్ల పావులతో ఆడిన ఆనంద్.. 40 ఎత్తుల్లో ఇయాన్ నెపోనియాచి (రష్యా)పై విజయం సాధించాడు. ఈ గెలుపుతో ఆనంద్.. మొత్తం 4.5 పాయింట్లతో మాగ్జిమ్, అరోనియన్‌లతో ఉమ్మడిగా అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంకో రెండు రౌండ్లు మాత్రమే మిగిలి ఉన్న ఈ టోర్నీలో.. ప్రపంచ ఛాంపియన్ కార్ల్‌సన్ 4 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు.

భారత్‌లో 15.6 కోట్లు.. ప్రపంచమంతా 18 కోట్లు

మహిళల ప్రపంచకప్ వీక్షకుల సంఖ్య

లండన్: ప్రపంచ క్రికెట్‌కు భారత్ ఎంత కీలకమో చెప్పే ఉదాహరణ ఇది. మహిళల ప్రపంచకప్‌లో ఎక్కువ మ్యాచ్‌లను ఐసీసీ ప్రత్యక్ష ప్రసారం చేయడంతో ఈసారి వీక్షకుల సంఖ్య భారీగా పెరిగింది. ఐతే అందులో 86 శాతం వరకు భారత్ నుంచే ఉండటం విశేషం. ఇంగ్లండ్‌లో జరిగిన మహిళల ప్రపంచకప్‌ను మొత్తం 18 కోట్ల మంది వీక్షించారని అంచనా. అందులో దాదాపుగా 15.6 కోట్ల మంది భారత్ నుంచే ఉండటం విశేషం. భారత్‌లో గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు దాదాపుగా 8 కోట్ల మంది మ్యాచ్‌లు చూశారని ఐసీసీ తెలిపింది. ఫైనల్‌ను భారత్‌లో 12.6 కోట్ల మంది వీక్షించారని పేర్కొంది. భారత్‌లో టోర్నీకి విశేష ఆదరణ లభించడంతో.. వీక్షణలో గత రికార్డులన్నీ బద్దలయ్యాయి.

20 ఏళ్ల వరకు..

రబ్బరు బంతే



ఉమేశ్

క్యాండీ: క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన సమయంలో రబ్బరు లేదా టెన్నిస్ బంతితో ఆడటం.. ఆ తర్వాత లెదర్ బంతికి అలవాటు పడటం మామూలే! అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఏ క్రికెటర్ అయినా పాఠశాల క్రికెట్ స్థాయిలోనే లెదర్ బంతితో మ్యాచ్‌లు ఆడటం మొదలుపెట్టేస్తాడు. కానీ టీమ్‌ఇండియా పేసర్ ఉమేశ్ యాదవ్ మాత్రం 20 ఏళ్ల వయసు వచ్చే వరకు ఆ బంతిని ఉపయోగించనే లేదట. అప్పటిదాకా అతను రబ్బరు, టెన్నిస్ బంతులతోనే మ్యాచ్‌లు ఆడేవాడట. దీంతో ఫస్ట్ క్లాస్ క్రికెట్ మొదలుపెట్టాక లెదర్ బంతితో ఏం చేయాలో తెలియని అయోమయంలో పడిపోయినట్లు ఉమేశ్ తెలిపాడు. "చిన్నప్పట్నుంచి ఆట ఆడుతుంటే చాలా విషయాలు తెలుస్తాయి. కానీ కొన్నిసార్లు మనం ఏదైనా భిన్నంగా చేయాల్సి వచ్చినపుడు సముద్రంలో ఉన్నట్లుంటుంది. నేను 20 ఏళ్ల వయసు వరకు టెన్నిస్, రబ్బరు బంతులతోనే ఆడాను. ఓ ఫాస్ట్ బౌలర్ విషయంలో అప్పటికి చాలా ఆలస్యమైనట్లు. నాకు లెదర్ బంతి ఇచ్చేటప్పటికి దాంతో ఏం చేయాలో అర్థం కాలేదు. ఆ బంతిని ఎక్కడ పిచ్ చేయాలో నాకు రెండేళ్ల పాటు అవగాహన రాలేదు. బంతి ఎలా వెళ్తుందో కూడా తెలిసేది కాదు. ఆ సమయంలో కోచ్‌లు నాకు సాయం చేశారు. బంతిపై నియంత్రణ సులువేనని తెలియజెప్పారు. ఇక అప్పట్నుంచి నా బౌలింగ్ శైలి మీద దృష్టిపెట్టా. నా వేగం నన్ను గొప్ప స్థాయికి తీసుకెళ్తుందని నాకు తెలుసు. వేగంగా బౌలింగ్ చేయడం నాకెప్పుడూ ఇష్టం" అని ఉమేశ్ అన్నాడు.

అశ్విన్, జడేజాలకు విశ్రాంతి?

శ్రీలంకతో వన్డేలకు భారత జట్టు ఎంపిక 13న



క్యాండీ: శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌కు స్పిన్నర్లు అశ్విన్, జడేజాలకు టీమ్‌మేనేజ్‌మెంట్, జాతీయ సెలక్షన్ కమిటీ విశ్రాంతినిచ్చే అవకాశముంది. పని భారాన్ని తగ్గించేందుకు పేస్ బౌలర్ మహ్మద్ షమికి కూడా విశ్రాంతి ఇవ్వొచ్చు. టెస్టు సిరీస్‌లో ఇప్పటివరకు జడేజా 108.2 ఓవర్లు వేయగా.. అశ్విన్ 108.3 ఓవర్లు వేశాడు. సస్పెన్షన్ కారణంగా జడేజా మూడో టెస్టుకు దూరం కాగా.. ఆ మ్యాచ్‌లో ఆడనున్న అశ్విన్ 150కి పైగా ఓవర్లతో సిరీస్‌ను ముగించే అవకాశముంది. యజువేంద్ర చాహల్, అక్షర్ పటేల్, కృనాల్ పాండ్య జట్టులో స్థానం కోసం పోటీలో ఉన్నారు. శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం సెలక్షన్ కమిటీ ఈ నెల 13న జట్టును ప్రకటించనుంది. తొలి వన్డే 20న జరుగుతుంది. సీజన్‌లో భారత్ తీరికలేని క్రికెట్ ఆడాల్సివున్న నేపథ్యంలో టీమ్‌మేనేజ్‌మెంట్ ఆటగాళ్లపై పని భారం మరీ ఎక్కువగా పడకుండా జాగ్రత్త పడుతోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో వన్డే మ్యాచ్‌లు ఆడనున్న భారత్.. ఏడాది ఆఖర్లో పూర్తి స్థాయి పర్యటనకు వచ్చే శ్రీలంకతో తలపడనుంది. కొత్త సంవత్సరంలో భారత్.. దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్తుంది. ఆ తర్వాత శ్రీలంకలో ఇండిపెండెన్స్‌డే కప్‌లో ఆడుతుంది. ఆ వెంటనే 2018 ఐపీఎల్ ఉంటుంది. ఈ తీరికలేని షెడ్యూలు నేపథ్యంలో, ఇప్పటికే అవిశ్రాంతంగా ఆడుతున్న కెప్టెన్ విరాట్ కోహ్లీకి కూడా విశ్రాంతి ఇవ్వొచ్చన్న చర్చ జరుగుతోంది. ఐతే కోహ్లీకి విశ్రాంతినిచ్చే అంశాన్ని సెలక్షన్ కమిటీ పరిశీలిస్తున్నప్పటికీ.. అతడు శ్రీలంకతో వన్డే సిరీస్‌లో ఆడాలనే ఉద్దేశంతోనే ఉన్నాడట.

రంగులో అందమా!

ముకుంద్ అసహనం



చెన్నై: తన ఒంటి రంగు గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై భారత టెస్టు జట్టు ఓపెనర్ అభినవ్ ముకుంద్ అసహనం వ్యక్తం చేశాడు. ఈ విషయంలో చిన్నప్పట్నుంచి తాను వివక్ష ఎదుర్కొంటూనే ఉన్నానని.. ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాల్లో ఈ తరహా వ్యాఖ్యలు శ్రుతి మించుతున్నాయని ముకుంద్ అన్నాడు. తనపై వర్ణ వివక్ష చూపిస్తున్న వారికి ఘాటుగా సమాధానం చెబుతూ ముకుంద్ ఓ ప్రకటన విడుదల చేశాడు. తాను దేశంలోనే అధిక ఉష్ణోగ్రతలు ఉండే నగరాల్లో ఒకటైన చెన్నైలో పుట్టి పెరిగానని, చిన్నతనం నుంచి ఎక్కువగా ఎండలోనే ఉండి సాధన చేశానని ముకుంద్ అన్నాడు. తన రంగును ఉద్దేశించి ఎందరో ఎన్నో పేర్లు పెట్టి పిలిచేవారిని, తనకు పెద్ద లక్ష్యాలుండటం వల్ల ఇలాంటి వాటిని తేలిగ్గానే తీసుకునేవాడినని.. ఎప్పుడూ దేనికీ సమాధానం ఇవ్వలేదని చెప్పాడు. ఐతే తనలా ఒంటి రంగు విషయంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొంటున్న వాళ్ల కోసం ఇప్పుడు మాట్లాడదలుచుకున్నానని.. సామాజిక మాధ్యమాల్లో వివక్ష పూరిత వ్యాఖ్యలు శ్రుతి మించిపోతున్నాయని చెప్పాడు. ఒంటి రంగులోనే అందం ఉండదని, దాని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డాడు. తన వ్యాఖ్యలు టీమ్‌ఇండియాలో ఎవరినీ ఉద్దేశించినవి కావని, అలాగే వీటిని రాజకీయ కోణంలో కూడా చూడాల్సిన అవసరం లేదని.. ఒక సానుకూల సందేశం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఇలా మాట్లాడుతున్నానని ముకుంద్ వివరణ ఇచ్చాడు. ముకుంద్ ప్రకటనపై టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లి సహా పలువురు ఆటగాళ్లు స్పందించారు. ''చాలా బాగా చెప్పావ్ ముకుంద్" అంటూ కోహ్లి ట్వీట్ చేయగా.. "చదివి, నేర్చుకోండి, ఇది ఒకరి భావోద్వేగాలకు సంబంధించిన విషయం, దీన్ని పతాక శీర్షికలకు ఎక్కించకండి" అని అశ్విన్ అన్నాడు.

తొడగొట్టిన తలైవాస్

ప్రొకబడ్డీలో తమిళ్ తలైవాస్ తొలి విజయాన్ని అందుకుంది. ఐదో సీజన్‌లో కొత్తగా చేరిన తలైవాస్ గురువారం బెంగళూరు బుల్స్‌కు షాకిచ్చింది. అన్ని రంగాల్లో ఆధిపత్యం ప్రదర్శించిన ఆ జట్టు 29–24తో జోన్‌-బిలో అగ్రస్థానంలో కొనసాగుతున్న బెంగళూరును ఓడించింది. మరోవైపు మాజీ ఛాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ కూడా బోణీ కొట్టింది. జోన్‌-ఎలో అగ్రస్థానంలోని పుణెరి పల్టాన్‌పై 30–28 తేడాతో విజయం సాధించింది.

● తమిళ జట్టు తొలి విజయం ● జైపూర్ బోణీ ● ప్రొ కబడ్డీ

నాగ్‌పుర్



జైపుర్ - పుణెరి మ్యాచ్‌లో ఓ దృశ్యం

కెప్టెన్ రోహిత్ కుమార్ (11 పాయింట్లు) చెలరేగినా ఫలితం లేకపోయింది. బెంగళూరుకు ఓటమి తప్పలేదు. సమష్టిగా రాణించిన తమిళ్ తలైవాస్ ప్రొకబడ్డీలో తొలి గెలుపు రుచిచూసింది. మ్యాచ్‌లో తొలి పది నిమిషాలు నువ్వా నేనా అన్నట్టుగా సాగింది. ఒక దశలో 6-6తో రెండు జట్లు సమంగా నిలిచాయి. ఐతే ప్రథమార్ధం ముగిసేసరికి 12-8తో ఆధిక్యంలోకి వెళ్లిన తలైవాస్ జట్టు రెండో భాగంలో మరింత పట్టుదలగా ఆడింది. 18-10తో ఆధిక్యం సాధించిన ఆ జట్టు ఏ దశలోనూ ఆధిక్యం కోల్పోలేదు. ఆఖర్లో బెంగళూరు 24-26తో పుంజుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మ్యాచ్‌లో రెయిడ్‌ల ద్వారా తమిళ్ తలైవాస్ 16 పాయింట్లు సాధించగా.. బెంగళూరు 15 పాయింట్లు గెలిచింది. ఐతే డిఫెన్స్‌లో బెంగళూరు పూర్తిగా విఫలమైంది. ఆ జట్టు డిఫెండర్లు 5 పాయింట్లే గెలిచారు. తలైవాస్ 10 ట్యాకిల్ పాయింట్లు సాధించడం విశేషం. మ్యాచ్‌లో రోహిత్ కుమారే టాప్ స్కోరర్. తమిళ్ జట్టులో ప్రపంజన్ (6) టాప్ స్కోరర్‌గా నిలవగా.. అమిత్ హుడా (4) ఎక్కువ ట్యాకిల్ పాయింట్లు గెలిచాడు.

జైపుర్ బోణీ: మాజీ ఛాంపియన్ జైపుర్ పింక్ పాంథర్స్ బోణీ కొట్టింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పుణెరి పల్టాన్‌ను ఓడించింది. మంజీత్ చిల్లార్ (9), జస్వీర్ (5) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ప్రథమార్ధం ముగిసేసరికి 14-11తో ఆధిక్యంలో నిలిచిన జైపుర్.. ద్వితీయార్ధం ఆరంభంలోనే పుణెరిని ఆలౌట్ చేసింది. 19-11తో స్పష్టమైన ఆధిక్యం సంపాదించిన ఆ జట్టు ఆ తర్వాత ఆధిక్యం కాపాడుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించింది. డిఫెన్స్‌లో మంజీత్ వరుసపెట్టి పాయింట్లు సాధించడంతో పుణెరి కోలుకోలేకపోయింది. మ్యాచ్ మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనగా జైపుర్ 29-19తో పుణెరిపై పది పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. ఈ స్థితిలో సందీప్ నర్వాల్ (9), రోహిత్ కుమార్ (4) రెయిడ్ పాయింట్లతో అదరగొట్టడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. ఐతే డిఫెన్స్‌లో బలంగా ఉన్న జైపుర్ 2 పాయింట్ల ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించింది. జోన్‌-ఎలో 11 పాయింట్లతో పుణెరి.. జోన్‌-బిలో 20 పాయింట్లతో బెంగళూరు అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి.

ప్రొ కబడ్డీలో ఈనాడు	గుజరాత్ × యు ముంబా రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో; వేదిక అహ్మదాబాద్

బోల్ట్ సరసన ఫెలిక్స్



ఫెలిక్స్

లండన్: అమెరికా ట్రాక్ దిగ్గజం అలిసన్ ఫెలిక్స్ ఖాతాలో మరో ఘనత చేరింది. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అత్యధికంగా 14 పతకాలు సొంతం చేసుకున్న జమైకా అథ్లెట్లు ఉసేన్ బోల్ట్, మెర్లిన్ ఒటె సరసన ఆమె చేరింది. బుధవారం రాత్రి జరిగిన మహిళల 400 మీటర్ల పరుగులో కాంస్యం గెలవడం ద్వారా ఆమె ఈ రికార్డు అందుకుంది. ఫెలిక్స్ 50.08 సెకన్లలో లక్ష్యాన్ని చేరింది. ఐతే ఫెలిక్స్ ప్రధాన పత్యర్థి, రేసులో ఒక దశలో అగ్రస్థానంలో ఉన్న షానె మిల్లర్ (బహమాస్) పొరపాటు కారణంగా ఆమెకు పతకం లభించింది. లక్ష్యానికి 20 మీటర్ల ముందు తడబడిన మిల్లర్ (50.49 సెకన్లు) నాలుగో స్థానానికి పరిమితమైంది. అమెరికా రన్నర్ ఫిలిస్ ఫ్రాన్సిస్ (49.92 సెకన్లు) స్వర్ణం సొంతం చేసుకోగా.. సాల్వ ఈద్ నాజర్ (50.06 సెకన్లు) రజతం నెగ్గింది. మహిళల్లో ఒటెను.. మొత్తంగా బోల్ట్‌ను అధిగమించి ప్రపంచ అథ్లెటిక్స్‌లో అత్యధిక పతకాలు నెగ్గిన స్ప్రింటర్‌గా చరిత్ర సృష్టించే అవకాశం ఫెలిక్స్ ముందుంది. బోల్ట్ 4×100 మీటర్ల రిలేలో మాత్రమే పాల్గొనాల్సివుండగా.. ఫెలిక్స్ 4×100మీ., 4×400 మీ. రిలేల్లో పోటీపడాల్సివుంది. ఈ రెండు విభాగాల్లో పతకాలు సాధిస్తే ఆమె పతకాల సంఖ్య 16కు చేరుతుంది. ఐతే ఇప్పటివరకు సాధించిన పతకాల్లో 12 పతకాలు రిలే విభాగాల్లో సాధించినవే కావడం గమనార్హం. ఆమె ఖాతాలో మొత్తం 9 స్వర్ణాలున్నాయి.

లక్ష్మణన్ విఫలం: పురుషుల 5000 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ గోవిందన్ లక్ష్మణన్ ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. హీట్స్‌లో 15వ స్థానంలో నిలిచాడు. తొలి 5 స్థానాల్లోని అథ్లెట్లు ఫైనల్ చేరారు.

సెలక్టర్లు ఉన్నదెందుకు?

మండిపడ్డ మదన్‌లాల్



దిల్లీ: మెరుగైన జట్లను ఎంపిక చేశారన్న కారణంతో భారత సెలక్టర్లకు రూ.15 లక్షల చొప్పున బీసీసీఐ ప్రోత్సాహకాలు అందజేయడాన్ని మాజీ ఆల్‌రౌండర్ మదన్ లాల్ తప్పుబట్టాడు. సెలక్టర్లున్నదే మెరుగైన జట్లను ఎంపిక చేయడానికైనపుడు, వారికి ప్రత్యేక ప్రోత్సాహాలివ్వాల్సిన అవసరమేముందని అతను ప్రశ్నించాడు. "ఉత్తమ జట్లను ఎంపిక చేసినందుకు సెలక్టర్లకు నజరానాలు ఇచ్చినట్లు చదివి ఆశ్చర్యపోయాను. వాళ్ల బాధ్యతే ఉత్తమ జట్లను ఎంపిక చేయడమే తప్ప చెత్త జట్లను కాదు" అని లాల్ ట్విటర్లో పేర్కొన్నాడు. ఐతే లాల్ వాదనను బీసీసీఐ అధికారి ఒకరు తప్పుబట్టారు. భారత జట్లు చక్కటి ప్రదర్శన చేసినపుడు ఆటగాళ్లతో పాటు సెలక్టర్లకు కూడా ప్రోత్సాహకాలు అందించిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయని అన్నారు.

కోహ్లీకి కలిసొస్తోంది అదే..

మహేల జయవర్ధనే

టెస్టు సిరీస్‌లో భారత్ ఆధిపత్యం చలాయిస్తోంది. తొలి రెండు మ్యాచుల్లో ఘనవిజయాలతో సిరీస్ సొంతం చేసుకోవడం ద్వారా భారత్ ఎంత బలమైన జట్టో చూపించింది. టెస్టు ర్యాకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉండటానికి భారత్ పూర్తిగా అర్హమైన జట్టే. కొన్నేళ్లుగా భారత్ జాగ్రత్తగా, తెలివిగా జట్టును పునర్నిర్మించుకుంటూ వస్తోంది. దూరదృష్టితో, సరైన నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఇప్పుడు మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రస్తుత సిరీస్‌లో భారత బ్యాట్స్‌మెన్ టాస్‌ను చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్లు సాధించారు. బలమైన బౌలింగ్, ఫీల్డింగ్ కూడా జట్టుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. భారత జట్టు గొప్ప ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రణాళికలను సరిగా అమల్లో పెడుతున్నారు. దానికి కావలసిన వనరులు భారత జట్టులో పుష్కలంగా ఉన్నాయి. ఆరుగురు బ్యాట్స్‌మెన్- ఐదుగురు బౌలర్ల విధానం భారత జట్టుకు చాలా ఉపయోగపడుతోంది. ఇది కెప్టెన్ కోహ్లీకి కలిసొస్తోంది. పల్లెకెలెలో చివరి టెస్టుకు భారత్ పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసే దిశగా చివరి టెస్టులోనూ నిర్దాక్షిణ్యంగా ఆడాలనే కోహ్లి సహచరులకు చెబుతాడు. విదేశాల్లో ప్రత్యర్థిని వైట్‌వాష్ చేయడం గొప్ప ఘనత అవుతుంది. ఈ సిరీస్ చాలా కఠినంగా ఉంటుందని, భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాలంటే అసాధారణంగా ఆడాలని వారికి ముందే తెలుసు. కానీ దురదృష్టవశాత్తూ వాళ్లు అనుకున్నట్లుగా ఏదీ జరగలేదు. తొలి ఇన్నింగ్స్‌ల్లో లంక బ్యాటింగ్ వైఫల్యం కలవరపెడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్లు చేయడం టెస్టుల్లో కీలకం. తొలి రెండు టెస్టుల్లో ఆరంభంలోనే ఒత్తిడికి గురవడం వల్ల తర్వాత ప్రత్యర్థిని అందుకోవడానికే సరిపోయింది. చివరి టెస్టులో 20 వికెట్లు తీయాలంటే ఏదైనా భిన్నంగా చేయాలి.

హంపికి అమ్మాయి



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: భారత చదరంగ తార కోనేరు హంపి తల్లయింది. గురువారం ఆమె విజయవాడలోని ఓ ఆస్పత్రిలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. దీంతో హంపి తండ్రి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ ఇంట సందడి నెలకొంది. హంపికి 2014లో విజయవాడకు చెందిన అన్వేష్‌తో వివాహమైంది.

ప్రొడునోవాకు విరామం

దీప నిర్ణయం



దిల్లీ: జిమ్నాస్టిక్స్‌లో ప్రమాదకర ప్రొడునోవా విన్యాసాన్ని అలవోకగా చేస్తూ.. ప్రపంచ దిగ్గజ జిమ్నాస్ట్‌లను ఆకర్షించిన దీప కర్మాకర్.. తనకు ఇష్టమైన ప్రొడునోవాకు కొంతకాలం దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. కాస్త తక్కువ ప్రమాదకర విన్యాసంపై పట్టు సంపాదించేందుకు ప్రయత్నిస్తోంది. వచ్చే ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో హ్యాండ్‌స్ప్రింగ్ 540 డిగ్రీ టర్న్‌తో సత్తా చాటాలని ఆమె పట్టుదలగా ఉంది. ప్రొడునోవా విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా రియో ఒలింపిక్స్‌లో ఆమె నాలుగో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఐతే ఆ తర్వాత గాయం కావడంతో పోటీలకు దూరంగా ఉంది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆమె వచ్చే ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో బరిలో దిగనుంది. గురువారం 24వ పుట్టినరోజు వేడుక చేసుకున్న దీప భవిష్యత్ గురించి మాట్లాడుతూ.. "హ్యాండ్‌స్ప్రింగ్ విన్యాసం కూడా ప్రమాదమైందే. ఐతే ప్రొడునోవా అంత కాదు. గాయం నుంచి కోలుకుంటున్నా. భారం ఎక్కువ పడకూడదనే ప్రొడునోవాకు దూరంగా ఉన్నా. 2020 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే నా లక్ష్యం. ప్రొడునోవాను నేను వదులుకోను" అని దీప చెప్పింది.

ఒక్కడే పరుగెత్తాడు..



మక్వాలా

● 200 మీ. ఫైనల్లో మక్వాలా

లండన్: ప్రపంచ అథ్లెటిక్స్‌లో అనూహ్య దృశ్యం. పరుగు పందెంలో ఒక్కడే పోటీపడ్డాడు. 200 మీటర్ల పోటీలో ఒకే ఒక్కడి కోసం హీట్స్ నిర్వహించారు. అది కూడా అసలు హీట్స్ ముగిసిన రెండు రోజుల తర్వాత..! సెమీస్‌కు కేవలం రెండు గంటల ముందు ప్రత్యేకంగా ఐజాక్ మక్వాలా కోసం పరుగు పోటీ పెట్టారు. అసలెందుకు అలా చేయాల్సి వచ్చిందంటే..?

లండన్‌లో ఓ హోటల్‌లో బస చేసిన దాదాపుగా 30 మంది క్రీడాకారులు, అధికారులు అనారోగ్యానికి గురయ్యారు. వాంతులు, కడుపు నొప్పితో ఇబ్బంది పడిన వారిలో కొంతమంది నోరోవైరస్ బారిన పడినట్లు తేలింది. అంటువ్యాధి కావడంతో అది సోకిన వారిని పోటీలకు దూరంగా ఉంచారు. అందులో 200 మీ. 400 మీ. పరుగుల్లో పతక ఫేవరెట్ మక్వాలా కూడా ఉన్నాడు. 400 మీ. ఫైనల్లో పోటీ పడేందుకు అతడు ఫిట్‌గా ఉన్నప్పటికీ నోరోవైరస్ బాధితుడు కావడంతో.. అంతర్జాతీయ అథ్లెటిక్స్ సంఘాల సమాఖ్య (ఐఏఏఎఫ్) అతడిని ఫైనల్‌కు అనుమతించలేదు. 200 మీ. హీట్స్‌కూ ఐజాక్ దూరం కావాల్సివచ్చింది. 400 మీటర్ల ఫైనల్ ముందు వార్మప్ ట్రాక్ దగ్గరకు వచ్చిన ఐజాక్.. "నాపై కుట్ర జరిగింది. అది చేసింది.. బ్రిటనా, ఐఏఏఎఫా అనేదే తేలాలి" అని ఆరోపించాడు. రెండు రోజుల్లో అతడి శరీరంలోని వైరస్ నశించడంతో.. బోట్స్‌వానా అథ్లెటిక్స్ సమాఖ్య.. ఐజాక్‌ను 200 మీ. రేసుకు అనుమతించాలని ఐఏఏఎఫ్‌కు విజ్ఞప్తి చేసింది. అందుకు సానుకూలంగా స్పందించిన అథ్లెటిక్స్ సమాఖ్య అతడి కోసం ప్రత్యేకంగా హీట్స్ నిర్వహించింది. 20.20 సెకన్లలో లక్ష్యాన్ని చేరిన అతడు అర్హత మార్క్ (20.53 సెకన్లు)ను సులభంగా అధిగమించి సెమీస్ చేరాడు. ఆ తర్వాత రెండు గంటల్లోనే జరిగిన సెమీస్‌లో మిగతా అథ్లెట్లతో పోటీపడిన అతడు 20.14 సెకన్లలో రేసును పూర్తి చేసి రెండో స్థానంతో ఫైనల్ చేరాడు. శుక్రవారం రాత్రి 2 గంటల తర్వాత ఫైనల్ జరుగుతుంది. "నా బాధ ఇంకా తీరలేదు. 400 మీటర్ల పరుగులో నాకు పోటీపడే అవకాశం కల్పించాల్సింది. ప్రస్తుతం చాలా కోపంగా ఉన్నాను" అని ఐజాక్ చెప్పాడు. 400 మీటర్ల పరుగులో నీకెర్క్ (దక్షిణాఫ్రికా) స్వర్ణం గెలిచాడు. ఐతే ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఒకేసారి 200 మీ, 400 మీ. స్వర్ణాలు సాధించిన అథ్లెట్‌గా.. 1995లో జాన్సన్ సాధించిన రికార్డును నీకెర్క్ అందుకోవాలంటే అతడు 200 మీ. ఫైనల్లో మక్వాలాను ఓడించాలి. అది సాధ్యమా..?

సద్విమర్శ లేకపోతే నిరంకుశమే

- వీడ్కోలు సభలో హమీద్ అన్సారీ
- రాజ్యసభ ఛైర్మన్ సేవల్ని కొనియాడిన ప్రధాని
- అన్సారీ నాకు మార్గదర్శి: మన్మోహన్‌సింగ్



ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ వీడ్కోలు సభలో జ్ఞాపికను బహూకరిస్తున్న ప్రధాని మోదీ. పక్కన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎం.వెంకయ్యనాయుడు

దిల్లీ: ప్రభుత్వ పథకాలపై సహేతుకమైన సద్విమర్శల్ని అనుమతించకపోతే ప్రజాస్వామ్యం కాస్తా భ్రష్టుపట్టిపోయి నిరంకుశత్వంగా మారిపోతుందని రాజ్యసభ ఛైర్మన్, భారత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ పేర్కొన్నారు. రెండు విడతల్లో పదేళ్లపాటు ఈ హోదాల్లో సేవలందించి గురువారం నాటితో పదవీకాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆయనకు రాజ్యసభ ఘనంగా వీడ్కోలిచ్చింది. ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సహా పలువురు నేతలు ఆయన సేవల్ని శ్లాఘించారు. అన్సారీ మాట్లాడుతూ భారతీయ భిన్నత్వాన్ని చాటి చెప్పే రీతిలో రాజ్యసభను రాజ్యాంగం సృష్టించిందని చెప్పారు. ప్రథమ ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన వ్యాఖ్యల్ని ఆయన ప్రస్తావిస్తూ- స్వేచ్ఛగా విమర్శించే అవకాశాన్ని విపక్షాలకు కల్పించాలన్నారు. ఆ పేరుతో పార్లమెంటు పనికి ఉద్దేశపూర్వకంగా అంతరాయాలు కలిగించడం మాత్రం సబబు కాదని చెప్పారు. విమర్శించే హక్కుతో పాటు తమ బాధ్యతల్నీ విపక్షాలు గుర్తెరగాలన్నారు.

నాదొక రిఫరీ స్థానం: 'ఆటను, క్రీడాకారుల్ని నిశితంగా గమనిస్తూ ఆటలో మాత్రం పాల్గొనని క్రికెట్ అంపైర్‌లా, హాకీ రిఫరీలా సభాధ్యక్ష స్థానంలో బాధ్యతల్ని నిర్వర్తించాను. నియమాల పుస్తకమే తలమానికంగా పనిచేశాను. భారత మూల పురుషుల వివేచన, ముందు చూపులతో రాజ్యసభ ఏర్పాటయింది. ఇక్కడ జరిగే చర్చల్ని ప్రజలు నిశితంగా పరిశీలిస్తుంటారనే విషయాన్ని గుర్తెరిగి మసలుకోవాలి' అని అన్సారీ చెప్పారు. అల్పసంఖ్యాక వర్గాలవారికి కల్పించే రక్షణను బట్టి ప్రజాస్వామ్య సమున్నతను నిర్వచించవచ్చనీ, అదే సమయంలో మైనారిటీలకూ కొన్ని బాధ్యతలుంటాయనీ చెప్పారు. చట్టాలను గందరగోళ పరిస్థితుల మధ్య ఆమోదించకూడదనీ, అలాంటి సందర్భాల్లో ఆచితూచి అడుగేయాలనీ పేర్కొన్నారు. చర్చ, వాదోపవాదనలనేవి అవరోధమేమీ కాదనే విశ్వాసంతో రాజ్యసభ పనిచేస్తూ వచ్చిందని చెప్పారు.

రాజ్యాంగ విలువల్ని పరిరక్షించారు: మోదీ

గత పదేళ్లుగా అన్సారీ అందించిన సేవలు మరువలేనివని ప్రధాని మోదీ చెప్పారు. రాజ్యాంగ విలువలు, నిబంధనల్ని పరిరక్షించడంలో ఆయన తన వంతు కృషి చేశారని కొనియాడారు. ఒకప్పటి దౌత్యాధికారిగా దౌత్యపరమైన విషయాల్లో ఆయనకున్న లోతైన అవగాహన నుంచి తానెంతో లబ్ధి పొందానని చెప్పారు. దౌత్యాధికారుల మాటలు, చేతలకు అర్థమేమిటో వెంటనే తెలియదన్నారు. ఇకపై బంధనాలు తెంచుకుని, అన్సారీ స్వేచ్ఛగా తన సిద్ధాంతానికి లోబడి మాట్లాడడానికి, పనిచేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఆయన సేవలు ఇకపైనా జాతికి అందాలని ఆకాంక్షించారు. అన్సారీ కుటుంబానికి ప్రజా జీవితంలో వందేళ్లకు పైగా ఘన చరిత్ర ఉందన్నారు. అన్సారీ వంటి నేతలు చేస్తున్న కృషి కారణంగా మనదేశం ఎన్నో సవాళ్లను అధిగమించి, ముందడుగు వేయగలుగుతోందని మన్మోహన్‌సింగ్ చెప్పారు. ఆయన తనకు మార్గదర్శిగా, స్నేహితునిగా వ్యవహరించి సహకరించేవారని గుర్తు చేసుకున్నారు. అలాంటి వ్యక్తి వెయ్యేళ్లు బతకాలని ఆకాంక్షించారు. అన్సారీ హయాంలో రాజ్యసభ అత్యుత్తమ స్థాయి చర్చల్ని, అంతరాయాల్నీ చవిచూసిందని సభా నాయకుడు అరుణ్ జైట్లీ చెప్పారు. అన్సారీకి వేర్వేరు దేశాలు అనేక గౌరవ డిగ్రీలను ప్రదానం చేసినా ఆయన ఎన్నడూ వాటిని వినియోగించుకోలేదని విపక్ష నేత గులాంనబీ ఆజాద్ చెప్పారు. అన్సారీ గత 40 ఏళ్లుగా మధ్యాహ్న భోజనంగా రొట్టె ముక్కల్ని మాత్రమే తీసుకోవడం ఓ ప్రపంచ రికార్డు అవుతుందని డెరెక్ ఓబ్రియెన్ (తృణమూల్ కాంగ్రెస్) అన్నారు. 80 ఏళ్ల అన్సారీ ఆరోగ్య పరిరక్షణనూ పలువురు సభ్యులు కొనియాడారు.

మనదేశంలోనే మైనార్టీలకు అత్యంత భద్రత

- భద్రతలేదనటం రాజకీయ దుష్ప్రచారంలో భాగమే
- హమీద్ అన్సారీ వ్యాఖ్యలను పరోక్షంగా ఖండించిన వెంకయ్యనాయుడు
- అన్సారీ అభిప్రాయం సరికాదంటూ భాజపా, వీహెచ్‌పీ మండిపాటు

దిల్లీ: ప్రపంచంలో ఎక్కడా లేనంత భద్రత అల్పసంఖ్యాక వర్గాలకు మన దేశంలో లభిస్తుందని శుక్రవారం ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేయనున్న ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. వారికి ఇక్కడ భద్రత లేదనటం రాజకీయ దుష్ప్రచారంలో భాగమేనని అన్నారు. దేశంలో అసహనం పెరిగిపోతుందన్న విమర్శలనూ ఆయన తోసిపుచ్చారు. భారతీయ సమాజంలోనే సహనం వేళ్లూనుకుని ఉందని, ఇక్కడి ప్రజలు, నాగరికత వల్లే అది కొనసాగుతుందని... ప్రజాస్వామ్య విజయానికి ఈ సహనమే దోహదకారని స్పష్టంచేశారు. 'దేశంలోని ముస్లింలు అభద్రత భావంతో ఉన్నార'ంటూ ఉపరాష్ట్రపతిగా పదవీకాలం ముగిసిన హమీద్ అన్సారీ ఓ టీవీ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలకు వెంకయ్యనాయుడు పరోక్షంగా స్పందించారు. ఒక వర్గం వారిని ప్రత్యేకంగా ప్రస్తావించటం అంటే దేశ ప్రజల్లో చీలిక తీసుకువచ్చే యత్నమేనని, ఇది ఇతర వర్గాలు తీవ్రంగా స్పందించేలా చేయవచ్చని హెచ్చరించారు. దేశంలో వివక్ష లేదనటానికి అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన వారు రాజ్యాంగ పదవులను చేపట్టడమే నిదర్శనమని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సర్వ ధర్మ సద్భావం, లౌకికతత్వం భారతీయుల హృదయం, రక్తంలో నిండుగా ఉన్నాయన్నారు. సువిశాల దేశంలో ఎక్కడో ఒకట్రెండు చోట్ల జరిగే చెదురుమదురు ఘటనల ఆధారంగా అల్పసంఖ్యాక వర్గాల వారికి భద్రత లేదనే నిర్ణయానికి రావటం సముచితం కాదన్నారు. అయితే, వర్గం ప్రాతిపదికన తోటి వారిపై దాడులు చేయటం సమర్థనీయం కాదని తెలిపారు. ఆయా ఘటనల వెనుక వ్యక్తిగత, రాజకీయ స్వప్రయోజనాలతో పాటు అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే యత్నాలూ ఉండవచ్చని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

హోదాకు తగని వ్యాఖ్యలు: భాజపా, వీహెచ్‌పీ

కీలకమైన రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి చేయతగిన వ్యాఖ్యలు కాదంటూ హమీద్ అన్సారీ విమర్శలపై భాజపా, విశ్వహిందూ పరిషత్‌లు స్పందించాయి. అన్సారీ వ్యాఖ్యలను బట్టి ఆయన రాజకీయ ఆశ్రయాన్ని ఏమైనా కోరుకుంటున్నారా అనే సందేహం కలుగుతుందని భాజపా ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయ్‌వర్గీయ అన్నారు. ఆయన మాటలు ఉపరాష్ట్రపతి హోదాకు తగవని అభిప్రాయపడ్డారు. ముస్లింలు అభద్రతలో ఉన్నారని అనటం ద్వారా ఉపరాష్ట్రపతి పదవిని అవమానించినట్లయిందని వీహెచ్‌పీ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ మండిపడ్డారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా ఆజాద్ చూపిన మార్గాన్ని అనుసరించటానికి బదులుగా అన్సారీ.. మహ్మద్ అలీ జిన్నా అడుగుజాడల్లో నడవటం దురదృష్టకరమని పేర్కొన్నారు.

లష్కరే తోయిబా ఉగ్రవాది అరెస్టు

శ్రీనగర్: ఉత్తర కశ్మీరు పరిధిలో బారాముల్ల జిల్లాలో గురువారం పోలీసులు లష్కరే తోయిబా ఉగ్రవాదిని అరెస్ట్ చేశారు. బారాముల్ల జిల్లాలో సీర్ అమర్‌గడ్ రోడ్డు సమీపంలో రైల్వే క్రాసింగ్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి తనిఖీలు దాటుకుని పరుగుతీశాడు. ఆ ప్రాంతాన్ని చుట్టిముట్టిన భద్రతా దళాలు, పోలీసులు పరుగు తీసిన అనుమానితుణ్ని పట్టుకున్నారు. అతను జమియ ఖాదీమ్ సుపూర్‌లో నివసించే ఇశ్ఫాఖ్ అహ్మద్ కన్నాగా గుర్తించారు. ఇటీవల అతను లష్కర్ తోయిబా ఉగ్రవాద సంస్థలో చేరినట్లు నిర్ధారించారు. అతని వద్ద నుంచి పిస్తోలు, తూటాలు, రెండు యూబీజీఎల్ గ్రెనైడ్లు స్వాధీనం చేసుకున్నారు. లష్కరే తోయిబాలో చేరకముందు అతను ఉత్తర కశ్మీరులో ఉగ్రసంస్థలకు ఉగ్రవాదులను నియమించేవాడని, అతనిపై సుపూర్ పోలీసుస్టేషన్‌పై గ్రెనైడ్లు విసిరిన కేసు ఉందని పోలీసులు వెల్లడించారు.

ఉగ్రవాదులకు నిధులు అందించిన కేసులో ఈడీ సోదాలు

శ్రీనగర్, దిల్లీ: ఉగ్రవాదులకు నిధులు అందించారన్న కేసులో జమ్ము కశ్మీర్‌కు చెందిన షేక్ ఆషిక్ అహ్మద్‌కు సంబంధించిన సంస్థల్లో ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) సోదాలు నిర్వహించింది. గురువారం శ్రీనగర్‌లో అహ్మద్‌కు సంబంధించిన మూడు ప్రదేశాల్లో సోదాలు జరిపినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా విదేశీ సంస్థలకు చెందిన కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నామని, నిందితుడు సహకరించడం లేదని తెలిపారు. ఉగ్రవాదులకు రూ.20 కోట్ల నిధులు అందించారన్న అభియోగాలపై, విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం ఉల్లంఘన కింద గతంలో కేసు నమోదైంది.

ఉగ్రవాది దుజనా హతంపై ప్రతీకార హెచ్చరిక

అమృత్‌సర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైల్లో బాంబు, లేఖ

అమేథీ: ఇటీవల జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో హతమైన లష్కరే తోయిబా ఉగ్రవాది అబూ దుజనా మృతికి భారత దేశం తగిన మూల్యం చెల్లించుకుంటుందని గుర్తుతెలియని వ్యక్తులు హెచ్చరించారు. దుండగులు కోల్‌కతా నుంచి అమృత్‌సర్ వెళ్లే అకల్‌తఖ్త్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక నాటు బాంబుతో పాటు వదిలి వెళ్లిన ఓ లేఖలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. బాంబు ఉందనే సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఆ ఎక్స్‌ప్రెస్‌ను బుధవారం అర్ధరాత్రి సమయంలో లఖ్‌నవూలోని చర్బాగ్‌లో నిలిపివేసి సోదా చేశారు. ఆగంతకులు ఒక పొట్లంలో బాంబును, రెండు లైటర్లను, ఒక లేఖను పొత్తంలో ఉంచి ఏసీ బోగీలోని మరుగుదొడ్డిలో దాచారు. పోలీసులు బాంబును నిర్వీర్యం చేసి ఫోరెన్సిక్ పరీక్షకు పంపించారు. ఆ తర్వాత రైలు గమ్యస్థానానికి బయలుదేరింది.

లెవల్‌క్రాసింగ్ ప్రమాద బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి

దిల్లీ: రైలు ప్రయాణికులకు మాత్రమే కాకుండా లైవల్‌క్రాసింగ్ వద్ద ప్రమాదానికి గురైన వారికి కూడా న్యాయప్రక్రియతో సంబంధం లేకుండా రైల్వే నష్టపరిహారం చెల్లించాలని పార్లమెంటరీ సంఘం సూచించింది. ఈ మేరకు పార్లమెంట్ ఉభయ సభలకు తన నివేదికను నివేదికను సమర్పించింది. లెవల్ క్రాసింగ్‌ల వద్ద జరిగే ప్రమాదాలకు కారణాలను ఏదైనా సంస్థతో విచారించి, రైల్వే తరఫున లోపాలున్నట్లయితే విచారణ ఆధారంగా సుమోటోగా నష్టపరిహారం చెల్లించాలని కమిటీ చెప్పింది.

భాజపాలో చేరనున్న గుజరాత్ తిరుగుబాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

అహ్మదాబాద్: గుజరాత్ రాజ్యసభ ఎన్నికల తర్వాత పార్టీ నుంచి బహిష్కరణకు గురైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భాజపాలో చేరనున్నారు. ఈవిషయాన్ని కాంగ్రెస్ మాజీనాయకులు శంకర్‌సిన్హ్ వాఘేలా కుమారుడు మహేంద్రసింగ్ గాంధీనగర్‌లో గురువారంవెల్లడించారు. తనతండ్రి శంకర్‌సిన్హ్ వాఘేలా మాత్రం భాజపాలో చేరడం లేదని ఆయన స్పష్టం చేశారు. బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలతో తాను భాజపాజాతీయఅధ్యక్షుడు అమిత్‌షాను కలిసి సంప్రదింపులు జరిపినట్లు మహేంద్రసింగ్ తెలిపారు.

అహ్మద్ పటేల్ గెలుపు కుట్రపూరితం: వాఘేలా

కాంగ్రెస్ నేతల కుట్రతోనే అహ్మద్ పటేల్ విజయం సాధించగలిగారని, లేదంటే ఆయన గెలిచి ఉండేవారు కాదని కాంగ్రెస్ మాజీ నాయకులు శంకర్‌సిన్హ్ వాఘేలా ఆరోపించారు. నెలరోజుల క్రితమే కాంగ్రెస్ పార్టీకి, గుజరాత్ రాష్ట్ర ప్రతిపక్షనేత పదవికి రాజీనామా చేసిన వాఘేలా, వచ్చే వారం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేల గురించి భాజపా అధిష్ఠానం చూసుకుంటుందని తాను మాత్రం భాజపాలో చేరనని తేల్చి చెప్పారు.

మేఘం ముసుగులో సప్తగిరులు!



గత కొన్ని రోజులుగా కురుస్తోన్న వర్షాలతో తిరుమల శేషాచలం కొండలపై మంచు మేఘాలు ఇలా దట్టంగా ఆవరించాయి. పూర్తిగా పచ్చదనంతో శోభిల్లుతున్న సప్తగిరులతో.. శ్వేత వర్ణంలోని మేఘాలు కలిసిపోయి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గురువారం ఉదయం తిరుమల ఘాట్ రోడ్డు మీదుగా శ్రీవారి దర్శనానికి బయలుదేరిన ప్రతిఒక్కరూ.. ఈ రమణీయ దృశ్యాన్ని చూసి మర్చిపోలేని అనుభూతి పొందారు.

- ఈనాడు, తిరుపతి

తప్పుడు పత్రాలతో బ్యాంకులకు కుచ్చుటోపీ

సినీ నిర్మాత బషీద్ అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: విక్రయించిన భూమికే తప్పుడు పత్రాలు సృష్టించి బ్యాంకులను మోసగించిన సినీ నిర్మాత షేక్ బషీద్(42)ను సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. డీసీపీ అవినాశ్ మహంతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన విమల్ గోయెల్ తన నగల దుకాణానికి రూ.2కోట్ల రుణం కోసం బ్యాంక్ ఆఫ్ బరోడాను సంప్రదించాడు. అందుకు పూచీకత్తుగా షేక్ బషీద్ బంజారాహిల్స్ రోడ్ నం.7లోని ఆస్తిపత్రాల్ని తనఖా పెట్టాడు. రుణ వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు ఆరా తీయగా.. బషీద్ అప్పటికే ఆ స్థలంపై పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రుణం పొందినట్లు తేలింది. మరోవైపు ఆ స్థలం హైమవతి అనే మహిళదని గుర్తించారు. దీంతో బ్యాంకు అధికారులు సీసీఎస్ పోలీసుల్ని ఆశ్రయించారు. ఇదే స్థలంపై బషీద్ అప్పటికే పలు బ్యాంకుల నుంచి దాదాపు రూ.2.40 కోట్ల వరకు రుణం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతనిపై పలు ఠాణాల్లో ఐదు క్రిమినల్ కేసులు కూడా ఉన్నట్లు తేలింది. ఇలా పొందిన రుణాలతోనే బషీద్ అల్లరే అల్లరి, మెంటల్ పోలీస్, నోటుకుపోటు లాంటి సినిమాల్ని తీసినట్లు పోలీసులు గుర్తించారు.

కార్తిపై లుకౌట్ నోటీసు... స్టే విధించిన మద్రాసు హైకోర్టు

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి చిదంబరం తనయుడు కార్తి చిదంబరంపై జారీ చేసిన లుకౌట్ నోటీసుపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. కార్తి చిదంబరంపై గతంలో అవినీతి కేసును సీబీఐ నమోదు చేసి విచారణకు నేరుగా హాజరు కావాలంటూ ఆయనకు సమన్లు పంపింది. ఆయన దానికి గైర్హాజరయ్యారు. ఆ సమన్లను సవాలు చేస్తూ మద్రాసు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. అది పెండింగ్‌లో ఉన్న సమయంలోనే కార్తి చిదంబరం సహా అయిదుగురిపై లుకౌట్ నోటీసులను జులై 18న కేంద్రం జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ వారు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. న్యాయమూర్తి ఎం.దురైస్వామి సమక్షంలో అది గురువారం విచారణకు రాగా... కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ జి.రాజగోపాల్, కార్తి చిదంబరం తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణియం హాజరై తమ వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాత కార్తి సహా అయిదుగురిపై జారీ చేసిన లుకౌట్ నోటీసులపై సెప్టెంబరు 4వ తేదీ వరకు స్టే విధిస్తూ కోర్టు ఆదేశించింది. దీనిపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమాధానం ఇవ్వాలంటూ విచారణను వాయిదా వేసింది.

హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు

- ఏపీఎన్‌జీవో నేతలపై బీటీఎన్‌జీవో ఆరోపణ

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఏపీఎన్‌జీవో సంఘ నేతలు ఉల్లంఘిస్తున్నారని భాగ్యనగర్ తెలంగాణ ఎన్‌జీవోల సంఘం(బీటీఎన్‌జీవో) ఆరోపించింది. ఈ విషయంలో న్యాయ పోరాటం చేయనున్నట్లు తెలిపింది. గురువారం గన్‌ఫౌండ్రి ఏపీఎన్‌జీవో హోంలోని బీటీఎన్‌జీవో కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశంలో బీటీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్, కార్యదర్శి పి.బలరాం మాటాడుతూ.. హైకోర్టు ఆదేశాలమేరకు తాము ఏపీఎన్‌జీవో హోం కార్యాలయ ఆవరణలోని పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించామన్నారు. వారం రోజుల్లో సభ్యత్వాలు తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలమేరకు సభ్యత్వాల కోసం తీసిన డీడీని గడువు తేదీలోపు ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు అశోక్‌బాబుకు ఈ-మెయిల్ చేసినట్లు తెలిపారు. వాట్సాప్‌లోనూ పంపించామని, స్పందన రాలేదన్నారు. ఉద్దేశపూర్వకంగా ఏపీఎన్‌జీవో కార్యాలయానికి తాళం వేశారని చెప్పారు. గురువారం ఏపీఎన్‌జీవో హోంకువచ్చిన అశోక్‌బాబు అసోసియేషన్ కార్యాలయం వద్ద తమతో గొడవకు దిగారని ఆరోపించారు. బీటీఎన్‌జీవో కార్యాలయానికి కూడా తాళాలు వేసి తమకివ్వాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు.

ఏపీఎన్‌జీవో హోంలో ఉన్న బీటీఎన్‌జీవో కార్యాలయం ఖాళీ చేసి తాళాలు ఇచ్చిన తర్వాతే సభ్యత్వాలు అందచేస్తామని ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు 'న్యూస్‌టుడే'తో చెప్పారు. సభ్యత్వం కావాల్సిన వారు స్వయంగా వస్తే ఇస్తామని, ఒకేసారి ఆరువేల మందికి సభ్యత్వం కావాలని కోరితే వివరాలు తెలుసుకోకుండా సభ్యత్వం ఎలా ఇస్తామని ప్రశ్నించారు.

మహా కూటమి చీలిక విశ్వాసఘాతుకం: శరద్‌యాదవ్

పట్నా: బిహార్‌లో మహాకూటమి చీలిక పదకొండు కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసిందని జేడీయూ నేత శరద్‌యాదవ్ అన్నారు. తాను మహా కూటమితోనే కొనసాగనున్నట్లు స్పష్టం చేశారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ భాజపాతో పొత్తు పెట్టుకున్న అనంతరం రాష్ట్రానికి వచ్చిన ఆయన కూటమి చీలికపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజలు కూటమిపై నమ్మకంతో అధికారం ఇచ్చారనీ, దాన్ని వీడి విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారని విమర్శించారు. అయిదేళ్ల పాటు కలిసి ఉండడమే మహాకూటమి ఒప్పందం, కానీ, దాన్ని మధ్యలోనే తుంగలో తొక్కడం తనను తీవ్రంగా కలచివేసిందని అసహనం వ్యక్తం చేశారు. భిన్న అజెండాలున్న రెండు పార్టీలు ఏకమవడం చరిత్రలో తొలిసారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర పర్యటనకు నిమిత్తం వచ్చిన ఆయనకు జేడీ(యూ) పార్టీ దూరంగానే ఉంది.

పెళ్లి కాకున్నా కలిసే ఉంటాం

- ఇరోమ్ షర్మిల స్పష్టీకరణ

చెన్నై, న్యూస్‌టుడే: తన మతాంతర వివాహానికి సాక్షులుగా ఉండేందుకు అంగీకరించిన ముగ్గురికి బెదిరింపులు వస్తున్నాయని సామాజిక కార్యకర్త ఇరోమ్ షర్మిల ఆరోపించారు. బ్రిటీష్ జాతీయునితో తన వివాహానికి కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న విషయంపై ఆమె స్పందిస్తూ... ఇద్దరు వ్యక్తుల ఆంతరంగిక జీవితానికి సంబంధించిన విషయంపై ఎందుకింతగా వారు భయపడిపోతున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. దివ్యభారతి అనే దర్శకురాలు రూపొందించిన కక్కూస్ (మరుగుదొడ్డి) అనే డాక్యుమెంటరీకి మద్దతుగా భావ ప్రకటనా స్వేచ్ఛ అనే అంశంపై ఏర్పాటైన సదస్సులో ఇరోమ్ షర్మిల మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన ముందుగా అనుకున్న ప్రకారం బ్రిటీష్ జాతీయునితో తన పెళ్లి జరిగినా, లేకున్నా కొడైకెనాల్‌లోనే తామిద్దరం సహజీవనం చేస్తామని ప్రకటించారు. తాను బెదిరింపులకు లొంగనని... మృత్యువుకు కూడా భయపడనన్నారు. ప్రజలకు ఇన్ని సంవత్సరాలైనా మరుగుదొడ్డి సౌకర్యం కల్పించలేకపోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి ఈ డాక్యుమెంటరీ అద్దం పడుతుందని షర్మిల పేర్కొన్నారు.

సముద్రంలోకి వలసదారుల తోసివేత

- స్మగ్లర్ల దురాగతం.. ఐదుగురి మృతి
- 50 మంది గల్లంతు

దుబాయ్: పడవలో యెమన్‌కు వెళుతున్న 180 మంది ఆఫ్రికన్లను స్మగ్లర్లు గురువారం సముద్రంలోకి తోసివేసిన ఘటనలో ఐదుగురు మృతి చెందగా, 50 మంది గల్లంతయ్యారు. ఎర్ర సముద్రంలో యెమన్‌కు సమీపాన దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు ఐరాసకు చెందిన వలస వ్యవహారాల సంస్థ (ఐఓఎం) తెలిపింది. గాయపడిన పలువురికి యెమనీ తీరం వద్ద చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించింది. ఇలాంటిదే మరో ఘటనలో బుధవారం 50 మంది మృతి చెందినట్లు పేర్కొంది. అధికారులు అరెస్టు చేస్తారన్న భయంతో సోమాలీ, ఇథియోపియన్ వలసదారులను.. మానవ అక్రమరవాణాకు పాల్పడుతున్న కొందరు సముద్రంలోకి తోసివేసినట్లు తెలిపింది. గాలి బాగావీచే ప్రస్తుత కాలంలో హిందూ మహాసముద్రంపై ప్రయాణం ప్రమాదకరమని హెచ్చరించింది. గల్ఫ్ ఆఫ్ అదన్, ఎర్ర సముద్రాల్లో మనుషులను అక్రమంగా రవాణా చేసే స్మగ్లర్లు తమ కార్యకలాపాలను చురుగ్గా కొనసాగిస్తుంటారని పేర్కొంది.

వంట మనిషికి శిక్ష ఖరారు

- తొమ్మిది మందికి విముక్తి కల్పించిన కోర్టు
- కుంభకోణం పాఠశాలలో అగ్నిప్రమాదం కేసు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం కుంభకోణంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 94 మంది విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న అగ్నిప్రమాదం కేసులో వంట మనిషికి విధించిన శిక్షను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఖరారు చేసింది. మిగతా నిందితులను విడుదల చేస్తూ తీర్పునిచ్చింది. తంజావూరు జిల్లా కుంభకోణంలో 2004లో ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 94 మంది విద్యార్థులు మరణించారు. దాదాపు 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో పాఠశాల యాజమాన్యానికి చెందిన 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పాఠశాల వ్యవస్థాపకుడు పళనిస్వామికి కోర్టు జీవితఖైదు... . కరస్పాండెంట్, వంట మనిషి తదితర పది మందికి జైలు శిక్ష విధించింది. తమ శిక్ష రద్దు చేయాలంటూ మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనంలో నిందితులు అప్పీలు చేసుకున్నారు. నిందితుల్లో కరస్పాండెంట్ 2016లో అనారోగ్యంతో మరణించారు. అప్పీలుపై వాదోపవాదనలు ఏప్రిల్‌లో ముగిశాయి. అప్పట్లో తీర్పును కోర్టు రిజర్వులో ఉంచింది. ఈ నేపథ్యంలో గురువారం కీలక తీర్పు వెల్లడించింది. వంట మనిషికి విధించిన శిక్షను ఖరారు చేస్తూ... మిగతా తొమ్మిది మందిని విడుదల చేయాలని తీర్పునిచ్చింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00